
అపురూప
మాదిరెడ్డి
సులోచన

పాఠకులకు అత్యంత ప్రియతమ నవలారచయిత్రి
మాదిరెడ్డి సులోచన
మహోత్తమ నవలలు

జీవనయాత్ర
పూలమనసులు
న్యాయం నిదురబోయింది
దేవుడిచ్చిన వరాలు
అధికారులు-ఆశ్రితజనులు
ప్రేమలు-పెళ్ళిళ్ళు
శ్రీనిలయం
అద్దాలమేడ
అభినేత్రి
ఆశయాల ఆఖరిమెట్టు
నిరీక్షణ
అక్కయ్య చెప్పిన కథలు
నాగమల్లికలు
భాగ్యలక్ష్మి
మిస్టర్ సంపత్ M. A.
ఋతుచక్రం
వారసులు
అపరంజి
మరో ప్రేమకథ
గాజుబొమ్మలు
అమృతకలశం
శిక్ష
వంశాంకురం
సృష్టిలో తీయనిది
అపురూప
సంసార నౌక
భిన్నధృవాలు
సంధ్య
పంతులమ్మ
అంతం చూసిన అసూయ
గడ్డితినే మనుషులు
తరం మారింది
జననీ జన్మభూమి
శృతి తప్పిన యుగళగీతి
అగ్నిపరీక్ష
నాతోపాటు నల్లూరం
మనిషి-మతము
వీడని నీడ
గెలుపు నాదే!
స్నేహప్రియ
పుణ్యపురుషులు
ఇది నా దేశం!
సంధ్యారాగం
మోహనరూప
నెరజాణలు-మగధీరులు
లాహిరి
రాలినరేకులు
మమూలు మనిషి
కలహంస
నెలవంక
అమ్మకానికో అబ్బాయి-కొనటానికో కోమలి

తప్పక చదవండి!

0-40 189
PHONE : NO. 130
శ్రీ రామ బుక్ క్లబ్
రామ్‌నగర్ - విజయవాడ - 3

# అపురూప

'చర్లగూడ ..., చర్లగూడ' బస్ కండక్టర్ అరుపులకు ఉలిక్కిపడి లేచాడు హరికృష్ణ. తన సూట్‌కేసు, బ్యాగు తీసుకుని దిగాడు.

"రైట్" అని కండక్టర్ డబుల్ బెల్ ఇవ్వగానే బస్సు దుమ్ము రేపుతూ కదిలింది.

అతను అప్రయత్నంగా కళ్ళు మూసుకున్నాడు. ఒక నిమిషం తర్వాత కళ్ళు విప్పాడు. మట్టిరోడ్డు ప్రక్కగా ఒక యువతి చిన్న కుర్రాడిని నడిపించుకుంటూ వెళుతోంది. శంకరాపురం, చర్లగూడ రెండు ప్రక్కప్రక్కనే ఉన్నాయట. ఎటు వెళ్ళాలో తెలియలేదు.

చుట్టూ చూచాడు. అట్టే జనసంచారం లేదు. దూరంగా పశువుల కాపరి మాత్రం కనిపించాడు.

తప్పదని రెండు చేతుల్లో రెండు మోసుకుని బయలుదేరాడు, త్వరగా ఆ యువతిని చేరాడు.

ఆమె ఉలిక్కిపడి అంతలోనే సర్దుకుంది.

"ఏమండీ! చర్లగూడెం వెళ్ళే దారిదేనా?"

"ఆఁ! ఇదేనండీ," అన్నది కొడుకును యెత్తుకుని.

హరికృష్ణ మామయ్యపై విసుక్కున్నాడు, తనను ఈ ఊరు పంపినందుకు. తల్లి, తండ్రి లేని తనకు అండగా నిలిచి ధూళిలో కలిసి

P 81



పోవాల్సిన తన జీవితానికి అర్థం కల్పించిన మామయ్య మాట కాదనలేక వచ్చాడు. ఆరోగ్యశాఖ మంత్రిగారు ఆశ్చర్యం ప్రకటించటం గుర్తుకు వచ్చింది.

"పట్నం ట్రాన్స్‌ఫర్ చేయించమని, పోస్టింగ్ వేయించమనివచ్చే వారిని చూచాంగాని, ఏ సౌకర్యం లేని పల్లెకు పోస్టింగ్ కావాలని వచ్చిన వారిని మిమ్మల్నే చూచాను కేశవరావుగారూ" అన్నాడు. దానికి అతను నవ్వాడు.

"కొన్ని ఋణాలుంటాయి మరి" అన్నాడు.

ఏం ఋణమో తెలియదు. మామయ్య మాటకు యెదురు చెప్పలేక ఉద్యోగంలో చేరాడు. స్నేహితులంతా ఉద్యోగం వద్దు అమెరికా వచ్చేయమని వ్రాసారు. అన్నీ వాళ్ళే చూసుకుంటామన్నారు.

మామయ్య అన్నట్టు కొన్ని ఋణాలుంటాయేమో! అతనికి గంపెడు సంసారమున్నా, తనను మెడిసిన్ చదివించాడంటే, అతని ఔదార్యం గొప్పది. అతనికోసం వచ్చాడీ ఊరు.

"హరీ! ఈ దుమ్ము, పేడ, గేదెలు చూడాలని నీ నుదుట రాసి వుంటే నీకు అమెరికా ఛాన్స్ ఎక్కడిదిరా! అని తనపై తానే జాలి పడ్డాడు. యెదురుగా వస్తున్న గేదెల గుంపును చూచి, అవి తరుముకు వస్తుంటే భయంగా దూరం తప్పుకున్నాడు.

కిల, కిల నవ్వు వినిపించింది. కోపంగా చూచాడు. యమధర్మ రాజు యెడమ భుజాన్ని అన్నట్టు, ఓ చిన్న దున్నపోతుపై ఎక్కి చిద్విలాసంగా నవ్వుతున్నాడో కుర్రాడు. అతని వయసు చూస్తే పట్టుమని పది సంవత్సరాలు లేవు. చేతిలో బీడి ఉంది.

"బాబా!" అని అర్జంటుగా ఆశ్చర్యపడి పోయాడు. హరికృష్ణ గేదెలు వెళ్ళిపోయాక ముందుకు సాగాడు.



పచ్చని పంటపొలాలు పరవశత్వం కలుగజేస్తాయంటారు గాని, అతనికి విసుగు వస్తుంది. ప్రకృతి పచ్చచీర కట్టుకున్నట్టు, వయ్యారంగా ఊగుతున్నాయి కొమ్మలు.

మరికొంత దూరం నడిచేసరికి, మేకలను తోలుకొస్తున్నాడు మధ్య వయస్కుడు.

హరికృష్ణ తన దగ్గరున్న చీటి తీసి చూసుకున్నాడు.

హెడ్‌మిస్ట్రెస్ రూపాదేవి, చర్లగూడ, అని వుంది.

అతని ముందు లావుగా, యెత్తుగా, నల్లగా పెద్ద ముడితో, కళ్ళజోడుతో ఓ ఆకారం ప్రత్యక్షమయింది. ఆమె చేతి బెత్తంకూడా ఊహించాడు.

మేకలు కాచే అతడిని ఆపాడు.

"రూపాదేవి ఇల్లెక్కడ ?"

"రూపాయికి చిల్లర నా దగ్గిర యాల్ల గట్లపో సత్తయ్య దుకానం ఉంది" అన్నాడు అతను. చుట్ట కంపు గుప్పుమన్నది.

"కర్మ! రూపాదేవిని రూపాయి అనుకుంటున్నాడా!" విసుగు, నవ్వూ రెండూ వచ్చాయి. మరో అనుమానం వచ్చింది. చెవిటివాడా లేక చెవులకడ్డం పాగా కట్టుకున్నాడా అర్థం కాలేదు.

అతను మరో ప్రశ్న వేసే లోపలే "హాయ్....హాయ్...." మేకలను అదిలిస్తూ ముందుకు వెళ్ళాడు అతను.

మరో నాలుగు అడుగులు వేసేసరికి ఒక వింత వ్యక్తి యెదురయింది. ప్రక్కనున్న పొలం నుండి బయటకు వచ్చిందామె. ఆడా, మగా అని పరికించి చూచాడు ముచ్చట పడి. ముఖంలోని మృదుత్వం ఆడ అనే చెబుతున్నాయి.

ఆమె కట్టిన ధోవతి, లాల్చి, చేతిలోని కర్ర మగ అంటున్నాయి. దగ్గరగా వచ్చాక ఆడ అనే అర్థం చేసుకున్నాడు హరికృష్ణ. ఆమెనెలా పలుకరించాలని అనుకుంటుంటే ఆమె పలుకరించింది,

"కమ్మింగ్ సిటీ?"

"ఎస్! కమింగ్ ఫ్రమ్ ద సిటీ" అన్నాడు.

"ఇంగ్లీషు నోసు!"

"ఎస్. అయ నో ఇంగ్లీష్." అన్నాడు కుతూహలంగా.

"యువర్ నేమూ?"

"మై నేమ్ ఈజ్ హరికృష్ణ" అన్నాడు, ఆమె వెనుకే నడుస్తూ.

"మై నేమ్ టైగర్ ఇంద్రమ్మ" అన్నది దర్పంగా.

అతను కుతూహలంగా, ఉత్సాహంగా ఆమెకు ప్రక్కగా నడక సాగించాడు. ఆమెకు అరవై ఏళ్ళకు పైనే ఉంటాయి. వయసులో మంచి అందగత్తె అని గ్రహించవచ్చు. ఒకక్షణం హెడ్‌మిస్ట్రెస్ రూపాదేవి ఈమె కాదుకదా అన్న అనుమానం వచ్చింది. ఆమె టైగర్ ఇంద్రమ్మ అనేసరికి తేలికగా నిట్టూర్చాడు.

"ఏయ్! ఏమిటి ఫ్రౌఢ్! ఈ ఇంద్రమ్మకు ఈక్వెల్‌గా నడుస్తావా? డేర్ డెవిల్." వెనక్కు తిరిగి కర్ర ఎత్తింది. లాఘవంగా ఆ కర్ర ఒడిసి పట్టుకున్నాడు. ఒక్క మాట ఎక్కువ అన్నా ఆమె తన బుర్ర రామకీర్తన పాడేస్తుంది. ఇద్దరూ బావి గట్టుమీద నడుస్తున్నారు. అప్పటికే అతని ఏర్‌బాగ్ వెళ్ళి బావిలో పడింది.

"సారీ మేడమ్.... సారీ...." భయం నటించాడు.

"మాఫీ మాంగా! బహుత్ అచ్చా! ఐ గోయింగ్...." చేతికర్ర విదిలించి వెళ్ళిపోయింది.

"బ్రతుకు జీవుడా! అనుకుని, బావిలో, నీళ్ళపై తేలుతున్న తన ఏర్‌బ్యాగ్ వంక అసహాయంగా చూచాడు. దాంట్లో షేవింగ్ సెట్, టూత్‌బ్రష్, టవల్ ఉంది కాబట్టి పరవాలేదు. లేకపోతే ఈపాటికి మునిగి పోయేదే.

వెనుకాల సైకిల్ గంట వినిపించింది. సైకిల్‌పై ఓ యువకుడున్నాడు. అతనికి హరికృష్ణ అవస్థ పూర్తిగా అర్థమయింది.



"ఎవరింటికి బాబూ!" అన్నాడు సైకిల్ దిగి.

"రూపాదేవి ఇంటికి" అన్నాడు. డి. ఎస్. పి. పేరు వింటూ హెడ్ కానిస్టేబుల్ నిటారుగా అయినట్టు, అతను సైకిల్ దిగి నిటారుగా నిలబడి నమస్కరించాడు.

"మీ బ్యాగ్ నేను తెస్తాను" అన్నాడు. సైకిలుకు స్టాండువేసి, ప్యాంటు, షర్ట్ విప్పి సైకిల్‌కు తగిలించి, బావిలోనికి దిగాడు. బ్యాగ్‌ను కర్రపెట్టి లాగాడు కొంచెం అండర్‌వేర్ తడిసింది కాని, పెద్ద శ్రమపడలేదు. అతను పైకి వచ్చి బట్టలు వేసుకున్నాక, ఒక రూపాయి యివ్వబోయాడు.

"వద్దు బాబూ, రూపమ్మకు తెలిస్తే ఇంకేమయినా ఉందా...." అని హరికృష్ణ జవాబుకు చూడకనే ఉడాయించాడు. బ్యాగ్ భుజానికి తగిలించుకుని టైగర్ ఇంద్రమ్మ గురించే ఆలోచిస్తూ ముందుకు నడిచాడు.

మరి కాస్త దూరం వెళ్ళి ఆగిపోయాడు, దారి రెండుగా చీలింది. ఒకటి ఊర్లోకి వెళ్ళింది. రెండవది దూరంగా కనిపించే మేడవైపు వెళుతుంది.

ఎవరిని అడగాలి?

బంగళావైపు నుండి ఇద్దరు యువతులు ఏదో తర్కించుకుంటూ వస్తున్నారు ఒకామె గల గల పారే సెలయేరులా మాట్లాడుతూ, చేతులు తిప్పుతోంది. రెండవ ఆమె గంభీరంగా ప్రవహించే నదిలా ఉంది. ఆమె ఎక్కువ మాట్లాడక, తన భావాలను, ఇష్టా అయిష్టాలను ముఖ కవళికలతో వ్యక్తం చేస్తోంది.

"ఏమండీ! హెడ్‌మిస్ట్రెస్ రూపాదేవి ఇంటికి దారి యెటు?" అంటూ, వాళ్ళ దగ్గరకు వచ్చాక అడిగాడు.

వాళ్ళిద్దరూ క్షణం ఆగి అతన్ని ఆపాదమస్తకం ఆశ్చర్యంగా గమనించారు.

"మీరెవరు ?" అందులో చీర అమ్మాయి అడిగింది.

"నే నెవరో చెబితేగాని రూపాదేవిగారి ఇల్లు చూపరా ?" కాస్త వ్యంగ్యంగా అడిగాడు.

అప్పరాల్ ఒక పల్లెటూరి యువతి తనను ఎదురు ప్రశ్నలు వేయటమా! పరీక్షగా చూచాడు. వెలసిపోయిన పాత పోచంపల్లి చీరలో అనాగరికంగా ఉంది. చేతులకున్న మట్టి గాజులు వెలవెల బోతున్నాయి.

"ఊర్కేనే అడిగాను. ఇదిగో ఆ బంగ్లాయే రూపాదేవి బడి, ఇల్లు. వెళ్ళండి" అన్నదామె.

లంగా, ఓణీ ముసి, ముసిగా నవ్వింది ఎందుకో.

"మీ రెవరు ? ఆ బంగళాలో పని చేస్తారా ?

"ఏం ? మేం అక్కడ పని చేస్తామంటే కాని అది రూపాదేవి ఇల్లు కాదు, నమ్మరా !" అని ఎదురు ప్రశ్న వేసింది వెలిసిపోయిన పాత చీర.

"అబ్బో ! పల్లెటూరి అమ్మాయిలకు తెలివితేటలు మీరిపోయాయి" అనుకున్నాడు.

"రాక్కా ! కూరలు తేవాలి, వంట కావాలి." ఓణీ పిలిచింది అసహనంగా.

"పద...." పాత చీర కదిలింది.

"కంట్రీ బర్డ్స్ !" అనుకోబోయి గట్టిగా అనేశాడు.

"ఏమన్నారు ?" ఓణీ వేగంగా తిరిగి వచ్చింది.

"అబ్బే ! ఏం లేదు. ధన్యవాదాలు అంటున్నాను. మీరు నాకు రూపాదేవి ఇంటికి దారి చూపారు. అందుకు ధన్యవాదాలు అనుకుంటు.... కాదు అంటున్నాను" అన్నాడు కంగారుగా.

విసురుగా తిరిగింది ఓణీ. ఆమె కొద్ది దూరం వెళ్ళగానే కాలుజారినట్టు అయింది, హరికృష్ణ చేయూత నిచ్చి ఆపాడు.



ఆమె లేచి, పాత చీరవైపు నడుస్తూ,

"కంట్రీ బ్రూట్ ...." అన్నది.

"ఏయ్ అమ్మాయి ఏమన్నావ్ ?" నిలదేసాడు హరికృష్ణ.

"అది కాదండీ. నేను పడబోతే సినిమా హీరోలా పట్టుకున్నారు కదా ! అందుకని ధన్యవాదాలు చెప్పాను వస్తా...." అని చెర చెర వెళ్ళిపోయింది. దగ్గరలో నీళ్ళు లేవుగాని ఉంటే ఓ రెండు గ్లాసుల నీళ్ళు తాగేవాడే.

"నేనుండేది ఇదే ఊళ్ళో ఒక్కసారయినా మందుకు రాదా ! అప్పుడు చెబుతాను. నేను కంట్రీ బర్డ్స్ అంటే తను కంట్రీ బ్రూట్ అంటుందా !" అనుకున్నాడు. బంగళావైపు దారి తీశాడు.

పాత కాలంనాటి బంగళా ! పెచ్చులూడి, పాకుడుతో గమ్మత్తుగా ఉంది. అక్కడక్కడ చేసిన మరమ్మత్తులు చూస్తే, నల్లటమ్మాయి, హడావుడిగా ముఖానికి పౌడరు మెత్తుకున్నట్టుంది.

ఇంటి ముందున్న బొగన్ విల్లాలు అందంగా కత్తిరించారు. ఆ బంగళాను చూస్తే దయ్యాలు, భూతాలు గుర్తుకు రాసాగాయి. ఈ రూపాదేవికి దయ్యాల బంగళాలో బడి ప్రారంభించాలన్న దురుద్దేశం ఎందుకు కల్గిందో !

ఒక ప్రక్క పనివాళ్ళకోసం కట్టిన ఇండ్లు కాబోలు, ఉన్నాయి. రెండో వైపు పశువుల కొట్టాలే కాని అడ్డు గోడలు పెట్టి, క్లాసులు నడుపుతున్నారని, బెంచీలు చూస్తే తెలిసిపోయింది.

"ఎవరు కావాలయ్యా ?" ఒక నడివయస్సు అతను వచ్చి అడిగాడు

"హెడ్ మిస్ట్రెస్ రూపాదేవి ఇల్లు...."

"ఇదే బాబుగారూ ! రండి, మీరు డాక్టరు బాబు అనుకుంటాను."

"నీకెలా తెలుసు ?" ఆశ్చర్యంగా చూచాడు.

"కేశవయ్య దొర అమ్మాయిగార్కి ఉత్తరం వ్రాసారు. ప్రభుత్వ

హాస్పత్రి కట్టేవరకు ఆ గదులు అద్దెకిస్తున్నాము" అన్నాడు అతను సంబరంగా, సర్వెంటు క్వార్టర్స్ వైపు చూపుతూ.

"ఏమిటి నా ఆస్పత్రి అక్కడా ?" ఆశ్చర్యంగా చూచాడు.

"అవును బాబూ ! ఊర్లో సర్కారు కడుతున్నారు. ఊరికి డాక్టరు కావాలని రూపమ్మ పట్టు పట్టింది. తన ఇంట్లో స్థలం ఇస్తానన్నది." అన్నాడు అతను,

"ఏడ్వలేకపోయింది" అనుకున్నాడు కసిగా.

బంగళా ఆవరణలో దూరంగా రెండు చిన్న చిన్న గదులు కనిపించాయి. వాటిని చూపాడు.

"అక్కడ నా నివాసమా !" అన్నాడు వ్యంగ్యంగా.

అతను నవ్వేసి భుజంమీది తుండు దులుపుకున్నాడు.

"అవి కట్యాక్లాస్‌లు బాబూ, మీకు మేడమీద బస ఏర్పాటు చేసాం" అంటూ ఎదురు వచ్చి సూట్‌కేసు, బ్యాగ్ అందుకుని.

బయట వరండాలో నుండి పైకి వెళ్ళారు. ఒక గది, ముందు హాలు ఉన్నాయి. పాతకాలం మిద్దె అయినా శుభ్రంగా ఉంది హాల్లో ఒక మూలకు రైటింగ్ టేబుల్, కుర్చీ ఉన్నాయి. మరో ప్రక్క రెండు ఫేము కుర్చీలున్నాయి, గదిలోకి వెళ్ళాడు. మంచం దానిపై పరుపు ఉతికిన దుప్పటి, దిండు ఉన్నాయి. ఒక పాతకాలంనాటి అలమర ఉంది.

"కాఫీ తీసుకుంటారా, టీ యా బాబూ?" అతను అడిగాడు.

"మొదట మీ అమ్మగారిని కలిసి మాట్లాడాలి. ఏ జన్మ శత్రుత్వం వల్ల నన్ను ఇలా ఏడ్పిస్తున్నారో కనుక్కుంటాను." అన్నాడు.

"ఏమిటి బాబూ అంటున్నారు ?"

"ఏం లేదు. నీ పేరు ?"

"వెంకయ్య అంటారు బాబూ ! రూపమ్మ వెంకన్నా అంటుంది." అన్నాడు వినయంగా.



"అయితే రోజూ పుణ్యం సంపాదించాలనే తపన కాబోలు, అవును ఆవిడను చూడాలి" అన్నాడు.

"ఇప్పుడుకాదు బాబు, మధ్యాహ్నము భోజనం చేసేటప్పుడు మీతో మాట్లాడుతానన్నారు. ఈ రోజు శశికళమ్మ లేదు. ఉదయం క్లాసులు తనే తియ్యాలట" అన్నాడు వెంకన్న.

"ఊం; టీ తెచ్చిపెట్టు" అన్నాడు విసుగ్గా.

"అలాగే బాబూ. టీ త్రాగి, గదిలో ఒక మూలకు అడ్డుగోడ పెట్టించాం. అదే మీ బాత్‌రూమ్ స్నానం చేసి విశ్రాంతి తీసుకోండి" అన్నాడు.

"సరే ..." అన్నాడు. ఈ రూపాదేవి నా కోసం బాత్‌రూమ్‌లు కట్టించి, ఇంత శ్రద్ధచూపుతూ ఈ ఊరు పిలిపించి దంటే, తప్పక ఆమెకు పెళ్ళీడు కూతురు ఉండే ఉంటుంది.

కానీ కట్నం లేకుండా డాక్టరుకివ్వాలని చూసుందా! నీ ఆటలు సాగనివ్వను హెడ్‌మిస్ట్రెస్‌గారూ! అలాగే నన్ను ప్రత్యేకంగా ఈ ఊరు వేయించనందుకు పశ్చాత్తాప పడే రోజు తప్పక తీసుకువస్తాను అనుకుని, ఓ సిగరెట్టు వెలిగించుకుని ఫేముకుర్చీలో కూర్చున్నాడు టీ కోసం ఎదురు చూస్తూ, సిగరెట్టు పొగలా అతని ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. అమెరికా అందచందాలు ఊహిస్తున్నాడు.

## 2

ప్రాతఃకాలం బల్లమీద అన్నీ అమర్చాడు వెంకన్న. రూపాదేవి క్లాస్‌రూమ్స్‌నుండి వచ్చింది. ఆమె ఒక్క నిమిషం కళ్ళు మూసుకుని వాలు కుర్చీలో కూర్చుంది.

"నాయనమ్మ భోజనం చేసిందా వెంకన్నా?" రూపాదేవి కళ్ళు మూసుకుని అడిగింది.

"లేదమ్మా! మీరొచ్చాక చేస్తానంటున్నారు. ఇప్పుడు కూలీలకు డబ్బులిస్తున్నారు" అన్నాడు వెంకన్న.

రూపాదేవి గాఢంగా నిట్టూర్చి, లేచి పెరటివైపు వెళ్ళింది. అక్కడ మెట్లమీద కూర్చుంది ఇంద్రాణీదేవి. పాతకాలంనాటి రేకుడబ్బా ముందు పెట్టుకుంది. దాంట్లోని గులకరాళ్ళు తీసి, లెక్కపెట్టి తనముందున్న మనుషులకు ఇచ్చినట్టు నటిస్తుంది.

"ఊఁ! కూలి ఫుల్‌గా కావాలి. పని హాఫ్‌గా చేస్తారు. ఇట్ సిల్లీ ...." అనుకుంది చేతిలో రాళ్ళు విసిరికొడుతూ

రూపాదేవికి కడుపులో చేయిపెట్టి కలియబెట్టినట్టు అయింది.

"నాయనమ్మా! ఆ కూలీలు నీకు వినరు, నాన్నగారువచ్చిచూస్తారు భోజనానికిలే" అన్నది మృదువుగా.

"యెవరూ! రూపా డార్లింగ్ ...." అన్నది ఇటు తిరిగి.

"నాయనమ్మా! నాకు ఇంగ్లీషే కాదు తెలుగుకూడా వచ్చు. తెలుగులో మాట్లాడకూడదూ!" అన్నది నవ్వటానికి ప్రయత్నిస్తూ.

అప్పుడే అక్కడికి వచ్చిన శర్మిష్ట పక పక నవ్వింది.

"ద గ్రేట్ టైగర్ ఇంద్రమ్మ తెలుగు మాట్లాడితే అవమానం కాదు, ఏం నాయనమ్మా!"

"శర్మీ ...." రూపాదేవి కోపంగా చూచింది.

"సారీ నాయనమ్మా. ఈవిడ నీ పర్సనల్ సెక్రటరని మరిచిపోయాను. బై ది బై మీ రాజకార్యాలు అయ్యాయా, ఆకలి దంచేస్తుంది" అన్నది శర్మిష్ట

"శర్మీ! నువ్వు పద ...." రూపాదేవి కోపంగా చూసింది.

ఇంద్రమ్మ చేయిపట్టి బేసిన్ దగ్గరకు తీసుకువచ్చింది.



"నాయనమ్మా! మీ కోటు తీస్తారా?" అన్నది చాలా మృదువుగా.

"ఆ కూలీల డబ్బులుంటాయని గాని కోసెందుకే ఇప్పుడు. ఒక్క నిముషం పూజ చేసుకుని రానా?" అని అడిగింది ఇంద్రమ్మ.

"అలాగే త్వరగా రా శర్మిష్టకు ఆకలిగా ఉందట" అన్నది ఆమె కాళ్ళు చేతులు కడుక్కొని పూజగదిలోకి వెళ్ళింది.

"హతోస్మి! రూపక్కా, ముప్పైమూడుకోట్ల దేవతల పేర్లు తలుచుకునేవరకు ఆకలికాస్త కొండెక్కి కూర్చుంది" అన్నది.

"శర్మీ! నువ్వు భోజనం చెయ్యి" అన్నది కాస్త కోపంగా.

శర్మిష్ట కోపంగా హాల్లోకి వచ్చింది. అక్కడ వెంకన్న కనిపించాడు. "అతిథిదేవుడు ఏమంటున్నాడు వెంకన్నా?"

"పాపం అలసటవల్ల నిదురపోయాడమ్మా, లేచారు" అన్నాడు నిదానంగా. వెంకన్న వీపులో రంధ్రం ఉంటే కీ ఇచ్చేద్దాం అనుకున్నది. ఆ నిదానం యెలా తగ్గుతుందో అర్థంకాలేదు.

ఆమె వార్తాపత్రిక పట్టుకుని గంభీరంగా కూర్చుంది. రూపాదేవి వచ్చి ప్రక్కన కూర్చుంది.

ఇద్దరి ఆలోచనలు వేరు వేరుగా సాగుతున్నాయి.

అక్కయ్య బాధ్యతలు, సెంటిమెంట్లు అంటూ ప్రాకులాడుతుంది. ఆ వలయంనుండి బయటపడనిదే బ్రతుకలేదన్న సత్యం దీనికెలా తెలుస్తుంది' అనుకుంది చెల్లెలు.

రూపాదేవి ఒక్కసారి పదిహేను సంవత్సరాల వెనక్కు వెళ్ళింది. తనకు తల్లి, తండ్రి యెవరో తెలియదు. నాయనమ్మే తల్లి, తండ్రి అయి తనను అల్లారుముద్దుగా పెంచింది. ఆమెకు మనవరాలంటే పంచప్రాణాలు.

"కలరావచ్చి నా కొడుకును, కోడల్ని యెత్తుకుపోయినందుకు నిందించను. ఈ వెలలేని రత్నాన్ని నాకు వదిలేసినందుకు కృతజ్ఞురాలినై ఉంటాను" అనేది యెన్నోసార్లు తనను హృదయానికి హత్తుకుని.

అది తన పసి హృదయంపై హత్తుకుపోయింది. ఆ దృశ్యం ఇప్పటికీ సజీవంగా కదులుతుంది.

"అబ్బో! ఇంద్రమ్మది గుండెకాదు బండ. చెట్టంత కొడుకును మింగినా విచారంలేదు" అనుకునేవారంతా.

ఇంద్రమ్మ రెండవ కొడుకు రఘునాథ్ అమాయకుడు. తల్లి ఎంత చెబితే అంతే. అతని భార్య అంతే. ఆమెకు బయట ప్రపంచం తెలియదు. వంటిల్లు పిల్లల ఆలనా, పాలనా తప్ప మరేం పట్టించుకునేదికాదు. ఆమెకు శర్మిష్ఠకంటే ముందు ముగ్గురు మగబిడ్డలు ఉండేవారు.

ఇంద్రమ్మకు మనవలు, మనవరాళ్ళంటే వల్లమాలిన అభిమానము. కోడలు విసుక్కున్నాకూడా, యెంత రాత్రయినా పాలుకాచి అందరికీ త్రాగించేది అప్పుడే ఆమెకు తృప్తి

ఆమె చేసిన పొరపాటల్లా ఒక్కటే మారుతున్న కాలాన్ని అర్థం చేసుకోలేదు. చుట్టూ ఆమె పొలాలే యెవరి పశువులు ఇల్లు చేరాలన్నా ఆమె పొలంలోనుండే రావాలి పంటచేలలో పశువులు పడ్డా, గడ్డిమేటలో పశువులు మేసినా, బంజల్ దొడ్డికి కొట్టించేది ఇంద్రమ్మ.

ఆమెకు నవాబుల అహం, దర్జా, దర్పం అలవడ్డాయి.

"ఇంత ఆస్తి చుట్టుప్రక్కలవారికి లేక, మీకు ఉండడం అనర్థాలకు దారితీస్తుంది మెల్లగా, యెంతో కొంత ధరకు అమ్మివేయండి" అని శ్రేయోభిలాషులు సలహా ఇచ్చారు.

"చట్! నా ఆస్తి, వాళ్ళేదో అనుకుంటారనీ బాధపడతామా! సూదిమొన మోపినంత స్థలంకూడా యెవరికి ఇవ్వను" అని ఖచ్చితంగా చెప్పింది.

స్వరాజ్యం వచ్చాకకూడా నియంతృత్వం ప్రారంభించింది. దాంతో జనం విసిగిపోయారు.



రఘునాథ్ అమాయకుడని తనే చీరపై కోటువేసుకుని, తెల్ల గుర్రం ఎక్కి, కోర్టులు, కచ్చేరీలు తిరిగేది.

ఆమె తెలివికి, ఆమె ధైర్యానికి అందరూ ఆశ్చర్యపోయేవారు. ఆ తెలివికి కాస్త సౌమ్యతఉంటే ఎంతో బాగుండేది. ఆలోచన ఉంటే బాగుపడేవారు.

ఆమె నిరంకుశత్వానికి ఓ రాత్రి రఘునాథ్, అతని భార్య జానకి, ముగ్గురు కుమారులు బలిఅయ్యారు.

చుట్టూ ఊర్లవారి సహాయంతో, ఊరివారు చందాలువేసి డబ్బు పోగుజేసుకుని కుటుంబాన్ని హతమార్చే ప్రణాళిక వేసుకున్నారు.

ఆదే రాత్రి ఇంద్రమ్మ మనవరాళ్ళకు ఎగ్జిబిషన్ చూపిస్తానని హైద్రాబాద్ తీసుకువెళ్ళింది. ఆమె గుర్రం ఉందానగర్ స్టేషన్ దగ్గర తెలిసినవారి దగ్గర కట్టేసి అయిదేళ్ళ రూపను, మూడేళ్ళ శర్మిష్ఠను తీసుకుని బండెక్కింది

జీతగాళ్ళు ఊరివారికి తోడయి, రఘునాథ్‌ను హతమార్చారు. జీతగాడు వచ్చి, రఘునాథ్ క్రొత్తగా కొన్న కోడెలకు జబ్బుచేసిందని, అవి గిలగిలలాడుతున్నాయని చెప్పాడు.

రఘునాథ్ వారి ప్రణాళిక ఊహించకనే వాళ్ళవెంట బయటికి వచ్చాడు. జనవరి మాసం చలిగావుందని మఫ్లర్ చుట్టుకున్నాడు బయటికి రాగానే, పాయిల్ పొదలచాటున దాగిన మనుష్యులంతా వచ్చి చుట్టుముట్టారు. అంతే అతను తెల్లబోయి తేరుకునే లోపలే అతను మెడచుట్టూ వేసుకున్న మఫ్లర్ ముడివేసి లాగారు.

యెంత బలవంతుడయినా రఘునాథ్ ఒక్కడూ, వాళ్ళు పాతిక మంది. అయిదు నిమిషాల్లో అసువులుబాసాడు.

"ఆ ఇంద్రమ్మ ఇంద్రజాలికురాలురా, స్వాశస్తంభనచేసే మంత్రం నేర్పించి ఉంటుంది. ఈ కాయాన్ని వదిలిపెట్టకూడదు" అని, రఘునాథ్

శవాన్ని గడ్డివాము వరకు మోసుకువెళ్ళి, వాములో పూడ్చి వాము తగల బెట్టారు.

అందరూ మళ్ళీ బంగళాకు వచ్చారు ఎవరికి హానిచేయని జానకి, తనకెవరయినా హానిచేస్తారన్న తలపుకూడా లేకుండా, తలుపుతీసే పిల్లలను దగ్గరగా వేసుకుని పడుకుంది. ఆ రాక్షసులు దయాదాక్షిణ్యం లేకుండా తల్లిని, పిల్లలను గొంతుదగ్గర నరాలు, రక్తనాళాలుకోసి, ఇల్లు దోచుకుని వెళ్ళిపోయారు. ఆ నిశీధిరాత్రి పాపాన్ని తనలో దాచుకున్నట్లు, జరిగిన ఘోరకృత్యానికి రాయి అయినట్టు ఉండిపోయింది.

ఉదయం అయిదు గంటలకే తనమనుమరాళ్ళతో గుర్రంపై బయలుదేరిన ఇంద్రమ్మ. ఆ దారి ఎప్పుడూ నిశ్శబ్దంగా ఉండేది, జనం ఎందుకు నడుస్తున్నారో అర్థంకాలేదు. ఎవరినైనా నిలేసి అడిగినా, తన అంతస్తుకు భంగంఅని, గుర్రాన్ని దౌడుతీయించింది. తెల తెలవారుతుండగా ఊరు చేరింది, ఇంటిముందు జాతరలాఉన్న జనాన్నిచూచి ఒక్కసారి గుర్రము దూకింది. రూపాదేవి పసిహృదయంపై ఆనాటి దృశ్యం ఎన్నడూ చెరగనంతగా ముద్రించుకుపోయింది.

ఇంటి ఎదురుగా పందిరీ మంచంపై తలక్రింద ఓ చేయి, తలపై ఓ చేయి వేసుకు పడుకున్న జానకి, ఆమె కాళ్ళదగ్గర, ప్రక్కన, తల దగ్గర అ సవిసంగా తెగకోసిన కోడిపిల్లలా పడివున్న పిల్లలు, వాళ్ళను చంపినప్పుడు పిచకారిలా విరజిమ్మిన రక్తం ఇంటి పై కప్పుకు కనిపించింది.

కేక పెడదామంటే నోరు రాలేదు, శర్మిష్ఠ, తను ఒకరిని, ఒకరు పట్టుకుని ఉండిపోయారు రాళ్ళలా. ఎవరోవచ్చి దగ్గరకు తీసుకున్నారు.

పోలీసులు రఘునాథ్ శవాన్ని గడ్డివామినుండి బయటికి తీశారు కాల్చిన జంతువులా భయంకరంగా తయారయింది. కొంకర్లుపోయినవేళ్ళు ఒంకర్లుపోయినచేతులు, కాళ్ళు చూచి అందరూ భయంతో బిగుసుకుపోయారు.



ఉదయం పదిగంటలవరకు కొన్ని వేలమంది పోగయ్యారు శవాలను అన్నీ హైద్రాబాద్ తరలించారు.

"ఏమాశించి ఈ ఘోరం చేశారో కుక్కలకొడుకు, అవి సాగనివ్వను. పిసరంత స్థలంకూడా దక్కనియ్యను" శివమెత్తినదానిలా అరిచింది ఇంద్రాణీదేవి.

అంత దుఃఖంలోను మనవరాళ్ళను విస్మరించలేదామె. ఇద్దరిని చెరో తొడమీద పడుకోబెట్టుకుంది.

అర్ధరాత్రి హైద్రాబాద్ నుండి వచ్చిన డొలకలకు దహన సంస్కారాలు జరపాలి, ఎవరు కర్మ చేస్తారన్న ప్రశ్న వచ్చింది.

"నా కొడుక్కి ఎవరో చేయటం ఏమిటి ? నేనే చేస్తాను. రిగ్వేదములో స్త్రీకి దహనసంస్కారాలు చేసే హక్కు ఉంది" అని వాదించింది ఇంద్రాణీదేవి.

"కుటుంబం అంతా పోయారు. లోకమే మునిగిందంటే, ఈ మనిషి స్త్రీయా, భూతమా ! రిగ్వేదం గురించి మాట్లాడుతుంది" అనుకోవటము రూప చెవుల్లో పడింది.

మొత్తానికి కొడుకు దహన సంస్కారాలుచేసి, ఎవరెవరికి తన కొడుకును చంపగల ఆస్కారముందో, అదంతా స్టేట్‌మెంట్ ఇచ్చింది. మర్నాడు ఆ పదిమందిదాకా అరెస్టు అయ్యారు.

ఆమె కర్మఅంతా ఘనంగా చేసింది. జానకి తల్లి వచ్చి శర్మిష్ఠను తీసుకువెడతానంటే తిట్టి పంపించివేసింది ఆమె న్యాయముతో పోరాటము ప్రారంభించింది.

ఆమెకు న్యాయస్థానాలపై విపరీతమైన నమ్మకం ఉంది. మానవత్వానికి విలువ ఉందని నమ్మే మంచిమనిషి ముగ్గురు పిల్లలను, తల్లి తండ్రి దారుణంగా హత్యచేసిన వారిని ప్రభుత్వం వదలదని భావించింది.

మొండిధైర్యంతో ఇదరు పిల్లలతో, నమ్మకమైన నౌకరు వెంకన్నతో, కోర్టు దోషులను శిక్షిస్తుందని ఆశగా ఎదురు చూసింది

న్యాయానికి వెల కడుతుంది సమాజం, ప్రభుత్వం అని మరిచిపోయింది.

మానవత్వాన్ని మంటల్లో కలిపి, మనిషి అనే ముసుగు తీసివేసిన వారే అధికారంలోకి వస్తారని మరిచిపోయిందామె.

చంపుతుండగా చూచినవారెవరూ లేరు కాబట్టి, ఎవరికి సరియైన శిక్ష వేయలేక పోతున్నామని, రక్తసిక్తమైన గుడ్డలు దొరికాయని, ఒక జీతగాడికి, ఇద్దరి డ్రైవరికి ఏడేళ్ళ కారాగారవాస శిక్ష విధించారు.

తీర్పు విన్నరోజున ఇంద్రమ్మ పడిన వేదన, ఆవేదన వర్ణనాతీతం. రఘునాధ్, జానకీల శవాలను చూచికూడా అంతగా చలించి పోలేదామె

వెళ్ళి న్యాయమూర్తి కారుకడ్డంగా పడుకుంది.

"జడ్జీగారూ! వీళ్ళు చంపలేదని వదిలేసారు అసలయిన దోషులెవరో మీరు పట్టుకోండి. నా కొడుకును, కోడల్ని, పిల్లలను చంపాలన్న మాట వాస్తవమా కాదా! మీకిది న్యాయంకాదు. పసివాళ్ళను పొట్టనపెట్టుకున్న పరమ కిరాతకులను వదిలేస్తారా!" చేతులు జోడించింది.

ఆయన ఒక్కసారి తిరస్కారంగా చూచి, ముఖం తిప్పాడు. "టేక్ హర్ ఫ్రమ్ ద వే (ఆమెను దారిలోనుండి తొలగించండి)" అన్నాడు దర్పంగా.

"ఇంగ్లీష్‌లో మాట్లాడితే తప్పించుకుంటాననుకుంటున్నావేమో నేను నేర్చుకోగలను. డబ్బుకమ్ముడుపోతావురా? నన్ను లాగెయ్యడం, దేనికి? నన్ను, నా పిల్లలను చంపు తోలరా నీ కారు" అంటూ రూపను శర్మిష్టను కారు ముందుకు లాగింది.

పోలీసులు వచ్చి ఆమె ఆక్రందన ప్రక్కనపెట్టి లాగేసారు. కారు వెళ్ళిపోయింది



ఇంద్రాణి ఆవేశంగా మట్టి యెత్తి కారువైపు పోసింది. చెట్టంత కొడుకులు పోయిననాడుకూడా ఆమె నిటారుగా నడిచింది. ఈ రోజు వెంకన్న సహాయంతో వచ్చి రిక్షాలో కూర్చుంది. అతనే పిల్లలను కూర్చోబెట్టాడు.

ఇల్లు చేరాక యెప్పుడూ మనవరాళ్ళకు తినిపించనిదే ఏ పని చేయని ఇంద్రమ్మ వెళ్ళి పడుకుంది.

వెంకన్న అన్నం పెడితే తిని పందిరి మంచంపై పడుకున్నారు పిల్లలు, నాయనమ్మను పలుకరించటానికి భయం వేసింది.

అర్ధరాత్రి మేలుకున్న రూప చుట్టూ చూచింది. నాయనమ్మ కనిపించలేదు, రూప గుండె జల్లుమంది. అది రాత్రని, భయం ఉంటుందని మరిచిపోయి 'నాయనమ్మా' అంటూ ఇల్లంతా తిరిగింది. పెరడు, దొడ్డి అంతా వెతికింది, వెంకన్న లేచాడు. ఇద్దరూ లాంతరు తీసుకునిదానిదగ్గరకు వచ్చారు.

వరుసగా కట్టిన గోరీల ముందు పడి ఏడుస్తుంది ఇంద్రాణీదేవి.

"నాయనమ్మా!"

"అమ్మా! రూపా, యెందుకో వాళ్ళు నిన్ను శర్మిని వదిలి బ్రతకమని శాసించారు. చనిపోదామన్నా ధైర్యం చాలటం లేదే...." అన్నది ఆమెను చూచి.

"నాయనమ్మా...." అంతకంటే అప్పుడేం అనలేకపోయింది. బావురుమని ఏడ్చింది.

వెంకన్న సహాయంతో ఇంటిలోకి వచ్చారు. బంధువులసలహామేరకు ఇంద్రమ్మ చేర్పించిందనేకంటే, బంధువులే రూపను, శర్మిష్టను హాస్టల్లో చేర్పించి, బడులలో సీటిప్పించారు. శర్మిష్ట మొదటి తరగతిలో రూప మూడో తరగతిలో చేరారు.

ప్రతి సెలవులకు వచ్చినప్పుడు ఇంద్రమ్మ హడావుడి చేసి తీపి వంటలు చేయించి, చేగోడీలు పండించేది. ఆమె శారీరకంగా మానసికంగా కృంగిపోవటమే కాక చిత్రమైన స్వభావం పెంపొందించుకుంది, వచ్చీరాని ఇంగ్లీషు పదాలు వాడడం మొదటికంటే ఇంగ్లీషు పదాలు యెక్కువగా ఉపయోగించటం మొదలు పెట్టింది.

## 3

కాలచక్రం నిరంతరం తన పనిని శ్రద్ధాసక్తులతో చేస్తుంది. రూపాదేవి పదవ తరగతి పాసయి వచ్చేసరికి ఇంద్రమ్మ స్థితే కాక, ఆర్థిక స్థితి, పొలాలు అన్నీ అస్తవ్యస్తంగానే ఉన్నాయి. ఆమె అస్తమానం తనలో తాను మాట్లాడుకునేది.

"ఊఁ! అసలు ఏమాసించి నావాళ్ళ నందరిని నాశనము చేశారో ఆ కొడుకు, అది జరుగనివ్వను" అనేది.

"ఆ వెధవ న్యాయమూర్తి ఉీక్ హర్ అంటాడా! నాకు ఇంగ్లీష్ రాదనుకున్నాడా! ఐ కిల్ ద ఫెల్లో...." ఆవేశంగా లేచేది.

వెంటనే దోసిళ్ళతో మన్ను యెత్తి ముందుకు పోసేది.

"శ్రీనాధ్.... రఘునాధ్.... ఏ జన్మ రుణమయ్యా తీర్చుకుని పోయారు. నన్నిట్లా బ్రతకమన్నారా!" అంటూ కాసేపు ఏడ్చేది.

రూపాదేవి క్లాసుమేటు ఒక్కరోజు ఉండి ఊరు చూచి వెళతానని వచ్చింది. ఆ అమ్మాయిని చూచి, రూపను ప్రక్కకు పిలిచింది.

"రూపా డియర్! ఆ పిల్ల....అదేనే నీ క్లాసుమేటు చిదిమి దీపం పెట్టుకునేదిలా ఉంది. మన సుధీర్‌కు చేసుకుంటే యెలా ఉంటుంది" మెల్లగా రహస్యంగా అడిగింది.



రూపాదేవి తెల్లబోయింది. అంతవరకు అస్తవ్యస్తంగా ఉన్న ఆలోచనలకు ఓ స్వరూపం దొరికింది. ఇంద్రమ్మ మతి చలించిందని అర్థం అయింది. తల్లిదండ్రులతోపాటు చంపబడిన సుధీర్ వివాహము యెలా చేస్తుంది?

"వెంకన్నా! ఏమిటీ విపరీతం?" కన్నీటితో అడిగింది.

"ఏం చెప్పమంటావు తల్లీ, ఏడేళ్ళ శిక్ష పడిన వారంతా విడుదలయి వచ్చి పండుగ చేసుకున్నారు. ముఖ్యంగా నాయనమ్మగారిని ఏడిపించటం కోసం కోలాహలంగా చేసారు ఆ రోజునుండి మన మనుషుల్లో లేరు తల్లీ" వెంకన్న కళ్ళు ఒత్తుకున్నాడు.

"డాక్టరుకు చూపించాలా వెంకన్నా?" అన్నది దిగులుగా.

"ఏమిటోనమ్మా! లాయర్ కేశవరావును కనుక్కుందాము." అన్నాడు.

రూపాదేవి వయసు చిన్నది.

సమస్యలు చాలా పెద్దవి. ఆమె గట్టున పడ్డ చేపలా గిలగిల్లాడింది బంధువులందరికి ఇంద్రమ్మంటే కోపము, దోచి పెట్టలేదని కక్ష

కేశవరావును పిలిపించింది. అతని సలహా మేరకు సైకియాటిస్ట్‌కు చూపించింది రూపాదేవి, కాని ఏం లాభం లేకపోయింది. వారం రోజులు మన లోకంలో ఉండదు.

తనముందు ఊరివారున్నట్టు ఊహించుకొని తిడుతోంది.

ఇంకాసేపటికి కూలీలు రైతులున్నట్టు భావించి మాట్లాడుతుంది. యెప్పుడో ఏరి తెచ్చుకున్న చిన్న రాళ్ళను డబ్బుగా భావించి వాళ్ళకి ఇస్తుంది.

నాయనమ్మ గొడవలో రూపకు ఫస్ట్‌క్లాసు వచ్చిన సంతోషం కూడా మిగలలేదు, శర్మిష్ఠను హాస్టలుకు పంపింది.

స్వంత నిర్ణయం తీసుకునే వయసు కాదు.

స్వంతవాళ్ళు సలహా ఇవ్వటానికి లేరు.

"చూడమ్మా రూపా, మీ నాన్నగారి సహాయం పొందినవాడిని. నీ క్షేమార్థిని. నువ్వు చదువుకుని, ఈ ఆస్తి సంతటిని అమ్మి, బయటపడు" కేశవరావు సలహా ఇచ్చాడు.

"ప్రయత్నిస్తాను అంకల్" అన్నది.

రాత్రింబవళ్ళు ఆలోచించి, ఆ వూరి దుస్థితి చూచాక రూపాదేవి ఒక నిర్ణయానికి వచ్చింది తన బంగళాలో ఒక మంచి బడి స్థాపించి, చీకటి, చీకటి అని ఏడ్చేకంటే చిరుదివ్వె వెలిగించాలనే నిర్ణయానికి వచ్చింది తన ప్రయత్నం వల్ల ఊరు బాగుపడినా పడకపోయినా ఒక విప్లవం బయలుదేరుతుంది. ఈ ఆస్తులవల్ల వచ్చే అరాచకాలు అంతం అవుతాయేమో .... ఏమో.

ఫలితంగా శ్రీనాధ్, రఘునాధ్ మెమోరియల్ స్కూల్ అని వెలిసింది. అక్కడ ఉన్నత పాఠశాల ప్రారంభించాలనే తపనే కాక వయోజన విద్యాకేంద్రం ప్రారంభించింది. మొదట ఒక్కరితో ప్రారంభం అయినా, పాతిక ముప్పైమంది అయ్యారు. అలాగే బడిలో మూడవ తరగతి ప్రారంభం అయింది.

అయిందని తేలికగా చెప్పవచ్చు, కాని దాని వెనుకాల రూప, దీక్ష పట్టుదల యెంతో ఉన్నాయి.

ఒకవైపు కొందరు రక్షిత కౌలుదార్లు పొలాలు మావే అంటున్నారు వారితో సంప్రదింపులు కొందరిని తీసివేయటానికి కోర్టుకు వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడింది.

"అల్లం చిన్నాన్నను కోసినట్టు కత్తికింత కోసి, కాకులకు గ్రద్దలకేస్తే యెవడు అడుగుతాడు!" అన్నారు బాహాటంగా.



రూప నిశ్చలంగా ఉంది. చావు పుట్టుకలు నిర్ణయించే ఉంటాయి అనుకుంది.

ఒకరోజు ఓ యువకుడు వచ్చాడు

"ఎవరండీ మీరు ?" చాలా సౌమ్యంగా అడిగింది.

"నా పేరు జగదీష్ అండీ. మావాళ్ళు జగ్గయ్య అని పెట్టారు. రఘు మా మామయ్యే జగదీష్ అన్నాడు. ఆ మామయ్యకు ఇంతఅన్యాయం జరిగిందంటే నా గుండె తరుక్కుపోతుందండి" అన్నాడు బాధగా.

"అది గతించిన విషయం" అన్నది నిర్లిప్తంగా.

"మా అమ్మ పులికంటి వారింటి ఆడబడచే, మీకు గుర్తుందో లేదో అన్నయ్యా అంటూ ఎప్పుడూ మీ నాన్న వెంటే వుండేది" అన్నాడు ఎంతో ఇదిగా.

"అలాగా ! అయిదారేళ్ళ దాన్ని నాకేం గుర్తులేదండి" అన్నది.

"ఘోరం జరిగినప్పుడు నేను హైదరాబాద్‌లో చదువుకుంటున్నాను"

"ఇప్పటికే చాలా ఆలస్యం అయింది, మీరు చేస్తున్న ఈ సేవా కార్యక్రమంలో నాచేయూత ఉండాలని...."

"దానికింత ప్రాధేయపడాలా" అన్నది రూపాదేవి. ఆమెకు ఒక చదువుకున్న వ్యక్తి సహాయం కావాలి. వెంకన్నకు విషయాలు తెలియవు అంతగా. జగదీష్ క్లర్క్ కమ్ సూపరింటెంట్‌గా అపాయింట్ అయ్యాడు. అతను చాలా చురుకయినవాడు. ఏదయినా పని చేయాలనుకుంటే చేసే తీరుతాడు.

అతని చురుకుతనం చూచి రూపాదేవి నిట్టూర్చింది.

"రూపా. నా తల్లీ, ఈ చుట్టుపక్కల ఎవర్ని నమ్మొద్దే తల్లీ అంతా నమ్మించి గొంతు కోస్తారు. ఛీట్స్... రోగ్స్...." అన్నది తన ధోరణిలో, ఆమె మాటలకు ఆశ్చర్యపోలేదుగాని, అంతగా పట్టించుకోలేదు.

జగదీష్ అంతరంగికుడుగా మారాడు. బయటి వరండాలో వెంక
న్నతోపాటు పడుకునేవాడు, అతను ఇంట్లో ఉంటే యెంతో నిశ్చింత అని
పించింది. అందుకే ఒక మగాడు ఉండాలనుకున్నారు. కాని జగదీష్
ఎక్కువకాలం ఆగలేదు. తన అసలు స్వరూపం బయట పెట్టుకున్నాడు.

ఒకరోజు రాత్రి రూపాదేవి ఏదో పుస్తకం చదువుతూ కూర్చుంది. లైటు వుంటే నిదుర రాదని లైటు ఈ మధ్యనే ఫిట్టింగ్ చేయించారు. లైటు వుంటే నిదుర రాదని ఇంద్రమ్మ అటు, ఇటు దొర్లుతుంటే ఇంటి వెనుకవైపు వరండాలోకి వచ్చి చదువుకుంటూ కూర్చుంది.

"రూపా....రూపాదేవీ" జగదీష్ పిలిచాడు.

"ఏమిటి ?" ఆశ్చర్యంగా అడిగింది పుస్తకం మూసి.

"తల దిమ్ముగా ఉంది రూపా ! ఏదయినా పుస్తకం ఇస్తావేమోనని" అన్నాడు.

రూపాదేవి లేచి లోపలికి వెళ్ళి ఓ డిటెక్టివ్ నవల తెచ్చి ఇచ్చింది. కటకటాలు చాలా చిన్నవి కాబట్టి తలుపు తీసింది. అంతే అతను ఒడిసి పట్టుకున్నాడు.

"రూపా ! ముందువైపు అయితే ఆ వెంకన్న ఉంటాడని, ఈ అవ
కాశం కోసం ఎన్నాళ్ళనుంచో ఎదురు చూస్తున్నాను" అన్నాడు. అతని కళ్ళు కామంతో ఎర్రబారాయి.

"జగదీష్ ! ఏమిటిది వదులు వదులు" బ్రతిమాలింది.

"వద్దు రూపా! నీ కన్నీళ్ళని, ఈ బాధ్యతలు నెత్తిన వేసుకుం
టావు చెప్పు! నీ మనసు, తనువు, ఆస్తి అన్నీ నాకు వదిలేయి. నిన్ను పువ్వుల్లో పెట్టి పూజించుకుంటాను." అన్నాడు ఆవేశంగా ఆమెను హృద
యానికి హత్తుకుని.

అతని స్పర్శ ఆమెకు చీదరగా, ఒంటిమీద తేళ్ళు, జెర్రులు ప్రాకి
నట్టుంది. అసహ్యంగా చూచింది.

"వదులు జగదీష్ ! నిన్నొక అన్నలా చూచాను వదులు...." అతని ఉడుము పట్టునుండి వదిలించుకోవాలని శతవిధాలా ప్రయత్నిస్తుంది



తను అరిచి గీ పెట్టినా ముందు గదుల్లో ఉన్నవారికి వినిపించదు, ఆమె ఇంతవరకు మానసికమైన ఇబ్బందినే ఎదుర్కొంది. ఇదొక క్రొత్తరకమైన అనుభవం. ఇప్పుడు అతని పంజానుండి బయట పడితే తరువాత ఆత్మ రక్షణార్థం ఏం చేయాలో ప్రయత్నం చేయవచ్చునని శక్తినంతటిని కూడ దీసుకుని ప్రతిఘటించింది.

అతను వదలటంలేదు. ఆమెను రెండు చేతులతో ఎత్తి, అక్కడ కూర్చోవటానికి వేసిన బల్లపైకి తీసుకు వెళ్ళాడు. ఆమె శక్తి చాలన టుండిపోయింది. తన వాళ్ళందరిని ఈ నాల్గు గోడల మధ్య ప్రాణము తీశారు. తనను మరొక విధంగా చంపుతున్నారు. తన ఆశలు, ఆశయాలు అన్నీ అడుగంటిపోతున్నాయి.

ప్రతిఘటించే శక్తిలేనట్టు శవంలా పడిపోయింది రూప. ఆమెకు సిగరెట్ కంపు, చమటకంపు కలసి వాసన గుప్పుమని దగ్గరగా రావటంతో చేతులు ముఖానికి అడ్డు పెట్టుకుంది.

"రూపా! నిన్ను అన్యాయం చేయను...." అంటున్నాడు జగదీష్.

"మొదట నువ్వు అన్యాయం కాకుండా ఉండరా రాస్కెల్...." అతని వీపుపై నాల్గు గుద్దులు పడేసరికి మగత వదిలిపోయింది. లేచి నిల బడ్డాడు ఒగరుస్తూ. రూప కళ్ళు విప్పింది.

అపర కాళికాదేవిలా నిల్చుంది ఇంద్రమ్మ. ఆమె కళ్ళు భగ భగ మండే నిప్పు కణికల్లా ఉన్నాయి.

ఆమె మూలకు పెట్టిన మంచం కర్ర తీసుకుంది. రూప క్షణంలో గ్రహించి అడ్డు పడకపోతే జగదీష్ తల కొబ్బరకాయలా పగిలేది, రెండుగా చీలేది.

"నాయనమ్మా...." అని కోడు లాక్కుంది ఉన్మాద స్థితిలో ఉన్న ఇంద్రమ్మను ఆపటం తన తరం కాదని అర్థం అయిందేమో, లుంగీ సవ రించుకుని పారిపోయాడు.

"నాయనమ్మా...." ఆమె గుండెలమీద తలవాల్చి, కుమిలి, కుమిలి ఏడ్చింది రూపాదేవి.

"రూపా యూ గ్రేట్ గళ్....ఏడుస్తారా. ఛ....ఛ...." క్రర పారేసి మనవరాలి తల నిమిరింది ఇంద్రమ్మ. తలుపులు వేసుకున్నాక, ఇంద్రమ్మ పరిష్వంగంలో పసిపాపలా నిదురబోయింది.

ఆ మర్నాడు ఊరంతా గుప్పుమంది.

"రూపమ్మ జగదీష్‌ను దగ్గరగా పిలిచి, కోర్కెలు తీర్చుకుని పంపేసిందట" అన్న పుకారు అంటువ్యాధిలా వ్యాపించింది

"ఆ వార్తవిని వణికిపోయింది నాయనమ్మతో చెబుదామని వెళ్ళింది ఆమె మఠం వేసుకుని కూర్చుంది, ఏదో భజన గొణుక్కుంటుంది

"నాయనమ్మా! ఒక విధంగా నువ్వు ధన్యురాలవు నీకు ఏ మాలిన్యాలు అంటవు" అనుకుంది.

ఈ నిందలు, అపనిందలు భరించే శక్తి కావాలని ఆమె అణువణువు కోరుకుంది. ఆమె ప్రతి రోజు పది నిముషాలు రామకోటి వ్రాసినట్టుగా తను స్థిత ప్రజ్ఞత సాధించాలని వ్రాసుకునేది.

ఆమె మనసు రాయిలా మారిపోయింది. అప్పుడే పని కట్టుకుని వచ్చారు పరామర్శకు.

"పాపం అసలే మగదిక్కు లేనిదానివి...."

"అవునండీ, మగదిక్కు కోసమే జగదీష్‌ని వలలో వేసుకున్నాను. ప్రేమకలాపాలు అయ్యాయి. మోహం మొత్తి అతన్ని వదిలేసాను, మరొకరి కోసం చూస్తున్నాను" అన్నది కసిగా.

ఆ వచ్చినావిడ ముఖం మాడిపోయింది.

"మీ ఇష్టం వచ్చినట్టు చేసుకోండి. మాదేం పొయ్యింది?" వచ్చినావిడ చిర బురలాడుతూ లేచి వెళ్ళిపోయింది.

"ఆ సూక్తి గుర్తు పెట్టుకుంటే అందరం సుఖపడతాం. మీకు



కొడుకులేడు, నన్ను కోడలిగా చేసుకునే బాధలేదు. అనవసరంగా శ్రమ పడతారేం" అన్నదామె. అపతలామె విన్నదేమో క్రొత్తరకమైన ప్రచారం బయలుదేరింది.

"ఆ రూపలేదూ! ఎవర్ని యెంతమాటపడితే అంతమాట అనేస్తుందట. ఆ కొంపకు వెళ్ళకపోతే సరి" అనుకున్నారు, ఆ వార్త వెంకన్న తెచ్చినరోజు తేలికగా నిట్టూర్చింది.

పల్లెలు భారతదేశానికి పట్టుకొమ్మలు అంటారు కాని ఆ పల్లె ఉన్నంత అధ్వాన్నంగా మరేవి లేవేమో!

మూర్ఖత్వం పీసమయినా తగ్గలేదు. ఊళ్ళో ఎవరికి ఏ రోగం వచ్చినా, కుమ్మరి గురప్ప వీబూది, మంత్రమే వేయిస్తారు.

అలా, మలేరియా ఇన్‌ఫెక్షన్‌తో అయిదారుమంది పిల్లలు చనిపోయారు.

అబార్షన్ అయ్యే సమయాన యంత్రం పనిచెయ్యక చాలామంది స్త్రీలు చనిపోయారు. పురుషులు అంతే. అందుకే ఆమె కేశవరావు సలహా మేరకు అర్టీసిబస్ కోసము, ఊర్లో హాస్పత్రికోసం దరఖాస్తు పెట్టింది.

బస్సు వాళ్ళ ప్రణాళికలో ఉందని వెంటనే వేసారు ప్రభుత్వం. హాస్పత్రి విషయంలో జాప్యం జరిగింది. హాస్పత్రికట్టి, డాక్టరు వేసేసరికి మరో అయిదేళ్ళు జరుగుతాయి.

దానికి జవాబుగా, హాస్పత్రి కట్టేవరకు తనింట్లో స్థానం ఇస్తానని వ్రాసింది రూపాదేవి.

"చూడమ్మా! మంచి డాక్టరును పోస్టుచేయిస్తాను. మీ నాన్న ఉపకారం పొందినవారినే వేయిస్తాను" అని హామీ ఇచ్చాడు కేశవరావు. అలా గతంలో విహరిస్తున్న రూపాదేవిని తట్టి పిలిచింది ఇంద్రమ్మ.

"ఏమిటే పరధ్యాస!" అన్నది ముసి ముసిగా నవ్వుతూ.

"ఓ....పద నాయనమ్మా భోజనానికి" అన్నది కళ్ళు ఒత్తుకుని. ఆమెకంటే ముందే ఏదో గొణుక్కుంటూ వెళ్ళిపోయింది.

## 4

"నేను హెడ్‌మిస్ట్రెస్ రూపాదేవిని, ఈవిడ మా నాయనమ్మ ఇంద్రమ్మ, ఇది మా చెల్లెలు శర్మిష్ట" భోజనాల బల్లదగ్గర హరికృష్ణకు పరిచయం చేసిందామె.

కళ్ళు పెళ్ళబెట్టి చూచాడు హరికృష్ణ. నమస్కరించటంకూడా మరిచిపోయాడు. ఉదయం వీళ్ళిద్దరూ యెదురయితే, వారి వేషభాషలు చూచి యెవరో పల్లెటూరివారనుకుని కంట్రీబర్డ్స్ అన్నాడు.

"కూర్చోండి" అన్నది రూపాదేవి. అందరూ కూర్చున్నారు.

"పరిచయం పూర్తికాలేదు. రూపా. ఇట్—ఇన్‌కంప్లీట్" అతన్ని పట్టి పట్టి చూస్తూ అడిగింది ఇంద్రమ్మ.

"సారి నాయనమ్మా, ఇతను హరికృష్ణ, ఎమ్.బి.బి.ఎస్." అని పరిచయం పూర్తిచేసింది.

"ఆరే.... నేను మార్నింగ్ వాక్‌నుండి వస్తుంటే కనిపించాడు డాక్టరునని చెప్పలేదేమిటి? నేను ట్రాన్స్‌పోర్ట్ అరేంజ్ చేసేదాన్ని. ఇట్ ఇన్‌సల్ట్" అన్నదామె.

హరికృష్ణ నోరు విప్పబోయాడు, కాని మాట పెగిలిరాలేదు.

"మా నాయనమ్మ ఇంగ్లీష్‌లోని ఈజ్, వాజ్, యామ్‌లు ఎగిరిపోతాయి, అవి ఊహించుకుని ఫాలో అవ్వండి" శర్మిష్ట నవ్వింది.



"శర్మీ..." రూపాదేవి కోపంగా చూచింది.

శర్మిష్ట లేచి అందరికి వడ్డన ప్రారంభించింది. ఎంత అన్నం పెట్టినా అతను చాలు అనలేదని మరో రెండు గరిటలు వేసింది.

"నాయనమ్మ! ఈ పూట అతిధిగారు ఆకలిమీదున్నట్టున్నారు, చూచి తిను" అన్నది క్రీగంట హరికృష్ణను చూచి.

అతను ఉలిక్కిపడి తన కంచం నిండుగా ఉన్న అన్నంవైపు చూచుకున్నాడు.

"సారీ! నేను పరధ్యాసలో ఉంటే మీరు చూడకుండా చాలా వడ్డించారు. ఆకలిమీదున్నా అంత తిననులెండి! మీరు తినే అంచనాప్రకారం వడ్డించినట్టున్నారు" అన్నాడు. తను మౌనంగా ఉంటే చెవులకు తూటాకులు కడతారని ఊహించి.

"ఓహో! డాక్టరుగారు చమత్కారులేనే. అవునూ అంతగా తల బద్దలుకొట్టుకుంటున్నారు. మా అక్కయ్య హెడ్‌మిస్ట్రెస్‌గా కనిపించటం లేదా!" కవ్వింపుగా అడిగింది శర్మిష్ట.

"అబ్బే, నేనలా అనలేదే" హరికృష్ణ తికమకపడ్డాడు. ఈ పిల్ల అవులిస్తే ప్రేవులు లెక్కపెడుతుందే అనుకుని.

"హరికృష్ణగారూ! మీరు ఈ రోజు ప్రారంభిస్తారా, ఈ రోజు విశ్రాంతి తీసుకుని రేపు ప్రారంభిస్తారా?" రూపాదేవి అడిగింది.

"ఊళ్ళోకి వెళ్ళి సెంటరులో ఎక్కడయినా ఇల్లుందేమో చూచి వస్తాను" అన్నాడు, నిద్రలేవగానే వెంకన్న చెప్పిన విషయాలు గుర్తుకు తెచ్చుకుంటూ.

అతని కళ్ళముందు, రఘునాథ్ అతని కుటుంబీకుల ఆత్మలు అసంతృప్తితో ఈ ఇంటిలో తిరుగుతున్నట్టే అనుభూతి పొందాడు. అక్కడ ఇరవై నాల్గు గంటలుండి ప్రాక్టీస్ చేయలేడు తను.

"భోజనం చేయండి. తరువాత ఆలోచించవచ్చు" అన్నదామె.

అతను అన్నం కలిపి యెవరో తరుముతున్నట్టుగా ముద్దలు కుక్కేసుకున్నాడు.

"డాక్టరుగారూ! కాళ్ళమీద నీళ్ళు యెందుకు వస్తాయి? షైనింగ్‌గా లేవు నా కాళ్ళు?" అన్నది ఇంద్రజ.

"నేను మందిస్తానండి" అన్నాడు పెరుగు వేసుకుంటూ.

"మందు కాదు నేను అడుగుతుంది, రీజన్...." అన్నది ఆమె నిలదీసినట్టు.

"మూత్రపిండాలు సరిగ్గా పనిచేయకపోతే అలా అవుతాయి" అన్నాడు.

"మరి దానికి క్యూర్ లేదా?" కుతూహలంగా అడిగింది.

"ఎందుకులేదు ఉన్నది" అన్నాడు విసుగ్గా.

"మీకు పెరుగులో పండు నంజుకునే అలవాటుందా?" పళ్ళున్న ప్లాస్టిక్ ట్రే ముందుకు త్రోస్తూ అడిగింది.

"ఉహూ..." అన్నాడు అతను ఏం ఊహించాడు? హెడ్‌మిస్ట్రెస్ అంటే యెలా ఉంటుందనుకున్నాడు?

"చూడండి హరికృష్ణగారూ? మీ వూహలు తలక్రిందులయితే నన్ను మన్నించండి. మీరు పరద్యాసగా వైద్యంచేస్తే మాత్రం ప్రమాదం" అన్నది హెచ్చరికగా శర్మిష్ఠ.

"ఆ భయం మీకు అక్కరలేదు లెండి" అన్నాడు.

"వెంకన్నా! నేను క్లాసుకు వెళ్ళాలి, డాక్టరుగారిని తీసుకువెళ్ళి వూరు చూపించు" అన్నది రూపాదేవి. అందరూ లేచారు.

"మంచిదమ్మా" అన్నాడు.

హరికృష్ణ పైకి వచ్చి, బట్టలు మార్చుకునేసరికి వెంకన్న వచ్చేసాడు. ఇద్దరూ నడుస్తుండగా, వెంకన్న మరోసారి రూపాదేవి కుటుంబ చరిత్ర, వూరివాళ్ళ విషయము చెప్పాడు.



"వెంకన్నా ఎంతయినా మీ రూపమ్మ తీసుకున్న నిర్ణయం సముచితమైనదికాదు ఇంత దుర్మార్గం చేసిన ఊళ్ళో బడి, హాస్పత్రి అనటం ఏం బాగోలేదు" అన్నాడు.

"అయ్యా..." వెంకన్న ఎందుకో అతనితో ఏకీభవించలేకపోయాడు.

"ఎంత తక్కువచేసి అమ్మినా ఈ పొలాలకు అయిదారు లక్షల రూపాయల వస్తాయి. హాయిగా అమ్ముకుని ఆ డబ్బు బ్యాంక్‌లో వేసుకుంటే పోలా?" అన్నాడు సిగరెట్టు వెలిగించుకుని.

"నాకేం తెలుసు బాబూ" అన్నాడు. ఊరంతా కొడితే పందయాభై ఇళ్ళున్నాయి, కాకపోతే దగ్గర దగ్గర అయిదారుపల్లెలు ఆ చుట్టూఉన్నాయి. అవన్నీ తనక్రిందికి వస్తాయని అర్థం చేసుకున్నాడు. ఆ ఊళ్ళో ఆ మాత్రం వసతి ఎక్కడ కనిపించలేదు. ఒకచోట కమ్మరి కొలిమి కాలుతుంది. దాని దగ్గర బండి నిలబడి ఉంది. చక్రానికి పట్టా బిగిస్తున్నారు.

ఒక యువకుడు లేచి వచ్చి హరికృష్ణతో చేయికలిపాడు.

"నా పేరు జగదీష్! మీరు క్రొత్తగా వచ్చిన టీచర్ అనుకుంటాను."

"చిన్న సవరణ, డాక్టర్‌ను" అన్నాడు.

"ఓ అయిసీ మా ఊరు ఆరోగ్య భాగ్యాలతో కల కలలాడబోతోందన్నమాట" అన్నాడు.

అది వ్యంగ్యమో నిజమో తెలియదు.

"నాకు చేతయినంతవరకు ప్రయత్నిస్తాను" అన్నాడు.

ఎన్ని ప్రణాళికలు వేసినా భారతదేశంలో వేష, భాషలలో మార్పు వస్తుందిగాని, పరిసరాలలో మార్పురాదు, శుభ్రతకు మనం చాలా దూరం వెళ్ళిపోయామేమో అనిపిస్తుంది.

ఊళ్ళో లేవగానే కాఫీలు త్రాగేవారు, టీ త్రాగేవారు, ప్యాంట్లు, షర్టులు వేసుకునేవారు కనిపిస్తారుగాని, ఊరు పరిశుభ్రతగాని, పద్ధతులుగాని గమనించరు. ప్రణాళికలేని ఇళ్ళు, ఇష్టానికి వదిలేసిన రోడ్లు, ప్రతి ఇంటివెనుక ఓ పెంటకుప్ప. చెత్తడిబ్బి చూడటానికి అసహ్యంగా ఉన్నాయి.

వెంటనే హైదరాబాద్ పట్టణము గుర్తుకు వచ్చింది. ఒకవైపు మున్సిపాలిటీవారు ఊడుస్తుంటే రెండోవైపునుండి నవనాగరికులయిన స్త్రీలు చెత్తబోయటం ఎరగనిదికాదు. మనం స్వాతంత్ర్యం అంటే ఏమిటో తెలుసుకోలేదు. అలాగే నాగరికత అంటే ఏమిటో తెలుసుకోలేదు.

"ఏమిటండీ ఆలోచిస్తున్నారు. ఈ పల్లెలు ఇలా ఉన్నాయేమిటనా?" నవ్వాడు జగదీష్.

"పల్లెలు, పట్నాలు అని లేదు అంతటా ఇదే దుస్థితి" అన్నాడు.

"మీరు కాస్త ఈ వెంకన్నను పంపించివేస్తే...." ఇంగ్లీష్‌లో చెప్పాడు జగదీష్.

"సరే ఇంతవరకు మీకు డాక్టరు ఎవరు?"

"ఇక్కడ ప్రత్యేకంగా ఎవరూ లేరండీ. లేనివారు చిట్కా వైద్యాలు మంత్రాలను ఆశ్రయిస్తారు ఇక ఉన్నవారు శంషాబాద్‌లో హాస్పత్రులున్నాయి. అక్కడికి వెళతారు" అన్నాడు జగదీష్.

"వెంకన్నా! నువ్వెళ్ళి ఏదయినా పని చూసుకో, నేను వస్తాను" అన్నాడు హరికృష్ణ.

ఆ తరువాత జగదీష్ చాలా విషయాలు చెప్పాడు. కొన్ని ఆసక్తికరంగా ఉన్నాయి. మరికొన్ని ఆశ్చర్యకరంగా కూడా ఉన్నాయి. ఓహో! అనుకున్నాడు హరికృష్ణ.



"వాళ్ళింట్లో తప్ప ఎక్కడా కాస్త శుభ్రమయిన స్థలము లేదండీ అదే దురదృష్టం" అన్నాడు విచారంగా.

"ఫరవాలేదు. మీదపడి రేప్‌చేయలేదు కదా, త్వరగా మరేదయినా ఆలోచించాలి" అన్నాడు హరికృష్ణ.

హరికృష్ణ సెలవు తీసుకుని బయలుదేరాడు. అతని మనసంతా వికలమయింది.

తను హాయిగా ఫారిన్ వెళ్ళిపోదామంటే మామ ఇదేం లంపటం తగిలించాడు తనకు. 'ఇది ఊరా, పెద్ద మిస్టరీకి ఆలవాలం. ఆ అమ్మాయి వద్ద నిజంగా మంత్రశక్తులు ఉండే ఉంటాయి. లేకపోతే ఆ ఘట్టం చూచి, ఓ పిచ్చిదానితో యెలా ఉంటుందో ఆ ఇంట్లో! తను వింటుంటేనే గుండె గుబ గుబలాడుతుంది.

ఒక్కరాత్రి దారుణంగా అందరిని హత్యచేసిన మనుషుల మధ్య తిరగటానికి ఎన్ని గుండెలు!

కరుకు కత్తులతో ఆడుకునే తనకే వెన్ను జలదరిస్తుంది. ఆ రూపాదేవికి ఉన్నవి గుండెలా, రాళ్ళా అర్థము కాలేదు. అతనికింటికి రాబుద్ధి కాలేదు. మెల్లగా ఊరికి దూరంగా ఉన్న గోలుకొండ అనే చిన్న ఊరుకు వెళ్ళి అక్కడ కూర్చున్నాడు. బండమీద కూర్చుంటే ఎన్నో గతస్మృతులు తన మదిలో మెదిలాయి. తన తల్లి ది ఇక్కడెక్కడో చిన్న పల్లెటూరట. అందం చూచి, తన తండ్రి ఆమెను వివాహం ఆడారు తండ్రి చెల్లెలే కేశవరావు భార్య. చిన్నప్పటినుండి తనకు తల్లి, తండ్రుల కంటే కేశవరావు, ఆయన భార్య అలివేలు దగ్గరే చనువుంది. అక్కడ పిల్లలున్నారని వాళ్ళతోనే కలిసి ఉండేవాడు.

అప్పుడే తన తల్లిదండ్రులు చనిపోయారు. తిరుపతి వెళ్ళి వస్తూ కారు యాక్సిడెంట్ అయింది. తను మామయ్యా పిల్లలతో కూర్చున్నాడు, కాబట్టి బ్రతికి బయట పడ్డాడు.

కేశవరావు దేవుడ పేరున ఆరుగురు పిల్లలను కన్నాడు. అప్పుడు ప్రాక్టీసులేదు. అదనంగా హరికృష్ణ బరువు బాధ్యతలు పడ్డాయి. తన తండ్రి సంపాదించింది ఏం లేదని అర్థంఅయింది. ఇన్సూరెన్స్ కంపెనీ వాళ్ళిచ్చిన వేయి రూపాయలు ఇంటర్ చదవటానికి వచ్చాయి. ఫస్టు క్లాసులో పాసయ్యాడు.

"ఎక్కడయినా ఉద్యోగం వేయించండి" అన్నది అలివేలు.

"నీకు మతిలేదే ఫస్టుక్లాసు వచ్చిన కుర్రాడిని ఉద్యోగంలో చేరుస్తారా !"అన్నాడు కేశవరావు.

అతను ఎక్కడ తెచ్చాడో, ఏం కష్టపడ్డాడో తనకేం తెలియదు. కాని నిరభ్యంతరంగా తన ఎం. బి. బి. ఎస్. పూర్తిచేసాడు. అతనికి తనపట్ల ఏదయినా కుతూహలమా అంటే, నల్గురు మగపిల్లల తరువాత పుట్టిన ఆడపిల్లలు చాలా చిన్నవారు. అందుకే అతని మాటకు విలువ ఇచ్చాడు. అతను ప్రయత్నం చేసి ఈ ఊరు వేయిస్తే వచ్చాడు. ఈ ఊరు రాజకీయాలు ఊహించలేదు.

కొందరు సీనియర్స్ చిత్రంగా చెప్పగా విన్నాడు. ఊర్లో రెండు పార్టీలని, జనం మూర్ఖులని. కాని తానువచ్చి, కనీ విని ఎరగని తమాషాల్లో, చిక్కుల్లో ఇరుక్కున్నాడు

బయటపడటం ఎలా ! వెంటనే పెట్టే బేడా సర్దుకుని హైద్రాబాద్ వెళ్ళొచ్చు. కాని ఒక్కనాటితో మంచి, చెడు ఏం గ్రహించావని కేశవరావు నిలదీస్తాడు. అతనికేం జవాబు చెబుతాడు తాను.

ఆ రూపాదేవి ఆటలు తాను కట్టిస్తాడు. ఆవిడ వలలో అందరు అనుకున్నట్టు తాను పడడు పడబోడు.

"ఎవరు బాబూ ?" ఒక వృద్ధుడు పలుకరించాడు.

"కొత్తగా డాక్టరుగా" వచ్చాను.



"అట్లానా ! రూపమ్మ తెప్పిస్తానంటే ఏమిటో అనుకున్నా. ఎంతయినా ఇంద్రమ్మ మనవరాలాయె" అతని ముఖంలోని ప్రసన్నత ఆ సాయం సంధ్యలో కనిపించలేదు.

లేచి నాలుగు అడుగులు వేశాడు. అతనికి రఘునాథ్, అతని కుటుంబములోని వ్యక్తులు కనిపించారు.

అసంతృప్తిగా మరణించిన ఆత్మలు, ఆ బంగళా చుట్టూ తిరుగుతున్నట్లు అనిపించింది. అతని వల్లంతా చిరుచెమటలు పట్టాయి. ఎంతయినా డాక్టరు, ధైర్యం చేసి ముందుకు కదిలాడు.

"డాక్టరుగారూ !" అతనిపై టార్చి పడింది.

"ఎవరూ ?" కళ్ళు నులుముకున్నాడు.

"నేను బాబూ! వెంకన్నని"అన్నాడు దగ్గరగావచ్చి. రూపపంపిందట.

"ఓహో ...." అన్నాడు. తన గురించి ఇంత కుతూహలమెందుకో.

"చాలా దూరం వచ్చేశారు బాబూ" అన్నాడు దారిచూపుతూ. అతను అనుసరించాడు.

ఏమిటన్నట్టు వెనక్కు తిరిగాడు.

"ఆ బంగళాలో....అదే....మీ దొరగారి ఆత్మ తిరుగుతుందట."

"అన్నవారి కళ్ళు పోతాయి బాబూ, ఆ బాబూ ఇన్నాళ్ళయినా నాకు కలలో కూడా రాలేదు" అన్నాడు నొచ్చుకున్నట్లు.

ఆ ఇంటి ఉప్పు తినే నువ్వు నిజం చెపుతావా అనుకున్నాడు. ఇల్లు చేరగానే వెంకన్నను ఆపాడు.

"నేను పైకి వెళ్ళి పడుకుంటాను వెంకన్నా, నాకు ఆకలి లేదు"అని పైకి వెళ్ళి బట్టలు మార్చుకున్నాడు. అతనికి కిటికీ తీసి చూడాలంటే జలదరింపుగా ఉంది. అక్కడున్న కుర్చీలో కూర్చుని, సిగరెట్టు వెలిగించాడు.

"ఆకలి లేదన్నారట ఆరోగ్యం బాగాలేదా?" రూపాదేవి పాలగ్లాసు తీసుకుని వచ్చింది. ఆ పాలగ్లాసు ఇంతయి, అంతయి పెద్ద వలలాగ కనిపించింది అతని దృష్టికి.

"ఆరోగ్యం సరిగా లేకపోతే ఆకలి ఉండదని డాక్టరునయిన నాకు తెలియదా!" అన్నాడు వెటకారంగా.

"మీకు తెలియని విషయాలు చాలా ఉండవచ్చు. ఎలా ఉంది మా ఊరు?" అన్నది. పాలగ్లాసు బల్లమీద పెట్టింది.

కూర్చో అని అనని అతని అమర్యాదకు ఆశ్చర్యపోయినా, గత రెండు మూడు సంవత్సరాలుగా ఎదురయిన సమస్యలకు, ఇంతకంటే ఎక్కువే అవమానం పొంది, ఆవేదన చెందింది.

"ఊరు ఊరులా ఉన్నా మనుషులు చిత్రంగా ఉన్నారు" అన్నాడు.

"జగదీష్ కలిశాడా!"

అతని కనుబొమ్మలు ముడిపడ్డాయి.

"ఓహో! ఈ ఊరులో జగదీష్ ఒక్కడే చిత్రమైన వాడా!"

అతని అంతర్యం గ్రహించిన రూపాదేవి మరేం అనలేదు, నా నిం చేదు మిగుల్చుకోవటం కంటే మౌనంగా ఉండటమే ఉత్తమం అనుకుని

"మీకు ఆకలి అనిపిస్తే పాలు తాగండి. గుడ్‌నైట్" ఆమె చరచ క్రిందికి దిగి వెళ్ళిపోయింది.

మొదటి ఎత్తులోనే ఓడిపోయిన ఆమె అసహాయతపై నవ్వుకున్నాడు

లేచి పాలు త్రాగి పడుకున్నాడు. కాని ఆకలి చల్లారలేదు, అట ఇటు దొర్లి, చాలాసేపటికే అలసటగా కళ్ళు మూసుకున్నాడు హరికృష్ణ.

హరికృష్ణ అందరికీ మందులిస్తున్నాడు. ఎడతెగని క్యూ ఉం అతని ముందు.

"నాకు వైద్యము చేయాలి!" ఒక గంభీర కంఠము వినిపించిం అతను తలెత్తి చూచాడు అంతే! అతని వెన్నెముక పక్కన ఏదో జరబ ప్రాకినట్టు అయింది.



"మీ....మీరు?" నోరు పెగుల్చుకుని అడిగాడు.

"నే నెవరో ఇంకా ఊహించలేదా?"

ముచ్చెమటలు పోసాయి. ఇంగ్లీషు సినిమాలో జంతువులను కాలుస్తుంటే ఒంకర్లు తిరిగిపోతాయి అలాగే ఒంకర తిరిగాడు.

ముఖం వికృతంగా, కళ్ళు ఎర్రగా ఉన్నాయి.

"మాట్లాడవేం నాకు వైద్యం చేయవా?"

"చేస్తాను... చేస్తాను....ఏమిటి జబ్బు?" గొంతు పెగల్చుకుని అడిగాడు.

"నాకు....నాకు గొంతుకు ఉరి వేశారు. ఊపిరి ఆడటంలేదు. గడ్డివామిలో వేసి కాల్చారు...." అతను చెప్పుకు పోతున్నాడు. ముగ్గురు కుర్రాళ్ళు నడుచుకుంటూ వచ్చారు.

భయంగా వాళ్ళవంక చూచాడు, మామూలుగా లేరు. తలలు మొండేలపై ఒక ప్రక్కకు వ్రేళ్ళాడుతున్నాయి.

"మాకు తక్షణం వైద్య సహాయం కావాలి. మా తలలు కుట్టు" ముగ్గురూ కోరస్‌గా అడిగారు.

"నాకు....నాకు రాదు" అన్నాడు ఈ విచిత్రమయిన మనుషులకు తనెలా చెప్పగలడు! తాను మామూలు ఎం. బి. బి. ఎస్. మాత్రమే, సర్జరీ నేర్చుకోలేదని.

"ఇదిగో డాక్టరుగారూ! లేడీస్ ఫస్టు అన్నారు, నా సంగతి చూడు" ఒక స్త్రీ కుంటుతూ వచ్చింది. ఆమె రెండు చేతులతో గొంతు నొక్కి పట్టుకుంది. ఆమె వేళ్ళ సందునుండి రక్తధారలు జాలువారుతున్నాయి.

"మీకు....మీకేమయింది!"

"నిదురపోతున్నదాన్ని పట్టుకుని గొంతు కోసారు" అన్నదావిడ. వీళ్ళను చూచిన మిగతా రోగులు చల్లా చదురు అయ్యారు.

"సరే కూర్చోండి" అన్నాడు, ఏదో తనకు తోచిన మందిచ్చి ఉస్మానియాకు పంపుదామని.

"ఉహుం! వ్యవధి లేదు, నా ప్రాణం పోవటానికి అట్టే సమయం లేదు. నన్ను మొదట చూడు" మగకంఠము అన్నది

"ఉహుం! నువ్వు ఈ రోజు కాకపోయినా మరో రెండేళ్ళకు పో వాడివి. మేం కుర్రాళ్ళము మాకు బంగారు భవిష్యత్తు ఉంది. మమ్మల్ని మొదట చూడాలి" పిల్లలు గోలగా అరుస్తున్నారు.

"అదేం కుదరదు. నాకు మొదట చూడాలి. ఈ రక్తస్రావము కనిపించటంలేదూ?" అ స్త్రీ ముందుకు వచ్చింది.

"నాకేముందు."

"కాదు పిల్లలకే ముందు చూడాలి."

"అదేం కాదు లేడీస్ ఫస్టు" అన్నారు.

"నా మాట విని మీరంతా ఉస్మానియా హాస్పత్రికి వెళతారా!"

"ఉహుం! వెళ్ళము. మీరే చూడాలి" కోరస్‌గా అరిచారు.

అతను చెప్పేది ఎవరూ వినరు. తల పట్టుకుని కూర్చుం పోయాడు.

"హేయ్! లేచి వైద్యం చేస్తావా, లేదా? నీ మెడకు ఉరివేసి చం తాను." క్రూరంగా చూచాడు ఆ పురుషుడు. అతను మప్లర్ తీసాడు. అ మామూలు మప్లర్ కాదు, ఇనప పట్టాలా ఉంది.

"వద్దు ముందుకు రావద్దు" అన్నాడు కీచుగా అరుస్తూ.

"ఇదిగో ఇవి చూడు" ముగ్గురు పిల్లలు మూడు గొడ్డళ్ళు పట్టు న్నారు.

"మా గొంతులు కుట్టమంటే వేశాలు వేస్తున్నాడు, వేశా అన్నారు కసిగా.

"అతనికి నేను బుద్ధి చెబుతాను" స్త్రీ మంగలికత్తితో వచ్చిం అతన్ని కుర్చీలో వెనక్కు వంచి కత్తితో గొంతు గంటు పెట్టబోయిం

హరికృష్ణ తన శక్తినంతా కూడదీసుకున్నాడు.

"వద్దు....వద్దు నన్ను పట్టుకోవద్దు... వద్దు.... నన్ను చంపొ



వదిలేయండి... ప్లీజ్..." అంటున్నా వాళ్ళు వినిపించుకోవటం లేదు. అతను ఆశ వదులుకున్నాడు.

అతని ముఖంపై చల్లటి నీటి జల్లు పడింది.

"హరికృష్ణగారు! హరికృష్ణగారూ"

ఎవరిదీ గొంతు! ఆ స్త్రీ గొంతులా కర్కశంగా లేదే.

"బాబూ.... డాక్టరుబాబూ...."

ఆ పురుషుడి గొంతు ఇంత మార్దవంగాలేదే.

"డాక్టర్.... డాక్టర్‌గారూ...."

ఆ పిల్ల పిలుపు పిడుగు పడినట్టుండేది. ఇంత మృదువుగా వుందేం? అతను బలవంతంగా కళ్ళు విప్పాడు.

తన మంచం చుట్టూ నిలబడిన వెంకన్న, శర్మిష్ఠ, రూపాదేవి తన వంకే ఆశ్చర్యంగా, అపనమ్మకంగా, ఆదుర్దాగా చూస్తున్నారు.

"నాకు.... నాకేమయింది?" ఆశ్చర్యంగా అడిగాడు.

"మాకేం తెలుసు! మీరే చెప్పాలి" అన్నది రూప.

"మొదట మంచినీళ్ళు త్రాగండి బాబూ" వెంకన్న మంచినీళ్ళు తెచ్చి యిచ్చాడు,

అతను మంచినీళ్ళు త్రాగి, నెమ్మదిగా తనకు వచ్చిన కలగురించి చెప్పాడు.

వెంకన్న, రూప ముఖాలు చూసుకున్నారు.

"అసంతృప్తిగా, మధ్యలోనే బలవంతంగా మరణించిన కుటుంబం యొక్క ఆత్మలు తిరుగుతున్నాయేమో!" అన్నాడు మెల్లగా జరిగింది గుర్తుకు తెచ్చుకుని.

"కాదు బాబూ! మీరు బయట విన్న విషయాలు మిమ్మల్ని వేధించి వెంటాడేయే తప్ప ఈ ఇంట్లో ఆత్మలు, దయ్యాలు, భూతాలు అన్న ప్రసక్తి లేదు" అన్నాడు వెంకన్న.

అతను మౌనంగా కూర్చున్నాడు.

రూపాదేవి ఓ రెండు నిమిషాలు అతని వంకే చూచింది. ఆ తరువాత వెంకన్నను పిలిచింది.

"వెంకన్నా! మానసికంగా ఇంత బలహీనంగా ఉండేవారిక్కడేం పనిచేయగలరు ? ఈ రాత్రికి ఇక్కడే పడుకో. రేపు ఉదయం వారిని బస్సు ఎక్కించేయి. కేశవరావుగారికి ఉత్తరం వ్రాస్తాను." అని శర్మిష్టను వెంటపెట్టుకుని వెళ్ళిపోయింది రూప

ఆ విసురులో ఎన్నో అనర్థాలు స్పష్టమయ్యాయి.

"మనూరికి ఓ మగాడు కావాలి" అన్నట్టుంది.

ఏమిటీ ఈవిడ ధిక్కారం!

ఎంత అహంకారం! ఆ పొగరుందనే ఒంటిస్థంభం మేడలాంటి ఈ బంగళాలో ఉండగలుగుతుంది.

అతను పళ్ళు కొరుకుతుండగానే వెంకన్న తుండు తెచ్చి ఇచ్చాడు, ముఖం అద్దుకుని మళ్ళీ వెనక్కు లాగాడు.

"పడుకోండి బాబూ! నే నిక్కడే ఉంటాను" అన్నాడు వెంకన్న. అతని మాటలు అగ్నిలో ఆజ్యం పోసినట్టు అయ్యాయి.

"నువ్వు పిరికివాడవు, నీకు తోడు ఉంటాను" అన్నట్టుగా ఉన్నాయి.

"వెంకన్నా ! నాకేం భయంలేదుగాని నువ్వెళ్ళిపో" అన్నాడు కరుకుగా. అతను ఒకసారి నిట్టూర్చి వెళ్ళిపోయాడు.

తను ఒకసారలాగే 'ద ఘోస్ట్సు' అన్న పుస్తకం చదివి అరిచాడు. నేనంత పిరికివాడినా చూస్తాను ! అనుకున్నా నిదుర పట్టలేదు. లైటు వేసుకుని, చేజ్ నవల తీసుకున్నాడు చేతిలోకి. రాత్రంతా అది చదువుతూనే గడిపాడు. తెల్లవారుజామున కళ్ళు మండుతుంటే లైటు ఆపేసాడు.

అతనికి మెలకువ వచ్చేసరికి బాగా పొద్దు ఎక్కింది. దూరం నుండి 'టు టు జ షోర్' అన్న మృదుమధురమయిన గొంతులు-కోరస్‌గా అనటం వినిపించింది.



"బాప్‌రే... " అని సమయము చూచాడు. పదిన్నర గంటలు అయింది. అతను లేచి బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు. బ్రష్, పేస్ట్, బిందె నిండుగా వేడినీళ్ళు ప్రక్కనే బాల్చీలో చన్నీళ్ళున్నాయి. ముఖం కడుక్కుని గదిలోకి వచ్చాడు, రెండు ఫ్లాస్కులున్నాయి.

ఒకటి మూత తీశాడు. కాఫీ వాసన గుప్పుమంది.

రెండవది తీసాడు, టీలా అనిపించింది. టీ ఒంపుకుని త్రాగేశాడు. స్నానంచేసి తయారయ్యేసరికి మరో అరగంట పట్టింది. క్రిందికి దిగాలి. తప్పదు అనుకుని లేచాడు. అతను బయటికి వస్తుండగానే వెంకన్న కనిపించాడు.

"లేచారా బాబూ!" అన్నాడు చిరునవ్వుతో.

"లేచారా అని అడక్కపోతే లేవకూడదా?" అన్నాడు కాస్త నిష్టూరంగా. వెంకన్న ఏదో చెప్పబోయి ఆగిపోయాడు. అంత భయం దేనికో!

"రూపమ్మ మిమ్మల్ని మీ ఇష్టం వచ్చినట్టుండనీయ మన్నారు. లేపి విసిగించవద్దన్నారు" అన్నాడు వినయంగా.

"ఓహో! నాపై బలప్రయోగం మొదలయిందన్న మాట" అనుకున్నాడు.

ఆకలి నక నకలాడుతుంది.

"ఈ ఊళ్ళో తినడానికేమయినా దొరుకుందా ?"

"దొరుకుతుంది బాబూ" అన్నాడు. అమ్మయ్య అనుకున్నాడు. దొరకదంటాడేమో మళ్ళీ ఆ రూపాదేవినే ఆశ్రయించాలి కాబోలు అనుకుని యెమ దిగులు పడిపోయాడు.

రెండు రూపాయలు ఇచ్చి టిఫిన్ తెమ్మన్నాడు, వెంకన్న పదినిమిషాల తరువాత పూరి కూర తెచ్చి, ఒక రూపాయి బల్లమీద పెట్టాడు.

"చూడు వెంకన్నా ఒకరిని ఇబ్బంది పెట్టటం నాకిష్టంలేదు, భోజనం దొరికితే కూడా తెచ్చిపెట్టు" అన్నాడు టిఫిన్ తీసుకుంటూ. అతను బట్టలు నీళ్ళ బిందె పట్టుకుని వచ్చాడు.

ఉన్న ఓపెన్ స్థలంలోకి వెడుతుంది. అది తీసాడు. అక్కడినుండి వెనుక స్థలం కనుపిస్తుంది. అక్కడ అరుగుమీద రూపాదేవి కచ్చేరి చేస్తున్నట్టు కూర్చుంది. ఆమె ఎదురుగా ఇంద్రమ్మ కూర్చుంది. పాట అయిపోయింది.

"ఇప్పుడయినా లేచి అన్నం తింటావా నాయనమ్మా!" అన్నది గారంగా.

"గుడ్.... గుడ్ గళ్. పద నువ్వు భోజనం చేద్దువుగాని...."

ఇంద్రమ్మ వెళ్ళిపోయింది.

"అక్కా! నాయనమ్మ అలకలకు ఇంత ప్రాముఖ్యం ఇస్తే, మనము బ్రతికినట్టే...." వెటకారం చేసింది.

"శర్మీ! కోపంగా అరిచింది రూపాదేవి. ఆమెను ఆ స్థితిలో చూస్తే సాక్షాత్తు ఆదిశక్తి యిలా ఉందేదేమో అనుకుంటారు.

"టైగర్ ఇంద్రమ్మ అని తమాషాగా చెప్పుకునే నాయనమ్మనే చూశావు. ఎందరికో ప్రాణభిక్ష పెట్టిన ఒకతల్లి, మహాఇల్లాలిని చూడ లేదు" అన్నది మందలింపుగా.

"అక్కా...." విచలిత అయి చూచింది.

"నువ్వు హాస్టల్‌కు వెళ్ళాలి కాబోలు. వెళ్ళి తయారవ్వు" అన్నది.

ఇద్దరూ లోపలికి వెళ్ళిపోయారు.

ఒక నిట్టూర్పు విడిచి వెనక్కి తిరిగాడు హరికృష్ణ. అతనికి అర్థం అయినట్టు, కానట్టు ఉంది.

## 6

ప్రాతకాలంనాటి లోగిలి. గడపలకున్న పసుపురంగు, వాటికి పెట్టిన ఎర్రని బొట్లు, పాపపుణ్యాలు పోటీపడుతున్నట్టున్నాయి. బయటవరండాలో కూర్చున్నాడు రాయలు. అతనికి నూనె రాస్తున్నాడు మంగలి వీరన్న.

రాయలు వయసు ఇంత అని ఖచ్చితంగా అంచనా వెయ్యటం కష్టమే. ఒకసారి చూస్తే ముప్పై అనిపిస్తాడు. మరోసారి చూస్తే నలభై అనిపిస్తాడు అతను వేసుకునే దుస్తుల్నిబట్టి అంటారు. ధోవతి వేసుకుంటే పెద్దాడిలా కనిపిస్తాడని అంటారు.

అతని దొడ్లో వేపచెట్టు క్రింద జావా పెట్టిఉంది. దాన్ని తుడుస్తున్న కాంపౌండర్ రాజలింగం, చేతులు తుడుచుకుంటూ వచ్చాడు.

"దొరా...." మాట మింగేసాడు.

"ఎవడు చచ్చాడ్రా?" రాయలు అడిగాడు కోపంగా.

"అదికాదు దొరా! ఊళ్ళోకి కొత్త దాక్టరు వచ్చాడు. అతని చేతి క్రింద పని చేయాలంట...."

"ఐంచత్! బ్రతకాలని లేదా?" కాలితో నేలను తన్నాడు.

"అదికాదు దొరా! సర్కారోల్లు కానూన్ ప్రకారం మాట్లాడుతారు" అన్నాడు భయంగా.

"ఎవడ్రా! కానూన్ గురించి నా దగ్గర మాట్లాడేది? అంతపాటి మగాడున్నాడా?" చేయి విదిలించాడు రాయలు అంతే, వీరన్న ప్రక్కన నూనెగిన్నె ఎగిరి గజం దూరంలో పడింది.

వీరన్న ఇప్పుడేం మాట్లాడొద్దు బొమ్మని సైగజేసాడు. రాజలింగం వెళ్ళిపోయాడు.

"తానం చేత్తారా! జరాయినంక చేత్తారా దొరా...." అని అడిగాడు.

"ఓ అరగంట ఆగి చేస్తాను" అన్నాడు ప్రక్కనే ఉన్న వార్తా పత్రిక తీసుకుని.

"దొర చాయ...." దాచసీతో గారపట్టిన పళ్ళు ఇకిలిస్తూ వచ్చింది పనిమనిషి కమిలి.

"కమ్లీ! నేను భోజనానికి రాను" అన్నాడు కళ్ళు చికిలిస్తూ.

"పట్నం వాసననూనే, ముక్కు పట్టుకుర్రండి" అన్నది. అప్పుడే వీరయ్య వచ్చాడు.

"గెటవుట్ .... నువ్వింట్లోకి వెళ్ళు" కసురుకున్నాడు రాయలు.

"నీళ్ళు తోడాను దొరా" అన్నాడు వీరయ్య.

టీ మొత్తం త్రాగేసి లేచాడు రాయలు.

"ఏమిట్రా వీరయ్యా! ఈ సైగర్ ఇంద్రమ్మ మనుమరాలు ఏమనుకుంటుందసలు. తనను రాణీ రుద్రమ్మ అనుకుంటుందా, మల్లమ్మ అనుకుంటుందా?" అన్నాడు బావి చప్టామీద కూర్చుని.

"అయ్య...." అన్నాడు వీపుకు సబ్బు పట్టిస్తూ.

"దాని తాత అన్యాయంగా మన పొలాలన్నీ ఆక్రమించుకుంటే, అవి దాని తండ్రి మనకు కౌలుకిచ్చాడు. అంత మాత్రంచేత దీనికి కొమ్ములు వచ్చినట్టేనా?" అన్నాడు కోపంగా.

"యిప్పుడేమయింది దొరా?" అన్నాడు వీరయ్య, రఘునాధ్‌ను చంపినవాళ్ళలో వీరయ్యకూడా ఉన్నాడు. అతను జైలులో ఉండగా రాయలు తండ్రి, వీరయ్య కుటుంబాన్ని ఆదుకున్నా, పాపమో, శాపమో గాని, వీరయ్యభార్య లేచిపోయింది. ఒకపిల్ల మసూచితో, రెండోపిల్ల కలరాతో పోయింది. వీరయ్యకు పళ్ళీ పెళ్ళి చేసుకోమని సలహా ఇచ్చారు.

అతని మనసు ఎటోపోతుంది. త్రాగిన నిషాలో కత్తిఎత్తాడు రఘునాధ్ కొడుకుపైకి. అప్పటికి అతను వాళ్ళింటి మంగలే. ఆ కుర్రాడు అమాయకంగా వీరయ్యవంక చూచాడు.

"నన్ను.... ఇప్పుడు వదిలెయ్యి వీరయ్యా, నిదురొస్తుంది. రేపు క్రాపు చేయించుకుంటానుగా...." అంటున్న అమాయకుడి గొంతుకు కత్తివేటు వేసిన పాపాత్ముడు తను.

"ఏరా! నేను మాట్లాడింది వినిపించిందా?"

"ఏమన్నారు దొరా?" ఎదుటికి వచ్చి కాళ్ళు రుద్దుతూ అడిగాడు.



"ఆ డాక్టర్ని అదే పిలిపించుకుందట కదా, పట్నంలో ఆటలు ఆడినవారేనట" అన్నాడు

వీరయ్య ముఖం, ధోరణి కళిముఖంగా ఉంది. అతని ముఖములో భావాలు చదివితే రాయలు ఆ మాట అనేవాడు కాదు.

"ఏమో దొరా అసుంటి పాపపు మాటలు మనకెందుకు?"

"అహహ్హ! .... బావుందిరా పాపపు మాటలని నీ నోటిగుండా రావటమా!" ఆ ఆపరణ అంతా అదిరిపోయింది రాయలు నవ్వుకు. నిజమే నవ్వటమేకాదు, తనను కత్తికి ఇంత కండకోసి కాకులకు గ్రద్దలకు వేసినా పాపంలేదు.

ఆఖరువాడు ఎంత అమాయకంగా తన చంకనెక్కాడు.

"వీరయ్యా! అమ్మకేమయింది? రక్త....అమ్మో ఎంత రక్తమో"

"చినబాబూ! వీళ్ళందరూ ఎవరు?"

తనతో పచ్చిన హంతకులను చూసాడు ఆ పసివాడు.

"ఇతను రాములు...." అలా మొదలుపెట్టి అందరి పేర్లు చెప్పాడు.

"అమ్మ నా కొడకా! రేపు పోలీసులు అడిగినా అందరిపేర్లు చెపుతావ్రా!" అంతే చంకలోనే ఒత్తేసాడు. అనుమానం తీరక వ్రేళ్ళాడిన గొంతుకను తెంపాడు.

"వీరయ్యా! వీళ్ళంతా అమ్మను, తమ్ముళ్ళను ఏదో చేసారు. నాకు భయంగా ఉంది" అంటూ వీరయ్యను కౌగిలించుకున్నాడు పెద్దబాబు.

తను కత్తి ఎత్తాడు,

"ఈ వస్తువులు, డబ్బూ అన్నీ తీసుకో వీరయ్యా! నన్ను చంపకు .. నాన్నగారూ, నాన్నగారూ...." అంటూ అందర్లోకి పెద్ద కుర్రాడు చేసిన ఆర్తనాదం అతన్ని వెంటాడుతుంది.

"నేను నిన్నేమన్నాను వీరయ్యా?" దీనంగా అడిగాడు.

"ఏమనలేదు బాబూ.... ఏమనలేదు, నేను రాచ్చసున్ని, కిరాయి కుక్కను" అని ఆ సంఘటన గుర్తు రాగానే వల, వల ఏడ్చేసాడు.

కళ్ళు ఒత్తుకున్నాడు వీరయ్య.

"ఈ వేళ నీకేదో రోగమొచ్చిందిరా, అలా ఉన్నావేం మందకొడిగా!" తడి లుంగీపంచె దూరంగా విసిరాడు రాయలు.

"ఏం లేదయ్యా, ఏ బట్టలు తియ్యమంటారు?" అన్నాడు మరోసారి భుజానికి కళ్ళు ఒత్తుకుని.

"పైజమా లాల్చీ తీసిపెట్టు. అలాగే మొన్న కుట్టిన ప్యాంటు బ్యాగ్‌లో పెట్టు. సిటీలో ఇచ్చినా దర్జీ నా కొడుకులు సరిగ్గా కుట్టరు" అన్నాడు. వీరయ్య బట్టలు, చెప్పులు తెచ్చిపెట్టి బ్యాగ్ సర్దాడు. నిజంగానే పసిపిల్లలేం జేసారు. త్రాగిన మైకంలో అందరూ అన్నదాన్ని సమర్థిస్తూ తన చేత్తో మూడు ప్రాణాలు తీసాడు. తను బ్రతికిఉన్నా, చచ్చినవాడి క్రిందే లెక్క.

"వీరయ్యా! కూరగాయల బిల్లు చాలా తక్కువ వస్తుంది. బండితో పాటు నువ్వెళ్ళు" అన్నాడు.

"మంచిది దొరా" అన్నాడు. అతను ఇంటిమేటు స్ప్రే చేసుకోవటము చూచి ఆగాడు.

"ఏమన్నా డబ్బులు కావాల్రా?"

"అదికాదు దొరా! మీ రొక్కరూ ఎన్నని జూసుకుంటారు. నా మాటిని పెండ్లి జేసుకోండి దొరా" అన్నాడు, అతని ప్రసన్న వదనము చూచి.

"ఏరా! నేను సుఖంగా బ్రతుకటం నీకు ఇష్టంలేదా?"

"పెండ్లి జేసుకున్నోళ్ళంతా కష్టపడిపోతున్నారా?" కాస్త బిగ్గరగా అడిగాడు ఆ మాత్రం చనువు వీరయ్యకే ఉన్నాయి.

"నీకు బుర్రలేదురా, చిక్కటిపాలు బజార్లో దొరుకుతుంటే, గేదెను ఇంట్లో కట్టేసుకుని, పేడ, దూడ అంటూ ఎవడూ తాపత్రయపడడురా తిక్కలోడా" అన్నాడు క్రాపు సవరించుకుంటూ.



"పేడ పనికివచ్చేది, దూడ దొడ్డికే లచ్చనం దొరా" అన్నాడు.

"నీ వేదాంతం కట్టిపెట్టు" అన్నాడు మురిపెమైన చిరాకుతో.

వీరయ్య నిట్టూర్చాడు. రాయలు బయటకువచ్చి తన వాహనము స్టార్ట్ చేసాడు, విమానం మ్రోగినంత మోతతో స్టార్ట్ అయింది.

"అమ్మయ్య! పీడ ఇరగడయ్యింది. ఇంట్లో ఉన్నంతసేపు ఉరుములే...." అన్నది కమిలి, అరసోలెడు గ్లాసుతో చిక్కటిపాలు తెచ్చుకొని నడింట్లో కూర్చుని త్రాగుతూ.

ఒకసారి ఏహ్యంగా చూచి పై పంచతో దులిపి, బయటికి వచ్చాడు వీరయ్య. అతనికి రూపాదేవిని కలుసుకుని వీళ్ళందరిని ఎందుకు రప్పించిందో అడగాలని ఉంది. ఈ పులులతో చలగాటం ఎందుకో అర్థంకాలేదు. తాను వెళితే ఎంత ప్రమాదమో తెలుసు.

మొదటిసారి వెళ్ళినప్పుడు ఇంద్రమ్మ శివమెత్తినట్టు వచ్చి గొంతు పట్టుకుంది. కొద్దిలో ప్రమాదం తప్పింది. రూపాదేవి ఒక్కర్తే సాహసించింది విడిపించాలని.

"రూపా! వాడు....వాడే నా బిడ్డలను చంపింది. వాడేనే తల్లీ.... ఏ కోర్టులు ఇవ్వలేని తీర్పు నేనిస్తానే...." అని గింజుకుంటుంటే, రూపాదేవి నాయనమ్మను రెండు చేతులతో కౌగిలించుకుంది.

"వీరయ్యా! వెళ్ళిపో....నువ్వెళ్ళిపో" అని అరిచింది.

ఆ సంఘటన తరువాత అతను ఏప్పుడూ ఆ ఇంటికివెళ్ళలేదు. ఎప్పుడయినా పనిఉంటే బయట పొలందగ్గర కలుసుకునేవాడు. సాయంత్రాలు వస్తుందామె. అంతవరకు ఆగవల్సిందే.

సాయంత్రం పొలందగ్గర రూపను కలుసుకున్నాడు వీరయ్య.

"ఏం వీరయ్య మీ దొరేమంటున్నాడు?"

"మీరేందమ్మా ఈళ్ళందరిని పిలువనంపింద్రంట."

"అవును వీరయ్యా! కౌలు ఇవ్వరు, పొలం వదిలపెట్టరు. కోర్టుకెళ్ళొచ్చు కాని ఇద్దరం నష్టపోతాం. లాయరుగారు వస్తామన్నారు. వారి

ముందు ఓ నిర్ణయానికి రావాలి. నాకు డబ్బేం వద్దు, ఈ ఇడికి నామినల్‌గా
కొంత డబ్బిచ్చి, ఆ పొలం వాళ్ళపేర పట్టాచేయించుకుంటారని పిలిపిస్తే
ఒక్కరూ రాలేదు" అన్నది నిట్టూరుస్తూ.
"పెద్దలు కష్టపడి సంపాయించిన పొలం పోగొడతావు" అన్నాడు.
"అది ఉండి నాకేం ఒరగబెట్టింది వీరయ్యా, లాయర్‌గారికి ఒంట్లో
సుస్తీ అట, వారు రాలేదు" అన్నది.
"దొర మంచోడెనమ్మా. దోస్తులు మంచోల్లుగారు పెద్దయితే
బాగుపడతడంటే పెండ్లొద్దంటాడు" అన్నాడు బాధగా.
"ఏం మంచో వీరయ్యా! ఎక్కడికయినా పారిపోవాలనిపిస్తుంది"
అన్నది అసహాయంగా.
వీరయ్య ఎటో చూస్తున్నాడు
"ఏమిటి వీరయ్యా, ఏమాలోచిస్తున్నావ్?"
"అది కాదమ్మా! మీ సిన్నబ్బాను, పిల్లలను చంపినోడిని మీ
ముందు నిలబడితే ఏం చేస్తావమ్మా."
"ఏం చేస్తాను వీరయ్యా! ఇదేం సినిమాకాదు, ఏదో గ్యాంగ్‌తో
చేరి పగదీర్చుకోవటానికి, వాళ్ళ పాపం వారిదే అని వదిలేస్తాను. న్యాయ
స్థానాల్లో న్యాయం అమ్ముడవుతున్న ఈ రోజుల్లో ఏం చేయగలం చెప్పు"
అన్నది ఎటో చూస్తూ.
"అమ్మా...." అతను ఆలోచనలో పడ్డాడు.
"అదికాదు ఆ చంపినవారు, తాత్కాలికంగా సంతోషంగా ఉండగల
రేమోగాని వారి అంతరాత్మ వారిని నిలదీస్తుంటుంది" అన్నది.
"అచ్చరాలా నిజం తల్లీ ....నిజం...." అనుకున్నాడు మనసులో.
"అందరూ మీ దొరగారికి జడుసుకుని రావటానికి భయపడు
తున్నట్టున్నారు వీరయ్యా. మీ అయ్యగారితో ఈ విషయం చెప్పు" అన్న
దామె. తలాడించాడు వీరయ్య.
బంగళాకు వెళ్ళేదారివరకు ఆమెనువదిలి, వెనక్కువచ్చాడు అతను
నవ్వులు వినిపించి, పడకగదివైపువెళ్ళి, వెళ్ళినంతవేగంగా తిరిగి వచ్చాడు.



ప్రొద్దంతా ఒడిగి ఒదిగి తిరిగే కమిలి రాయలు వడిలో పడుకుని ఒగలు పోతుంది. ఆయన అప్పటికే సగం సీసా ఖాళీ చేసినట్టున్నాడు. కమిలిని నానా బూతులు మాట్లాడుతూ తిడుతున్నాడు.

"వీరయ్యా ....ఒరేయ్...." ముద్దముద్దగా వినిపించింది అతని మాట. వీరయ్య నిలబడే అడిగాడు.

"ఇట్లారా సన్యాసీ...." అన్నాడు.

అతను ఎదురుగా వచ్చాక ఇక తప్పదన్నట్టు కమిలి లేచి ప్రక్కకు జరిగి నిలబడింది.

"ఎక్కడికి వెళ్ళావ్! ఆ వెధవ....రంగడు ఏం చేశాడో తెలుసా, పాలు తీస్తూ నీళ్ళు కలిపాడు, చావు దెబ్బలు తిన్నాడు వెధవ..." అన్నాడు.

"అట్ల వస్తుంటే రూపమ్మ కనిపించింది."

"కనిపించిందా? ఇంటికి పిలిపించిందా, వయసు మళ్ళినా, బలంగా ఉన్నావ్...." భళ్ళున నవ్వాడు.

వీరయ్య అసహ్యంగా చూచాడు.

"అది ఎట్లా ఉంటుంది? అందంగా ఉంటుందా! ఎంగిలి వందే రుచి, ఓ పట్టు పట్టనా!" అన్నాడు.

"దొరా! ఆయమ్మ నిప్పయ్యా...." అన్నాడు బాధగా.

"అందుకే ఆ జగదీష్‌ను కాల్చేసిందికదరా. ఇంతకీ ఏమంటుంది?" అన్నాడు సీసాయెత్తి గడగడ త్రాగుతూ.

మీరు కౌలుకు చేస్తున్న పొలాలన్నీ మిమ్మల్నే పట్టా చేసుకో మన్నదయ్యా. జరన్ని పైసలియ్యమంది."

"అహా! జరన్ని పైస లెందుకట! దమ్ములుంటే కోర్టుకెల్ల మనరా. దానికి పైసలే కావాలనుకుంటే రెండు రాత్రులు నా దగ్గరకు రమ్మను ఇస్తాను" అన్నాడు దర్పంగా.

"శివ! శివా!" వీరయ్య వెనుతిరిగాడు.

"పసిపిల్లల గొంతు కోసిననాడు శిపుడు ఎక్కడ దాక్కున్నా డురా?" వెటకారంగా అడిగాడు.

అతను జవాబు చెప్పలేదు. పెరటిలోకివచ్చి మూలుగుతున్న రంగ డిని నాలుగు తిట్టి, వేడినీళ్ళతో కాపుతూ కూర్చున్నాడు.

## 7

శర్మిష్ట పట్నం వెళ్ళిపోయాక ఇల్లు మరీ చిన్నబోయినట్లు అని పించింది రూపకు. సాయంత్రం వయోజన విద్యార్థులు వస్తారు, కాబట్టి ఆమాత్రమయినా సమయం నడుస్తుంది.

వెంకన్న వచ్చాడు. ఏమిటన్నట్లు చూచింది.

"డాక్టరు బాబుకు అన్నం హోటల్ నుండి పంపటం లేదని మనింట్లో నుండే వస్తుందని తెలిసిపోయిందమ్మా. రాత్రికి ఉపవాసం చే రేపు వంట ప్రారంభిస్తారట" అన్నాడు.

చదువుతున్న పుస్తకం బల్లమీద పడేసింది రూప.

ఉయ్యాల బల్లమీద కూర్చున్న ఇంద్రమ్మ వేమనపద్యాలు చదు తుంది.

"ఆహా! వచన కవిత్వమట. చందోబద్ధమయిన కవిత్వమట. వే శ్రాద్ధం కవిత్వమట. ఒక్కడయినా, ఇంత ఈజీగా అర్థం రాశాడా! వేమ పద్యాలు గ్రేట్....నిజంగా గ్రేట్ పొయెట్రీ "అకలన్న వాని కన్నం బెట్టినా, హాయని కర్పితముగ నారగించు" అంటూ చదువుతూ వెడుతుంది

నిజమే ఈ డాక్టరుకు పొగరు కాకపోతే తము పెట్టటం లేదుకద ఎందుకో అంత పట్టుదల! పైకి వెళ్ళింది. అతను సిగరెట్టుపై సిగరె కాలుస్తున్నాడు. అక్కడ పీకలు చాలాపడ్డాయి.

"సిగరెట్టు పొగతో కడుపు నిండదని డాక్టరుగారికి తెలియదా!

ఆ మాటలకు ఉలిక్కిపడ్డాడు. వెనక్కుతిరిగి అప్రయత్నంగా సిగరె యాష్ట్రేలో వేసాడు.

"రండి కూర్చోండి" అన్నాడు తెచ్చిపెట్టుకున్న మర్యాదతో.



"కూర్చోవటానికి రాలేదు. ఒక విషయం అడగాలని వచ్చాను. భోజనం పద్దన్నారట" అన్నది తలుపువద్ద నిలబడే.

"అవును. ఒకరిని ఇబ్బంది పెట్టటం ఇష్టంలేక" అన్నాడు, తల వంచుకుని.

"ఇబ్బంది అని ఎవరన్నా అన్నారా?" సూటిగా అడిగింది.

"అనకపోయినా ఒక మనిషిని భరించాలంటే ఇబ్బందేమరి. ఐనా రోజు శ్రమ ఎందుకు? రేపయినా, యెల్లుండయినా వండుకోవలసిందేకదా" అన్నాడు ఈసారి కొంత తల ఎత్తి.

"నిజమే కాని ఇది పద్ధతి కాదంటాను. మీ ఏర్పాట్లు చేసుకుని మానెయ్యాలండీ" అన్నది.

వేస్తుంది.... వేస్తుంది గాలం అనుకున్నాడు ప్రతిరోజూ ఆమెను వేయి కళ్ళతో గమనిస్తున్నాడు. ఎవరు ఏ సమయానికి వస్తారో పట్టుకుందామని, కాని దొరకటంలేదు.

"ఈ పూటకు భోజనం చెయ్యండి. రేపటి నుండి వెంకన్నచేత వండించుకుందురు గాని" అన్నది గౌరవపూర్వకంగా.

"ఓహో! నాపై చాలా అభిమానము ప్రదర్శిస్తున్నారే" అన్నాడు వెటకారంగా.

"అభిమానము, ఆదరణ ఏదయినా అనుకోండి. యువ డాక్టర్లకు ఫారిన్ వెళ్ళాలని ఉంటుంది, హాయిగా జీవించాలని ఉంటుంది. అవన్నీ వదులుకుని మా ఊరు వచ్చి ఉంటున్న మీపై మాకెంత గౌరవమో చెప్పలేను" అన్నది మృదువుగానే.

అతనికి ఒక్కసారి తన ఆశలు ఫారిన్ వెళ్ళాలని చేసిన ప్రయత్నము గుర్తుకు వచ్చాయి, రూపాదేవి అంటే అంత కసి పెరిగింది.

"చూడండి రూపాదేవిగారూ! మీరెన్ని ప్రయత్నాలు చేసినా మీ వలలో పడను. మీరు నగ్నంగా నా ముందు నిలబడినా నన్ను నేను రక్షించుకోగలను ..." అన్నాడు చురుకుగా.

ఒక్కసారి రూపాదేవి ముఖం మలినమయింది. అంతలోనే తేరు

కుంది. చిన్నగా నవ్వింది. ఆ నవ్వు పొంగేముందు నది ఉన్నట్టు ఉంది. ప్రశాంతంగా జవాబు చెప్పింది.

"అంత నిగ్రహం ఉంటే చాలా సంతోషమే డాక్టరుగారూ. ఈ ఊళ్ళో రాయలుగారు వాడి వదిలిన యువతులు చాలామంది ఉన్నారు. వారి బారినుండి మిమ్మల్ని రక్షించటం కష్టం అనుకున్నానే!" అన్నది.

"మీకంటే ప్రమాదమయిన వాళ్ళా?"

"అనే అనుకుంటున్నాను డాక్టరుగారూ! చదువు వేరు, సంస్కారం వేరు అని మిమ్మల్ని చూచాక అర్థం అయింది" అన్నది. ఎంత మృదువుగా చెప్పబోయినా కాస్త వ్యంగ్యం ధ్వనించిందా కంఠంలో.

"నేను సంస్కారహీనుడిననా మీ భావం?" తీక్షణంగా అడిగాడు.

"మీరు ఏమిటన్నది మీరు తెలుసుకోండి. ఒక్క విషయము మాత్రము తెలుసుకోవటం ఇద్దరికి మంచిది. మీరనుకున్నట్టు మీకు వం పన్నాలని చూడటంలేదు. నా దృష్టిలో మగవాడంటే చూడగానే గుండె లయతప్పి. గంభీరత మొరటుతనం ఉండాలి మిమ్మల్ని చూస్తుంటే నాకు ఒక ఆడపిల్లను చూచినట్టు ఉంది. అర్థం అయిందా? నున్నగా తల దువ్వుకుని, నలగని బట్టలతో తిరిగేవారంటే నాకు ఎలర్జీ అర్థం అయిందా! పిచ్చి పిచ్చి ఆలోచనలు మాని అన్నం తినండి అంతగా అయితే అన్నం తిన్నందుకు డబ్బు ఇచ్చేయండి" అన్నది మెట్లవైపు వెళుతూ.

అతను రోషంగా లేచాడు. ఆమె వెనుకే వెళ్ళి, మెట్ల గది గుమ్మములో నిల్చున్నాడు.

"అన్నం పెట్టి డబ్బు తీసుకున్నప్పుడు అవసరం ఐతే అన్నీ సప్లయి చేయాలి" అన్నాడు వ్యంగ్యంగా నవ్వుతూ.

రూపాదేవి చలించలేదు. వెనక్కు తిరిగి చూచింది

"అలాగే! నువ్వింకా పసివాడివి బాబూ! కాస్త ఎదిగాక అన్నీ అందుతాయి" అని చర చర మెట్లుదిగి వెళ్ళిపోయింది.



అరగంట తర్వాత మళ్ళీ క్యారియర్ వచ్చింది, అతనికి కడుపులో మంటగా ఉంది. ఆ మంట చల్లారాలంటే భోజనం చేయాలి. మాట్లాడక క్యారియర్ విప్పాడు.

"రూపమ్మ ఇట్లాంటి విషయాలు నిమిషంలో సెటిల్ చేస్తారు" అనుకున్నాడు వెంకన్న.

హరికృష్ణకు మతిపోయింది. తనింకా పసివాడా! ఎంత పొగరు! అతను కోపం దిగమింగాడు ముద్దలతోపాటు. అతనికి అక్కడ ఉండాలనిపించలేదు.

పిరికివాడిగా పారిపోతాడా! తను పసివాడా! ఎంత అహంకారము. తను వెంటనే తనను పట్టుకో లేదనికదా ఆ మాటంది.

రూపాదేవీ! నా పడుచుదనం ప్రదర్శించాలా! తెలివంటే నీదే. ఎవర్ని ఎలా లొంగదీయాలో నీకు బాగా తెలుసు. పళ్ళు కొరికాడు. అతని మనసంతా వికలమయింది.

తను సంస్కారహీనుడా! మరో ప్యాకెట్టు సిగరెట్లు పూర్తి చేసి కూర్చున్నాడు

చాలాసేపటికి రూపాదేవిపై ఎలా కక్ష తీర్చుకోవాలో నిర్ణయం తీసుకున్నాక, నిశ్చింతగా నిదురబోయాడు. మర్నాడు చేయవలసిన పనులు మరోసారి మననము చేసుకొని నిదురబోయాడు.

ఉదయము వాకిట్లో ముగ్గులను గమనిస్తూ నిలబడ్డ రూపాదేవికి, తనకు చాలా దగ్గరగా సిగరెట్టు వాసన రావటంతో తిరిగి చూచింది.

"గుడ్ మార్నింగ్...." ఒక చేతిలో సిగరెట్టు పట్టుకుని నిల్చున్నాడు హరి.

"గుడ్ మార్నింగ్" అన్నది పొడిగా, రూపకు నవ్వు వచ్చింది, తను పసివాడన్నందుకు మగాడు అనిపించుకోవాలని తాపత్రయ పడుతున్నాడని.

అతను కళ్ళు చికిలించి నవ్వి లాబ్రెటీవైపు వెళ్ళాడు.

రూపాదేవి తల వంకించింది.

ఆ రోజంతా అతను చాలా హుషారుగా కనిపించాడు.

"డాక్టరుబాబు దారిలో పడ్డాడు" అనుకున్నాడు వెంకన్న.

రాత్రి మారుమాట్లాడక భోజనం చేశాడు. వెంకన్న అన్నీ సర్ది తీసుకు వెళుతుండగా చెప్పాడు.

"మీ రూపాదేవిని ఒక్కసారి పిలుస్తావా వెంకన్నా" అన్నాడు.

"మంచిది బాబూ! "వెంకన్న వెళ్ళిన అయిదు నిమిషాలకు రూపాదేవి వచ్చింది. సాయంత్రమే తల అంటుకుందేమో వేలుముడి వేసుకుంది, అస్తవ్యస్తంగా ముఖానపడ్డ వెంట్రుకలు ఆమె ముఖానికి మరింత అందాన్ని చేకూర్చాయి.

తను ఆమెను ఏడ్పించి, తను మగవాడని గుర్తుచేయాలనుకున్నాడు. కాని ఆమె అందం రెచ్చగొడుతున్నట్టు అనిపించింది.

అతి శ్రద్ధగా చేసిన రబ్బరు బొమ్మలా ఉంది.

క్రింది పెదవి కాస్త ముందుకు జారినట్టుంది. మరింత అందంగా కనిపించింది.

గదిలోకి వచ్చిన చల్లనిగాలి అతడిని తాకి గిలిగింతలు పెట్టింది. ఆమె కళ్ళల్లోని అమాయకత ఆహ్వానంలా భావించాడు. ఒక్క ఉదుటున లేచాడు.

"ఏదో మాట్లాడాలన్నారట!" అని అడిగింది.

"ఊ...." ముందుకు వచ్చి అమాంతంగా ఆమెను కౌగలించుకున్నాడు.

"నా మగతనాన్ని సవాల్ చేస్తావా ?" అతని శ్వాస వేడిగా ఉంది. అతని శరీరం కంపిస్తుండగా ముందుకు వంగాడు

నిమిషంలో పరిస్థితిని గ్రహించిన రూప అతడిని దూరంగా నెట్టింది, ఒల్లు దులుపుకుంది.



"ఛీ....ఛీ....మీ చదువు, సంస్కారం ఇతేనా ?"

అతను తోక త్రొక్కిన త్రాచులా బుసలు కొడుతున్నాడు.

"ఏమిటి? చదువు, సంస్కారం లేదా ?" ముందుకు రాబోయాడు.

"హరికృష్ణగారూ ! ఈ రాక్షసులలాంటి మనుషుల మధ్య ఇన్నాళ్ళు ఉంటున్నానంటే, ఆత్మ రక్షణ చేసుకునే ఆత్మవిశ్వాసంతోపాటు ఆయుధాలున్నాయి" అన్నది మండిపడ్డట్టు చూస్తూ.

హరికృష్ణ వ్యంగ్యంగా నవ్వాడు.

"ఏం జగదీష్ కన్నా తీసిపోయానా ?"

"నిజంగానే తీసిపోయావు. జగదీష్‌కు ఓ కుటుంబ చరిత్ర లేదు, చదువులేదు. అతనలా ప్రవర్తించినా అర్థం ఉంది. నువ్వు చదివావు. కేశవరావు అంకుల్ అండన పెరిగావు. స్త్రీ అంటే ఆటవస్తువు అనుకుంటున్నావా ?" అన్నది తీక్షణంగా.

"నాకు నీతులు చెప్పనక్కరలేదు, ఉపాధ్యాయుడు శంకర్ కంటే, గుమస్తా గోపాలం కంటే అందగాడిని...."

ఆమె అతడివంక కంపరంగా చూచింది. మొదటిసారి ఆ అభియోగాలకు బాధ పడింది. ఏమిటి వీళ్ళ సంస్కారం? ఇదివరకు అన్న వారు సంస్కార హీనులు. చదువు లేదు. లోకజ్ఞానంలేదు. జగదీష్‌తో వెళ్ళి నేర్చుకున్న మాటలన్న మాట.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్ ! ఇతను నలుగురితో చెబితే వివాహమెలా అవుతుందనా!" అన్నాడు రెండు అడుగులు ముందుకు వేసి.

"కాదు, ఇకనుండి డాక్టరీ కోర్సుల్లో సభ్యత, సంస్కారాలుకూడా చేర్చితే బావుంటుందని...." అన్నది కుపితంగా.

"అంటే నాకు సభ్యత లేదని అంటున్నావా? రాత్రులు చాటుమాటు వ్యవహారాలునడిపి, దినమంతా ఉపాధ్యాయిని ముసుగు వేసుకుని లోకాన్ని మోసం చేయటమే సభ్యత అయితే నీ దగ్గరే నేర్చుకుంటాను...." అతను ఆమె చేయి పట్టి లాగాడు.

అంత దురుసుతనం, మొరటుతనం ఆశించని రూప, వెళ్ళి అతని హృదయంపై వాలిపోయింది.

అతను రెండు చేతులు ఆమె చుట్టూ వేసి బిగించాడు.

"వదులు....వదులు...." గింజుకుంది.

"ఊహూ.... నిన్న నువ్వు అన్న మాటలకు ప్రతీకారం చేసే వదుల తాను" అన్నాడు, ఆమెను మంచంవైపు నడిపిస్తూ.

"వదులు....ఫూల్....ఈడియెట్! ఎట్ల డాక్టరి చదివావురా. ఈ టైగర్ ఇంద్రమ్మ మనవరాలిపై చేసి బ్రతుకుదామనేనా — ఐ కిల్ యూ" చర్నకోల చల్లుమంది.

హరికృష్ణ పట్టు సడలిపోయింది.

రూపాదేవి ఏడుస్తూ తలుపుకు అభిముఖంగా నిలబడిపోయింది. అవమానంతో ఆమె హృదయం కుతకుమన్నది.

ఇంద్రమ్మ చేతిలోని చర్నకోల శబ్దం లయబద్ధంగా వినిపిస్తుంది. మధ్య మధ్య హరికృష్ణ మూలుగులు వినిపిస్తున్నాయి.

"ఎంత ప్రౌఢరా — బ్లడ్ కక్కాలి బంచత్ — నా రూప రూపవతే కాదురా, గుణవతి, షి — ఏంజిల్ —" అంటుంది వొగురుస్తూ.

రూపాదేవి తేరుకుంది. హరికృష్ణ ఊపిరి పీల్చుకోలేక పోతున్నాడు. బనియన్‌లో నున్న అతని ఒంటిపై వాతలు తేలుతున్నాయి.

"నాయనమ్మా — వదిలేయి, అతడు చచ్చిపోతాడు" వెనుకగా వచ్చి పట్టుకుంది.

నో — ఐ కిల్ హిమ్ — యువకులు ఏదో ఒరగబెడతారనుకుంటే ఇదా వీళ్ళు చేస్తున్న పని — వీళ్ని పిలిపించిందెందుకు? ప్రజలను రోగాల నుండి కాపాడుతాడని —" ఆమె చెయ్యి లేచింది. బలంగా పట్టుకుంది రూప.

"పద నాయనమ్మా —" బలవంతంగా క్రిందికి లాక్కువచ్చింది.

వెంకన్న చుట్ట కాలుస్తూ కూర్చున్నాడు.



"వెంకన్నా! వెళ్ళు.... వెళ్ళి డాక్టరుగారెలా ఉన్నారో చూడు." అన్నది. ఇంద్రమ్మ ఇంకా పూనకం వచ్చిన దానిలా అరుస్తుంది. వెంకన్న పైకి వెళ్ళిపోయాడు.

"వాడెంత, వాడి లైఫెంత.... రూపా నా మాట విను తల్లీ నువ్వు త్వరగా వివాహం చేసుకో...." మనుమరాలిని హృదయానికి హత్తుకుని ఉయ్యాల బల్లపై కూర్చుంది.

"ఒరేయ్ దేవుడూ, నీకు ఏం అపకారం చేసాన్రా, నా లైఫ్ యెందుకు పాడుచేసావురా? ఇద్దరు బిడ్డలు పుట్టగానే భర్తను దోచేసావ్, నేను నిన్ను తిట్టానా; ఒరేయ్ రాయీ, రాతిలో దేవుడున్నాడనుకోవటం పొరపాటురా. ఇట్ మై మిస్టేక్...." ఏడ్పుగాని ఏడ్పు పాటలా ఏడుస్తుంది.

"నాయనమ్మా ఇదేం కొత్తా? నువ్వు అప్‌సెట్ కావద్దు". ఇంద్రమ్మ రెండు చేతులు పట్టుకుని అడిగింది.

"తినగా తినగా వేము తియ్యనుండు" అన్నారు. అనుభవించగా అనుభవించగా ఈ కష్టాలే మనకు సుఖాలవుతాయి రూపా! అందరూ పూలపూజచేస్తే నేను రాళ్ళ పూజ చేసానా? ఆ దేవుడికి నాపై యెందుకే కక్ష, ఇద్దరి కొడుకుల్ని కంటికి రెప్పలా కాపాడుకున్నాను నా నట్టింట పసిపాపలు తిరుగాడాలని, చిన్నవయసులో నా కొడుకులకు పెళ్ళిళ్ళు చేసాను. ఆ ఓర్వలేని దేవుడు నా పెద్దకొడుకు, కోడల్ని పొట్టన పెట్టుకున్నాడు. హి చీటెడ్ మి. అయినా నేను బాధపడలేదు.... రూపా! కొడుకు కోడలు బదులుగా నిన్ను చూచుకొన్నాను. అందరూ నన్ను రాయి అన్నారు. భరించానే తల్లీ, నాకు రెండవ కన్ను ఉందనుకున్నాను. ఆ దేవుడి నోట్లో మట్టిపడ, నన్ను మాయజేసి రాముడిలాంటి నా రఘును, చీమకయినా హాని చెయ్యని నా జానకిని, పిల్లలను పొట్టనబెట్టుకున్నావ్, నీ పూజలకు నువ్వే మట్టిగొట్టుకున్నావ్, అయినా నా కర్మ

అనుకున్నారా. నా లక్కు... నా బ్యాడ్ లక్కు అనుకున్నానే తప్ప నిన్ను తిట్టలేదురా. బ్రతకటానికి పిసరంత ఆశ చాలు, ఆ ఆశ నా పిల్లలను కున్నానురా గుడ్డివాడా, చెవిటివాడా, పక్షపాతి...." ఆమె ఆవేశంగా, ఆకాశంవైపు చేతులెత్తి, శాపనార్థాలు పెడుతుంది.

"నాయనమ్మా! రిలాక్స్...." అన్నది బ్రతిమాలుతూ. "రూపా నిన్ను చదివించి మహారాణిని చేద్దామనుకున్నానే. ఆ దేవుడినే ఓడిద్దా మనుకున్నానే, నన్నే సాధించాడు. ఓరేయ్.... నువ్వే గెలిచావ్‌రా.... నువ్వే గెలిచావు...." ఆమె విరుచుకు పడిపోయింది. విపరీతంగా మూల్గు తుంది.

గుండెలు రాసుకో సాగింది.

"ఏమయిందమ్మా...." వెంకన్న వచ్చాడు.

"డాక్టరుగారి కెలా ఉంది."

"పరవాలేదమ్మా...." వచ్చి తనూ ఇంద్రమ్మను పట్టుకున్నాడు.

"రూప, నా తల్లీ అయిపోయింది.... నా పని అయిపోయింది." అని గిల గిల కొట్టుకుంది.

"వెంకన్నా! ఒక్కసారి డాక్టరుని పిలువు." అన్నది.

"వస్తారని అనుకోనమ్మా. అయన చాలా కోపంగా ఉన్నారు." అన్నాడు.

"నీవు నాయనమ్మను చూడు...." ఆమె పైకి వెళ్ళేసరికి హరి కృష్ణ తన బ్యాగు పట్టుకొని యెదురయ్యాడు.

"డాక్టరుగారూ! ప్లీజ్ నాయనమ్మకు చాలా సీరియస్‌గా ఉంది దయచేసి...." ఆమె మాట వినకుండా ముందుకు కదిలాడు.

"హరికృష్ణగారూ! ఇప్పుడు తప్పొప్పుల పట్టిక చదవటం ముఖ్యం కాదు...." దీనంగా అడిగింది.

"రూపాదేవిగారూ! మీకు, మీ నాయనమ్మకో నమస్కారం. వైద్యం



చేయాలా! ఒల్లు భగ భగ మండిపోతుంది." అన్నాడు, అప్పటికే అతను మెట్లుదిగాడు.

రూపాదేవి నాలుగేసి మెట్లు ఒక్కొక్కసారి దిగివచ్చి, అతని ముందు మోకరిల్లింది.

"చెప్పు డాక్టరుగారూ .... ఒక్కసారి మా నాయనమ్మ కేం కాదని".... అన్నది. ఆమె ధైర్యం సడలిపోతుంది. అతను తిరిగిఅయినా చూడలేదు. రూపకు మతిపోయింది. వెంటనే గుర్రపుశాల వైపు పరుగెత్తి ఇంద్రమ్మ యెక్కే గుర్రం తీసింది. దానిపై కూర్చుంది. దాని పిర్రమీద ఒక్కటిచ్చింది. దానికి శంషాబాద్ దారి అలవాటే. పరుగు తీసింది.

కాసేపటికి రూపాదేవి తేరుకునే సరికి, ఆమె దారి ప్రక్కన గడ్డిపై పడిఉంది. తను జీను, కళ్ళెం తేలేదని గుర్తుకు వచ్చింది. కంగారులో సరిగ్గా కూర్చోలేదు.

వెంటనే నాయనమ్మ స్థితి గుర్తుకువచ్చి, లేచి దారమ్మట పరుగులు పెట్టింది.

మోటార్ బైక్ ఢీకొనేదే కాని బర్ర్‌మని శబ్దంచేస్తూ మోటార్ బైక్ ఆగింది.

"ఏయ్ యెవరు! బ్రతకాలని లేదా?"

"ఎవరయింది తరువాత చెబుతాను. ఒక్కసారి.... ఒక్కసారి నన్ను అమెరికన్ హాస్పత్రిదగ్గర దింపరా.... అన్నది. ఆ మోటార్ బైక్ మీది వ్యక్తి ఒక్కక్షణం ఆమెవంక చూచాడు చెమట కక్కుతూ దీనత్వానికి మారుపేరులా ఉంది "ఊం, రా, కూర్చో...." అన్నాడు. వెళ్ళి అతని మోటార్‌బైక్ వెనుక కూర్చుంది. అంతవరకు అతను యెవరయింది గమనించలేదు గమ్మత్తయిన వాసననుబట్టి అతను త్రాగి ఉన్నాడని అర్థం అయింది. నిండా మునిగాక చలేమిటన్నట్టు, మొండిగా కూర్చుండి పోయింది.

# 8

కేశవరావు మర్నాడు నంబరుపైకి వచ్చిన కేసు వివరా
చూస్తున్నాడు. అతనికి కాస్త నిశ్చింతగా, ధైర్యంగా ఉంది. ఆ కాలంలో
కూడా ఫ్యామిలీ ప్లానింగ్ ఉన్నా, ఇచ్చేది దేవుడంటూ సంతానం పరిమిత
చేసుకోలేదు. అది అతన్ని అడుగడుగునా కృంగదీస్తుంది

"ఆడపిల్లలు కానందుకు సంతోషించు" అంటారు హితులు.

"నీకేమయ్యా అంతా కొడుకులే. ఆఖర్న ఆడపిల్లలు" అంటా
అతని ప్రత్యర్థులు. మగపిల్లలకు తక్కువ ఖర్చు ఏం కాదు. బట్ట
షోకులు, ఫీజులు, భోజనాలు, తనకి తెలుసు పడ్డ యాతన. పెద్దబ్బాయి
ఇంజనీరింగ్‌లో సీటు రాకపోతే ఇంటరు రెండుసార్లు రిపీట్ చేసా
ఎప్పుడు సీటువస్తే అపుడు చదివిస్తానని చెప్పి, డిప్లొమా చదు
మన్నాడు. అయిష్టంగా పూర్తిచేసాడు, అతనికి సిద్దిపేటలో పోస్టిం
వచ్చింది.

"ట్రాన్స్‌ఫర్ నాన్నా...." గొనిగాడు.

"చూడరా ఉద్యోగం ఇవ్వటమే గొప్ప. మళ్ళీ ట్రాన్స్‌ఫర్
మనకు నచ్చినచోట అంటే యెవరిస్తారు? అన్నాడు.

తల్లి వెళ్ళింది గదిలో అన్నీ సర్ది వస్తానంటూ. అతని తరువా
అబ్బాయి మహీధర్, ఐ. టి. ఐ. లో చేర్పించాడు. మరియు ఆరు నెల
పోతే అతని చదువు అయిపోతుంది. వాళ్ళు ఆదుకోక పోయినా, తన
అడక్కపోతే అంతే చాలు, అనుకున్నాడు.



"నాన్నా....నాన్నా! బావ వచ్చాడు, బావ!" అంటూ చిన్న కూతురు గౌరి పరుగెత్తుకు వచ్చింది.

"బావ ఇప్పుడెందుకు వస్తాడమ్మా!" అతను ఆశ్చర్యముగా చూచి లేచి బయటికి వచ్చాడు, ఆటోదిగి డబ్బులిచ్చి వచ్చాడు హరి. "ఏమయింది హరీ?" ఆయన ఆదుర్దాగా చెంపామీద, చేతులుపై తేలిన వాతలను ఆశ్చర్యముగా చూచాడు.

"ప్రాణములతో తిరిగి వచ్చినందుకు సంతోషించు మామయ్యా" అన్నాడు కూర్చుని,

"గౌరీ కాస్త టీ పట్రావే" అన్నాడు నీరసముగా.

గౌరి కంటే పెద్దమ్మాయి నీల టీ తెచ్చింది.

"అల్లి బిల్లిగా వాతలు తేలాయి నాన్నా బావ నెవరో కొట్టారు" అన్నది. అతను కూతుర్ని నోరు మూసుకుని ఉండమని సైగ చేసాడు. టీ త్రాగి, వేడి, వేడి నీటితో స్నానం చేసాక, ఓ గంట పడుకుని లేచాడు హరికృష్ణ.

ఈ లోపల కేశవరావు పలు పలు విధాలుగా ఆలోచించాడు. అది అసలే హంతకులకు ఆలవాలమైన ఊరు. ఆ ఊరికి పంపి అన్యాయము చేయలేదు కదా?

"మామయ్యా! నాకు ఉద్యోగము దొరక్కపోతే ప్రయివేటుగా ప్రాక్టీసు చేసుకుంటానుగాని, ఆ ఊళ్ళో ఉండను. ఆ ఇంట్లో అసలే ఉండను," అన్నాడు ఆవేశముగా.

"ఏం జరిగిందో శాంతంగా చెప్పు బాబూ" అన్నాడు కూర్చుని.

"అదికాదు నాన్నా! బావ పల్లెటూరి అమ్మాయిలు కదా అని పరిహాసము ఆడబోతే, కాస్త వాళ్ళు మోటు సరసం ఆడేరేమో!"అన్నది నీల.

"షటప్! నీల తంతాను...."

"అమ్మో బావ కోపం భోజనం చేసాడు, పదవే గౌరి బడి ఎగ్గొట్టి ఉన్నందుకు మంచి శాస్తి చేసావ్."మూతి తిప్పుకుని వెళ్ళింది నీల.

తలుపులు చేరవేసి వచ్చి, తల వంచుకుని జరిగింది. తు.చ. తప్పకుండా చెప్పాడు.

కేశవరావు కళ్ళు వెళ్ళబెట్టి, చెవులు రిక్కబొడిచి విన్నాడు.

"యెంత పని చేసావ్ హరీ...." అన్నాడు బాధగా.

"నాదే పొరపాటు అంటావా మామయ్యా? ఆవిడ కవ్వింపు బావుందా? అన్నాడు ఉక్రోషంగా.

"రూపను నువ్వు అర్థము చేసుకోలేదు బాబు: ఆమె నీ పాదాలంటి ప్రాధేయ పడుతుంటే కూడా కాదని యెందుకు వచ్చేసావ్? డాక్టరువు, ప్రాణాలు కాపాడటం నీ ప్రధాన లక్ష్యం అని మరిచిపోయావా?" అతను అశాంతిగా అటు, ఇటు తిరిగాడు.

"మామయ్యా!.... ఆ ముసలిదాన్ని, నేను కాపాడాలి! నా ప్రాణం పోయినా ఆ పని చేయను" అన్నాడు రోషంగా.

"నా చేతుల్లో పెరిగిన హరేనా ఇలా మాట్లాడేది? నీ సభ్యత సంస్కారాలు ఏమయ్యాయి. కాసేపటికి రూప చెడి పోయిందనుకుందాము. చెడిపోయిన వారికి ఇష్టా అయిష్టాలుంటాయని మరిచిపోతే ఎలా! చిన్న పిల్లయినా పెద్ద బుద్ధికలది రూప. ఎవరి మాటలో విని ఆ అమ్మాయిని అవమానిసావా బాబూ. నీ చదువు, జీవితము అన్నీ రూప పెట్టిన భిక్ష తెలుసా!" అన్నాడు ఆవేదనగా.

"ఏమిటి మీరంటున్నది?" ఈసారి కాస్త నిదానముగా అడిగాడు.

"అవునురా. పదవ తరగతి వరకే నా డబ్బుతో చదివావు. అంతా ముసలిది, ముసలిది అనే ఇంద్రమ్మదే! అంతా చెప్పాలంటే రూప వద్దు వద్దని వారించి ఇంత అనర్ధం తెచ్చుకుంది" అతను తల పట్టుకున్నాడు. రూపకు తనెలా ముఖము చూపగలడు.

తన మేనల్లుడు. తన ఇంట్లో పెరిగినవాడిని నమ్మకముగా ఇంట్లో ఉంచుకొమ్మని చెప్పాడు. ఎంత మూర్ఖంగా ప్రవర్తించాడు.



"ఏమిటి మామయ్యా? అసలు విషయము ఏమిటి, మీరు చెప్పేది నిజమా!"

"అక్షరాలా నిజంరా. నా పరిస్థితి బాగాలేదు. ఏదయినా చిన్నపాటి ఉద్యోగములో పెట్టమని చెప్పింది మీ అత్త. అప్పుడు రూప చాలా చిన్నది అయినా గొప్ప మాటంది. అవకాశమున్న వారికి మార్కులు రావు అంకుల్. బాబాయి కట్టిన భీమా డబ్బు వచ్చింది. తీసుకువెళ్ళి చదివించు" అన్నది అన్నాడు.

"రూప .... రూపాదేవి అన్నదా ఆ మాట!" ఆశ్చర్యముగా చూచాడు.

"అవున్రా, ఇంద్రమ్మ ఆమోదించదేమో అనుకున్నాను, కాని ఆమె కూడా అంగీకరించింది మనిషికి కనీసపు చదువు లేకపోతే వచ్చే అనర్ధాలు గ్రహించాను కేశవయ్యా. నా చేతుల మీదగా ఒకడు విద్యావంతుడయి, నల్గురికి ప్రాణదానం చేయటంకన్నా మానవత్వం ఏముంది?" అన్నది అలాంటి దేవతను నిర్లక్ష్యం చేసావా?" అన్నాడు బాధగా.

"ఓ గాడ్! ఆమె అంత తెలివిగా మాట్లాడేదా మామయ్యా?"

"ఆ అఁ! ఆమె అఖండమైన తెలివితేటలు గలది. ఒకే ఒక పొరపాటు చేసింది. పోలీస్ యాక్షన్ రాగానే పొలాలు అమ్మితే పోయేది. అదొక్కటే ఆమెను నాశనము చేసింది." అన్నాడు నిట్టూర్చి.

"మీరు లాయర్‌గా సలహా ఇవ్వలేదా?" ఇంద్రమ్మ తనను కొట్టిందన్న విషయము కూడా మరిచిపోయి అడిగాడు.

"నా పెద్దలు సంపాదించారు. నేనెవరినీ దోపిడి చేయలేదనే వాదము ఆమెది. కొడుకును నిర్దాక్షిణ్యముగా చంపినవారు దొరల్లా తిరుగుతుంటే మెంటల్ అయింది కాని, చాలా మంచిదిరా."

"అయితే వెంటనే బయలుదేరుదాం మామయ్యా" అన్నాడు కంగారుగా "సుస్తీ ఏమిటని అడగలేదా?"

"గుండె నొప్పి అన్నది. మామయ్యా, అయినా రూపాదేవిని గురించి అలా చెప్పారేం?" అన్నాడు తనలో తానే కుమిలిపోతూ.

"ఆడుతూ, పాడుతూ తిరగవలసిన వయసురా రూపది. ఆ వయసులో ఈ బరువు బాధ్యతలు మోస్తున్న, ఆమె అంటే అందరికి అసూయే. మగాడకో బలహీనత ఉందిరా. స్త్రీ గునుస్తూ నువ్వు తప్ప ఇహపరంబులు లేవని ఏడ్వాలి. అప్పుడే కరిగి, జాలి చూపుతాడు లేకపోతే పగ బూనుతాడు" అన్నాడు.

హరికృష్ణ ఏం వినిపించుకునే స్థితిలో లేడు. వెళ్ళి టాక్సీ తెచ్చాడు. "పదండి మామయ్యా" అన్నాడు.

కేశవరావు వచ్చి కారులో కూర్చున్నాడు.

టాక్సీ ఊరు చేరేవరకు మధ్యాహ్నము రెండు గంటలు దాటింది. తలకు బ్యాండేజ్ కట్టుకున్న రూప అతని కంట పడింది.

"హలో... హల్లో! నాయనమ్మ కెలా ఉంది రూపా?"

"డాక్టర్ సివియర్ అటాక్ అన్నాడంకుల్" అన్నది విచారముగా.

"అయామ్ సారీ రూపా...." అతను పాతకాలమునాటి కుర్చీ లాక్కుని కూర్చున్నాడు. ప్రక్కనే ఉన్న ప్రేము కుర్చీలో హరికృష్ణ కూర్చుడు.

"మీకెలా ఉంది డాక్టరుగారూ? ఈ రోజు కాసేపు డాక్టర్‌ను కావల్సి వచ్చింది" అన్నది చిరునవ్వుతో, రాత్రి ఏమీ జరగట్టు.

హరికృష్ణ తికమక పడ్డాడు.

"నాయనమ్మగారిని ఎవరు చూచారు?" అడగలేక, అడగలేక అడిగాడు.

"రాత్రి గుఱ్ఱం మీద వెళ్ళి శంషాబాద్ నుండి డాక్టర్‌ను తీసుకు వచ్చాను. వెళ్ళేటప్పుడు మా రాజా నన్ను క్రింద వేసింది. ఆ దెబ్బ ఈ తలకు" అన్నది అదే చిరునవ్వుతో.

"అయ్యో! రాజా నీకు పరిచయమే కదమ్మా" కేశవరావు నొచ్చుకున్నాడు.



"మన సమయము బాగా లేదు అంకుల్. యెవరో త్రాగుబోతు లిఫ్ట్ ఇచ్చాడు. వచ్చేటప్పుడు గవర్నమెంటు డాక్టరు జావాపై వచ్చాను" అన్నది. ఆమె చేతుల దగ్గర గీసుకు పోయింది.

"సిటీకి తీసుకువెళ్దామా?" కేశవరావు అడిగాడు,

"అవసరం అయితే ఆయినే తీసుకు వెళతానన్నారు డాక్టరుగారూ, నాయనమ్మ పంచ ప్రాణాలు మేమే. మా ఇద్దరిపై ఈగ వాలినా సహించ లేదు" నొచ్చుకున్నట్టు అన్నది రూప.

"ఫరవా లేదు. మీరు అలా మాట్లాడి నా తప్పు రెట్టింపు చేయకండి. చెప్పిన మాటలు వినటం యెంత అనర్థమో ఇప్పుడు తెలిసింది. అయామ్‌సారీ రూపాదేవి.... సారీ...." అతని కంఠం రుద్ధమైంది. అప్రయత్నంగా ఆమె రెండు చేతులు పట్టుకున్నాడు.

అనుకొని ఈ సంఘటనకు రూప తెల్ల బోయింది.

"సారీ...." చేతులు వదిలి కళ్ళు తుడుచుకున్నాడు.

అది చూచి కేశవరావు తేలికగా నిట్టూర్చాడు.

ఇంద్రమ్మ నిదుర మత్తులో పీటన్నిటికి అతీతంగా నిదురబోతుంది.

"అమ్మా రూపా! మా భోజనాలు కాలేదమ్మా." అన్నాడు కేశవరావు.

"పది నిమిషాల్లో చేస్తానంకుల్." అన్నది. ఆమె అన్నట్టే పది నిమిషాల్లో అన్ని ఏర్పాట్లు చేసింది.

భోజనాలు అయ్యాయి.

"ఆ రోజు నాకు అర్థంటు కేసుండి రాలేదమ్మా. నీ కొలు దార్లంతా వచ్చారా?" అన్నాడు కేశవరావు.

"వాళ్లెందుకు వస్తారంకుల్, ఆ రాయుబ వాళ్ళకు మద్దతు!" అన్నది. నిట్టూర్పు విడిచి.

"కోర్టు కెళ్ళక తప్పదంటావా ?"

"ఈ లోపల ఒకసారి ఆయనతో మాట్లాడనా అంకుల్ ?"

"ఈ పరిస్థితుల్లో వద్దు తల్లీ. నీపై నున్న అభాండాలను ఆధారం చేసుకుని, ఇంత సంస్కార వంతుడనుకున్న హరే క్రూరంగా ప్రవర్తించాడు. వాడు మరీ దారుణమైన వ్యక్తి" అన్నాడు హెచ్చరికగా.

"కోర్టుల చుట్టూ తిరగడం నా వల్ల అవుతుందా అంకుల్ ?"

"నేనున్నాను కద రూపా...." ఆయన ఆవులిస్తూ లేచాడు.

"మీరు విశ్రాంతి తీసుకోండి అంకుల్, మీరు కూడా డాక్టరుగారూ" అన్నది, కేశవరావు బయటి హాల్లో పీటమీద నిదుర బోయాడు.

రూప వెళ్ళి ఇంద్రమ్మను చూచి, గది ముందు వాలు కుర్చీలో కూర్చున్నది. ఆమెకు సన్నగా తల పోటు ప్రారంభం అయింది.

కళ్ళు మూసుకుంది. ఆమెకు ఉదయం సంఘటనే కళ్ళ ముందు మెదులుతుంది,

అరగంట గడిచింది.

"రూపాదేవి...."

ఆమె కళ్ళు విప్పబోయింది కాని మగత కమ్మేసింది.

"రూపాదేవీ...." అడుగుల శబ్దం దగ్గరయింది.

"మైగాడ్ ! జ్వరం వచ్చింది" నుదుటిపై చల్లని చేయి పడింది.

"ఆఁ...." కళ్ళు విప్పింది. తనపై వంగి ఆదుర్దాగా చూస్తున్న హరికృష్ణ కనిపించాడు.

"మీకు ఇంత జ్వరంగా ఉంటే యెలా మాట్లాడ గలిగారు ?" పరుగెత్తి తన బ్యాగు తెచ్చాడు.

"పని ఉన్నంత సేపు జ్వరం నా దరిదాపులకు రాలేదు చూడండి, ఇప్పుడేమో...." అన్నది నీరసంగా.

"ఈ పట్టి మీరే కట్టుకున్నారు కదూ ?"

"నా తలకు గాయం అయిందని డాక్టరుగారు వెళ్ళాక గమనించాను."



అన్నది నీరసంగా నవ్వుతూ. అతను పట్టి మారుస్తున్నా, ఇంజక్షన్ చేస్తున్నా, వారించలేక పోయింది.

మరో రెండు రోజులు ఆ ఇంటివారి సేవ తప్పలేదు హరికృష్ణకు. అతనికి చాలా సంతోషంగా, తృప్తిగా ఉంది.

# 9

సంక్రాంతి సెలవులిచ్చారు పిల్లలకు. సెలవులంటే చికాకు రూపా దేవికి, ఏం తోచదు, నాయనమ్మను జాగ్రత్తగా చూచుకోవటంతో కాలం వెళ్ళబుచ్చుతుంది. ఆమె ఏ క్షణాన టైగర్ ఇంద్రమ్మ అని పేరు పెట్టుకుందో కాని తన పాలిట టైగరే.

ఊర కుక్కల్లా మొరిగే జనం కాటు వేయకుండా కాపాడుతుందామె. శంకర మఠము నుండి యెవరో స్వాములవారు వస్తే ఆయనతో మాట్లాడుతుందామె.

"నాయనమ్మా ! ఒకసారి పొలం వెళ్ళిరానా ?"

"వెళ్ళమ్మా" అన్నది, మాట్లాడుతూనే.

భుజాల చుట్టూ ముసుగు వేసుకుని బయలు దేరింది. హరికృష్ణ క్లినిక్ ముందు పెద్ద క్యూ ఉంది.

"బోర్ కొడుతుంది డాక్టరుగారూ !" అన్నది ఆమె.

అయితే నా దగ్గర నర్సుగా చేరండి" అన్నాడు హాస్యంగా.

నిజంగా ఇక్కడ పని చేయవచ్చు కాని, యువతీ యువకులు కలిసి తిరిగితే పల్లెటూరి అమాయకులు సవ్యంగా అర్థం చేసుకోరని భయం, ఆమె ఊరు దాటింది.

అక్కడక్కడ వరి కోస్తున్నారు. తెలంగాణాలో 'సాంబాలు, అని ఒక రకం వరి వేసారు. అది అయిదు నెలలు పడుతుంది కోతకు వచ్చే సరికి. ఆఖరుగా కోతలు జరుగుతున్నాయి.

మైమరిచి చూస్తుంది. చిరు చలిగా ఉంది. కాని కష్టజీవులకు వేడి వారి శ్రమలోనే దొరుకుతుందేమో !

"అమ్మో! వద్దయ్యా.... మల్ల జెయ్యను, కాల్మొక్త...." దీనాతి దీనమైన ఏడ్పు వినిపించింది. ఆమె చుట్టూ చూచింది. యెక్కడా జనం కనిపించలేదు. ఆమె యెత్తుగా ఉన్న దిబ్బ యెక్కి క్రింద దృశ్యం చూచి తల్లడిల్లి పోయింది.

ఓ బక్క చిక్కిన స్త్రీని, బాగా బలిసిన పురుషుడు చర్నాకోలతో కొడ్తున్నాడు.

రూపాదేవి రక్తం సల, సల కాగిపోయింది. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళయినా ఈ దౌర్జన్యాలు సమసిపోలేదు.

స్త్రీ పూజింప బడు దేశం అంటూ కబుర్లు చెబుతారు. పూజంటే ఇదేనా ! దిబ్బమీద నుండి దూకింది రూప.

యెత్తిన చెర్నాకోల గట్టిగా పట్టుకుంది వెనుక నుండి !

'అమ్మో!' అంటూ అరవ బోయిన ఆ స్త్రీ కళ్ళల్లో ఆశ్చర్యం కదలాడింది. అందరూ బొమ్మల్లా నిలబడిన వారు ఒక్కసారి వెనక్కు చూచారు.

అతను గర్జిస్తూ ఇటు తిరిగాడు.

"ఏయ్!.... యెవరు నువ్వు ? వదలవ్...." అన్నాడు మొరటుగా.

"మొదట మీరు మర్యాదగా మాట్లాడాలి" అన్నది చర్నాకోల లాగుతూ. అలా లాగుతారని తెలియని అవతలి పార్టీ గట్టిగా పట్టుకోలేదు. అది రూప చేతిలోకి వచ్చింది.

"ఏయ్!" బ్రతకాలని లేదా ?" అను క్రూరంగా చూచి ఒక్కడుగు ముందుకు వేసాడు.



"అయితే అందరిని చంపటమే తమరి వృత్తా నాకు తెలియదు!" అన్నది వెటకారంగా.

"ఏమిటే కూసావ్....?" పిడికిలి బిగించాడు.

"నాకు నోరుంది ఏమిట్రా అనగలను, కాని నాకు సంస్కారముంది నేను మనిషిని." అని రూప ముందుకు వచ్చి ఆ స్త్రీని లేపి గుడ్డలు సవరించింది.

"ఏమంత పొగరే నీకు ? నేను....పశువునా ?"

"అంతకంటే హీనము మనిషి, మగాడు తన సాటి వారిపై చేయి యెత్తుతాడు. తనకంటే క్రింది వారినిలా చూడడు" అన్నది నిదానముగా కాని కళ్ళు అగ్ని కురుస్తున్నాయి.

"ఏం జరిగిందమ్మా! ఎందుకు ఈ బహుమతి ?" ఆమెను అడిగింది. ఆమె భయంగా చూచిందే తప్ప నోరు విప్పలేదు.

ఆమె దెబ్బలు తిన్న షాక్ లో ఉందనుకుంది.

"మీరయినా చెప్పండర్రా ఏమయింది ?" అక్కడున్న కూలీలను చూచి అడిగింది

ఒక్కరూ నోరు విప్పలేదు.

"చూచావా ? ఈ ఊర్లో ఈ రాయలుకు ఎదురు చెప్పేవారు ఆయన సమక్షములో నోరు విప్పేవారు లేరని గ్రహించావా ?" పక, పక నవ్వాడు అతను.

'ఓ', అనుకుంది అప్రయత్నంగా. రాయలుఅంటే సినిమావిలన్ లా ఉంటాడనుకుంది.

"వివరాలు కావాలా ! అసలింతకీ నీవెవరు ?" అనుమానముగా చూస్తూ అడిగాడు.

ఈసారి ఆమె జవాబు చెప్పలేదు. అతన్ని అతని అభిప్రాయాలను అంచనా వేయాలని చూస్తుంది.

"నీ నోరు మూత పడిందా నా పేరు విని...." మరోసారి నవ్వాడు.

"నీ నోరు ఎలా మూయించాలా అని చూస్తున్నాను." అన్నది.

"దానికంత ఆలోచన ఎందుకు ? నీ పెదవులతో మూస్తే పోలా...."

అతనిమాట పూర్తి కాలేదు. చర్నాకోల చేళ్లుమంది.

అక్కడున్న వారి గుండెలు జల్లుమన్నాయి.

"అమ్మ... రూపమ్మా.... వెళ్ళి పొమ్మా నీకాల్మొక్త...." వీరయ్య వచ్చి ప్రాధేయ పడ్డాడు.

పులిలా ముందుకు దూకబోయిన రాయలు ఆగిపోయాడు.

"ఓ .... పులికంటివారి పిల్లిపిల్లా ఇది ? రూపమ్మ .... టైగర్ ఇంద్రమ్మ మనవరాలు ...." అన్నాడు.

అందరూ అతనివంక ఆశ్చర్యంగా చూచారు. రూపాదేవి పని సరి అనుకున్నారు. రాయలు అంత శాంతంగా మాట్లాడటము ఎన్నడు ఎరగరు వారు.

"మీరంతా ఒక్క మనిషికి బయపడి బలిపశువులవతూ వెళ్ళి పొమ్మంటున్నారా నన్ను. మీరు మనుషులు కారా, నోరు లేదా ! ఆయన జమీందారయితే, కామందు అయితే కావచ్చు. మీరు ఒక్కరోజు పని మానేస్తే అన్నము పెడతాడా !" అన్నది రూప.

అందరూ ఒకరి ముఖాలు ఒకరు చూచుకున్నారు.

"రూపమ్మా! మా అయ్య ఊకె పుణ్యానికి కొట్టలేదమ్మ. మేం జిర్ర పాటయినము, కుంచెడు ఒడ్లు తీసి దాసుకున్నది" అన్నాడు వీరయ్య.

ఆ స్త్రీ తలవంచుకున్నది.

ఆ బక్క చిక్కిన స్త్రీ దొంగతనం చేయటం తప్పేకాని ఆ ఒడ్లు ఆకలి చల్లార్చుకోవటానికే తప్ప ఆశతో, దురాశతో దొంగిలించినవి మాత్రము కావు.



"చూడమ్మా నీ పేరేమిటోగాని, చాలకపోతే చాలదని పోట్లాడాల నీ హక్కుల కోసము, దొంగతనము చేస్తావా ?" అన్నది.

ఆ స్త్రీ కళ్ళెత్తి చూచింది. ఆ చూపుల్లో భాష కందని యెన్నో భావాలు. ఊహాకందని ఊసులు !

"అమ్మా! నేను మేడమీద మేడ కట్టాలని ఈ దొంగతనము చేయ లేదమ్మా."

"కుంచెడు ఒడ్లతో నగలు, నాణ్యాలు తెచ్చుకుందామని కాదమ్మా" అన్నట్టున్నాయి.

"ఇప్పుడేమంటారో ఈ మనిషిగారు...." అన్నాడు గారు ఒత్తి పలుకుతూ.

"ఎప్పుడయినా ఒకటే మాట. నేను అనేది స్త్రీలను కొట్టటం అమానుషం, అక్రమము." అన్నది దృఢంగా.

"యహా ! ఏం దశ అలా చూస్తూ నిల్చున్నారు? కానియ్యండి మీ పన్లు." అన్నాడు అందరి వంక చూచి.

కాళ్ళకు చక్రాలు వచ్చినట్టు, చేతులకు స్ప్రింగ్‌లున్నట్టు పనులు చేయటము మొదలు పెట్టారు.

"చూడు టైగర్ ....ఏమమ్మో నీ పేరు ? వెళ్ళి బుద్ధిగా, ఇంట్లో ఉండు, ఇలా మగవాళ్ళతో సవాళ్లు చేయకు, అని కాస్త ముందుకు నడిచాడు. అతని నిర్లక్ష్యమైన నడక చూస్తే ఎక్కడో చూచినట్టు అనిపించింది. ఆమె దృష్టి దూరంగా ఉన్న మోటార్ బైక్‌పై ఆగిపోయింది.

"ఓ....ఇతనా !" అనుకుంది అప్రయత్నంగా.

"వీరయ్యా! ఆ సత్యభామను ఇంటి దగ్గర వదిలి వెయ్యి. పాపం గత వైభవం ఆమె మరిచిపోయినా, నేను మరిచిపోలేదని చెప్పు" అన్నాడు నిర్లక్ష్యముగా.

రూప త్వరగా అతని దగ్గరగా వెళ్ళింది.

"ఆగండి, నేను మీకు ధన్యవాదాలు చెప్పుకోవాలి." అన్నది.

"ఎందుకు? మీ కుటుంబ వైభవం గుర్తు చేసినందుకా?" అన్నాడు
వెటకారముగా.

"కాదు. కొన్ని రోజుల క్రితం అర్ధరాత్రి నాకు సహాయం చేసారు
నన్ను శంషాబాద్ హస్పత్రిలో విడిచి పెట్టారు—" అన్నది.

అతను ఒక్క క్షణం కళ్ళు తాటించాడు. ఆ తరువాత ఏదో
గుర్తు వచ్చినట్టు వంకించాడు.

"ఆ రోజు రాత్రి లిఫ్ట్ అడిగి, నా బంగారములాంటి షర్ట్ పా
చేసింది నువ్వేనన్నమాట," అన్నాడు.

"నేను మీ షర్టు పాడు చేసానా?" ఆశ్చర్యపోవటం ఆమె వంత
యింది.

"అవును. మర్నాడు చూచుకుంటే వెనుక అంతా రక్తం మరక
ఎవర్నయినా చంపి వచ్చే వేమిటి?" హేళనగా నవ్వాడు.

"సారీ! నా తలకు గాయము అయింది. ఆ గాయమునుండి కారి
రక్తము అయి ఉంటుంది."

"ఇంగ్లీష్ చదువు సతికి 'సారీ' 'ఎక్స్‌క్యూజ్' 'థాంక్యూ' అంటు
మభ్య పెడతారు. షర్టు ఖరీదు యెంతో తెలుసా? నూట ముప్పై రూపా
యలు" అన్నాడు దర్పంగా.

రూప జవాబు చెప్పేలోగాన్ అతని మోటార్ బైక్ వె
పోయింది.

ఆమె అలాగే నిలబడి పోయింది.

"రూపమ్మా! ఆ అయ్యమాట తీరే గంత తల్లీ" అన్నాడు వీరయ్య
ఆమె ఆలోచిస్తూ ఇంటిదారి పట్టింది. ఇతను అంగీకరిస్తే అందరూ ఇంతో
అంతో తన పొలానికి ధర పెడతారు. శర్మిష్ట చదువు, వివాహం కావా
ఒక్క బావి, దానిక్రింద నాల్గు ఎకరాల వరి పొలంలో వచ్చే పంట ఎం
అదే ఎవరయినా ఇంటి వాళ్ళుండి కూరగాయలు పండిస్తే డబ్బు లో
యేమో. వరి తప్ప మరేం వెయ్యరు జీతగాళ్ళు. రసాయన ఎరువుల
జీతగాళ్ళకే సరిపోదు.



"వీరయ్యా! ఒకసారి మీ అయ్యగారితో మాట్లాడాలి."

"ఆయన సవ్యంగా మాట్లాడరమ్మా. నీవు పరిషాన్ గావాలి."
అన్నాడు.

తను ఏదో నిర్ణయం తీసుకోకపోతే తన కుటుంబం వీధిలో నిలబడ
వలసి వస్తుంది.

పట్నాలలో ప్రయివేటు బడులంటే ఓ పరిశ్రమలా అయిపోయింది.
డబ్బు వర్షం కురుస్తుంది. ఈ పల్లెలకు బడికి వ పినందుకే వాళ్ళకు
ధన్యవాదాలు చెప్పే పరిస్థితి తను ఈ పల్లెలో ఓ టరిగా శర్మిష్ట పెళ్ళి
చేయగలదా! ఒకసారి గుండెపోటు వచ్చిన ఇంద్రమ్మ బ్రతికేది యెన్ని
రోజులు?

"వీరయ్యా, యెంత పరిషాన్ అయినా పరవాలేదు. ఒక్కసారి
మాట్లాడాలి" అన్నది తప్పదు అన్నట్టు.

"అయితే ఒక పని చేయమ్మ. రేపు పొద్దటేల్ల రా. జర లాగి
ఉందరు." అన్నాడు.

"సరే వీరయ్యా," అన్నది ఇంటికి దారితీస్తూ.

ఆమె ఇంట్లో అడుగుపెట్టి ఆశ్చర్యపోయింది. ఇంద్రమ్మ హరి
కృష్ణను కూర్చోబెట్టి ఉపన్యాసం ఇస్తుంది.

"ఇట్ సాక్రెడ్ జాబ్— వృత్తి, చాలా కేర్‌పుల్‌గా ఉండాలి.
నాకు ఇంగ్లీష్ వస్తేనా, ఆనాడే జడ్జీని అదరగొట్టి వద్దును, హి చీటెడ్ మి
లంచం తిన్నాడు—" అంటుంది.

"అలాగా, పాపం—" అన్నాడు హరికృష్ణ.

"ఐ డోంట్ నాంట్ సింపతీ — నోరు మూసుకో." అన్నది
కోపంగా. హరికృష్ణ ఏం తోచనట్టు చూచాడు.

"అయివాంట్ లర్న్ డాక్టరీ— ఐ మీన్ వైద్యం, నువ్వు సెలవు
పెడితే గిడితే నేనే నీ హస్పత్రి చూచుకుంటాను." అన్నది.

"అలాగే నేర్పిస్తానండీ," అంటున్నాడు. స్టెత్‌తో పల్స్ రీడింగ్ చూపుతూ.

రూపాదేవి నవ్వింది.

"నాయనమ్మా! నువ్వు ముందు సంపూర్ణ ఆరోగ్యవంతురాలివయితే డాక్టరీ చదువవచ్చు, కలెక్టరీ చదువవచ్చుగాని, మందు తీసుకున్నావా?" అని అడిగింది.

"ఇదిగో రూపా! నన్ను చూస్తే నీకు ఆటగా ఉందా? అని టైగర్ ఇంద్రమ్మ" లేని మీసం మెలివేసింది

"అయినో — అయినో! నీ దగ్గరకు పేషెంట్లు రావాలంటే నువ్వు ఆరోగ్యంగా ఉండాలి" వెళ్ళి టాబ్లెట్లు తెచ్చింది.

"అబ్బ! ఆ మందు వెగటు —" పసిపాపలా ముఖం పెట్టింది.

"మరి మందు తియ్యగా ఉంటుందా యెక్కడయినా! పోనీ మనమే మందులకంపెనీ పెట్టి తీయటి మందులు తయారుచేద్దామా!" అన్నది అనునయంగా.

"ఊం — డబ్బు లేదనా!" దిగులుగా చూచింది.

"మా నాయనమ్మ — గ్రేట్ బంగారు తల్లి షి ఈజ్ గుడ్ డేమ్ —" అన్నది తల్లి ఆప్యాయత అంత ఒలికిస్తూ.

"తేపే —" మందు వేసుకుంది.

"ఏమయ్యా డాక్టరూ! రైట్ టు మందుల కంపెనీస్ — మేక్ స్వీట్ మందులు." అన్నది.

"అలాగే నండీ —" అన్నాడు వినయంగా.

"ఎలాగండీ!" వెక్కిరించింది. ఆ తరువాత నవ్వింది.

"డాక్టరుపు, దాబుగా ఇంగ్లీష్‌లో మాట్లాడాలి అర్థం అయిందా — అండర్ స్టాండ్."

"ఎస్! సమజ్ గయా — అర్థం అయింది. అయి అండర్ స్టుడ్" అన్నాడు ఆమెను అనుకరిస్తూ. ఆమెకు భోజనంపెట్టి నిదురబుచ్చి రూపను కళ్ళింతచేసి చూచాడు.

"మనము ఇంకోసారి టీ త్రాగుదామా?" అన్నాడు చనువుగా.



ఆమె నవ్వింది.

"మా నాయనమ్మ మాటలు మీకు బాగానే తలనొప్పి కల్గిస్తున్నట్టున్నాయె." అన్నది.

"తలనొప్పి కాదుగాని, మీరెలా భరిస్తున్నారోనని ఆశ్చర్యపోతుంటాను." అన్నాడు తలపట్టుకొని.

"ఇప్పుడు నాకు మిగిలిన ఆత్మీయురాలు, శ్రేయోభిలాషి, అంద ఆమె" అన్నది జాలిగా.

"నిజమేననుకోండి —" నసిగాడు అతను.

"నేను మీకంటే చిన్నదాన్ని ఏకవచనముతో పిలువవచ్చు.

"రూపాదేవి — రూపా! ఈవిడను ఒక్కసారి డాక్టరుకు చూపిస్తే."

అన్నీ అయ్యాయి. ఆమెకు కావాల్సిన కొడుకు, మనమలు రారు కదా, మానసికస్థితి యెలా బాగుపడుతుందంటారు?" అన్నది దిగులుగా.

ఆమె నా స్థితిలో చూస్తే అతని హృదయం ఆర్ద్రం అయింది. ఆమెను తన బాహువుల్లో బంధించి "రూపా! నీకు నేనున్నానని" చెప్పాలనిపించింది. కాని సంకోచిస్తూ, ఆమెను చూస్తూ కూర్చుండిపోయాడు. బాపు బొమ్మలా ఉన్న ఈమెను అమ్మలా ఊహించాడు. తనకేం తెలుసు హెడ్‌మిస్ట్రెస్ అంటే అలా ఉండాలనుకున్నాడు, ఆమె యెటో చూస్తోంది.

## 10

"లోపలికి రావచ్చా?"

మృదుమధురమైన కంఠము విని యెవరన్నట్టు తిరిగి చూచాడు రాయలు. అతని చేతిలోని సిగరెట్టు క్రింద వేసాడు.

"ఓహ్! టైగర్ ఇంద్రమ్మ మనమరాలు. టైగర్ రూపాదేవి గారా!?" అన్నాడు హాస్యంగా.

రూప మనసు చివుక్కుమంది. అతని ప్రవృత్తి తెలిసిన తను బాధపడటంలో అర్థం లేదు అనుకుంది.

"అవునండీ సైగర్ ఇంద్రమ్మ మనుమరాలిని. సైగర్‌ను మీరు చంపేసారు. ఒక్తి ఇంద్రమ్మ మిగిలింది." అన్నది వచ్చే కోపాన్ని దిగమింగి.

"మాటలు తిన్నగా రానియ్యండి" అన్నాడు కోపంగా.

"మీ ఇంటికే తిన్నగా వచ్చినదాన్ని. మాటలు తిన్నగా రానియ్యటానికేం ?" అన్నది. అతను ఆహ్వానించడని తెలిసి, తనే చొరవగా లోపలికి వెళ్ళింది. అతని యెదురుగా కొయ్యస్టూలు ఉంటే కూర్చుంది.

అతను కంగు తిన్నాడు. తనను చూస్తే ఏ ఆడపిల్ల ధైర్యంచేసి తన ముందు అలా కూర్చోవటం యెరగడు.

అతను ఏదో అనటానికి తలెత్తాడు. అప్పుడే ఆమె తలయెత్తి చూచింది. ఇద్దరి కళ్ళు కలుసుకున్నాయి.

ఆమె కళ్ళు హిమము కురిసనంత చల్లగా అనిపించాయి. నోట్లోని మాట మింగేసాడు.

"రాయలుగారూ ! నేను తెగించి వచ్చానని మీరు ఆశ్చర్యపోతున్నారేమో కాని రాక తప్పలేదు. అనాడు దారుణంగా మా కుటుంబాన్ని చంపినవారు మమ్మల్ని యెందుకు వదిలారో అర్థంకాదు. అందరిని అంతం చేస్తే ఆస్తి గొడవలుండేవి కావు" అన్నది నిదానంగా.

"అయితే మీ వాళ్ళను నేను చంపించానా ?" కరుకుదనం కర కర మందా కంఠములో.

"అబ్బే ! ఆ మాట అనటం లేదు. మాకు పొలాలన్నీ కావాలని అడగటంలేదు కదా. నామినల్‌గా ఇంతని ధర ఇస్తే సంతోషిస్తాను" అన్నది.

"నేనొక్కడనే పొలాలు చేస్తున్నానా ?" అరిచినట్టే అడిగాడు.

"లేదు. మీరు కాస్త విశాల దృక్పథంతో ప్రవర్తిస్తే మిగిలినవారు మీకు జడిసి అయినా మిమ్మల్ని అనుసరిస్తారని నా ఆశ." అంది నిదానంగా.

"ఏం నేను మీకెందుకు సహాయం చేయాలి ?



"దానికి జవాబు నా దగ్గర లేదు" అన్నది.

అతను తీక్షణంగా చూచాడు అప్పుడే లోపలి నుండి కాఫీ గ్లాసుతో కమిలి వచ్చింది.

ఆమె కులుకుతూ చిన్నబల్ల తెచ్చి, అది ముందుంచి, దానిపై కాఫీ గ్లాసుంచింది.

అక్కడే ఉన్న సీసాలో నూనె తీసి, అతని తలకు రాసింది. అతను తల రాయించుకుంటూనే కాఫీ త్రాగాడు. కాఫీ గ్లాసు ప్రక్కన పెట్టి మరో సీసాలో ఉన్న నూనె తీసి అతని కాళ్ళకు చేతులకు పట్టించసాగింది.

"ఏమిటే యెద్దులా ఉన్నావ్, చేతుల్లో బలం లేదూ ?" ఒక్క తోపు త్రోసాడు. కమిలి మధ్య తలుపుకు కొట్టుకుంది.

"నాజూకులు పోతుంది నాజూకులు" అన్నాడు పళ్ళు కొరుకుతూ.

"లేదు దొరా...." మళ్ళీ వచ్చి తన పని ప్రారంభించింది కమిలి. ఆమె ముఖంలో సిగ్గు, బాధ ఏం కనిపించలేదు. మామూలుగా ఉంది. 'ఓహ్ !' వాళ్ళిద్దరి మధ్య చాలా చనువుందనుకుంది.

"అలా బెల్లం కొట్టిన రాయిలా కూర్చోకపోతే వెళ్ళిపోరాదు ?"

"వెళ్ళటానికే వచ్చాను. నేను అడిగింది వినిపించలేదా ?"

"నాకేం చెముడు లేదు"

"మరి మీరు ఆలోచించి చెబుతారా ?"

"ఆలోచించవలసిన అవసరం అంతకన్నా లేదు" అన్నాడు పదునుగా. అప్పుడే వీరయ్య వచ్చాడు. అతని చేతిలో కాపు సారా సీసాలున్నాయి. అతను రూపను చూచి ఉలిక్కిపడ్డాడు.

"ఏరా వీరయ్యా ! ఇప్ప సారేనా ?" అతని చేతిలోని సీసాలొక్కటి గడ, గడ త్రాగడు సగం సీసా.

"అబ్బే ! నికార్సయిన ఇప్ప సారా కాదురా, గుడంబ. ఆ కాపు సారా సన్యాసులకు బుద్ధి చెబుతాను" అన్నాడు చివాల్న లేచి.

రూపకేం పాలుపోలేదు, ఆ మనిషితో యెలా వ్యవహరించాలో

యెవరూ చెప్పరు గాని అతనితో మాట్లాటవద్దంటారు. అతను సాగా బిట్టి వాళ్ళను బండబూతులు తిడుతూ బావి దగ్గరకెళ్ళి కూర్చున్నాడు. చేసేది లేక నిరాశా, నిస్పృహలతో వెనుతిరిగింది. కోర్టు కెళ్ళితే యెన్నాళ్ళు పడుతుందో. వెంకన్న చదివే దండకం గుర్తుకు వచ్చింది.

కచ్చేరీలో కాగితం

కోర్టులో వాదం

తెగవు మునగవు. అలాగే సర్వనాశనం అయ్యేవి ఉన్నాయి కొన్ని.

కోళ్ళ గంపలో పిల్లి పడితే
కోకలో నిప్పు పడితే
గాజుల గంపలో రాయి పడితే
గరుకు లేని రాయిపై జారిపడితే

సర్వ నాశనం అంటాడు. నిజమే కోర్టులో వాదం తెగే సరికి శర్మిష్ఠ ముసలమ్మ అవుతుంది. ఆమెకు అరుగుమీద కూర్చుని పద్యాలు కంఠతా పడుతున్న పసివాడు కనిపించాడు.

అనగనగ రాగమతిశయిల్లుచు నుండు
తినగ తినగ వేము తియ్యగనుండు
సాధనమున పనులు సమకూరు ధరలోన
విశ్వదాభిరామ వినరవేమ.

ప్రజా కవి వేమన్న పద్యం! యెంత జీవిత సత్యం ఇమిడి ఉంది. ఆమె కళ్ళు మిలమిలలాడాయి, అవును ఒక్క రోజుకే కృంగిపోతే యెలా సాధించాలి. మళ్ళీ ప్రయత్నించాలి. దృఢ నిశ్చయంతో ఇంటికి వెళ్ళింది.

హరికృష్ణ తన పేషెంట్లతో బిజీగా ఉన్నాడు.

ఇంద్రమ్మ ఉయ్యాల బల్ల మీద కూర్చుని స్వగతం! ఏమో అనుకుంటుంది. ఏవో లెక్కలు కడుతుంది.

"ఊరవతల గడ్డి కంచెకు ఈ సంవత్సరం రెండు వేలన్నా రావాలి. అవును యెందుకు రాదు! అమస్ట్ స్టిక్స్! పది పుట్ల వడ్లు రావాలి. అసలీ రఘుకు ఏం తెలియదు. తెలియనట్టు ఉండరా అంటే వినడు. పిల్లల



యెదిగి వస్తున్నారు. రూప తల్లికి ఇంజనీరును, శర్మికి డాక్టరును చూడాలి" అంటుంది. రూప జాలిగా నిట్టూర్చింది.

"వచ్చావా రూపదేవీ! ప్రొద్దున్నే యెక్కడకి వెళ్ళావే తల్లీ. నువ్వు లేనిది బ్రేక్‌ఫాస్ట్ నచ్చలేదు. నాకే కాదు ఆ డాక్టరు అంతే" అన్నది.

రూప ఆదుర్దాగా బల్లమీద చూచింది. చపాతీలు అలాగే ఉన్నాయి. ఆమె క్షణం అలాగే నిలబడి పోయింది. ఈ అనుబంధాలకు నిర్వచనం చెప్పగలమా అనుకుంది.

"వెంకన్నా! పదకొండు గంటలకు డాక్టరుగార్ని ఇక్కడికే రమ్మను టీకి" అన్నది వెంకన్న తలాడించి వెళ్ళిపోయాడు.

"అమ్మాయ్.... రఘు లేడు కదూ ... హి వాజ్ మర్డర్.... ఐ కిల్ దెమ్. ఐ కిల్ ...." అన్నది పిడికిళ్ళు బిగించి.

కాస శారీరకంగా బలహీనంగా కాగానే అలా మాట్లాడుతుంది. ఏం చేయాలో తోచలేదు రూపకు.

"నాయనమ్మా! నువ్వలా ఎక్సయిట్ కావద్దు, నేను లాయర్ని పిలుస్తాను కదా" అన్నది నెమ్మదిగా.

ఇంద్రమ్మ పెద్దగా పడీ, పడీ నవ్వింది.

"రూపాదేవి! ఏమన్నావ్ లాయర్లనా, నిజాన్ని అబద్దాన్ని చేసే ఆ లోఫర్లనా,! న్యాయవాదులు కాదు అన్యాయవాదులు, న్యాయమంతా వాళ్ళ నల్లకోటు మింగేస్తుంది. అవునూ.... నన్ను నన్ను మినిష్టర్ను చేసే పనేమిటో తెలుసా! న్యాయ కళాశాల మూయించేస్తాను...." ఆమె ఆవేశంతో ఊగిపోతుంది.

"నాయనమ్మా! నా కోసం ... నాకోసం శాంతించు. అందరూ మనలాంటి దురదృష్టవంతులుంటారా. న్యాయవాదులంతా అన్యాయానికి తలపడతారా! వాళ్ళు మాత్రం ఏం జేస్తారు సాక్షులు కావాలి కదా" అన్నది నచ్చచెబుతూ.

"నిజమేనే కాదనను మరి కుటుంబం మొత్తం చంపబడింది కదా, ఎవరో ఒకరు చంపారు కదా. వాళ్ళను ప్రభుత్వమే పట్టుకోవచ్చు

కదా. కత్తికి కాళ్ళు వచ్చాయా, చేతులు వచ్చాయా ?" ఆమె ఆవేశం ఆవేదనగా మారింది.

"జరిగిపోయినది యెంత విచారించినా బాగుచెయ్యలేం...."

"ఎందుకే ఈ న్యాయాలు, చట్టాలు, నా మనవలు ఇప్పుడుఉంటే నా సుధీర్ కలెక్టరు అయ్యేవాడు, నా విద్యాధరుడు డాక్టరయితే ఈ హరికృష్ణలకు ఊడిగం చెయ్యాల్సి వచ్చేదా ? నా రణధీర్ ఇంజనీరు అయ్యేవాడు. నా మనవలే నా ఇంటి దీపాలె. నా కంటి వెలుగు. ఒరేయ్.... మీ చేతులు పడిపోను. మీరు నాశనం కండిరా. నా ఇంటి దీపాలను ఆర్పేసిన తుచ్ఛాలు....నీచులు —"

"నాయనమ్మా ..." కంగారుగా పట్టుకుంది.

"వదలవే.... ఆ గాడిద కొడుకులను వదలను.... ఐ లర్న్ ఇంగ్లీష్.... ఐ గో టు సుప్రీమ్ కోర్ట్. వాళ్ళందర్ని ఉరి కంభం యెక్కిస్తాను. నాలాగే వాళ్ళ అమ్మలు ఏడ్వాలి. వదలవే రూపా...." రూపకు ఆమెను పట్టు శక్యం కావటంలేదు.

"ఏమయింది రూపాదేవి!" హరికృష్ణ హడావుడిగా వచ్చి, ఆమె సమాధానం వినకుండానే మత్తు ఇంజక్షన్ ఇచ్చేసాడు. ఇరవై నిమిషాలు ఏదో అరుస్తూ, ఆ తరువాత తోటకూర కాడలా వేళ్ళాడిపోయింది ఇంద్రమ్మ.

పడుకోబెట్టి దిండు సరిజేసింది.

హరి చేతులు కడుక్కుని ఏం జరిగిందన్నట్టు చూచాడు.

"ఏముంది ?" జరిగింది చెప్పింది.

"నేను టీకి వద్దామనుకుంటుండగానే పెద్దగా అరుపులు, శాపనార్థాలు వినిపించాయి" అన్నాడు కూర్చుని.

"మీరు బ్రేక్‌ఫాస్ట్ తీసుకోలేదు" అన్నది ప్లేటు పెడుతూ

"మీరు తీసుకోండి" అన్నాడు. ఆమె మాట్లాడక కూర్చుంది. ఆమెకీ రోజు భయం, దిగులు కంటే నిశ్చింత అనిపించింది. మనిషికి ఒక తోడు కావాలి, అనుకుంది.

ఉద్దరూ ఉపహారం ముగించారు.



"మీరు ఇన్నాళ్ళు యెలా నెట్టుకువచ్చారోనని ఆలోచిస్తే నా మతి పోతుంది." అన్నాడు సిగరెట్టు వెలిగించుకుని.

"నాకూ ఆశ్చర్యంగానే ఉంటుంది. మీరు ఏకవచనంతో పిలిస్తే సంతోషిస్తాను" అన్నది.

"మీరూ అలాగే పిలువాలి మరి. ఏదయినా రెండు వైపులమంచి ఉండాలి" అన్నాడు బయటకు వెళ్తూ.

"అలాగే పిలుస్తాను కృష్ణా...." అన్నది. అతను ఉలిక్కిపడ్డాడు. ఆ పిలుపులో ఎంత ఆప్యాయత!

ఎంత స్నేహ పూరితమైన పిలుపు.

"రూపా!" అన్నాడు ఇటు తిరిగి.

"వెళ్ళు....వెళ్ళు మీ పేషెంట్లు యెదురు చూస్తారు. నేను శర్మకి, అంకుల్‌కు ఉత్తరం వ్రాయాలి" అన్నది. అతను వెళ్ళిపోయాడు.

రూప కేశవరావుకు ఉత్తరం వ్రాద్దామని కూర్చుంది. వెంకన్న ఉత్తరాలు తెచ్చాడు.

కేశవరావే రాసాడు. అది చదివి ఆలోచిస్తూ కూర్చుండి పోయింది. అతను మెడిసన్ ఫైనలియర్‌లో ఉన్న అబ్బాయిని, ఇంజనీరింగ్ చదివి నాగార్జునసాగర్‌లో పనిచేస్తున్న ఉద్యోగిని చూచాడట. ఒకరు యాభై వేలు అడిగారట, ఇంజనీరుకు ముప్పైవేలు అడిగారట. ఇంకా పర్స్యూ చేస్తే ఓ అయిదువేలు తగ్గుతారేమో అని వ్రాసాడు. అంత కట్నం ఇచ్చి వివాహం హోదాకు దగ్గట్టే చేయాలి అదనంగా మరో పదివేలు కావాలి.

ఎలా తేవాలి డబ్బు!

'సాధనమున పనులు సమకూరు ధరలోన....' అవును నిజమే. ఒక్కసారికే తను నిరాశపడితే యెలా ?

సాయంత్రాలు రాయలు పొలం దగ్గరుంటాడని తెలుసు. అక్కడికి వెళ్ళాలని నిర్ణయించుకుంది.

"లక్ష్మీదేవి కూడా చాలా చిత్రమైన దేవతమ్మా ఆ తాగుడు తిరుగుబోతు రాయలును తెగ వరిస్తుంది"

"ఏమయింది వెంకన్నా ?" అతని సణుగుడు విని అడిగింది.

"ఏముందమ్మా ! ఆ రాయలు లారీ కొన్నాడు" అన్నాడు.

కాలం కదలిక చెప్పటం యెప్పుడూ యెవరి తరం కాదేమో.

తను పసిపిల్లగా ఉండగా రాయలు తండ్రి తన దాబాయికి, నాయనమ్మకు యెంత చాకిరీ చేసేవాడు.

ఈనాడు ఊరందరికంటే బలవంతుడు, ధనవంతుడు !

సాయంత్రం వరకు రాయలును యెలా అంగీకరింపజేయాలి అనుకుంటూ కూర్చుంది.

హరికృష్ణ అలసిపోయాడేమో నిదురబోయాడు.

మళ్ళీ సాయంత్రం పొలాలకేసి బయలుదేరింది. అతను ఉదయమే సీసా మూతికేసుకున్నాడు. సాయంత్రం ఏ స్థితిలో ఉంటాడో. వెంకన్నను వెంటబెట్టుకొని వెళ్ళింది.

వీళ్ళని ఆశ్చర్యంగా చూచాడు జీతగాడు.

"మీ అయ్యగారు లేరా ?" అని అడిగింది, నిజానికా పొలం తనది. తనే పరాయిదానిలా నిలబడిపోయింది.

"ఉన్నారు." అతను షెడ్డువైపు చూపాడు.

ఇద్దరూ అటు వెళ్ళారు. దట్టంగా అల్లుకున్న పొదలమాటునుండి ఒక జత మొరటు పాదాలు, మరో జత సున్నితమైన పాదాలు కనిపించాయి.

"రామ, రామ...." అనుకొని అక్కడే ఆగిపోయాడు వెంకన్న.

"రాయలేనా ?" మెల్లగా అడిగింది.

"ఊ ! మీరెల్లి ఆ చెట్టుక్రింద కూర్చోండి. నేను పిలుచుకు వస్తాను" అన్నాడు వెంకన్న.

రూప వెళ్ళి చింతచెట్టు మొదట్లో కూర్చుంది. అయిదు నిమిషాల తరువాత వెంకన్న బంతిలా దొర్లుతూవచ్చి రూపముందు పడ్డాడు.



రూప అతన్ని లేపి కూర్చుండ బెట్టింది.

"పదమ్మా ! ఇక్కడ మనుషులుండరు...." అన్నాడు వెంకన్న.

"ఏమిట్రా ముసలినక్కా ! మనుషులుండరా ! నేను ఒంటరిగా ఉన్నచోటకి రావటానికి యెంత ధైర్యంరా." రాయలు వచ్చారు. అతని కళ్ళు ఎర్రగా ఉన్నాయి.

"వెంకన్నా వైపునుండి క్షమాపణ అడుగుతున్నాను. అతన్ని పంపింది నేనే...." అంటున్న రూప నోరు ఒక్కసారి మూతపడింది. ఆమె ముందు నుండి మైల బట్టలతో ఉన్న ఒక యువతి వెళ్ళిపోయింది. కామానికి కళ్ళుండవా !

"ఏమిటి, క్షమాపణ .... సహాయం అంటూ నా వెంట పడ్డావు. ఏం కథ!" అన్నాడు అక్కడున్న మరో చెట్టుకానుకుని నిల్చొని.

"కథ, కాకరకాయ ఏం లేదు మీకు చేతులు జోడిస్తున్నాను. మా పొలాల విషయం తేల్చండి. మీరు ముందుకువస్తే అందరూ ఎంతో కొంత ఇస్తారు." అన్నది ప్రాధేయపూర్వకంగా.

"వాహరే వ్వా ! పులిపిల్ల పిల్లిపిల్లయిందేం ? చూడు నీవు యెంత ప్రాధేయపడినా లాభంలేదు. మీ తాత బీదలందరి కడుపుకొట్టి సంపాదించాడు ఆ బీదలే తీసుకున్నారు " అన్నాడు నిర్లక్ష్యంగా.

"ఈనాడు మీరు దొరికినన్ని మార్గాలలో సంపాదిస్తున్నారు. అవి బీదలను కొట్టినట్టేనా !" అని ధైర్యంగా అడిగింది.

"నా మాటిను రూపమ్మా. ఆయన చేసే సహాయం లేక పోగా, అవమానం మిగులుతుంది." అన్నాడు వెంకన్న.

"నువ్వు దూరం వెళ్ళి కూర్చో" కసురుకుంది రూప

వెంకన్న చేసేదిలేక దూరం వెళ్ళిపోయాడు. అతనికి రాయలు చూపులు శూలాల్లా గుచ్చుకుంటున్నాయి.

'భగవంతుడా! అమాయకురాలయిన రూపమ్మను నువ్వే రక్షించు' అనుకున్నాడు.

"చూడండి రాయలుగారూ! ఆ నాడు వాళ్ళు ఊహించి ఉండరు ఆసి అనర్థాలకు దారితీస్తుందని. ఇప్పుడయినా నేను ఊర్కేనే వదిలిపేసే దాన్నే కాని, కట్నాలు మా జీవితాలను బలిగొంటున్నాయి. ఇదిగో ఈ ఉత్తరం చూడండి" అన్నది. ఉత్తరం గుప్పిట్లోనుండి తీసి, "అక్కరలేదు. ఏముందో చెప్పు."

"మా చెల్లెలి వివాహం కావాలంటే కనీసం ఓ యాభై వేలన్నా కావాలి. మీరు ఆ యాభై వేలు ఇస్తారని కాదు. పొలాలు చేస్తున్నవారు తలా రెండు వేలిచ్చినా కార్యం గడుస్తుందని. ఆ పొలాలు చట్టబద్ధంగా మీవి అవుతాయి."

"ఇదిగో చూడు రూపమ్మా, దీపమ్మాగాని ఈ ఏడ్పులు అంగలార్పులు యెందుకు? ఈ డబ్బిప్పిస్తే నాకేం గిట్టుబాటు అవుతుంది?" అన్నాడు.

రూప అయోమయంగా చూచింది.

అంతలోనే తేరుకుంది.

"సరే! మీరు చేస్తున్న పొలాలకు డబ్బు ఇవ్వకండి. ఆ డబ్బిచ్చారని చెబుతాను." అన్నది దీనంగా.

"ఊహూ! లాభంలేదు. నువ్వేదో బిక్షం వేస్తానంటే యెలా కుదురుతుంది. నేను అడిగింది ఇవ్వాలి?" అన్నాడు కాస్త తగ్గి.

"అడగండి, మొత్తం పొలాలపై మీకు చేతనయినంత వసూలు చేసుకుని నాకు ఓ యాభై వేలు ఇవ్వండి చాలు." అన్నది.

"అదేం కాదు. మొత్తం ధర ఇప్పిస్తాను. లేదా నువ్వు అమ్ముకుంటానంటే విడిపిస్తాను ఆ పొలాలు." అన్నాడు యెంతో నిదానంగా.

అలా నిదానంగా మాట్లాడితే భరించలేరు అతని సన్నిహితులు.

ఏదో ప్రళయం వస్తుందనుకుంటారు ఆయన జీతగాళ్లు.



"సందేహించకండి." అన్నది. అతను అడిగిందేదో తగలేసి, తన పని చేసుకుందామని.

"నీ వాలకం చూస్తే కాస్త ఇంటి పట్టున పడి ఉండి పనులు చేసుకునేలా ఉన్నావ్ నా కింట్లో ఇల్లు సవరించటానికో ఆడది కావాలి అందుకని నన్ను పెళ్ళి చేసుకో నీ విషయాలు...."

అతని మాట పూర్తి కాలేదు. అతని చెంప చెళ్ళుమంది, ఆమె ఆడపులిలా లేచింది.

"ఏమిటి?....ఏం కూసావ్! నిమిషానికో అమ్మాయితో కులికే నీకు పెళ్ళే తక్కువయిందా? ఛీ....ఛీ! మీలాంటి వారి నోట ఆ పెళ్ళి అనే పదం అపవిత్రం అయింది. వెంకన్నా పద," అన్నది చర, చర నడుస్తూ.

రాయలు అదిరి పోలేదు. ఆశ్చర్యపోయాడు. ఏ ధైర్యంతో ఈ అమ్మాయి తన పైకి చేయి యెత్తింది! అని రాయిలా నిలబడి పోయాడు.

వెంకన్న గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి.

జీతగాళ్ళ హృదయాలు లబ్, డబ్ మన్నాయి.

అందరూ ఆశ్చర్యంగా చూస్తుండగానే రూప దెబ్బతిన్న త్రాసులా బుసలు కొడుతూ తన భవనం చేరుకుంది.

తల్లిదండ్రులు లేని పిల్లలంటే ఎంత లోకువ!

ఆమె పెళ్ళి మంచంలో పడుకుంది ఏడ్పు రావటములేదు, ఖాళీ మైదానంలా ఉంది బుర్ర.

నిమిషాలు గంటల్లోకి మారటం కూడా గమనించలేదు.

"రూపా! అకలి దంచేస్తుంది," అంటూ వచ్చాడు హరికృష్ణ.

"రండి." అన్నది లేచి ముఖాన నీళ్ళు చల్లుకుని.

"అదేమిటి ఆరోగ్యం బాపుండ లేదా?" ఆమె వంక పరీక్షగా చూచాడు అతను.

"ఏదో తలనొప్పి...." అన్నది తల వంచుకుని. తన ముఖంలోని భావాలు అతను చదువ కూడదని.

"నాయనమ్మ కోసం దిగులు పడుతున్నావా ?" అన్నాడు జాలిగా. అతను చొరవగా ఆమె నుదురు తాకి చూచాడు.

చల్లగా ఉంది.

అతని స్పర్శ అంతకంటే చల్లగా ఉంది.

ఆమెకు ఎందుకో కళ్ళు చెమర్చాయి.

"రూపా ! నీ బాధ ఏమిటో చెప్పవా ! నేనింకా పరాయివాడలా కనిపిస్తున్నానా ?" ఆర్తిగా అడిగాడు.

"లేదు హరి.... లేదు...." అన్నది. కూర్చుని ప్లేట్లు పెడుతూ.

"కొన్ని విషయాలు నోటితో చెప్పటానికి అసహ్యంగా ఉంటాయి" అన్నదీ.

"అలాంటి విషయమైతే చెప్పొద్దు. రూపా, నువ్వు మరిచిపో." అన్నాడు. ఆమె తలాడించింది

అతను చాలాసేపు కబుర్లు చెప్పి వెళ్ళిపోయాడు పైకి.

మనిషి ప్రవృత్తి బహు చిత్రమైనది. ఒకప్పుడు రూపంటే చులకన భావం ఉన్న అతనికి, ఈనాడు, ఆమె అంటే చాలా ఉన్నతమైన భావం ఏర్పడింది. ఆమె గురించి ఆలోచిస్తూ నిదురలోకి జారిపోయాడు.

## 11

ధనుర్ సంక్రమణమంటే రూపకు చాల ఇష్టం. వాకిట్లో స్వయంగా ముగ్గులు పెడుతుంది. ఆమే స్వయంగా కల్లాపి చల్లి, చీపురుతో ఊడ్చి ముగ్గులు పెడుతుంది. ఆమె మనసు ఒక్కసారి చిన్నతనము వైపు వెళ్ళింది.

తన తల్లి ముగ్గులు పెడతుంటే అరుగుపై కూర్చున్న పిన్ని తమకు తలలు దువ్వేది. ఆ రోజులు మళ్ళీ వస్తే యెంత బావుండును



"అక్కా" ఒంగిన రూప వీపుపై వాలిపోయింది శర్మిష్ట

"శర్మీ ! ఎప్పుడొచ్చావే ?"

"ఇదిగో ఇప్పుడే వస్తున్నాను. రాత్రి బండి దిగి శంషాబాద్‌లో మా ఫ్రెండ్ ఇంట్లో పడుకున్నాను పాల వ్యాన్‌లో వచ్చాను." అన్నది. వీరనారీ మణిలా.

"ఒంటరిగా అలా రావచ్చునా !"

"ఛో అక్కా ! ఈ కాలంలో కూడా భయపడటం ఏమిటి సింగినాదం, అవునూ మన గ్రేట్ నాయనమ్మగారేరి ?" అన్నది.

"ఆమెకు రోజూ సెడేషన్ ఇవ్వాల్సిందే." అన్నది దిగులుగా.

"సారీ అక్కా మన హీరో ఉన్నాడా, ఈ పేడ కంపు, నాయనమ్మ ఇంగ్లీషు మాటల సొంపు విని పారిపోయాడా ?" అన్నది సూట్ కేస్ అరుగుమీద పెడుతూ.

రూపాదేవి పక్కున నవ్వింది. శర్మిష్ట వస్తే ఆమెకు చాలా ఆనందంగా ఉంటుంది. స్తబ్ధముగా ఉన్న వాతావరణము ప్రాణము తీసుకున్నట్లు ఉంటుంది.

"డాక్టర్ హరికృష్ణగారా ! ఉన్నారు, ఇప్పుడె ఊరులో కొంతమంచి పేరు సంపాదించాడు. ఈ ఊరి వాతావరణానికి, నాయనమ్మ మాటలకు అలవాటు పడ్డాడు." అన్నది ముగ్గు క్రింద పెడుతూ.

"అక్కా ! నేను వెయ్యనా ముగ్గు ?"

"నీ ముఖం నీకేం వస్తుంది." అన్నది గారంగా.

"హృదయ పద్మము చూడు." అంటూ పమిట బిగించి, ముగ్గు డబ్బా పట్టుకుంది.

"ఏమండోయ్ శర్మిష్టగారూ ! హృదయ పద్మము వాకిట్లో పార వెయ్యరు. పదిలంగా దాచుకుంటారు" అన్నాడు అప్పుడే వాకింగ్ నుండి వచ్చిన హరికృష్ణ. శర్మిష్ట ముగ్గు డబ్బా పారవేసి పరుగెత్తింది ఇంట్లోకి.

"ఒట్టి పిచ్చిది హరీ ! ఇందాక మిమ్మల్ని హీరో అన్నది, ఇప్పుడేమో సిగ్గుపడి పారిపోతుంది." అన్నది నవ్వుతూ.

"అమ్మమ్మ ! ఈ కాలములో ఆడపిల్లలే ఎక్కువ అల్లరి చేస్తున్నారు." అన్నాడు పిర్యాదుగా.

"మీ మగవారు మహా అమాయకులు అయినట్టు, రండి మీరు రాలేదని టీ కూడా త్రాగలేదు నాయనమ్మ" అన్నది.

ఇద్దరు లోపలికి నడిచారు

ఇంద్రమ్మ శర్మిష్టను వడిలో కూర్చోబెట్టుకుని ఒళ్లంతా నిమురుతుంది.

"రావయ్యా డాక్టరు బాబూ! మా శర్మికి కాస్త డాక్టరీ అట చెప్పు" అన్నది ఆమె.

"నేను చెబితే ఆమె దగ్గర వైద్యము నేను, మీరు చేయించుకుని తృప్తి పడాలి" అన్నాడు కాస్త వెక్కిరింపుగా.

"ఏమిటయ్యా! ప్రయివేటుగా పరీక్షకు కడుతుంది" అన్నదామె.

"ఇంద్రమ్మగారూ ! మీ మనవరాలు రేపు మార్చిలో ఇంటర్ పరీక్ష ఇచ్చి, ఫస్టుక్లాసులో పాసయి, మళ్ళీ ఎంట్రెన్స్‌లో మార్కులు తెచ్చుకుని, డాక్టరీలో సీటు తెచ్చుకుని అయిదేళ్ళు చదవాలి " అన్నాడు

వాళ్ళందరికి టీ తెచ్చింది రూప.

"మహా ! మీరే అయిదేళ్ళు చదివినట్టు. నాయనమ్మా నేను డాక్టరీ చదువుతానే" అన్నది గారాలు పోతూ.

"నా తల్లి కాకపోతే మరెవరు చదువుతారు. మీరంతా షేమ్ అయిపోవాలయ్యా షి విల్ .... గ్రేట్ డాక్టర్ ...." అన్నది టీ సిప్ చేస్తూ.

"బావుంది ఊహ ! టీ త్రాగి స్నానం చెయ్యవే శర్మీ !"

శర్మిష్ట లేచి వచ్చి అక్క ప్రక్కన కూర్చుంది, ఇద్దరూ కాలేజి విషయాలు మాట్లాడుకున్నారు.

"ఎన్నాళ్ళే నీ మకాము ?" అన్నది రూపాదేవి.



"సంక్రాంతి వెళ్ళిపోయేవరకు అక్కా ! జగదీష్ వాళ్ళ ఇంట్లో జామచెట్టు కాస్తుందటే ?" అన్నది ఉత్సాహంగా.

"శర్మీ! జామచెట్టు కాయకాసినా, పొన్నచెట్టు పూతపూసినా నువ్వు బయటికి వెళ్ళటానికి వీల్లేదు. నువ్వు పెద్దదాని వయ్యావు." అన్నది గంభీరంగా.

"ఏమయిందక్కా ?"

"ఏం లేదు శర్మిష్టా! మనం పల్లెటూరి వారు అమాయకులు, అప్రులు అనుకుంటాము. కాని అవసరమైతే మనిషిని అంతం చేయటానికి వెనుకాడరు వాళ్ళు" హరి జవాబు చెప్పాడు.

"ఐసీ....తల పంకించింది.

రూపదేవికి మరిచిపోతున్న మానసిక వ్యధ మళ్ళీ తలెత్తింది తను శర్మిష్ట విషయములో ఏదో నిర్ణయము తీసుకోవాలి. శర్మిష్ట స్నానానికి వెళ్ళింది. ఆమె మెల్లగా హరివెంట పైకి వెళ్ళింది.

"హరీ ! మామయ్యాగారు వ్రాసిన విషయము ఏం చేయాలో తోచటం లేదు" అన్నది. అతని గదిలో చిందర వందరగా ఉన్న బట్టలు సర్దుతూ.

"ఉండనీ రూపా, మాకు హాస్టల్‌లో అస్తవ్యస్తంగా ఉండే అలవాటయింది. ఒక్కసారి శుభ్రతను భరించలేము" అన్నాడు.

"మా అధీనములో ఉన్న పొలం అమ్మటం తప్పితే మరేదారి కనిపించటం లేదు" అన్నదామె కిటికిలో నుండి తన పొలం వైపు చూస్తూ.

ఆమె మనసులో ఎన్నెన్నో మధుర స్మృతులు సుళ్లు తిరిగాయి.

మహారాణిలా గద్వాల చీర కట్టుకొని, చేతులు నిండుగా బంగారు గాజులు వేసుకుని, మెడలో చంద్రహారంతో శాలువా కప్పుకుని తిరిగే

ఇంద్రమ్మ వెంట, బంగారు నగలతో కంచి పట్టు పరికిణీలతో తిరిగే పసి పిల్లలు మెదిలారు

ముగ్గురు అందమైన కుర్రాళ్లు బావిలో ఈత కొట్టేవారు. టవల్స్, సోప్ బాక్స్ పట్టుకుని నిలబడే వెంకన్న.

అవన్నీ గతకాలపు వైభవాలుగానే మిగిలిపోయాయి.

"మాట్లాడవేం రూప ?" హరి మాటలకు ఈ లోకములోకి వచ్చింది!

"ఏమన్నారు ?"

"ఆ పొలం అమ్మేసినా మనకు బాధలేదు. నా జీతం మన ముగ్గురికి సరిపోదనుకోను...." అన్నాడు.

"హరీ !" ఆశ్చర్యముగా చూచింది! ఆనందంతో ఆమెకు మాటలు రాలేదు.

"మా బరువు, బాధ్యతలు మీరు స్వీకరిస్తారా ?" అన్నది.

"బరువు బాధ్యత ఏం లేదు రూపా! పరస్పర సహకారము మాత్రమే."

"నాయనమ్మ ఋణం తీర్చుకోవాలను కుంటున్నారా ?" అన్నది. చురుకుగా.

"ఈ ఋణం తీరేది కాదు రూపా!" అతను స్వప్నా విష్టుడిలా వచ్చి ఆమె భుజాలపై చేతులు ఆన్చాడు.

నిన్ను అవమానించిన మాట వాస్తవమే. కాని కావాలని చేసానని నువ్వు అర్థం చేసుకుంటే సంతోషిస్తాను" అన్నాడు .... అతని కంఠము మధుర గంభీరంగా ఉంది రూప అణువణువు ఓ రకమైన, అనిర్వచనీయమైన అనుభూతితో నిండిపోయింది.

"రూపా, పట్నాలలో రంగులు, హంగులు ఆకర్షించే మాట నిజమే. కాని నాకీ జీవితం నచ్చింది. నీ సహచర్యలలో, ఉన్నదాంట్లో ఆనందముగా బ్రతుకవచ్చని అనుకుంటున్నాను" అన్నాడు.



అతని రెండు చేతులపై తన చేతులు ఆన్చింది.

"థాంక్యూ హరీ....థాంక్యూ వెరిమచ్" అన్నది. మిల, మిల లాడే కళ్ళతో చూస్తూ.

"రూపా...." అతని మాట పూర్తికాక పూర్వమే క్రింది నుండి శర్మిష్ఠ పిలిచింది.

"శర్మి...." రూప దూరం జరిగి, దబ, దబా క్రిందికి దిగింది.

"అక్కా! ఏం జేస్తున్నాడు హీరో ?"

"ఏమో, వెళ్ళి చూడు" అన్నది.

"ఒంటరిగానా...." అని అక్క వెంటనే హాల్లోకి వచ్చింది. రూప శర్మిష్ఠ పొడగాటి జుట్టు చిక్కు తీసింది.

"అక్కా! నాయనమ్మకు గుండె నొప్పి వచ్చిందా ?" అని అడిగింది.

"అవునే, ఎవరు చెప్పారు ?"

"వాకిలి ఊడ్చే జంగమ్మ చెప్పిందిలే....అబ్బ .... నెమ్మదిగానే" అన్నది.

"ఈ జుట్టంతా ఇలా పీకి పెడితే బోడిగుండు అవుద్దే" అన్నది రూప చిరుకోపముగా.

"అక్కోయ్ ! ఈ కాలం గాలో, నీళ్ళో చెప్పలేం గాని ఈ రోజు ఎవరి జడ అయినా చూచి నాగుబాముంత అనుకున్నామా, సంవత్సరము తిరిగేసరికి ఎలక తోకంత కూడా మిగలటంలేదు. అందుకని నువ్వేం దిగులు పడకు. ఈ జుట్టు నువ్వు పట్టుకున్నా ఆగదు. నువ్వు దండోరా పుచ్చుకుని మా చెల్లెలి జుట్టు ఇంత ఉండేదన్నా ఎవరూ నమ్మరు" అన్నది గల, గల మాట్లాడేస్తూ.

"మాటలు నేర్చావ్." జుట్టు చిక్కుదీసి, కొసలకు రిబ్బన్ కట్టి వదిలి వేసింది.

హాస్టల్లో ఒకరితో ఒకరు పోటీపడి స్నానానికి వెళ్ళాలని, భోజనానికి వెళ్ళాలనే తాపత్రయం ఉంటుంది. తలకు చిక్కు తీసుకునే తీరిక, ఓపిక ఉండవు.

"అక్కా! ఈసారి క్లాసులో నేనే టాప్ చేసాను. మా కాలేజి బ్యూటి అంటారే" అన్నది గర్వంగా.

"అతిశయోక్తికాదు కదా" ఆమె, మనస్సు మళ్ళీ ఎటో పోయింది

అమ్మాయిలను బోల్తా కొట్టించేది ముఖఃస్తుతితోనే. ఒంటరిగా ఉంటే శర్మిష్ట వాటికి లొంగిపోదా ? తను చెల్లెలిని కాపాడలేదు. త్వరగా వివాహము చేసి పంపించాలని ఉంది.

విశృంఖలత్వము పెరిగిపోయిన ఈ రోజులలో ఏదీ తప్పుకాదు అంటున్నారు. అనుకరణ పెరిగిపోయింది.

ఆడపిల్లలు కూడా స్వేచ్ఛగా తిరుగుతున్నారు. అది తప్పుకాదు, కాని అనుకరణే తప్పు.

చలి దేశాలలో కొద్దిగా వేడి కోసం వాళ్ళు సిగరెట్టు కాలుస్తారు, త్రాగుతారు. మన అమ్మాయిలు ఫాషన్ కోసము సిగరెట్టు కాలుస్తారు. కంపెనీ కోసం త్రాగుతారు.

వాళ్ళు నైతిక విలువలు పాటింపరు అంటారుగాని వాళ్ళు పాటించినంతగా మనవారు పాటించరేమో. ఒక్కసారి వివాహం చేసుకున్నారంటే వాళ్ళకున్న 'అఫేర్స్' అన్నీ మూల బడతాయి. మన వారికి వివాహమైన తరవాతే కొత్త అఫేర్స్ మొదలవుతాయి. 'దాంపత్యము' అనే పదాన్ని కలుషితం చేస్తున్నారు.

మళ్ళీ పతివ్రతల ముసుగులే. ఆ రంకు మొగుడి దగ్గరకు, ఈ భరించు భర్తే తీసుకు పోవాలి.

హరికృష్ణ రావటంతో అందరూ టిఫిన్ తీసుకోవటానికి వెళ్ళారు.



మధ్యాహ్నము భోజనము కాగానే నిదురబోయింది శర్మిష్ఠ రూప వెంకన్నను పిలిచింది.

"వెంకన్నా! మన బావి అమ్ముదాము. కొనేవారెవరో ఉన్నారన్నావు కదా" అన్నది, అతను మతిపోయిందా అన్నట్టు చూచాడు.

"మన బావి అమ్ముతావా రూపమ్మా!"

"అవును వెంకన్నా! నాకు మిగిలిన శ్రేయోభిలాషివి, బంధువు నువ్వు ఒక్కడివే. శర్మిష్టమ్మ వివాహము చేసి బరువు దింపు కోవాలను కుంటున్నాను" అన్నది వ్యధగా.

"మీది కాకుండానే శర్మిష్ఠమ్మదా ?"

"ఊరంతా టముకు వెయ్యకు గాని, నాయనమ్మ అంతగా పట్టు పడితే, సింపుల్‌గా నేను పెళ్ళి చేసుకుంటాను" అన్నది. అంత ధైర్యశాలి రూప తల కూడా వంగిపోయింది.

"ఏంటమ్మా, యెవర్ని చేసుకుంటారు ?" ఆదుర్దాగా అడిగాడు వెంకన్న,

"డాక్టర్ని" అన్నది అతి మెల్లగా.

ఆమె గొంతులో కోయిల రాగం వినిపించింది.

ఆమె చెంపలలో కెంపుల తళుకు కనిపించింది.

"అమ్మయ్య! బ్రతికించావ్. తల్లీ నేను భయపడి పోయాను. ఎక్కడ ఆ రాయలు అయ్యను పెండ్లి అంటావో అని...." అన్నాడు.

గుండెల మీద నుండి బరువు దిగి పోయినట్టు,

"ఇప్పట్లో కాకుంటేనే మంచిది కాని నాయనమ్మ కాదు, కూడదంటే తప్పదు" అన్నది. పుస్తకంలో ముఖం దూర్చి.

"నాయనమ్మ సంగతి అటుంచు. నేనూరు కుంటానేమిటి ? ఇక నేను తొందరగా పొలం కొనేవారిని చూస్తాను" అన్నాడు, ఆనందంగా. అతనికి చాలా రోజుల తరువాత ఆనందంగా ఉంది. రూపంటే ప్రత్యేకమైన అభిమాన ముంది, అతనికి పెంచిన ప్రేమే కావచ్చు.

"అమ్మా...." అతనింకా ఏదో అనబోయాడు,

"అక్కా ! మొద్దు నిదుర పోయానే" శర్మిష్ఠ లేచి వచ్చింది.

"ఇప్పుడు చేసే పనేముంది" అన్నది నవ్వి.

"నాకు చెక్కలు కావాలక్కా !" అన్నది వచ్చి ఆమె ప్రక్కన కూర్చుంటూ.

"అయితే చేసుకుందాము పద" అన్నది లేచి.

"ఏదో వంట ఎక్స్‌పెరిమెంట్ చేస్తామని లేచినట్టున్నారు" అన్నాడు అప్పుడే అక్కడికి వచ్చిన హరికృష్ణ.

"ఏమండోయ్ డాక్టరుగారూ! మా ఎక్స్‌పరిమెంట్ చాలా తక్కువలో తేలిపోతుంది మీరు ఎక్స్‌పరిమెంట్ చేస్తే ప్రాణాలే పోతాయి" అన్నది శర్మిష్ఠ.

"మీ ప్రాణాలకు నా ప్రాణం అడ్డు వేస్తాను లెండి" అన్నాడు నవ్వుతూ.

అప్పుడే లేచి ఇంద్రమ్మ వచ్చింది.

ఆమె కళ్ళు మత్తుగా వాలిపోతున్నాయి. అయినా ఏదో మాట్లాడుతుంది.

"న్యూసెన్స్‌గా ఉందయ్యా సర్కారు ! నేను ఈ మేడ యెన్నాళ్ళలో కట్టించానో తెలుసా ? సరిగ్గా రెండు నెలలు. అంటే టు మంత్స్" అన్నది.

"నాయనమ్మా ! అకస్మాత్తుగా నీ దృష్టి కట్టడాల మీదికి పోయిందేమిటే ?"

"మాకు చెరో బంగళా కట్టిస్తావేమిటి ?" హాస్యంగా అడిగింది శర్మిష్ఠ.

"నేనంత ఫూల్‌ను కానే శర్మీ పాపం మా డాక్టరుగారు చూడు. హాస్పత్రి లేక మన షెడ్లలో సఫర్ అవుతున్నారు. మీకు చెరొక బిల్డింగ్ కట్టిస్తాను చెరొక యాభై ఎకరాల పొలం ఇస్తాను. అప్పుడు కేసు



వదుస్తుంటే మీ అమ్మ బంగారం, నాది మార్టిగేజ్ చేసాను. అందంతా తెచ్చి మీ ఇద్దరికి ఈక్వెల్‌గా యిస్తాను" అన్నది సంబరంగా.

"ఆఁ! అప్పులివ్వకపోతే చాలు" అన్నది చురుగ్గా.

కళ్ళతోనే మందలించింది రూపాదేవి.

"నాయనమ్మను ఆటలు పట్టించడం తప్ప మరేం పని లేదటే నీకు."

"నాయనమ్మా పాలు త్రాగుదువుగాని పద" అన్నది రూపాదేవి.

"పాలేమిటే పసిపిల్లనా ?" అన్నది ముఖం చిట్లించి.

"ముసలివాళ్ళు, పసివాళ్ళు ఒక్కటే నండీ" అన్నాడు హరి.

"నువ్వు డాక్టరువు చేదు మందు తీయగా ఉందని చెబుతావు" అన్నది ఆమె, రూపాదేవి లోపలికి వెళ్ళారు.

"డాక్టరుగారూ! ఈ పల్లెటూర్లో మీకు బోరుగా లేదూ ?"

"బోరెందుకు ? సిటీలోనైనా రోగులను చూడటమే కాదా. ఇక క్లబ్బులకు వెళ్ళటం, సిటీలోని రంగులను, హంగులను కొనే ఆర్థిక స్థితి నాకు లేదు" అన్నాడు.

శర్మిష్ఠ ఆలోచిస్తూ నిలబడి పోయింది.

"అది కాక, ఒక ఊపులో సిటీ, సిటీ అంటున్నాము. అక్కడ లక్షలు సంపాదించే వాడికే మనుగడ ఉంది, స్వేచ్ఛ అనేదే లేదు. ఒక బిందెడు నీళ్ళకు గంటల తరబడి పడిగాపులు కాయాలి" అన్నాడు తన అత్త పడే అవస్థలు తలుచుకుని.

ఆమె తల వంచుకుని ఆలోచిస్తూ నిలబడి పోయింది.

అతను లేచి పెరడు వైపు వెళ్ళాడు. పెరట్లో వేప చెట్టు చుట్టూ వేసిన చప్టా మీద కూర్చుంటే వంటింటిలో తిరుగుతున్న రూపాదేవి కనిపిస్తుంది.

అక్కడ నుండి ఆమెను చూస్తుంటే బాపు వేసిన బొమ్మలా కనిపిస్తుంది అలా చూడటం అతనికెంతో ఇష్టం. అక్కడ కూర్చుని, అతను స్వప్న లోకాలలో విహరిస్తూ ఉంటాడు.

## 12

జగదీష్ బంధువులే రూపాదేవి బావి, ఇంజన్‌తోసహా అరవై వేలకు కొన్నారు. ఆమెకు డబ్బు చేతికి వచ్చేక చెప్పలేని ఆనందం కల్గింది. దొంగలు, దోపిడీదారులు తమ భవిష్యత్తు దోచుకుంటారేమోనని భయముతో, ఆ డబ్బు శంషాబాద్ బ్యాంకులో నిలవ చేసింది.

అది మార్చి మాసం ఇంకొక్క నెల ఆగితే శర్మిష్ట పరీక్షలు అయిపోతాయి. అవి అయిపోగానే ఆమె వివాహం చేయవచ్చు, అదొక్కటే ఆమెకు మిగిలిన ధ్యేయం. ఆ తరువాత హరికృష్ణ అండలో నిరాటం రంగా తన జీవితం వెళ్ళబుచ్చగలదు.

కేశవరావుకు, ఉన్న కాస్త ఆధారం అమ్మటం నచ్చలేదు, అంత కంటే మార్గం కనిపించలేదు.

ఆమె ఒంటిపూట బడులే కాబట్టి పిల్లలు వెళ్ళిపోగానే ఇంటిలో వచ్చింది. ఆమె కాబడి వల్ల ఉపయోగం లేక పోయినా, తృప్తి చాల కల్గుతుంది, తను విప్లవం లేవదీయకపోయినా, వీరావేశంలో ఉద్యమా నడుపకపోయినా, ఏదో చేసానన్న తృప్తి చాలు అనుకుంది.

"రూపా" ఆదుర్దాగా వచ్చాడు హరికృష్ణ.

"ఏమిటి హరీ? యెవరికయినా సీరియస్‌గా ఉందా?"

"కాదు రూపా! నాకు ట్రాన్స్‌ఫర్ అయింది. ఇక్కడి పాపులేష దృష్ట్యా డాక్టరు అనవసరమట" అన్నాడు ఉత్తరువు ఆమెకు ఇస్తూ. ఆ ఆర్డర్ చదివింది.



"ప్రభుత్వం వారు ఇంతాలస్యంగా కళ్ళు తెరిచారేం?" అన్నది కోపంగా, అతను నీరసంగా కూర్చున్నాడు.

"నీవు అప్‌సెట్ అవుతావని చెప్పలేదు రూపా, మొన్న ఒక రోజు రాయలు మనుషులు, జగదీష్ తమ్ముళ్ళు కొట్టుకున్నారు. రాయలు జీతగాడికి చిన్న దెబ్బ తగిలింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని సర్టిఫికేట్టు అడిగాడు.

"ఇవ్వాల్సింది, పైన పెద్ద ఆస్పత్రులు లేవా?" అన్నది ఆమె.

"అవును కాని వీళ్ళు సర్టిఫికేట్టు ఆధారం చేసుకుని నిజంగా ఆ అమాయకుడికి ప్రాణాపాయ స్థితి కలిగిస్తే...." అన్నాడు కంగారుగా.

"అంతటి ఘనులే" అన్నది సాలోచనగా.

"ఆ రోజే రాయలు నాతో చాలెంజ్ చేసాడు, ఈ ఊళ్ళో యెలా ఉంటావో చూస్తానని...." అన్నాడు.

ఆమెకు అతని ట్రాన్స్‌ఫర్ అశుభంగా అనిపించింది.

"అతనే చేయించాడని అంటారా?"

"అంతే అనుకోవాలి, మరి ప్రయివేటుగా ప్రాక్టీసు పెడితే ఏం చేస్తాడో చూస్తాను" అన్నాడు పళ్ళు కొరుకుతూ.

"ప్రయివేటు ప్రాక్టీసు నడువదండీ. వాళ్ళు మందులు కూడా ఉచితంగా కావాలనుకుంటారు" అన్నది రూప దిగులుగా.

రూపా! ఒకసారి మామయ్యను కలిసి వస్తాను, ఆయన ఏమంటారో మరి" అన్నాడు.

"ఏమిటో అంతా చిత్రంగా జరుగుతుంది" అంది నిరాశగా.

"రూపా! అధైర్య పడుతున్నావా?" అతను చటుక్కున ఆమె ముఖం తనవైపు తిప్పుకుని అడిగాడు.

"లేదు హరీ.... లేదు ఇలా యెందుకు జరుగుతుందని ఆలోచిస్తున్నాను" అన్నది ధైర్యం ప్రదర్శిస్తూ.

"అన్నీ మనము అనుకున్నది అనుకున్నట్టు జరగవు నువ్వు నిశ్చింతగా ఉండాలి సుమా" అన్నాడు, మృధువుగా అతని చేతుల నుండి తన ముఖం తీసుకుంది.

"మీరు హైద్రాబాద్ వెళ్ళేరండి" అన్నది తనలోని భావం బయట పడకుండా.

ఆ సాయంత్రమే అతను వెళ్ళాడు. రూపకు నిజంగా దిగులు పట్టుకుంది. హరికి అదే ఊరిలో ఉద్యోగ మయితే ఇంద్రమ్మను వది తను వెళ్ళలేదు, ఇంద్రమ్మ ఒంటరిగా ఉండలేదు. ఈ సమస్యకు పరిష్కా రము ఏమిటి ?

ఒక్కసారి వెళ్ళి రాయలును తన్నాలనిపించింది. తన జీవితాని విలన్‌లా దాపురించాడు. ఆమె ఆలోచిస్తుండగానే వెంకన్న హడావుడిగా వచ్చాడు.

"రూపమ్మా ! ఆ రోజు పొలం అమ్మిన తరువాత డాకుమెంట్ పూర్తిగా చదివావా ?" అన్నాడు.

"యెందుకు వెంకన్నా ! రఫ్ కాఫీ నేనే కదా ఫేర్ చేసి ది, టై ప్‌కిచ్చా" అన్నది.

"ఒక్కసారి చూచుకొండమ్మా, కొంప మునిగింది. అతను మ బంగళా కూడా రాశామంటున్నాడు" అన్నాడు కంగారుగా.

"భయపెట్టటానికి అని ఉంటాడులే వెంకన్నా" అని ఇనుప పెట్టె తీసి, అగ్రిమెంట్ తీసింది.

బంగళా కూడా అమ్మినట్టుంది, ఆఖరు పేరాలో ఒక ప్యారా వ్రాసారు. సర్పదష్టలా నిలబడి పోయింది ప్రపంచంలో ఇంత మోసం ఉంటుందని తెలియదు.

ప్రపంచములో తనలాంటి అమాయకులు ఉంటారా. టైప్ వాళ్ళు కొట్టించారని మరిచి పోయింది తనిప్పుడేం చేయగలదు! అన్ని వైపుల సమస్యలే.



విపరీతంగా తల నొప్పి వచ్చింది. ఆమె నిదుర మాత్ర వేసుకుని పడుకుంది.

మర్నాడుదయం కేశవరావు వచ్చారు అతన్ని చూడగానే కళ్ళ నీళ్ళు వచ్చాయి.

ఆమె చెప్పిందంతా విన్నాడాయన.

"రూపా ! కేవలం నిన్ను జడిపించటానికే వాళ్ళు అవి వ్రాసి ఉంటారు ఇక్కడ ఉండాలంటె ఒక్కడికి గుండెధైర్యం లేదు. అందరూ భయపడతారు" అన్నారు ధైర్యం చెబుతూ.

"నాపై వాళ్ళ కెందుకు కోపం ?" అన్నది అయోమయంగా.

"వ్యక్తిత్వంతో బ్రతికే వారంటే పిరికి వాళ్ళకు కోపం నువ్వేం దిగులు పడకు. ఈ ఇంటిలో హత్యగావింపబడిన వారి ఆత్మలు తిరుగు తున్నాయని వాళ్ళ నమ్మకం. వాళ్ళు వచ్చి అడిగేవరకు నువ్వేం కమిట్ కావద్దు" అన్నారాయన.

"అలాగే అంకుల్ హరి ట్రాన్స్‌ఫర్ విషయములో ఏమాలోచిం చారు ?" అన్నది ఆదుర్దాగా.

"ఈ ఊళ్ళో హాస్పత్రి వద్దన్నాక ఇక మనము చేసేది ఏం లేదు. వికారాబాద్ చాలా దూరం అవుతుంది. శంషాబాద్‌కు ప్రయత్నిస్తాను" అన్నాడు ఆయన.

"థాంక్యూ మామయ్యా" అన్నది కృతజ్ఞతా పూర్వకంగా చూస్తూ.

"అదేమిటమ్మా రఘు చేస్తే థాంక్స్ చెప్పేదానివా ! శర్మిష్ట మొన్న వచ్చింది. థియరీ బాగా వ్రాసిందట ప్రాక్టికల్స్ యెలా పోతాయో అని కంగారు పడింది. పెదబాబు ఏదో చెప్పాడు" అన్నారాయన.

"తనింటికి రాగానే పెళ్ళి చూపులు కానిచ్చేద్దాం అంకుల్" అన్నది.

"అలాగేనమ్మా" అతను లేచాడు, వెళ్ళటానికి.

"ఏమండీ లాయర్‌గారూ! మా రూపకు మంచి సంబంధం చూడు,

మారేజ్ చేద్దాం, ఐ సఫరింగ్ హార్ట్ అట్టాక్" అప్పుడే ఇంద్రప్ర
వచ్చింది.

ఆమెనం ఎగాదిగా చూచాడు. పట్టంచు ధోవతి కట్టింది. పైన లావ
ఉత్తరీయం వేసుకుంది ఎల్లిపాయంత వేలు ముడి వేసుకుంది.

"నాడిపస్ వంక చూస్తున్నారా; ఈ మాత్రం హంగు లేకపో
యెవరూ భయపడరు." అన్నది చేతిలో కర్ర అక్కడ పెట్టి.

అతను జాలిగా నవ్వాడు.

"రూపా:" ఆమె పిలుపుకురూప వచ్చింది.

"మన బావి కవులుకిచ్చాం కదూ:"

"అవును నాయనమ్మ ఇప్పుడేం జరిగింది?" అన్నది కంగ
రుగా. అది అమ్మారని తెలిస్తే ఆమె గుండె ఆగిపోతుంది.

"వెళ్ళి బ్రింజాల్స్ తెంపాలంటే ఫర్మిషన్ అంటాడు, బోడి పర్మి
షన్" అన్నది నిదానంగా.

"పోనీ? నేను వెంకన్నను పంపి తెప్పిస్తాను. అయినా వాళ్ళ దగ్గ
రకు నువ్వు వెళ్ళటం ఏమిటి?" అన్నది కాస్త కోపంగా.

"నిజమేనే ఆ చిన్నగతి వాళ్ళ దగ్గరకు వెళ్ళటం మనకే అవమా
నము" అన్నది దర్పంగా.

కేశరావును సాగనంపుతూ బయటికి వచ్చింది రూప.

"ఇదీ నాయినమ్మ వరస అంకుల్. ఆమె బయటికి అలా అనద
బల్లమీద ఒక్క కూర కనిపిస్తే బాధ ఆమెకు. మారుతున్న కాలాన్ని
అర్థం చేసుకునే నేర్పు ఉండాలి. ఆమె నుండి ఆశించటం అత్యాశే అవు
తుంది."

ఆమె భుజం తట్టాడు, ఓదార్పుగా.

"హరి అలా కనిపించాడుగాని చాలా మంచివాడమ్మా అతని సహ
క్షంలో అంతా సవ్యంగా జరుగుతుంది."

రూప ఉలిక్కి పడింది.



"హరి మీకేమయినా చెప్పాడా అంకుల్?" అడిగింది మెల్లగా.

"మీ నిర్ణయము చెప్పాడమ్మా చాలా సంతోషం. చిన్నప్పుడు రఘూ నేను అన్నా, తమ్ముడు అనే వరసలు లేకపోతే శర్మిష్ఠను పెద్ద బాబుకు చేసుకొనే వాడిని" అన్నారాయన.

"ఇప్పుడేమయింది అంకుల్ వాళ్ళు మంచివాళ్ళే అంటున్నారు కదా."

"అవును." అతను వెళ్ళిపోయాడు.

రూప మెల్లగా ఇంటిలోకివచ్చింది. తను "ఏమాశించి బడి పెట్టి హాస్పత్రికోసం ప్రయత్నం చేసింది. కాని దాన్ని సమూలంగా నేల గూల్చారు స్వార్థపరులు.

బడిలో కూడా మనసు లగ్నం చేయలేకపోయింది. ఆరాటంగా అటూ, ఇటు తిరిగింది.

ఆమె ఆశయం ఆదిలోనే త్రుంచివేయబడింది.

యెందు కిలా జరిగింది! యెందు కిలా జరిగింది. ప్రతి రోజూ ప్రతి నిత్యం ఇదే ఆలోచన

హరికృష్ణ బ్యాగు ఊపుతూ వచ్చి, గేటు తీసి, గేటు వేసినా బొమ్మలా వరండా మెట్లమీదున్న రూపాదేవి కదలలేదు. అతనలాగే చూస్తూ నిల్చున్నాడు

ప్రకృతి చాలా హాయిని గొల్పుతుంది.

వసంత ఋతువు ఆగమనాన్ని తెలుపుతూ కోయిల గానం చేస్తుంది. తదియ చంద్రుడు తన ప్రతాపం చూపి ప్రకృతి అందాల్ని బయట పెడతానన్నట్టు, పిండి వెన్నెల కురుస్తుంది.

చెక్కిట చేయి జేర్చి బాపు బొమ్మలా, లేత కొమ్మలా, ఆ గోపా లుడి కోసం యమునా తీరంలో యెదురుచూచే అమ్మలా కదలక కూర్చున్న ఆమె అందాన్ని మౌనంగా తిలకిస్తూ నిలబడిపోయాడు హరికృష్ణ

రోడ్డుమీద యెవరో అరుస్తూ వెడుతుంటే ఉలిక్కిపడ్డాడు హరి.

'ఈ రూప యెంత అమాయకురాలు అర్ధరాత్రి ఒంటరిగా ఇలా కూర్చుంటే యెంత ప్రమాదం' అనుకొని దగ్గరగా వెళ్ళాడు.

"రూపా!" ఆమె భుజం తట్టాడు.

"ఆఁ.....ఓ..... నువ్వా హరీ ? యెప్పుడొచ్చావ్ ?" అన్నది వాస్తవంలోకి వస్తూ.

"అరగంట అయిందేమో. నువ్వు గమనిస్తేనా ?"

"సారీ! నేను ఏదో ఊహిస్తున్నాను, ఆ స్వప్నలోకాలలో విహరిస్తున్నాను హరీ" అన్నది లేచి.

అతను కూర్చున్నాడు.

"నీ ఊహలేమిటో చెప్పే వరకు నేను ఇక్కడి నుండి కదలను గాక కదలను." అన్నాడు తెచ్చిపెట్టుకున్న హఠంతో.

"కొన్ని ఊహలు యెవరితో పంచుకోలేనివి హరీ."

"నాతో కూడానా ?" నిష్ఠూరంగా అడిగాడు.

ఆమె నవ్వి, వచ్చి అతని వెనుకాల మెట్టుపై కూర్చుంది. అతని భుజంపై తల ఆన్చింది.

"నువ్వు వెళ్ళిన పని ఏమయిందో చెప్పు ?"

"అవటానికి ఏముంది! మన ప్రభుత్వంలో పనులు అంత తొందరగా జరుగుతాయా! మామయ్య శంషాద్ వేయించే ప్రయత్నంలో ఉన్నారు. నా స్నేహితుడు అక్కడ ఏర్పాట్లు చేసానని వ్రాసాడు. కాని అంత డబ్బు మన దగ్గరలేదే." అన్నాడు.

"మామయ్యను అడగలేక పోయావా "? అంది

"ఆయనదగ్గర డబ్బుందనుకోను రూపా అప్పు తీసుకుగావాలి."

"మనలాంటి వారిని చూచే అన్నారుకాబోలు ఉండి దరిద్రం అని" అన్నది బాధగా.

"ఆ విషయం వదిలేయి. నీ ఊహాలోకం గురించి చెప్పు" అన్నాడు ముందుకు పడిన జడతీసుకుని మెలివేస్తూ.



"చెప్పక తప్పదా ?"

"నో ఛాన్స్...." అన్నాడు.

"ఈ ఇంటిలో మనిద్దరం, మనకిద్దరు పిల్లలు, వాళ్ళతో ఈ వెన్నెలలో దాగుడుమూతలు ఆడుతున్నామట. పాప ఉనికి నేను బాబుకు చెప్పానట. అంతే ఆ పాప నాపై విరుచుకుపడుతూ, 'నాన్నా! చూడండి అమ్మకు తమ్ముడంటే ఇష్టం' అని నీతో ఫిర్యాదు చేసిందట...."

"ఇంటరెస్టింగ్, అయితే నీకు మొదటే పాప కావాలన్నమాట" అన్నాడు.

"అలా యెదురు ప్రశ్నలు వెయ్యొద్దు. మొదటే పాపయితే మనం ముసలి వాళ్ళము కాకముందే తన వివాహం చేసాము. అప్పుడు నువ్వు పాప నెత్తుకొని "ఊర్కో పాపా! మరి నువ్వంటే నా కిష్టం కదా, అన్నావుట అప్పుడేమో బాబు గోలపెడుతూ అమ్మా! నాన్నగారికి అక్కంటేనే ఇష్టం! ఫిర్యాదు చేసాడట...."

"మైగాడ్! ఊహల్లోకూడా మమ్మీ డాడీ అనిపించవా పిల్లలచేత" అని నవ్వాడు.

"అమ్మా, నాన్నా, అనే పిలుపులోని తీయదనం ఏ మమ్మీ,డాడీలో లేదు హరి! అమ్మా, నాన్నా అని పిలువటానికి నోచుకొన లేని, నా బిడ్డల చేత పిలిపించుకోవాలని ఉంది...." అన్నది మైమరుపుగా.

"నేను ఓ రెండు సంవత్సరాలు ఫ్యామిలీ ప్లానింగ్...."

"ఉష్ నో ఛాన్స్ !" అన్నది రూప.

"ఒక్క ఏడాది...."

"నథింగ్ డూయింగ్," అన్నది దృఢంగా.

అతను కొద్దిగా తల తిప్పి రూప వంక చూచాడు. ఆ కళ్ళలోని ఆకర్షణ అతడిని పిచ్చివాడిని చేసింది. ఆమెను అలాగే యెత్తుకొని తన గదిలోకి తీసుకువెళ్దాం అనుకొని అనుచితమని అంతరాత్మ హెచ్చరించగా, మృదువుగా ఆమెను త్రోసి, చక, చక మేడపైకి వెళ్ళిపోయాడు.

ఆమె చకితురాలయినట్టు ఒక్క నిముషం చూచి, పిలువబోయి, అతనిలోని కలవరం గ్రహించినట్టే తల వంకించి, ఇంటిలోకి వెళ్ళి తలుపులు వేసుకొని, చిరునవ్వు పెదవులపై నాట్యం చేస్తుండగా నిదుర బోయింది.

## 13

"ఏయ్.... యెక్కడ చచ్చావ్‌రా వీరయ్యా?" నేలకు ఒక్క తన్ను తన్నాడు రాయలు.

"అయ్యా! ఛా తెస్తున్న" టీ కప్పుతో వచ్చాడు వీరయ్య.

"ఆ కమిలి యెక్కడ చచ్చింది?"

"దాని కండ్లు నెత్తికొచ్చాయి అయ్యా. అయ్యగారి కక్కులు ఉమ్ములు యెత్తిపోత్తానా అంటూ పోయిందయ్యా" అన్నాడు స్టూల్ జరిపి, దానిపై టీ పెట్టి.

"దానికి ఒల్లు బలిసింది. మళ్ళీ కాంపౌండులోకి రానియ్యొద్దు బంచత్" అన్నాడు టీ త్రాగుతూ.

"నమస్తే సర్ ...." అక్కడి ప్రయిమరీ స్కూల్ టీచర్ వచ్చాడు.

"ఏం లేదు సర్! జగదీష్ బాబుగారు లేరా?"

"యెందుకు లేరు దుక్కలా, దున్నపోతులా ఉన్నాడు. ఉంటే ఏమిటి?" అన్నాడు చిరాకుగా.

"అదే....అదే మనవి చేస్తున్నాను ఆ రూపాదేవి బడినుండి ఇరవై మంది పిల్లలను చేర్పుకొమ్మంటున్నాడు....."

"అతను చేర్చుకొమ్మంటే నన్ను అడగటం దేనికి? మీ బడిలో



కొలిఇంటే చేర్చుకోలేదంటే మానెయ్యి. ఊళ్ళో జరిగే ప్రతీ వెధవ పనికి నన్నే కారణం చేస్తారు" అతను కోపంగా స్టూల్ తన్నేసాడు.

వీరయ్య అదిరిపోయాడు. తనేం మాట్లాడినా ఇంకా రభస అవుతుందని చూస్తున్నాడు. "ఈయనకు జ్వరము వచ్చినప్పుడే ఈ జనాభాకు తీరుతుంది." అనుకున్నాడు.

"అదికాదండీ పిల్లల తల్లితండ్రులకు మా బడిలో చేర్పించటము అంతగా ఇష్టంలేదు" అన్నాడు.

"వాళ్ళూ నువ్వూ కట్టకట్టుకుపోయి కాముని చెర్లో దూకండి. ఆ హాస్పత్రి ఉంటే నాకేం, ఊడితే నాకేం! నేనే తీయించానని అందరూ నా యెదానపడి ఏడుస్తున్నారు" అన్నాడు కోపంగా. "మంచిదండి వస్తాను" అతను అతివినయంగా నమస్కరించి వెళ్ళిపోయాడు.

ఒంటరితనమంటే ఏమిటో అతనికి అర్థం అవుతుంది. ఇంకా ఏ గౌరవమో వీరయ్య ఉన్నాడు మనిషి ఆరోగ్యంగా తిరుగుతుంటే ఎవరు గుర్తురారు. కాని కష్టకాలంలో అందరూ కావాలనిపిస్తుంది. "వీరయ్యా! ఎవరినన్నా వంటకు కుదుర్చు నీ ప్రయోగాలతో నా ప్రాణాలు తీయకు" అన్నాడు కాస్త జాలిగా.

"అట్లనే అయ్య నేను మందుకు పోతున్న" అన్నాడు కర్ర సంచీ తీసుకుని వెళుతూ.

"ఛ....వాడు రాసేమందులు ఎన్ని మింగినా జ్వరం తగ్గదు. కడుపులో మంట తగ్గదు" అన్నాడు కోపంగా.

"అయ్య....మరి....సారా బాంది....తాగొద్దనె కదనండి" అన్నాడు.

"నోరుముయ్యి" నీవు నీతులు చెప్పేవాడివా అన్నట్టు మాట్లాడాడు. వీరయ్య వెళ్ళిపోయాడు.

అతను తల దగ్గరున్న పుస్తకం తీసి పది నిమిషాలు చదివాడు. అంతే కోపంగా విసిరి బయటకు వేసాడు.

"అరెరె....పుస్తకం ఏం పాపం చేసిందన్నా...." జగదీష్ వచ్చాడు అక్కడికి.

"పాపమా, పాపమున్నరా ! ఆదర్శ కుటుంబమట, భర్త శ్రీరామ చంద్రుడట అంతా హమ్‌బగ్" అన్నాడు కోపంగా.

"మీకంత కోపం దేనికి ?" అన్నాడు జగదీష్

"కాకపోతే ఏమిటి ? భార్య సలహా లేనిదే భర్త ఏపని చేయడట, పిల్లల భవిష్యత్తు గూర్చి భార్యాభర్తలు ప్రణాళికలు వేస్తారట మరీ ఇంత ఊహాలోకాలలో విహరిస్తారా ! నా చిన్నప్పుడు నాకు బాగా గుర్తు నాన్న తప్పతాగివచ్చి రోజు అమ్మను చావతిన్నేవాడు. వీళ్ళు రాసినట్లు అమ్మ ఎన్నడూ 'ఏమండీ ఈ దుర్వ్యసనము ఎందుకు ! మన పిల్లలు పాడవు తారు." అంటూ ప్రేమగా మాట్లాడలేదు. త్రాగి వస్తాడు. వీడి నోట్లో మన్నుపడ. వీడి చావుకబురయినా రాదు," అంటూ నన్ను పట్టుకుబాదేది మనచుట్టూ ప్రపంచం అట్లాగే చూస్తున్నాము" అన్నాడు కసిగా.

"అవునన్నా ! ఈ రాసేవారికేం పనిలేదు. బల్లముందు కూర్చుని ఊహించి రాస్తారు" అన్నాడు పుస్తకం బల్లమీద పెట్టాడు. తను అతని మంచం చివరగా కూర్చున్నాడు.

"అంతేనా? కాలేజివాళ్ళు ఏదో పెట్‌పార్టీ ఆరేంజ్ చేస్తే 'నాకు అలవాటులేదు.' అని తిరస్కరిస్తాడు. చెప్పరా జగదీష్ ఈ కాలములో బ్రాందీ, విస్కీ చూపిస్తే కాదనేది ఎవరు ?" నవ్వాడు రాయలు.

"బ్రాందీ, విస్కీ, భామ అను అన్నా."

"బాగా చెప్పావ్" అంటూనే కడుపు పట్టుకుని మెలికలు తిరిగి పోయాడు.

"అరె....ఏమయిందన్నా ?" అతను వచ్చి అతని భుజాలు పట్టుకున్నాడు.

"ఏమిటోరా కడుపులో నొప్పి" అన్నాడు బాధగా ముఖంపెట్టి.

"డాక్టరుకు చూపించలేదా ?" అన్నాడు.



"చూపానురా మందు మానేసి తానిచ్చిన మందు తీసుకొమ్మంటాడు....అబ్బా...." అన్నాడు దొర్లుతూ.

"ఇదీ విషయం మాట్లాడాలని వచ్చాను. నీకేమో ఒంట్లో బాగా లేదు. రేపు వస్తానే కాని ఆ రూపను అలా వదిలిపెట్టటం నాకేం బాగా లేదన్నా ! నీలాంటి వాడిపైకి చేయి యెత్తుతుంతా ?" అన్నాడు.

"ఒద్దూ ! ఆ విషయము నేను మరచిపోయాను. నువ్వు మళ్ళీ నాముందు యెత్తకు" అన్నాడు మూల్గుతూ.

"నువ్వూరుకున్నా నేనూరుకోనుగా! అయినా దీనికెందుకంత ఊరి విషయాలు ఎవడ్నో చేసుకుని వెళ్ళిపోక."

"చేసుకునేవాడు కనిపించవద్దూ !"

"అదీ నిజమే అందరూ అక్షరాలు నేర్చుకోగానే పెద్దమొనగాళ్ళయి పోయినట్లు మాట్లాడుతున్నారు."

"ఎవరువాళ్ళు ?"

"జీతగాళ్ళు, కూలీలు" అన్నాడు కసిగా.

"గర్వంగా మాట్లాడినోడు అడుక్కుతిని పోతాడులే .... అమ్మో అబ్బా...." మూల్గుతున్నాడు రాయలు.

జగదీష్ వెళ్ళిపోయాడు. అతను ఆలోచనలో పడ్డాడు. నిజంగా పుస్తకంలో ఊహించినంత మధురంగా ఉంటాయా సంసారాలు. అసంభవం. ఊహలవెంట పరుగెత్తడం అంత ఆరోగ్యకరం కాదేమో....

నొంది అయిపోయాక కాస్త నొప్పి తగ్గింది.

జీతగాడు వచ్చి అంతా శుభ్రం చేసాడు. జీతగాడు వెళ్ళిపోతుంటే వెనుకాలే వెళ్ళాడు తలుపేసుకుని పడుకుందామని వెళ్ళాడు వాడు తన కోసమని తెప్పించుకున్న బిస్కెట్లు, పండ్లు సగానికి, సగం పట్టుకు పోతున్నాడు.

పిలిచి నాల్గుతన్ని పంపించేద్దాం అనుకున్నాడు. కాని తన ఆరోగ్యం బాగాలేదు తను వాళ్ళపై ఆధారపడినవాడు. జీవితంలో మొదటిసారి రాజీ పడిపోయాడు రాయలు.

నిరక్తిగా నవ్వుకున్నాడు. తను కష్టపడి సంపాదిస్తే జీతగాళ్ళు ప
పడిపోతారు కాటోలు.

అతను భరించలేని ఆవేదనతో నిదురమాత్ర వేసుకుని తలుపులు
మూసుకుని పడుకున్నాడు.

## 14

హరికృష్ణ, రూపాదేవి ఒకరి ఎదురుగా ఒకరు కూర్చున్నా
అంతవరకేదో గంభీరంగా చర్చించారని అర్థం అవుతుంది చూపులు
అయిదు నిమిషాల తరువాత హరే మౌనము వదిలాడు.

"నువ్వు ఎన్నయినా చెప్పు రూపా! నీ దగ్గరున్న డబ్బుతో అమె
రికా వెళ్ళటం అసంభవం" అన్నాడు హరి.

"చూడు హరీ! అంతగా మొండిపట్టుదల కూడదు. ఏదొ
మనమంచికే అన్నారు పెద్దలు. శర్మిష్ఠ వివాహమే చేసుకుంటానం
ఆ డబ్బు నా దగ్గర ఉండేదికాదు నీకిచ్చేదాన్నికాదు" అన్నది.

"నిజమే రూపా! శర్మిష్ఠ మెడిసిన్‌లో చేరింది బోలెడు ఖ
ఉంటుంది" అన్నాడు, నచ్చచెప్పే ధోరణిలో.

రూప సూటిగా చూచింది, ఆమెకు శర్మిష్ఠ గుర్తుకు వచ్చిం
వేసవిలో పెళ్ళి చూపులు ఏర్పాటు చేస్తామంటే కాదు, కూడదు. తను డా
చదువాలని పట్టుబట్టింది.

"రూపా! ఈ కాలం పిల్లలతో ఇదే చిక్కు. డాక్టరీ చదుపట
అంత తేలికా! ఇంటర్ పాసయి, ఏంట్రెన్స్ వ్రాసి, అక్కడ పాసవ్వా
కదా, నువ్వో రెండు నెలలు ఓపికపట్టు" అన్నాడు కేశవరావు.

రూపకు అదే మంచిదనిపించింది.



కాని వాళ్ళ ఊహలను భంగంచేస్తూ శర్మిష్ఠ మెడిసిన్ సీటు
తెచ్చుకుంది.

"వరంగల్ చాలా దూరం శర్మీ!" అడ్డంకు చెప్పబోయింది.

"అక్కా! హైదరాబాద్ అయినా, వరంగల్ అయినా ఒక్కటే
మనకు హాస్టల్లో ఉంటాను" అన్నది. ఆమెకెంత నచ్చచెప్పినా వినలేదు.
మొండికేసింది. ఇక తప్పదని చేర్పించి వచ్చింది.

సీటు రాక దొనేషన్లు కట్టే ఈ రోజుల్లో సీటు వచ్చిన అమ్మాయిని
వద్దనటం నచ్చలేదు తన మనసుకు కూడా.

అప్పుడే హరికృష్ణకు స్నేహితుడు అక్కడ అన్ని ఏర్పాట్లు చేసా
నని ఉత్తరం వ్రాసాడు

అతను అనుకున్నట్టు రూపాదేవికి దగ్గరగా ట్రాన్స్‌ఫర్ కాలేదని
రిజైన్ ఇచ్చేసాడు

అతనికి ఖర్చులు తను ఇస్తాను అమెరికా వెళ్ళమంటుంది రూప.
ఈ ఆరు నెలలు కూర్చుని, కాని రాబడిలేక తింటే యెంత కరిగిపోయిందో
హరికృష్ణ యెరగనిది కాదు.

అందుకే వారించబోయాడు.

"చూడు హరీ! నీకు అక్కడ ఏదయినా జాబ్ దొరికితే మాకు
పంపుదువుగాని. మళ్ళ. మళ్ళ ఇలాంటి అవకాశంరాదు. ఆ డబ్బుపై
శర్మిష్ఠకెంత అధికారముందో నాకు అంతే అధికారం ఉంది" అన్నది
ఆఖరు అస్త్రంగా.

హరికృష్ణ అంగీకరించాడు.

రూప పసిపిల్లలా సంబరపడిపోయింది. ఆమె స్వయంగా వెళ్ళి
బట్టలుకొని తెచ్చింది. మూడువందల రూపాయలు పెట్టి వి. ఐ. పి.
సూట్‌కేసు కొన్నది.

"రూపా! నువ్వెంతో ఆలోచిస్తావనుకున్నాను. ఇంత మూర్ఖురాలివని తెలియదు." అన్నాడు హరి ఆ ఖర్చుచూచి.

హరీ! నీకు కొంటుంటే నాకు కలిగే ఆనందం వర్ణించరానిది. అవి భరించలేకపోతే అలాగే అనుకో." అన్నది ఉత్సాహంగా. అతను మరేం మాట్లాడలేక ఆమెచేయి మెత్తగా నొక్కాడు "రూపా...." అతని గొంతులోని మాట, ఆదరం, ఆరాధన అనే అనుభూతుల్లో చిక్కుకొని బయటికి రాలేదు.

అవును హరీ .... వారానికి ఓ ఉత్తరం రాయటం మరిచిపోతే నేనూరుకోను." అన్నది ఆజ్ఞాపిస్తున్నట్టు.

"నాకు ఆ మాత్రం తెలియదా హెడ్‌మిస్ట్రెస్‌గారూ" అన్నాడు అల్లరిగా.

"ఇంకో విషయం గుర్తుంచుకో, వారానికో ఉత్తరం నా నుండి నువ్వు ఆశించకూడదు" అన్నది.

"అదేం శిక్షట" అన్నాడు తమాషాగా.

"అది అంతే." అన్నది నవ్వుతూ.

ఇద్దరూ ఇల్లుచేరారు. ఆ రోజే కాస్త మత్తునుండి బయటపడిన ఇంద్రమ్మతో చెప్పాడు. తను అమెరికా వెడుతున్నట్టు.

"పాస్‌పోర్టు, గీసుపోర్టు దొరికిందా?" అన్నది. అమెరికా వెళ్ళటానికి ఏమేమి కావాలో తనకు తెలుసు అన్నట్టు.

"ఊరికే యెప్పుడో అప్లై చేసాను. పాస్‌పోర్టు వచ్చింది. వచ్చే ఆదివారం వెడుతున్నాను." అన్నాడు

"గుడ్డు ... గుడ్డు .... మనదేశంలో మంచివాళ్ళు బ్రతుకలేరు." అన్నది టీ త్రాగుతూ.

అతని కళ్ళు అప్రయత్నంగా చమర్చాయి. ఏమిటో ఈ అనుబంధాలు అనుకున్నాడు.



ఒక్కొక్క రోజు గడుస్తుంటే ఇద్దరి హృదయాలు బరువెక్కాయి. అందరూ శుక్రవారమే వచ్చి కేశవరావు ఇంటిలో దిగారు. యెంత సంతోషంగా ఉండాలన్నా రూప హృదయం బరువెక్కింది.

కేశవరావు ఆమెను గమనిస్తూనే ఉన్నాడు.

"రూపా! మీరిద్దరూ వివాహం చేసుకున్నాక వెడితే బావుండేదేమో." అన్నాడు.

"వద్దు అంకుల్, ఇంకా దగ్గరగా వచ్చి దూరంవెడితే భరించలేము." అన్నది దిగులుగా.

"ఇప్పుడు మాత్రం సంతోషంగా ఉన్నావా?" అన్నాడు.

"విచారంకాదు అంకుల్, నా స్థితి మీకు తెలుసు, అతి చిన్నవయసులోనే తల్లీతండ్రి పోయారు. ఆ లోటు తీర్చబోయిన బాబాయి, పిన్నిని ఊరివాళ్ళు పొట్టన పెట్టుకున్నారు. అత్యంత ప్రేమగా చూచినా, నాయనమ్మది ఉన్మాద స్థితి. స్నేహపూర్వకమైన హరికృష్ణ పరిచయం, అనురాగంగా మారిన పరిస్థితి తలుచుకుంటే బాధగాఉంది. ఆ స్నేహం దూరమవుతుందే అన్న దిగులు అంతకన్నా మరేంలేదు." అన్నది కళ్ళు తుడుచుకుని. ఇద్దరూ బయటి గదిలోకి వచ్చేసరికి, ఇంద్రమ్మ హరికి హితవు చెబుతుంది.

"ఆ దేశాలలో లవ్వులు, నవ్వులు యెక్కువంట, మా అమ్మాయికి కాబోయే హస్బెండ్ అని మరిచిపోకు.... అండర్‌స్టాండ్,"

"అంతా అండర్ స్టాండేనండీ," అన్నాడు అల్లరిగా.

"త్రాగుడు గీగుడు నో...." అన్నది దర్పంగా.

"త్రాగుడు ఎస్సేగాని గీగుడు నో అండి."

"ఏమిటి?" కోపంగా చూచింది.

"కాఫీ, టీ ఏం త్రాగొద్దా!" అన్నాడు కొంటెగా.

ఇంద్రమ్మ పకా పకా నవ్వింది. ఆమెనలా చాలా రోజుల తరువాత చూచింది.

"భలే జోకు చేస్తావోయ్ రిమెంబరు నేను ఉన్నానని "

"ష్యూర్ మేడమ్." అన్నాడు ఉత్సాహంగా.

"మ్యాడమ్ కాదోయ్ అమ్మమ్మ అను అమ్మమ్మ." అన్నది.

"అజ్ఞ!" అన్నాడు నాటకీయంగా.

అందరూ మరోసారి నవ్వారు. కేశవరావు చిన్నకొడుకు వెళ్ళి శర్మిష్ఠను పిలుచుకువచ్చాడు.

"అబ్బా! ఏమిటక్కా, నీ పిలుపు, ఒక్కరోజు పాఠాలుపోతే యెంత నష్టమో తెలుసా!" అన్నది శర్మిష్ఠ

"ఎంత శ్రద్ధేతల్లీ చదువుమీద! నా కిష్టంలేదు డాక్టరుగారికేమో నీకు చెప్పివెళ్ళాలని మహా ఉబలాటంగా ఉంది." అన్నది కళ్ళతో హరిని వెక్కిరిస్తూ.

"అవునవును మరి ఉండదూ!" అన్నాడు.

"రేపు ఆదివారమే కదే తల్లీ" అన్నది ఇంద్రమ్మ.

"అమ్మో! డాక్టరుగారు గట్టివారేనే. మా నాయనమ్మ బ్రెయిన్ సెంటర్ చేరుకుంది." అన్నది శర్మిష్ఠ.

"శర్మీ! నా బ్రెయిన్ మరమ్మత్తు చేద్దాం అనుకున్నావేమో ఆ అపార్చునిటీ నీకు లేదు." అన్నది ఇంద్రమ్మ.

"బ్రతికిపోయాను నాయనమ్మా." అన్నది బరువు దిగినట్టు.

"పోవే బడాయి! నా రూప తల్లి డాక్టరు కాకపోయినా అంతకంటే యెక్కువే సేవచేస్తుంది." అన్నది గర్వంగా.

"అక్కా! నీ జన్మ తరించిందే. దేవుడు నీకు మేలుచేయుగాక." అన్నది.



"వేషాలు యెక్కువయ్యాయి." రూపాదేవి చెయ్యి యెత్తింది.

"కొట్టకే అక్కా! నీ కళ్ళుపోతాయి. పిన్నిగారు ఒక్కర్తి వంట చేయలేక బాధ పడుతుంది. నేను వెళ్ళి సహాయం చేస్తాను" అన్నది శర్మిష్ఠ.

"అమ్మో! రేపు నేను ప్రయాణం చేయాలి" భయం నటించాడు హరికృష్ణ

శ్రీమనత వహించినా డాక్టరుగారూ! మీ ఆరోగ్యం నా దగ్గర ఇన్సూర్ చేయండి. క్షేమంగా ఉంచుతాను" అన్నది శర్మిష్ఠ.

"మీరు మాట్లాడుతుండండి, నేను వెళ్తాను" రూప వెళ్ళిపోయింది.

"ఉత్తరాలు వ్రాస్తారా డాక్టరుగారూ?"

"రాయమంటారా కాబోయే డాక్టరుగారూ!"

"నేను డాక్టరు కానని అపనమ్మకంగా ఉందా?"

"అంత కోపం యెందుకు? మీరు డాక్టరు అవుతారు, నాకు అసిస్టెంట్ అవుతారు సరా!"

"అబ్బా! యెంతాశ!" అన్నది.

"అత్యాశ కాదు." అని, నవ్వుతూ లేచాడు.

మరో అరగంట వాళ్ళు కబుర్లు చెప్పుకుంటుండగా, రూప భోజనాలకు పిలిచింది.

అందరూ భోజనాలకు కూర్చున్నారు. కేశవరావు భార్య ఫిర్యాదు చేసింది, రూప పనిచేయనీయటం లేదని.

"పోనీలేవే మన పెద్దకూతురనుకో. మన పిల్లలుతో పాటు మరో ఇద్దరు పిల్లలు అనుకుంటే పోలా!" అన్నాడు కేశవరావు.

"మీకేం మీరెన్నయినా చెబుతారు! ఇంత బుద్ధిమంతురాలయిన కూతుర్ని వదులుకోవాలంటే యెంత బాధ, అందుకే అనుబంధాలు పెంచుకోను." అన్నది పప్పు వడ్డిస్తూ.

రూప, హరి కళ్ళు కలుసుకున్నాయి. ఇద్దరి ముఖాలు చిరునవ్వుతో కాంతివంత మయ్యాయి.

"బావుంది, నీ గోల ఆడపిల్లలు అత్తవారింటికి పంపుకోమా ఏమిటి ?" అన్నారాయన.

మనిషి యెందుకు ఒంటరితనం, ఏకాంతం కోరుకుంటాడో అర్థం కాలేదు. అందరూ కలిసి కూర్చున్నా, మాట్లాడినా యెంత అందంగా ఉంది! తనూ, హరి, శర్మిష్ఠ, ఆమె కుంటుంబం ఏర్పడితే ఇలాగే గడుస్తుంది. మరో మూడేళ్ళు కళ్ళుమూసుకోవాలి అనుకుంది రూప.

మర్నాడు ఏర్‌ఫోర్ట్‌లో హరికి వీడుకోలు పలుకుతుంటే ఉప్పెనలా వచ్చిన దుఃఖాన్ని కప్పిపుచ్చటానికి బాత్‌రూమ్‌కు వెళ్ళింది. అతని! లోపల బాధగా ఉన్నా, నిబ్బరంగా నవ్వుతున్నాడు.

ఆమె కళ్ళు తుడుచుకుని బలవంతంగా నవ్వు ముఖానికి పులుము కుంది.

"బై రూపా !"

"బై ...." అన్నమాట ఆమె నోటినుండి పైకిరాలేదు. అతను వెళ్ళే విమానం లేచే వరకు బొమ్మలా నిలబడి పోయింది.

"రూపా ! పదమ్మా," కేశవరావు ఆమె భుజం తట్టాడు

అతని వెనకాల యాంత్రికంగా ఇంటికి వచ్చింది, ఆ సాయంత్రమే శర్మిష్ఠ వెళ్ళిపోయింది.

"ఓ నాలుగు రోజులుండ కూడదు రూపా ? నీ బడిలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది కదా" కేశవరావు అడిగాడు.

"ఇంత ఆప్యాయంగా ఉండమని అడిగే వాళ్ళెవరున్నారు అంకుల్! విద్యార్థులు తగ్గిపోవటంతో టీచర్లను తీసివేసాను. హెడ్‌మిస్ట్రెస్ కమ్ టీచర్ కమ్ క్లర్క్ అన్నీ నేనేను" అన్నది నవ్వేస్తూ.

"ఈ పల్లెల్లో పాలిటిక్స్ ప్రాణాలు తీస్తున్నాయి. వాడివాళ్ళ బాగో గులకని తెలియకపోతే యెట్లా ?" అన్నాడు.

"ఏ ఊరి నాయకుని పిల్లలు ఆ ఊళ్ళోనే చదువాలంటే అప్పుడ యినా, ఆ ఊరు బాగుపడాలని, బడులు బాగుపడాలని కోరుకుంటారు."



"మీ ఊరి పంచాయతీ మెంబరు సత్యానికి వివాహమే లేదు. ఇక పిల్లలగురించి ఏమాలోచిస్తాడు ?" అన్నారాయన.

"అదీ నిజమే!" అన్నాది రూప.

మర్నాడుదయము బస్సులో నాయనమ్మను తీసుకుని ప్రయాణం అయ్యింది రూపాదేవి.

## 15

రూపాదేవికి చెప్పలేని ఆనందంగా ఉంది. ఏ దేవుడు పంపిన వరమో చెరువు క్రింద నాలుగెకరాల పొలం ఆమెకు స్వాధీనమయింది. అది కౌలుకుచేస్తున్న గొండ్ల లచ్చన్న ఒంటరివాడు. అతను చనిపోతూ అది వదిలిపోయాడు. ఈ సంవత్సరంలో శర్మిష్ఠ ఫీజులకు, ఇంద్రమ్మ మందులకు బోలెడు డబ్బు ఖర్చయింది. ఒక్క సంవత్సరమే గడిచింది. ముందు యెలా ?

ఇల్లుకూడా గడవడం కష్టంగా ఉంది.

హరికృష్ణ ఇంకా చదువుతున్నాడు అతను డబ్బుపంపే స్థితిలో లేడు పారుడు నీళ్ళు, ఈ పొలం కౌలుకిచ్చినా, తాము చేయించినా నష్టం లేదు.

ఆమె ఆనందం అట్టేకాలం నిలువలేదు. ఆ రోజు సాయంత్రం జగదీష్, పొలం కొన్నతను వచ్చారు.

ఇల్లు స్వాధీం యెప్పుడు చేస్తావ్ ?" దురుసుగా అడిగాడు.

"జగదీష్ ! నువ్వు వేసిన వలలో తేలికగా ఇరుక్కున్నాను. పిల్ళ్ళ చదువనీకుండా సంతకం పెట్టటం నా తప్పు, అంగీకరిస్తున్నాను మరి కొంత సమయం ఇవ్వు" అన్నది అటూ, ఇటూ చూస్తూ దిక్కుతోచనట్టు. ఈ విషయం నాయనమ్మకు తెలియకూడదని.

"వలలో ఇరుక్కున్నావు, వల కొరుక్కోవటం అంత తేలికకాదు రూపాదేవిగారూ ! మేము ఇల్లు స్వాధీనం చేసుకుంటాము" అన్నాడు కరుకుగా.

"జగదీష్! మీకు మేము చేసిన అపకారం ఏమిటో అర్థం కావట లేదు. యెందుకీ పగ?" అన్నది ఆవేదనగా.

"రూపా! నెరజాణను అనుకుని మాట్లాడకు. నువ్వు వ్రాసిచ్చింది అసల్లో పెట్టమని అడుగుతున్నాము, కాదు, కూడదు అంటే అద్దె ఇవ్వు" అన్నాడు దయచూపినట్టు.

"ఏమిటి? నేను అద్దె ఇవ్వాలా!" కోపంతో బుసకొట్టింది రూప

"ఏమిటి రూపా! వ్హాట్ ఇట్...." ఇంద్రమ్మ వచ్చింది.

"ఓ టైగర్ ఇంద్రమ్మగారా! రండి! రండి మీరయినా మనవరాలి బుద్ధి చెప్పండి." అన్నాడు జగదీష్ కవ్వింపుగా.

"షటప్! నా మనవరాలు ఏం చేసిందని బుద్ధి చెబుతాను. అది బంగారంరా....గోల్డ్ అండర్‌స్టాండ్" ఆమె చేతికర్ర తీసుకువచ్చింది.

"చాల్లెమ్మా! నీకేమో పిచ్చి. ఇల్లు గడవక, ఇల్లు పొలాలు అన్నీ అమ్ముకుని ఇల్లు స్వాధీనం చెయ్యమంటే కొడతాననటం మీకే తగింది ఇదిగో కాగితం...." జగదీష్‌తో వచ్చినాయన చూపాడు.

ఇంద్రమ్మ కాగితాలు తీసుకుంది ఆమెకు ఇంగ్లీషురాదు, తన ముందు రూప అబద్ధం చెప్పదని తెలుసు

"ఏమిటి రూపా ఇది నిజమేనా? ఈ ఇల్లు.... ఈ ఇల్లు అమ్మావా?" అపనమ్మకంగా అడిగింది.

రూపకు తెలుసు ఆ నిజం, నాయనమ్మ భరించలేదని. అందుకే తటపటాయించింది.

మౌనము అర్థాంగీకారంగా తీసుకుంది ఇంద్రమ్మ

"ఏమిటే.... నా ఇల్లు.... నా ఇల్లు అమ్మావా! మనకు ఇల్లు అమ్మే హీనస్థితి వచ్చిందా!.... మాట్లాడవేమే.... ఇల్లమ్మే అధికారం యెవరిచ్చారు నీకు! ఒరేయ్ గాడిద కొడుకుల్లారా నేను అమ్మితేనే చెల్లుతుందిరా. వెళ్ళి దావా వెయ్యండిరా. దావా హైకోర్టుకయినా సరేరా. నడవండి నా ఇంటి ముందునుండి .... ఆమె విసిరివేసిన వస్తువులతో ఆ ప్రదేశమంతా రణరంగంగా మారిపోయింది.



"ఏమిటయ్యా ఈ గోల! ఆ దయ్యాలకొంప యెవడికి కావాలి పద...." ఒకతను తిరిగి చూడక పరుగులంకించుకున్నాడు. శివమెత్తినట్లు పరుగెత్తుతున్న ఇంద్రమ్మను రూప, వెంకన్న బలవంతంగా ఆపారు.

"నాయనమ్మా.... పొరపాటు నాది. మనకు గడవక అమ్మాను. నా మాట విను ..." బలవంతంగా ఆమెను తీసుకెళ్ళింది.

"నా తల్లీ .. రూపా! చివరికెంత గతి పట్టిందే...." ఆమె ఆయాస పడిపోయింది.

"నాయనమ్మా! నువ్వేకదా చెబుతావు. నిమ్నోన్నతాలుంటేనే జీవితం అని, మనకు మంచి రోజులు వస్తాయి. అటు హరి, ఇటు శర్మిష్ఠ పెద్ద చదువులు చదువుతున్నారు"అని ఎంతో నచ్చచెప్పి మాత్ర ఇచ్చింది.

ఆమె తలాడించింది, మౌనంగా ఏడ్చింది. అరగంట తరువాత విపరీతంగా ఆయాస పడిపోయింది, ఆమెకు కాళ్ళు చేతులు ఆడలేదు. ఊళ్ళో వారంతా కలిసి ఆమె చేసిన ప్రయత్నం నాశనము చేసి, అత్యవసర పరిస్థితిలో డాక్టర్‌ను లేకుండా చేసారు.

రూప వెంకన్నను శంషాబాద్‌కు పంపింది.

వెంకన్న రాకముందే ఈ లోకముతో ఐహిక బంధాలన్నీ త్రెంచుకుని వెళ్ళిపోయింది ఇంద్రమ్మ.

రూపకు అది గ్రహించటానికి పది నిమిషాలు పట్టింది.

"నాయనమ్మ...." అని ఒక్క గావుకేక పెట్టింది. కట్టెలా పడి వున్న ఇంద్రమ్మ ఆ కేకకు మేలుకుంటుందా?

రూప ఆమె శవంపై పడి దొర్లి, దొర్లి ఏడ్చింది. అంత పెద్ద ఇంటిలో శవంతోపాటు ఒక్కతే ఉన్నదన్న సంగతి మరిచిపోయింది.

"నాయనమ్మా! ఎంత కోపం వచ్చినా నన్ను ఒంటరిదాన్ని చేసి వెడతావా! నన్నెలా బ్రతుకమన్నావు?" ఎంతసేపు అలా ఏడ్చిందో ఆమెకు తెలియదు. ఆమె ఏడుపు గేటు దాటి ఎవరికి వినిపించలేదు.

మూడు గంటలకు డాక్టర్‌తో వచ్చిన వెంకన్న తెల్లబోయి అందరిని పిలిచాడు.

శర్మిష్ట కోసం మర్నాటి వరకుంచారు ఇంద్రమ్మ శవం. కేశవ రావు భార్యను తీసుకుని దక్షిణాది యాత్రలకు వెళ్ళాడు రూపాదేవికి మిగిలిన ఆప్తుడు, స్నేహితుడు, బంధువు ఒక్క వెంకన్న మాత్రమే.

అతని సహాయముతో నాయనమ్మ అంత్యక్రియలు జరిపింది. ఇంద్రమ్మ చితికి నిప్పు పెట్టబోతుండగా, ఇంద్రమ్మ మామ, మారుటి తమ్ముడి, మనవడట ముందుకు వచ్చాడు.

"మేము దాయాదులముండగా ఆడపిల్ల కర్మ చేస్తుందా?" అన్నాడు.

అతన్ని రూప ఎన్నడూ చూడలేదు.

"మా పెద్దమ్మ ఆత్మ శాంతించాలంటే నేనే కర్మ చేయాలి!" అన్నాడు.

అతను ప్రక్క ఊరు గోల్కొండలో ఉంటే జగదీష్ పిలిపించాడని అందరూ గుస, గుసలు పోయారు.

రూప అతని మాటలు లెక్కచెయనట్టు ఇంద్రమ్మ చితికి నిప్పు అంటించింది.

"ఇల్లు అలుకగానే పండుగకాదు చూస్తాం ఎలా ఉంటుందో ఆ సీ అంతా మాకే చెందాలి" అంటూ సవాలు చేసాడు అతను. అతని పేరు యాదగిరి అట.

రూపాదేవికి ఇంద్రమ్మ చితి దగ్గర తగవు పడటము ఇష్టంలేక అందుకే మౌనంగా వచ్చేసింది.

"ఎంత పొగరు చూస్తాము" అన్నారు వాళ్ళు అంతా.

స్నానాలు చేసి కూర్చున్న ఆ ఇంటిలో, ఇద్దరే మిగిలిపోయారు. ఇంద్రమ్మ ఒక్కర్తే యెందరి పెట్టు ఉండేది. ఇల్లంతా బావురుమంటూ భయంకరంగా కనిపించింది. ఒకరిద్దరి విద్యార్థుల తల్లి తండ్రులు ఉపహారం, టీ తెచ్చారు సానుభూతితో మాట్లాడారు రూపవాళ్ళకు ధన్యవాదాలు చెప్పి పంపింది.



వాళ్ళకున్న బంధువు వెంకన్న మాత్రమే. అతనే వండి పెడుతున్నాడు.

ఇంటిలోకి వెళ్ళాలంటే భయంగా ఉంది.

బావురుమన్నట్టున్న ఆ ఇంటిలో ఉండలేక అక్కా, చెల్లెండ్లు వరండాలోనే ఉంటున్నారు.

"శర్మీ! నువ్వు వెళ్ళవే కాలేజి మిస్ అవుతున్నావు" అన్నది.

వరండాలో పీటమీద బోర్లాపడుకున్న శర్మిష్ట తలెత్తి చూచింది.

"నువ్వు నన్నేమనుకుంటున్నావే," లేచి కూర్చుంది.

"నిన్నీ స్థితిలో వదిలివెళతానా! పదవరోజు వరకయినా కేశవరావ్ అంకుల్ వస్తాడేమో చూద్దాం" అన్నది.

శర్మిష్ట వెళ్ళిపోతే తాను ఒంటరిగా ఉండగలదా! ఏ మూలచూచినా ఇంద్రమ్మ తిరిగినట్టే ఉంటుంది. ఇన్ని రోజులున్నా, ఇంద్రమ్మ కొండంత అండగా అనిపించేది. ఇప్పుడు మృత్యువు వెంటాడుతున్నట్టు అనిపిస్తుంది,

అయిదవ రోజు అస్తికల కోసమని స్మశానానికి వెడితే అప్పటికే అక్కడ 'కర్మ' చేయిస్తున్నాడు యాదగిరి, వెంట జగదీష్ బృందము ఉంది. రూపాదేవికి ఏం పాలుపోలేదు.

ఆ ఊళ్ళో న్యాయము అడగాలంటే రాయలు తప్ప మరో మనిషి లేడు. అతడిని వెళ్ళి న్యాయం అడగటం కంటే ఆత్మను చంపుకోవటమే అవుతుంది.

బావి దగ్గర స్నానం చేసి ఇద్దరూ ఇంటికి వచ్చారు.

"అక్కా! వీళ్ళను యెదిరించి మన కోసం నిలబడే మనిషే లేదా? ఇక నువ్వీ ఊళ్ళో ఒక్క నిముషం ఉండొద్దు, మనము వరంగల్లు వెళ్ళి పోదాము!" అన్నది శర్మిష్ట.

రూపాదేవి మౌనము వహించింది.

ఆమె తల ఆర్పుకుంటుంటే, వెండితీగలా తెల్లవెంట్రుక మెరిసింది. ఆమెకు నవ్వు వచ్చింది ఈ అయిదు రోజులలోనే తెల్లవెంట్రుకలు వచ్చి ఉంటాయి అనుకుంది.

వెంకన్న చేత అన్నం వండించి బిక్షగాళ్ళకు, అక్కడే రాయి కొడుతున్న వడ్డివాళ్ళకు అన్నదానము చేయించింది.

"కేశవరావు అంకుల్ వస్తే బావుండును" అనుకుంది పదే, పదే, ఆమె గట్టునపడ్డ చేపలా గిల, గిలలాడుతుండగానే, పదవరోజు వచ్చింది.

పెద్ద కర్మ యాదగిరి అర్భాటంగా చేసాడు. ఆ రోజు ఊరివారిని భోజనానికి పిలిచాడు అందరికి తమాషాగా ఉంది

"మరీ నోరున్న వాడిది ఊరన్నట్టుందమ్మా. వీడికేం పొయ్యే కాలం. తను చేస్తున్నాడు కర్మ. కొడుకులుపోయి ముసలమ్మ ఏడుస్తుంటే ఒక్కనాడైనా వచ్చారా" అన్నారు కొందరు దయగల తల్లులు రూప మళ్ళీ బీదలకే నాయనమ్మ పేరట అన్నదానం చేసి ఊరుకుంది తనిప్ప దేం చేయలేదు.

కాలం కలిసి రాకపోతే రాముడంతటివాడు అరణ్యవాసం చేసాడు అదే కాలం కొండంత అండగల పాండవులను కాటేసింది. తనూ అంతే.

సాయంత్రం వెంకన్న పిడుగులాంటి వార్త తెచ్చాడు.

"అమ్మా! రూపమ్మా, మన చెఱువు క్రింది పొలంలో యాదగిరి, అతని అనుచరులు నాగళ్లు కడుతున్నారు" అన్నాడు.

"నిజమా వెంకన్నా ?" ఆమె తెల్లబోయింది.

"నిజమేనమ్మా, నేను వెళ్ళి ఏమిటంటే 'దయామలం' మాకు దక్కాలి పొలం. దమ్ములుంటె మీ అమ్మగార్ని కోర్టుకెళ్ళమను' అన్నారు" అన్నాడు అదుర్దాగా.

"ఏం చేద్దాం వెంకన్నా ?" ఆమె కంగారుగా అడిగింది అప్పుడే శర్మిష్ఠ వచ్చింది.

"ఏమిటక్కా ?"

"ఏం లేదే. ఈసారి వర్షం బాగా పడితే మన చెరువు క్రింద పొలం సాగు చేయాలనుకుంటున్నాము. అవునూ నీ సర్దుడంతా అయిపోయిందా" అన్నది కళ్ళతోనే వెంకన్నను వారిస్తూ.



"రెండు పుస్తకాలు కనిపించటంలేదు. పైన చూస్తాను" అని పైకి వెళ్ళింది.

"దానికి ఏ మాత్రం అనుమానం వచ్చినా చదువు మానేస్తుంది వెంకన్నా ఏం చెప్పకు. రేపు బస్సుకు తను వెళ్ళాక, విషయం ఏమిటో జగదీష్‌ను వెళ్ళి కలుసుకుంటాను" అన్నది.

"ఏంటోనమ్మా ! బ్రహ్మంగారు చెప్పినకాలం వస్తుంది. వీళ్ళకేం పొయ్యేకాలం వచ్చిందో నిట్టూర్చాడు వెంకన్న.

శర్మిష్ఠ పుస్తకాలు తీసుకుని వచ్చింది. అవి బ్యాగ్‌లో సర్దుకుంది.

"ఒంటరిగా ఎలా ఉంటావక్కా ? నాకయితే వెళ్ళాలని లేదు "

"శమ్మిమ్మ ! నేను నేనా ! నువ్వెళ్ళి హాయిగా చదువుకో తల్లీ" అన్నాడు వెంకన్న.

శర్మిష్ఠకు ఆ వాతావరణం నుండి బయట పడాలని ఉంది. కేశవరావు చెబితేగాని రూప వినదని తెలుసు. అందుకే మర్నాడు ఉదయము బస్సుకే వెళ్ళిపోయింది.

రూపాదేవి తేలికగా నిట్టూర్చింది. వెంకన్నను తీసుకుని రెండు న్నర మైళ్ళు నడిచి చెరువు దగ్గరకు వెళ్ళిందామె. ఒకటి రెండు వర్షాలు పడ్డా, ఇంకా ఎండ పెట, పెట మంటుంది.

"చెరువు నిండనిదే దున్ని ఏం చేస్తారు వెంకన్నా ?"

"మీ మీద పంతము తల్లీ, అంతకంటే మరేంలేదు" అన్నాడు. వాళ్ళు వెళ్ళేసరికి పది నాగళ్ళు ఉన్నాయి.

"ఒహో ! కథానాయకురాలు వస్తుంది" జగదీష్ వెక్కిరించాడు.

"జగదీష్ ! ఈ పొలం దున్నినా, ఇల్లు స్వాధీనము చేసుకున్న నువ్వు మాత్రము కథానాయకుడవు కావు" అన్నది రోషంగా.

"ఏం విలన్‌లా కనిపిస్తున్నానా ?" అన్నాడు ఎగతాళిగా.

"కాదు విలన్ తాతలా కనిపిస్తున్నావ్. నీకు మా ఉసురు కొట్టి, కుళ్ళి, కుళ్ళి ఏడుస్తావ్. మా నాయనమ్మను చంపిన హంతకుడవు."

"భేష్! చాముండీ అభియోగం! కుటుంబ సభ్యులనంతా చంపించిన వారు ఊర్లో ఊరేగుతుంటే, మేము అలుసుగా కనిపిస్తున్నామా? ఏదో యాదగిరి రమ్మంటే వచ్చాను" అన్నాడు అమాయకంగా గొంతు మార్చి.

"ఏమిటిది? మీరంతా వచ్చి నాగళ్లు కడతారా? మేము మిమ్మల్ని ఏమన్నాము? ఈ యాదగిరి ఈ రోజు వారసుడిని అంటున్నాడు. మీరు అంగీకరిస్తున్నారు. మా వాళ్ళంతా పోయి దిక్కులేని పక్షుల్లా అల్లాడి నప్పుడు ఎక్కడికి పోయాడీ వారసుడు? నాయనమ్మకేం సేవ చేసాడని?" అందరిని అడిగింది.

"మాకేం తెలుసు? మేము కూలివాళ్ళము, మీరు కూలిచ్చినా వస్తాము" ఒకతను జవాబు ఇచ్చాడు.

"ఆడపిల్లలు బాబూ. వాళ్ళేమంటున్నారు? ఇప్పుడు వాళ్ళకు మిగిలిన ఆధారము ఆ పొలము మాత్రమే" వెంకన్నకూడా బ్రతిమాలుతున్నట్లు అడిగాడు.

"మాదే ముందయ్యా. వాళ్లు రమ్మంటే వచ్చాము" అన్నాడు మరొకతను. నాగలి విడిచి పోవటానికి సిద్ధపడుతూ.

"ఏరా అప్పుడే మరిచిపోయావూ? కంచే మేసిందని పశువులను బంజరి దొడ్లో తోలి, నిన్ను కొట్టిన ఆ ఇంద్రమ్మ ప్రతాపము!" అన్నాడు జగదీష్.

"పోనీయ్యవయ్యా, ఎవరి పాపాన వాళ్ళే పోతారు" అన్నాడు అతను

"ఛ....ఛ మీరంతా ఆడంగి వాళ్ళనే ఆవిడో టైగర్ అయిందిరా" జగదీష్ ఎగద్రోసాడు.

"నీ పొలంలో పశువులు పడితే వదిలేస్తావా?" రూపాదేవి అడిగింది, కోపాన్ని దిగమింగి.

"మహారాజులా వదిలివేస్తాను" అన్నాడు నిర్లక్ష్యంగా.

ఆమె వెళ్ళి నాగళ్ళ ముందు నిల్చుంది.



"పోనియ్యండి. నాపైనుండి పోనివ్వండి...." అన్నది, వాళ్ళు ముఖ ముఖాల చూచుకున్నారు.

"ఈ తగాదా ఏమిటో తేల్చుకుని, మరీ పనికి పిలువండి" మాకెందుకన్నట్లు మరో నల్గురు వెళ్ళిపోయారు.

"నీ జాణతనంతో వాళ్ళను పంపేసావ్. దినమంతా కాపలా ఉంటావా?" తీక్షణంగా అడిగాడు యాదగిరి.

"ఈ ఊళ్ళో ఎలా ఉంటుందో చూస్తాను" అన్నాడు జగదీష్.

ఒక్కనాటి గండంగడిచిందని ఇంటికి వచ్చింది రూప. ఆమె వచ్చే సరికి హరికృష్ణ ఉత్తరము ఉంది.

ఆమె ఉదయము నుంచి పడిన శ్రమంతా మరిచిపోయింది.

ఆమె మానస వీణ తీయగా మ్రోగింది.

ఆమె ఆనందముతో ఉత్తరము విప్పింది.

డియర్ రూపా!

నీ ఉత్తరము రాక చాలా రోజులు అయింది. ఎంత పని ఉన్నా, నాకు ఉత్తరం వ్రాయటంకన్నా ముఖ్యమయిన పని ఉంటుందనుకోను. ఉన్నా అవతల పెట్టవోయ్! ప్రతి క్షణం, ప్రతి నిముషం నువ్వే గుర్తుకు వస్తావ్. ఇంకొక్క సంవత్సరము అయితే నాకు ఉద్యోగము వస్తుంది. అప్పటివరకు నీకు స్ట్రగుల్ తప్పదు. నేను ఉత్తరాలు వ్రాయటములో చాలా బద్ధకస్తుడని. నేను చిన్నగా వ్రాసానని నువ్వు అంతే గాయ కూడదు. హెడ్ మిస్ట్రెస్‌గారూ! కొర, కొర చూడకు మరి. చేయి చాపనా. మీ శర్మిష్ఠగార్ని అడిగానని చెప్పు. వెంకన్నను, నాయనమ్మను మరీ, మరీ అడిగానని చెప్పు....

"ఆ తరువాత చదువలేను అన్నట్లు రెండు చేతుల్లో ముఖము దాచుకుందామె. పది నిమిషాలు అలాగే ఈ లోకము మైమరచి పోయింది.

"రూపమ్మా....రూపమ్మా" వెంకన్న పిలిచాడు.

ఆమె తల ఎత్తింది. ఆమె కళ్ళనిండుగా నీళ్ళున్నాయి.

"ఏమందమ్మా ! హరిబాబు క్షేమముగా ఉన్నారా ?"

"అయన బాగానే ఉన్నారు. నాయనమ్మకు నమస్సులంటే," మరో సారి వెక్కి, వెక్కి ఏడ్చింది.

"ఊర్కోమ్మా.... ఊర్కో...." తల నిమిరాడు.

"వెంకన్న ! శ షాబాద్ వెళ్ళి హరికి టెలిగ్రాంమిచ్చిరా. నాయనమ్మ పోయిన సంగతి తెలుపనే లేదు" అన్నది కళ్ళు ఒత్తుకుని.

ఆట్లాగే తల్లీ"

ఒంటరిది, ఆడపిల్ల, అన్నీ మరచి పోతుంది. రాబందువుల్లో చిక్కిన రామచిలుకలా ఉంది ఆమె పరిస్థితి.

అలాగే చాలా సేపు కూర్చుంది, వెంకన్న వెళ్ళిపోయాక ఆ ఉత్తరము తీసి హృదయానికి తాకించుకుంది.

"హరీ.... హరీ... అంటూ ఆమె అణువణువు రోదన చేయటము మొదలు పెట్టింది. ఆ క్షణములో తోడు కోసము తల్లడిల్లింది.

"హరీ ; దిన దిన గండముగా ఉంది ఈ జీవితము. ఇంకా ఒక్క సంవత్సరము వేచి చూడాలా ?" అనుకుంది కళ్ళు మూసుకుని. ఆమెకు హరి తలుపులు అట్టే సేపు నిలువలేదు మళ్ళీ వాస్తవములోకి వచ్చింది.

## 16

"ఇంతలో ఇంద్రమ్మకు ముంచుకు వస్తుందని ఊహించనయినా లేదమ్మా," కేశవరావు తన హృదయంలో తల దాచుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్న రూపాదేవిని ఓదార్చాడు.

"ముంచుకురాలేదు అంకుల్ బలవంతంగా చంపారు ఆ రోజు వాళ్ళు అలా అల్లరి పెట్టకపోతే నాయనమ్మ బ్రతికేది" అన్నది వెక్కుతూ.



"ఆమెకు ఆయుష్షు తీరింది కాబట్టే వాళ్ళకా బుద్ధి పుట్టింది" తల నిమిరి ఓదార్చాడు.

"ఏమిటో అంకుల్, ఆమె మరణించినట్టు అనిపించటంలేదు. ఈ ఇంట్లో మా చుట్టే తిరుగుతుందనిపిస్తుంది" అన్నది అతనికి దూరం జరిగి.

ఈ రోజు హృదయభారం తీరినట్టుంది ఆమెకు.

"మేము అనుకోకుండా పాండిచరీలో ఉండిపోవలసి వచ్చింది. అక్కడనుండి రాద్దామనుకున్నాను యేన్నాళ్ళంటామో తెలియదుకదా" అన్నాడు.

"అంకుల్ ! ఈ పొలాల విషయాలు ఏంచేయాలో తోచటం లేదు. శర్మ చదువు అవుతుందా అని భయంగా ఉంది" అన్నది.

"నువ్వేం దిగులు పడకు. నేను వెళ్ళి ఆ రాయలుతో మాట్లాడు తాను. అతనంటే అందరికి హడల్ అట. అతని మాట తీసివేయరను కుంటాను" అన్నాడు అతను.

ఇద్దరూ కష్ట, సుఖాలు చర్చించుకుంటూ చాలా సేపు కూర్చున్నారు. వెంకన్న భోజనం వడ్డించేసాడు.

"ఈ రోజు అమ్మాయిగారు కడుపునిండా అన్నం తిన్నది" అన్నాడు.

"ఇకనుండి నీ సమస్యలు నాకు వదిలివేసి హాయిగా ఉండమ్మా" అన్నాడు వక్క నోట్లో వేసుకుని.

"అంకుల్ ! ఈ ఊళ్ళో వ్యవసాయం చేయటం అసంభవము, అమ్మే ఏర్పాటు చేయి" అన్నది.

"అలాగే చేద్దాం" అన్నారాయన.

మధ్యాహ్నము విశ్రాంతి తీసుకుని ఊళ్ళోకి వెళ్ళాడు. ఊరివారి నాగరికత చూస్తే నవ్వు వస్తుంది.

వేషం మారింది, భాష మారింది కాని దృక్పథం మారలేదు.

ప్రతివాడు టెరిలిన్ ప్యాంటు వేస్తాడు.

ప్రతి వ్యక్తి 'టీ' 'కాఫీ' లకు అలవాటు పడ్డాడు.

ప్రతివాడు వచ్చినా రాకపోయినా ఇష్టం వచ్చినట్టు ఇంగ్లీషు పదాలు వాడుతాడు

ఇన్‌సల్ట్ అంటారు. మీల్స్ చేస్తున్నాము అంటారు. 'మమ్మీ! డాడీ' అని పిల్లలచేత పిలిపించుకుంటారు.

ప్రతి ఇంట్లో జాజి చెక్కదో, టేకు కర్రదో భోజనాల బల్ల ఒకటి ఉంటుంది. అవన్నీ బాగానే ఉన్నాయిగాని ఇంట్లోనుండి వీధిలోకి చెత్త చెదారం విసరటంలో మార్పురాలేదు. ఇంకా అదే పాత పద్ధతి ఇంటిచుట్టూ దుర్వాసన వెదజల్లుతూ తిరిగే మురికి కాలువ. పేడ, 'పిల్లల దొడ్డి' నానా గలీజుగా ఉంటుంది.

రాయలు ఇల్లు కాసయెత్తున, మురికిఓడుతూ లేదు. ఇంద్రమ్మ బంగళా తరువాత చెప్పుకో తగ్గది ఆయనదే. అతని అరుగునిండా ఆశ్రిత జనులున్నారు. ఓ ఇరవై ఏళ్ళ యువకుడిని జుట్టుపట్టి అటు, ఇటు కదిలిస్తున్నాడు.

"ఏరా నీకు నా పనులు ఆక్షేపించే ధైర్యము వచ్చిందా! దొంగ రాస్కెల్.... యెరువులు నా పొలంలో చల్లుకుంటాను నా కిష్టమైనవారి కిస్తాను. నువ్వారా ఆక్షేపించేవాడివి" అంటున్నాడు కోపంగా.

"వదిలెయ్యండి బాంచను. ఏదో తెలువకన్నడు" ఓ ముసలమ్మ ప్రాధేయపడింది.

ఊం! వెళ్ళు చూడు మంగీ నీ కొడుకు ఆ టైగర్ రూపమ్మ బడిలో చదువుతున్నాడేమో! ఆ తెలివితేటలు నా దగ్గర చూపొద్దని చెప్పు" అని దూరంగా నెట్టాడు.

"అయ్యా! తవరికి ఈల్లు సదుకోవటం ఇట్టంలేదని తెల్సి మాన్పించిన దొర!" అన్నది ఆ అమాయకురాలు.

వాళ్ళు వెళ్ళిపోయారు.

"ఊర్లో ఒక్క పైసా అప్పుకావాలన్నా వచ్చేది నా దగ్గరకే" అన్నాడు సగర్వంగా. నాకు కొట్టేహక్కు ఉంది అన్న ధోరణిలో.

"అవునండీ. వెధవలు వీళ్ళ పొగరు మీరే అణచాలి" ఒంతకను లెగడులో నెయ్యి పోస్తున్నాడు మాటలతో.



"వకీలేమో! మన రాయలు కాళ్ళు పట్టుకుంటానని వచ్చాడేం?"

"మరి ఆడపిల్ల దగ్గరేముంది, ఫీజులేనిది ఏం చేస్తాడు పాపం మరొకరు నవ్వారు.

"ఫీజు కంటె విలవయిందే ఇచ్చుకోవచ్చుగా. కాస్త వయసు మీరిన వాడయినా, ఆ జగదీష్ గాడికంటే బాగానే ఉన్నాడు"

"నోరు మూసుకోండి. పరాయి స్త్రీలను గురించి పబ్లిక్‌గా మాట్లాడటానికి సిగ్గు పడాలి" అన్నాడు రాయలు

"మన సర్పంచిగారు ఉత్తుత్త ప్రయాలు వెయ్యలేదన్నమాట. నిజంగా నిందిస్తే సహించలేక పోతున్నారు" అన్నారెవరో అతి సన్నిహితులు

"ఏడ్చారు! వెళ్ళండి" అని అతను లోపలికి వెళ్ళాడు.

కేశవరావు నిట్టూర్చాడు లోకం యెంతగా మారిపోయింది. తండ్రీ కూతుళ్ళకు రంకు గడుతున్నదీ ప్రపంచం.

అతను వచ్చే వరకు ఆశగా రూపాదేవి వరండాలోనే కూర్చుంది.

"ఏమన్నా సెటిల్ అయిందా అంకుల్?" అన్న ఆదుర్దాగా.

"అవుతుందమ్మా. అనుకోగానే అన్ని పనులు కావుగా. కాసిన్ని మంచినీళ్ళు తెచ్చిపెట్టు" అన్నాడు.

అతనునీళ్ళు త్రాగి, క్లుప్తంగా అక్కడ జరిగిన విషయాలు చెప్పాడు, ఆఖరన్న అన్న మాటలు తప్ప.

"ఆ రాయలు అంత త్వరగా సహాయం చేస్తాడని అనుకోను అంకుల్."

"అతను మరీ అంత చెడ్డవాడు కాదమ్మా. అక్కడ చేరిన గ్రహాయున్నాయె, వాళ్ళు అతన్ని తప్పు దారి పట్టిస్తున్నారు చూద్దాం, పీక్కోనే వారా? ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టరు కావాలన్నాడు అడుగుదాం" అన్నాడు ఆయన

ఆమె ఏం మాట్లాడలేక పోయింది,

"రేపు మనము హైద్రాబాద్ వెళ్దాం. మీ ఆంటి మిమ్మల్ని చూడాలంటుంది. వచ్చేటప్పుడు శర్మిష్ఠకు కాలేజీకి ఫోన్ చేసాను. ఆమె ఆరోగ్యం బావుండలేదు." అన్నారు.

"తప్పదా అంకుల్ ?"

"చూడమ్మా, నీకు మార్పుకావాలి, నువ్వేం సందేహించకు" అన్నాడాయన, రూప అంగీకరించింది.

తమకు మిగిలిన ఆత్మీయుడాయన !

మర్నాడు వెంకన్నకు ఇల్లు అప్పగించి, ఇద్దరూ హైద్రాబాద్ వచ్చారు అలువేలు మరోసారి ఏడ్చింది. శర్మిష్ఠ సాయంత్రం వరకు వచ్చింది, ఇద్దరూ ఒకరిని ఒకరు చూచికుని మరోసారి కన్నీరు కార్చారు. నిశ్చింతగా నిదుర బోయారు.

మర్నాడుదయం కేశవరావు ఇద్దరూ కూర్చున్నాక తన అభిప్రాయం చెప్పాడు.

"రూపా ! మీరిద్దరూ ఆలోచించుకోండి. వరంగల్లులో భూస్వాములున్నారు. వారి ఏకైక పుత్రుడు ప్రసాద్. మన శర్మిష్ఠ కాలేజీలోనే ఫోర్తియర్ చదువుతున్నాడు" అన్నాడు కేశవరావు.

"యెవరంకుల్ ? ఆ బ్లూఫియెట్ లో వచ్చే అతను కాదు కదా !"

"అవునమ్మా. వాళ్ళ నాన్నగారి పేరు వేణుగోపాలరావు. వాళ్ళ తాతగారి పేరున నర్సింగ్‌హోమ్ కడుతున్నారు. కొడుకు, కోడలు డాక్టర్లయితే బావుంటుందని వారి అభిప్రాయం. మన శర్మిష్ఠ నచ్చిందట. మనము క్లుప్తంగా వివాహం చేస్తే చాలంటున్నారమ్మా" అన్నారాయన.

"మీరేమన్నారు అంకుల్ ?" రూప అడిగింది.

"అభ్యంతరం లేక పోయినా అమ్మాయిలను ఒకసారి అడగాలి అన్నాను. పెద్దమ్మాయి ఉండగా చిన్నమ్మాయిది చేయటం బాగోదేమో అన్నాను. ఆలోచించు కుని ఉత్తరం వ్రాయమన్నారమ్మా" అన్నాడు.

శర్మిష్ఠ తల వంచుకుని వార్తా పత్రికపై వేలుతో గీతలు గీస్తుంది.

"ఆలోచించటానికేముంది అంకుల్ ! అంగీకరించాల్సింది. పెద్ద



చిన్న ఈ కాలంలో పాటించాల్సిన పనేముంది. అవకాశం, అవసరంకాని" అన్నది రూప.

"ఒకమాట శర్మిష్ఠను అడుగుదామని ఆగానమ్మా."

"దానికయినా ఏం అభ్యంతరం ఉంటుంది. మా కిష్టమేనని వ్రాయండి అంకుల్ అన్నది వెంటనే.

"మీకు లేకపోయినా నాకు అభ్యంతరం ఉంది. అక్క వివాహం అయ్యేవరకు నేను చేసుకోను" శర్మిష్ఠ లేచింది.

"శర్మీ !"

"అవునక్క ! ఇక్కడ వెళ్ళి, పెళ్ళి అని యెవరు ఏడ్వటంలేదు. మీ వల్ల కాదంటే చెప్పండి. ఫీజులు అవికూడా నేనే కట్టుకుంటాను" అన్నది రోషంగా.

"అదికాదే శర్మీ ...." రూప నచ్చ చెప్పబోయింది!

"నా కోసం యెవరూ ఏ త్యాగం చెయ్య నక్కరలేదు ?" విసురుగా అని చర, చర మేడపైకి వెళ్ళింది.

"నీ వివాహం నిశ్చయమయిందని చెప్పు రూపా! తప్పక అంగీకరిస్తుంది" అన్నాడు కేశవరావు.

రూపాదేవి చాలాసేపు అక్కడే కూర్చుది కేశవరావు, క్లైంట్స్‌తో మాట్లాడుతున్నాడు. ఆయన భార్య రోగిష్టి మనిషని గ్రహించి, ఆమెకు వంటలో సహాయం చేసింది.

మధ్యాహ్నాము అందరూ భోజనాలు చేసి నిదురబోయారు. రూప ఒక్కతే కనకాంబరాలు మాల కడుతూ వెనుం వరండాలో కూర్చుంది. శర్మిష్ఠ మెల్లగా వచ్చి ఆమె భుజాలపై చేతులు వేసింది.

"అక్కా! కోపం వచ్చిందా ?"

"కోపం దేనికి ? నీ అభిప్రాయం నువ్వు చెప్పావు. నేను చెప్పేది కూడా వింటే అలా అనవు" అన్నది నిదానంగా.

శర్మిష్ఠ అక్క భుజంమీద గడ్డం ఆన్చి కూర్చుంది.

"నా మాట ఒక్కటి వినక్కా. ఆ తరువాత నీవు ఏది చెప్పినా వింటాను. నన్ను అర్థం చేసుకో" అన్నది ప్రాధేయ పడుతూ.

"ఏమిటమ్మా అంత విలువైనమాట ?"

"అక్కా.... నేను.... నేను...."నీళ్ళు మింగింది.

"ఏమిటే అంత నస ! నువ్వు యెవరినయినా ప్రేమించావా ? అపునక్కా! అన్నది వెనుక నుండి అక్కమెడకు రెండు చేతులు వేసి.

"యెవరే ?" ఆదుర్దాగా అడిగింది. కడుతున్న మాల ప్రక్కన బెట్టి ఆ రెండు చేతులు తన గుప్పెట్లో బంధిస్తూ.

"అక్కా.... నీకు తెలిసిన అతనే. డాక్టర్ హరికృష్ణగారిని నేను...." చెప్పలేక పోయింది.

"డాక్టర్ హరికృష్ణగారినా !" రూప నోరు ఎండుకు పోయినట్టు అయింది.

"ఊఁ ! ఈ భూస్వాముల సంబంధం ముందు, లక్షాధికార్ల ముందు హరికృష్ణగారు తక్కువగా కనిపిస్తారేమోగాని, అతనంటే నాకు చాలా ఇష్టం అక్కా. మాకు కావల్సింది తృప్తిగాని డబ్బుకాదు. ఇద్దరం ఉద్యోగాలు చేసుకుంటు సంపాదించుకుంటాము" అన్నది. అక్క అభ్యంతరం అర్థికస్తోమతు దృశ్యా అనుకుని.

"శర్మీ.... అదికాదే....అది గాదు. అతని అభిప్రాయం ఏమిటో; అతడు యెవరినయినా ప్రేమించాడేమో...." మెల్లని స్వరాన అడిగింది

"నేనేం అంత వెర్రిదాన్ని కానక్కా. ఆ విషయము తేల్చుకున్నాను." అన్నది కచ్చితంగా.

"అబ్బ నన్ను మరీ అంత బుర్ర లేనిదానిగా భావించకు. ఒకరోజు కాఫీ తీసుకుపోతే, థాంక్స్ చెప్పి ఆ మాట, ఈ మాట అన్న తరువాత మనకు రుణపడి పోతున్నానని తెగబాధ పడిపోయాడు."

"అయితే మీరు డాక్టరు కదా. మాకు ఫీజులేకుండా మందులిచ్చి రుణం తీర్చుకోండి" అన్నాను.

"అలా కాదు. ఈ ఇంటి అల్లుడినయి ఋణం తీర్చుకుంటాను" అన్నారే.



"అబ్బా ! యెంతాశ" అన్నాను.

"అత్యాశ మాత్రం కాదు" అన్నరే. దాని అర్థం ఏమిటి ? తన కిష్టమేకదా అతను వ్రాస్తే ఉత్తరాల నిండా అల్లరే...." నవ్వింది.

ఆ మాటలంటూ రూప ముఖము చూస్తే మాటలు మింగేసేది శర్మిష్ఠ.

రూప ఏదో చెప్పబోతు౦డగా కేశవరావు వచ్చాడు.

"రూపా ! మీ పిన్నిపై నుండి ఇప్పుడు ఓ బస్సుపోయినా మేలు కోదుగాని, ఓ కప్పు కాఫీ పెట్టమ్మా" అన్నాడు.

"అలాగే అంకుల్ ఆమె వంటింట్లోకి వెళ్ళింది. అక్కడే తన అంతరంగాన్ని కాల్చివేసి కాఫీ కప్పుతో బయటికి వచ్చింది.

"ఏముంటుంది శర్మిష్ఠ ?"

"తను ఎవరినో ప్రేమించందట అంకుల్" అన్నది ఎంత సహజముగా అనబోయినా, గొంతు భారంగా వినిపించింది.

అతను కాఫీ కప్పు అందుకున్నాడు.

"టేకిట్ ఈజీ రూపా ! మనము ఎన్నో అనుకుంటాము. అన్నీ అనుకున్నట్టు జరుగవు కదా. వాళ్ళకు చెబుతాను" అన్నాడాయన.

రూప ఆయనకు ముఖము కనబడనీయలేదు.

ఆదివారము సాయంత్రము శర్మిష్ఠ వెళ్ళిపోయింది.

కేశవరావు బలవంతముపై ఆ రోజుండి సోమవారము ఊరికి తిరిగి వచ్చింది.

ఒక్కరోజుకే వెంకన్న నీరసముగా కనిపించాడు.

ఏమిటో ఈ అనుబంధాలు అనుకుంది.

"రూపమ్మా ఉత్తరాలు" రెండుత్తరాలు తెచ్చి ఇచ్చాడు. ఆమె ఆ ఉత్తరాలు విప్పి చదివి, రాయిలా కూర్చుండి పోయింది. బయటి నుంచి పిల్లవాడు చదివే పాఠము గట్టిగా వినిపించింది.

"తగిలినచోటే పలుమార్లు దెబ్బ తగులును. ఇది సహజము, తగిలిన చోటే దెబ్బ తగులును...."

ఆమె కోపముగా పొరము అపుమని అరబోయి ఆగిపోయింది. అలాగే కూర్చుండి పోయింది.

వెంకన్న హడావుడిగా ఏదన్నా వంట చేద్దామన్న ప్రయత్నములో ఉన్నాడు.

## 17

కేశవరావు, శర్మిష్ఠ దిగిన టాక్సీ ఇంద్రమ్మ బంగళాముందు ఆగే సరికే, రూపాదేవి వివాహము రాయలుతో జరిగిపోయింది! తలంబ్రాల తంతు ముగిసిందేమో, ఓ కుర్రాడు అందరికీ అక్షింతలు పంచాడు. అతను కేశవరావు చేతిలో కూడా పెట్టాడు.

అక్షింతలు చల్లినట్టే, అతని కళ్ళలోని నీటిబొట్లు రాలి యెదపై పడ్డాయి.

శర్మిష్ఠ పిచ్చి చూపులు చూచింది.

రూపాదేవి పందిట్లో నుంచి లేస్తూనే, వీళ్ళను చూచింది. చిరునవ్వుతో ముందుకు వచ్చింది.

"ఎక్కడికి ?" రాయలు గొంతు కర్కశంగా ఉంది.

"అంకుల్ వచ్చారు. నమస్కరించాలి" అన్నది.

"నువ్వు నమస్కరించుకో" అన్నాడు కోపముగా.

రూప వచ్చి అతనికి నమస్కరించింది.

"ఎంత పని చేసావ్ రూపా! మేమంతా లేమనుకున్నావా ?" దుఃఖముతో అతని గొంతు పూడుకుపోయింది

"మీరు ఈవివాహానికి అంగీకరించరని తెలుసు అంకుల్. వెంకన్న మీకు తెలియ జేస్తాడని తెలుసు...."

"ఏమిటా ముచ్చట్లు! ఊళ్ళో వారంతా ఇక్కడ యెదురు చూస్తుంటే" రాయలు ఉరిమినట్టే పిలిచాడు.



"రండి అంకుల్—" ఆమె శర్మిష్ఠ చేయి పట్టుకుని ముందుకు నడిచింది.

అందరికి నమస్కరించింది.

వెంకన్న, వీరయ్య పెండ్లి పెద్దల్లా వంటలు చేస్తున్నారు.

రూప రాయలుకు దగ్గరగా వెళ్ళింది.

"చూడండి! మీరు నా భర్తని తెలుసు. నాపై అధికారము ఉందని తెలుసు. అది ఈ రోజే ప్రదర్శిస్తే మీ ఆశ్రిత జనమే మిమ్మల్ని ఏవగించుకుంటారు" అన్నది మెల్లగా.

అతను కొర, కొర చూచాడు

రూపాదేవి పనులు చూచుకోవడానికి వెళ్తే, అతను నిలబడి పోయాడు.

"నువ్వుండక్కా! నేను చూసుకుంటాను" ఆమెను ఆపి తను వెళ్ళింది శర్మిష్ఠ.

కేశవరావుకు వెళ్ళలేక తప్పలేదు. అటుగా వెళ్తుంటే రాయలు దగ్గర నాటు సారా కంపు గుప్పుమంది.

"వీళ్ళ భోజనాలు అయ్యేసరికి మరో రెండు గంటలు పకుతుంది. నేను మా ఇంటికి వెళ్ళిపోతాను" అన్నాడు రాయలు.

"చూడండి మనము నల్గురిలో నగుబాటు కావద్దు. ముఖ్యముగా మీరు ప్రజల మనుషులు" అన్నది నిదానముగా.

అందరూ వారినే కుతూహలముగా చూస్తున్నారు.

"మీరు రండి. విశ్రాంతిగా కాసేపు కూర్చోండి" అన్నది. ఆమె వెనుక అతను వెళ్ళక తప్పలేదు.

ఆమె తన మెడలోని దండలు తీసి చిలుకొయ్యకు వేసింది. అతని మెడలో దండలు తనే తీసింది.

"ఇక్కడ కూర్చోండి" ఉయ్యాల బల్లపై చేయిపట్టి కూర్చో బెట్టింది. అతను అయోమయముగా చూస్తున్నాడు.

తాను ఆమెను కించపరచాలని కొన్న నేత తెల్ల చీరలో యెంత హుందాగ తిరుగుతుంది అనుకున్నాడు.

ఆ ఇంటిలోకి స్వేచ్ఛగా ఒక వెంకన్న తప్ప ఎవరూ రారు.

బంధువులు, స్నేహితులు ఎవరూ లేరు.

అతను దిండ్లకు చేరబడి కూర్చున్నాడు.

ఆమె ఉయ్యాల బల్లను ఊపింది మెల్లగా గదిలోకి వెళ్ళి ట్రే పట్టుకుని వచ్చింది. దాంట్లో బ్రాందీ సీసా గ్లాసులు, చిప్స్ ఉన్నాయి.

అతను తెల్లబోయినట్టు చూచాడు.

"మొదటి రోజు, భర్త కోర్కెలు తీర్చటము భారత నారీగా నా ధర్మము అన్నది, అతని ముందు ట్రే పెడుతూ.

అతని అంచనాలు తప్పిపోయాయి. ఆమెను మానసిక క్షోభకు గురి చేయాలనే, ముహూర్తము సమయానికి బాగా త్రాగాడు.

అతని అంచనాలు తారుమారు చేస్తూ, ఆమె అతనికి బ్రాందీ తెచ్చి ఇచ్చింది.

"పోసివ్వమంటారా ! పోసుకుంటారా ?"

"ముందు నువ్వు ఇక్కడి నుండి వెళ్ళు" అన్నాడు కోపముగా.

రూపాదేవి బయటికి వచ్చేసరికి పందింట్లో వరండాలో, బంతులు కూర్చున్నారు శర్మిష్ట, వెంకన్న, తన దగ్గర పనిచేసే ఉపాధ్యాయిని వడ్డన చేస్తున్నారు. కేశవరావు సలహాలిస్తూ తిరుగుతున్నాడు. ఆమె అలాగే గుమ్మములో నిలబడి పోయింది.

ఉయ్యాల బల్ల మీద అసహనముగా అటు, ఇటు కదిలాడు రాయుడు అతనికి ఏం తోచటం లేదు. గ్లాసుతో బ్రాందీ పోసాడు. నోటి దగ్గరకు తీసుకు రాబోయాడు.

చిరునవ్వుతో రూప ముఖము ఉంది.



"నువ్వా !" కోపంగా అరిచాడు.

"నేనే" అన్నది అదే నవ్వుతో.

"యెందుకొచ్చావ్ !" అరిచినట్టే అడిగాడు.

"ఆ రోజు మీరో ప్రస్తావన తెచ్చారు గుర్తుందా ? మీకు నమ్మకంగా ఇల్లు చూచుకునే ఒక స్త్రీ కావాలని! ఆ రోజు మీ గురించి తెలియక తొందరపడి చెంప పగలగొట్టాను..."

"ఇంకో చెంప దెబ్బ వేద్దామనా ? గెటవుట్..." అన్నాడు కోపంగా.

"తన కోపమే తనకు శత్రువు అని వినలేదా ? మీరు అడిగారు, ఇప్పుడు అభ్యంతరం లేదని తెలుపటానికి వచ్చాను" అన్నది.

"ఓహో! నీ కన్య చెఱ విడిపించటానికి యెవడూ దొరకలేదా ?"

"పోనీ అలాగే అనుకోండి!" అన్నది.

"నాతో కాపురం అంటే కత్తితో సాము-తెలుసా ?"

"ఆహా...! బాగా తెలిసే వచ్చాను!" అన్నది.

"నో ఛాన్స్ ! నీ ఇష్టం వచ్చినప్పుడు వివాహం చేసుకుంటానంటావ్-ఇష్టం లేనప్పుడు కాదంటావ్. నేనేం నీ నౌకర్నా!" అన్నాడు కోపంగా.

"మీ ఇష్టం. మీరు అడిగినప్పుడు ఆలోచనారహితంగా వద్దన్నాను. ఇప్పుడు మీరు అభిమాన పడుతున్నారు. ఆలోచించి చెప్పండి." అని ఆమె భుజాల నిండుగా పమిట కప్పుకుని వెళ్ళిపోయింది.

వీరయ్య వచ్చాడు.

"బాబూ ! ఈ యమ్మను వద్దలోద్దు. నీ కాల్మొక్త..." అన్నాడు.

"యెందుకురా! ఇంకో హత్య బాకీ ఉందేమిటి ?"

"నా మాట ఇనండి అయ్యా ! ఈ బజారోల్లు పైసలిస్తేనే. మొన్న మీరు జొరం వచ్చి పండుకుంటే యెవరొచ్చింద్రయ్యా. మా లచ్చి

మిని కాదనకండ్రయ్యా!" అన్నాడు వీరయ్య.

రాయలు ఆలోచనలో పడిపోయాడు. నిజమే. తనతో అవసరం ఉన్నప్పుడు ఆకాశానికెత్తుతారు అంతా. మంచం పడితే ఒంటరి తనం యెంత వేధించింది!

అప్పుడే కొత్తగా కుదిరిన పని పిల్ల అతనికి టిఫిన్ తెచ్చింది.

"వీరయ్యా! నా సంగతి తెలిసికూడా నా దగ్గరకే యెందుకు వచ్చిందంటావ్?" అన్నాడు రొట్టెముక్క నోట్లో పెట్టుకుని.

"ఏముందయ్యా! ఈ కాలంలో ఆడపిల్ల పెండ్లి కావాలంటే యెంత కష్టం. వరదక్షిణ కావాలె! ఒంటిగ ఉందమంటే మీ జగదీసయ్య అసుంటి మొగోల్లు నానా మాటలన్రని. ఏదో ఇంత ఆసర!" అన్నాడు.

"అంతేనంటావా?"

"అదేం కాదు. ఏ కతుపో వచ్చి ఉంటుంది..." పని మనిషి తన గొప్ప చాటుకోబోయింది.

అంతే-రాయలు తన్నుకు అంత దూరంలో పడింది.

"వెళ్ళిపో, గెటవుట్..." అన్నాడు రొట్టెలు దూగంనెట్టి ఆ పని పిల్ల ఏడుస్తూ వెళ్ళిపోయింది.

చాలా సేపటివరకూ అలాగే కూర్చున్నాడు.

"అయ్యా! నేను పొయ్యి రూపమ్మతో చెబుతాను."

తలాడించాడు. వీరయ్య ఏం చెప్పాడోగాని, వారం తిరక్కుండానే ముహూర్తం పెట్టించింది

ఆమెను పెళ్ళి చేసుకున్నాడు కాని,ఆమె ఆడిచ్చినట్లు ఆడటానికి తనేం నౌకరు కాడు. ఆమె ఇచ్చిన బ్రాందీ యెందుకు త్రాగాలి!

అంతే-గ్లాసు టపీమని పెట్టేశాడు. ఉయ్యాల బల్ల దిగాడు.

"ఏయ్...నిన్నే..." గుమ్మంలో నిలబడిన రూప వెనక్కు తిరిగింది.

"నా పేరు రూప."



"రూపా, డార్లింగ్, డియర్ అనటానికి నేను ఆఫీసర్ని కాదు. పల్లెటూరి వాడిని. అవన్నీ ఇక్కడ నుండి తీసి వెయ్యి."

"అదేం!- త్రాగరా?"

"నువ్వు త్రాగమన్నప్పుడు త్రాగటానికి నేను నీ నౌకర్ని కాను."

ఆమె లోపలికి వచ్చి అన్నీతీసి పెట్టింది.

"నేను మా ఇంటికి వెళ్ళిపోతాను."

"సరే వెళ్ళండి!" అన్నది అతని అంతరంగాన్ని అంచనావేస్తూ.

"దర్జాగా 'వెళ్ళండి' అంటున్నావు. ఒంటరిగా వెళ్ళాలా!"

"సరే పదండి భోజనంచేసి బయలుదేరుదాం అనుకున్నాను." అన్నది.

"అవునూ, పదండి అంటున్నావు. ఈ ఇంటి అల్లుడని మర్యాద కూడా లేదా నాకు? భోజనం చెయ్యొద్దంటావా?"

"మీకు ఏకాంతం కావాలేమో అని అలా అన్నాను!" అన్నది.

అప్పుడే కేశవరావు లోపలికి వచ్చి రూపను పిలిచాడు.

"అతడిని భోజనానికి పిలువమ్మా!" అన్నాడు.

"అంకుల్, ఈనాటి నుండి నేనెంతో వారూ అంతే. మీరు మర్యాదగా చూడాలి. మీరే పిలువండి!" అన్నది కాస్త నిష్ఠూరంగా.

కేశవరావు ఒక్క క్షణం తెల్లబోయాడు. వెంటనే నవ్వేశాడు. ఆమెను దగ్గరగా లాక్కున్నాడు

"రూపా! బంగారు తల్లీ!" ఆమె తల నిమిరాడు.

అందరూ భోజనాలకు కూర్చున్నారు.

"అక్కా, యెందుకే ఈ విలన్‌ను వరించావు?" మెల్లగా అడిగింది.

"ఒకొకరి అభిరుచి అది." అన్నది రూప. ఆ మాటల్లో నీ అభిప్రాయం నువ్వు చెప్పలేదా అన్నట్టుంది.

ఆమె ఏం మాట్లాడలేదు. భోజనాలప్పుడు, శర్మిష్ఠ పరిహాసం ఆడింది.

"బావగారికి త్రాగుడేగాని తిండి సహించదా!" అన్నది.

"మరదలు చేతితో తినిపిస్తే సహిస్తుంది!" అన్నాడు.

అమ్మయ్య! అనుకుంది రూప. షటప్ అంటాడేమోనని భయపడింది.

"భయపడతాననుకున్నారేమో బావగారూ! మేము డాక్టర్లము, మీ లాంటి పేషెంట్లు చాలామంది తటస్థపడతారు!" అన్నది.

"నీకు పుణ్యముంటుంది మరదలా! నన్ను రోగిష్ఠి వాడిని చేయకు!" అన్నాడు. అందరూ నవ్వారు.

తన చుట్టూ ఇంత ఆనందం ఉందని యెరగని రాయలు తెల్లబోయాడు. ఇది వరకు నవ్వేవారి నవ్వు కృత్రిమంగా కనిపించేది.

అతనికి తీపి తింటే మత్తుగా, నిదుర వచ్చినట్టుగా ఉంటుంది. వద్దంటున్నా వినకుండా శర్మిష్ఠ లడ్డు పెట్టింది.

అతడిని పడుకుంటారా, అంటే వెళ్దాం అంటాడని రూపకు తెలుసు.

"వెళదామా?" అన్నది అతనికి తాంబూలం ఇస్తూ.

"నేను పడుకోవాలి!" అన్నాడు.

అతనికి మంచము చూపింది. అతను పడుకున్నాడు. శర్మిష్ఠ ఉయ్యాల బల్లమీద పడుకుని నిదురబోయింది.

రూపాదేవి, కేశవరావు మిగిలిపోయారు. వీరయ్య, వెంకన్న ఇరువురు జీతగాళ్ళకు పనివారికి అన్నం పెడుతున్నారు.

"రూపా! ఏమిటమ్మా ఇది!"

"ఇది చూడండి!" ఆమె అలమరాలో నుండి ఉత్తరం తెచ్చి ఇచ్చింది. విప్పాడు.

డియర్ రూపా!

అంతే ఉత్తరం మడిచాడు.

"హరి వ్రాసినట్టున్నాడు!" తిరిగి ఇచ్చేయబోయాడు.

"మీరు చదవాలి అంకుల్!" అన్నది, తనూ కుర్చీ లాక్కుని



కూర్చుంటూ.

"నీ ఉత్తరానికి జవాబు వ్రాద్దామనుకుంటూనే చేయి లేవక వ్రాయలేదు. రూపా, నువ్వు కంగారు పడకు. ఈ దేశంలో నాగరికత శిఖరాగ్రం అందుకుందని అనుకుంటాం. అనాగరికత అదే స్థాయిలో ఉంది. దొంగలు దారికాచి, అడిగింది ఇవ్వాలి. వాళ్ళు సాయుధులయి ఉంటారు. అది తెలియని నేను ప్రతిఘటించబోయాను. భుజంపై, కడుపులో పొడిచారు. హాస్పత్రిలో ఉన్నాను. నా తోటి రూమ్ మేటు నా ఖర్చులు భరిస్తున్నాడు. అప్పుచేసి అయినా ఈ క్రింది అడ్రసుకు నెలకు అయిదు వందలు పంపించు. రెండు మూడు నెలలు ఈ కష్టం తప్పదు. మామయ్యకు యెలా చెబుతావో నీ ఇష్టం. నేను లేచి తిరుగటం ప్రారంభించగానే డబ్బు పంపుతాను. నువ్వు బెంగ పెట్టుకోవని నాకు తెలుసు. మైస్వీట్ డార్లింగ్, నీ దగ్గర ఉన్న చనువుతో, అధికారంతో ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. చేయి లాగుతుంది ఇక ఉంటాను మరి..."

"బ్యాంక్‌లో డబ్బు అడుక్కు పోయింది. ఇప్పుడీ ఇద్దరి చదువు మధ్యలో ఆగిపోవటం నా కిష్టం లేదు అంకుల్."

అతను ఉత్తరం మడిచి పెట్టాడు.

"రూపా! ఇది పద్ధతి కాదమ్మా. అప్పుచేసే వారం- మరో విధంగా ఆస్తి రాబట్టుకునే వారం" అన్నాడు ఆవేదనగా.

"ఈ ఊళ్ళో రాయలుగారిని యెదిరించి ఏ పనీ చేయలేమని అర్థం అయింది అంకుల్..." అన్నది మెల్లగా.

"ఇదొక్కటే కాదమ్మా, ఇంకేదో బలమైన కారణముండాలి..." ఆయన, ఆమె చూపులతో చూపులు కలిపాడు.

కళ్ళు వాల్చింది రూప.

"మీరూహించింది నిజమే అంకుల్. అమాయకంగా శర్మి హరిపై ఆశలు పెంచుకుంది. బాధ్యతకల అక్కగా ఆ విషయంలో నేను చేసింది సముచితమనే అనుకుంటున్నాను" అన్నది.

"నువ్వు నీపరంగా ఆలోచించావు. మరి హరి మాటేమిటి ?" అన్నాడు.

"హరిని ఒప్పించగలనన్న ధైర్యం వుంది. నా కోసం హరి ఏమయినా చేస్తాడు" అన్నది నమ్మకంగా.

కేశవరావు నిట్టూర్చాడు.

"ఈ విషయము ముందే మీకు చెబితే అంగీకరించరని రహస్యంగా ఉంచాను అంకుల్. వెంకన్న మీకు చెప్పి, ఈ పెళ్ళి ఆపాలని చూచాడు, అమాయకుడు" అన్నది జాలిగా.

"రూపా! నిజంగా అతన్ని అంగీకరింపజేసి, నీ ఆస్తి చేజిక్కించుకుని, నీ వాళ్ళను ఆదుకుంటావనే ధైర్యముందా ?"

"నూటికి నూరు పాళ్ళుంది అంకుల్. మీరే చెప్పారు అతను మంచివాడే చుట్టూ ఉన్నవారు పాడుచేస్తున్నారని. ఒక్క విషయము నాకు వాగ్దానం చేయాలి."

"ఏమిటమ్మా ?"

"నా వివాహ విషయం హరికి చెప్పే బాధ్యత నాకే వదిలివేయండి. అతను ఏ విషయము ఆలోచించ వద్దు. నిశ్చింతగా చదువుకోవాలి. నేను ఈ విషయం శర్మిష్ఠకు చెబుతాను."

"మంచిదమ్మా" ఆయన గాఢంగా నిట్టూర్చాడు.

"అంకుల్, ఈ నగలు మిగిలాయి. రెండు నెలల్లో భూముల విషయము ఏమీ తేలక పోతే అమ్మి హరి వ్రాసిన అడ్రసుకు పంపండి. ఇక నుండి హరి ఉత్తరాలు మీ అడ్రసుకే వస్తాయి" అన్నది.

"మంచిదమ్మా" అన్నాడు ఆయన మరోసారి.

"మీరు నా విషయంలో ఎలాంటి విచారం పెట్టుకోవద్దు. అతన్ని మార్చగలనన్న నమ్మకం ఉంది. అతను మారితే ఊరికి ఉపకారమే కాని, అపకారం జరుగదు" అన్నది దృఢంగా.



# 18

రాయలు గదిలోకి వచ్చి ఉలిక్కి పడ్డాడు. తన గది కాదేమోనన్న భ్రమ కల్గింది. స్వర్గమంటే శుభ్రమయిన పరిసరాలలో ఉంటుందేమోనని పించింది. అతను ఒక్క క్షణం నిలబడిపోయాడు.

తనింట్లో వుండే పందిరి మంచం దుమ్ము, ధూళి లేక తళ, తళ లాడుతుంది.

దానిపై పరిచిన తెల్లని దుప్పటి స్వచ్ఛతకు చిహ్నంగా ఉంది.

ఒక ప్రక్కగా బల్లమీద నీళ్ళకూజా, గ్లాసుతోపాటు, ఓ నాటు సారా సీసా ఉంది. చిందరవందరగా ఉండే బట్టలు, చక్కగా బీరువాలో అమర్చి ఉన్నాయి.

"ఈ కిళ్ళీ తీసుకుంటారా ? మందు పుచ్చుకున్నాక తీసుకుంటారా?" మృదువుగా అడిగింది రూప.

అతను తల తిప్పాడు.

పాల నురుగులాంటి కటావ్ చీరలో, తెల్ల మల్లెలు తురుముకున్న రూప కనిపించింది

ఆమె చిరునవ్వు స్వచ్ఛంగా, మల్లెల సౌరభాలు గుమ్మరిస్తోంది. అతనికి పరిచయమున్న స్త్రీలు మైలోడుతూ, కంపుతో ఉన్నవారు.

అతను పట్నంలో కొన్న అందాలు కృత్రిమమైనవి. రంగులు, హంగులతో ఉక్కిరి, బిక్కిరి చేసేవి.

ఇంత స్వచ్ఛమైన, నిర్మలమైన వాతావరణాన్ని భరించగలడా తను.

ఉదయం పుచ్చుకున్నాక మళ్ళీ త్రాగుడు లేక మనసు తిక్క, తిక్కగా వుంది.

"నాకు మందు పుచ్చుకోవటం తప్ప మరేం పనిలేదా?" తీక్షణంగా అడిగాడు.

"అలా అని నేను అనలేదే" అన్నది అల్లరిగా.



మాదిరెడ్డి
సులోచన

"ఇవన్నీ యెనతు ముట్టమన్నాడు?" అతడు తెల్ల దుప్పటి లాగేసి, నీళ్ళకూజా తన్నేసి, సారాసీసా బయటకు గిరాటువేసి తలుపులు భళ్ళున మూసుకున్నాడు.

బయట నిలబడిన రూప గాఢంగా నిట్టూర్చింది.

ఆ స్థలంలో హరి ఉంటే ?

యెంత లాలింపు! యెంత అపురూపం చూసేవాడు.

'ఛీ...ఛీ...!' తనేం చేస్తుంది! ఇదో రకంగా మానసిక వ్యభి
చారమే. హరిని అన్నగా చూచే నిగ్రహం అలవర్చుకోవాలి.

"అయ్యగారేరమ్మా ?" ఆదుర్దాగా వీరయ్య వచ్చాడు.

"తలనొప్పిగా ఉందట, పడుకున్నారు. అయ్యగారి విషయాలు నేను
చూచుకుంటాను. నువ్వెళ్ళి పడుకో" అన్నది బయటికి తలుపు తీస్తూ.

"అంత కంటే ఏం గావాల్నమ్మా" అతను వెళ్ళి పడుకున్నాక
తలుపు వేసుకుని వచ్చి, 'అన్నాకెరినినా'కు అనువాదం చదివింది. ఒరి
నల్ పుస్తకం తీసుకుని కూర్చుంది. పడకగది ముందు వసారాలో ఉన్న
పీటపై పడుకుని పుస్తకం తీసింది.

క్రోడి కూతకు మేల్కొంది. ఇంద్రమ్మ భవనం రాజప్రాసాదంలా
ఉండి బయటి శబ్దాలు వినిపించేవి కావు.

దూడలు అంబా అంటున్నాయి.

చేద బావుల గిలకల శబ్దం వస్తుంది. వాటితో పాటు నీళ్ళతోడు
తున్న ఇల్లాండ్ర గాజుల శబ్దం వచ్చింది. లేచి తలుపు తీసేలోపలే పాలు
పిండుతానని గోపాల్ వచ్చాడు.

అతనికి పాల చెంబులిచ్చి ముఖం కడుక్కుంది.

రోజూ రాయలుకు వంటచేసే మనిషి వచ్చింది.

పొయ్యిలో బూడిద ప్రక్కకునెట్టి టీ నీళ్ళు పడేసింది.

"నీ పేరేమిటో గాని, మొదట వంటిల్లు శుభ్రం చెయ్యి" అన్నది
రూప.



అంతా శుభ్రం చేయించి టీ పెట్టినా రాయలు లేవలేదు. అంత హడావుడిగా యెందుకు టీ పెట్టారో అర్థంకాలేదు.

ఆ మాటే అడిగింది.

"అయ్యగారు లేవలేదని మేం త్రాగమా ఏమిటి ?" నిలదీసింది.

ఎనిమిది గంటలకు మేల్కొన్న రాయలు ముఖం ప్రశాంతంగా ఉంది.

రాయలు తను చేసిన పనికి వ్యతిరేకి అని తెలిసిపోయింది. అందుకే టీ వీరయ్యకిచ్చి పంపింది.

"నీవు తెచ్చావ్ దానికేం రోగం వచ్చింది ?" అని కర్కశంగా అడగటం వినిపించింది.

మరో గాజు గ్లాసుతో టీ తెచ్చి అతని ముందు పెట్టిందామె.

అతను ఏదో అనబోయేటంతలో శర్మిష్ఠ, వెంకన్న వచ్చారు.

"సుప్రభాతం బావగారూ!"

"సుప్రభాతం! పొద్దున్నే దయచేశావ్. మీ అక్కను కొరుక్కు తింటానని భయమా!"

"అబ్బే! నువ్వే ఎంత కొరుకుడు పడ్డావో చూద్దామని వచ్చాను బావగారూ !" అన్నది నవ్వి.

"గట్టిదానవేనే! మీ అక్క నువ్వు వస్తావని తెలిసి కాబోలు రెండు గ్లాసులతో టీ పంపింది !" అంటూ వీరయ్య తెచ్చిన టీ ఆమెకిచ్చాడు. శర్మిష్ఠ మరోరకంగా అర్థం చేసుకుంది. వాళ్ళిద్దరికని తెచ్చుకున్న టీ కాబోలు అనుకుంది.

వాళ్ళిద్దరూ టీ త్రాగుతున్నారు. వెంకన్న, రూప మాట్లాడుతున్నారు. రూప కాస్త బిగ్గరగానే అంటోంది.

"ఊరివాళ్ళను ఎదిరించి, ఇది అన్యాయం అని చెప్పగలవాళ్ళు ఎవరున్నారు? వెళ్ళు ఆ జగదీష్‌తో చెప్పు, వచ్చి ఇల్లు స్వాధీనం చేసు

క్కొమ్మని..." అన్నది.

'అన్యాయం అని చెప్పగలవాళ్ళు ఎవరున్నారు?' అన్నమాట అతడిని బాగా సవాలు చేసింది. 'ఏమిటి? వాళ్ళే మగాళ్ళా! మేమంత చేత కాని వాళ్ళమా' అన్నట్టు లేచాడు.

"వెంకన్నా! ఏమిటి ఇల్లు అంటున్నారు- స్వాధీనం అంటున్నారు!" కోపంగా అడిగాడు రాయలు.

"ఏంలేదు అయ్యగారూ! మా బావి క్రింద పొలం అమ్మారు అమ్మ గారు. పొలం, దాని క్రింద ఇంజన్ వగైరాలు. సమస్తం అని వ్రాయించ మంటే అతను బంగళా అని కూడా వ్రాయించుకున్నాడు..."

"మరి సంతకం పెట్టేటప్పుడు మీ అమ్మాయిగారి కండ్లకు గోడ అడ్డం కట్టారా?" అన్నాడు వెటకారంగా.

"నెత్తిన శనివుంటే కండ్లకడ్డం గోడ కడతారు బాబూ. అదంతా మా దురదృష్టము!" అన్నాడు జాలిగా

"ఊఁ" అతను టీ త్రాగుతూ గంభీరంగా కూర్చుండిపోయాడు. కాసేపు రూపతో మాట్లాడి శర్మిష్ఠ, వెంకన్న వెళ్ళిపోయారు. శర్మిష్ట అదే రోజు వెళ్ళిపోతానని చెప్పింది.

"జాగ్రత్తగా చదువుకో శర్మీ! ఇక్కడంతా క్షేమంగా ఉన్నామని తప్ప మరో విషయం రాయకు హరికి. అర్థం అయిందా?"

శర్మిష్ఠ తలాడించింది.

"ముఖ్యంగా నా పెళ్ళి విషయం!" అన్నది.

"సరే..." కళ్ళు ఒత్తుకొని వెళ్ళిపోయింది శర్మిష్ట.

అమెను సాగనంపి వస్తుంటే తీక్షణంగా చూచాడు రాయలు.

"ఈ ఇంటి ఆడవారు అలా బయటి గేటువరకు వెళ్ళరు, తెలుసా!" అన్నాడు.

"సారీ! నాకు తెలియదు." అన్నది లోపలికి వెళుతూ.

అతను స్నానం చేసేవరకు అతనికిష్టమయిన రొట్టెలు, ఆమ్లెట్లు



చేసి పంపింది. అతను ఉరుస్తాడేమో అనుకుంది, కానీ అప్పటికే బయట అతనికోసం చాలామంది వచ్చి కూర్చున్నారు అతను తినేసి, తన పనిపై వెళ్ళిపోయాడు.

రూప మధ్యాహ్నాలు తుడిపించింది. తమ బంగళానుండి తెప్పించిన డైనింగ్ టేబుల్ అక్కడ వేసింది. ఇల్లంతా చెత్తా, చెదారంతో గింజ లతో ఉంది. అదంతా శుభ్రం చేయించింది. వంటింటికెదురుగా ఉన్న గది ఖాళీ చేయించి ధాన్యం అంతా అక్కడ వేయించింది. ఆమె స్నానం కాక పూర్వమే రాయలు వచ్చాడు.

అన్నీ బల్లమీద పెట్టి పక్కకుతప్పుకుంది. అతనితోపాటు, వి డి. ఓ, కూడా వచ్చాడు.

"అతిథులు వస్తున్నారంటే ఏదయినా ప్రత్యేకంగా చేయించే దాన్నిగా." అన్నది నెయ్యి కరిగించి వీరయ్యకిస్తూ.

"అమ్మా! ఈ ఇల్లు గసుంటి అలవాటు లేదు. ఒక్కొక్క సారి నలుగురయిదుగురు వస్తారు" అన్నాడు.

"ఎన్నయినా చెప్పండి సర్పంచిగారూ! ఇంటికి ఇల్లాలు కావాలండీ. నిజంగా మీ ఇల్లేనా అని ఆశ్చర్యం కలుగుతుంది." అన్నాడు వి. డి. ఓ.

"ఇంకా నయం, మీరు మీరేనా అనలేదు." తేలికగా కొట్టి పారే శాడు.

అతను భోజనము ముగించి వెళ్ళిపోయాడు.

ఆమె వెంటనే వీరయ్యను పంపి తనింటినుండి కర్టనులు తెప్పించి తలుపులకు వేసింది. అడవిలా వున్న ఇంటి ప్రాంగణం శుభ్రం చేయిం చింది.

"వీరయ్యా! మల్లె అంట్లు, గులాబి అంట్లు తెప్పించు!" అన్నది.

"తెప్పిస్తానమ్మా. తమరుపోయి తానం చెయ్యండి!" అన్నాడు పెద్దరికంగా మందలిస్తూ.

"అలాగేలే. ఆ పేడ మన గోడలకు కొట్టవద్దను."అన్నది. యింట్లోకి

వచ్చి స్నానం చేసింది. అంత పొద్దుపోయి తింటే ఆరోగ్యం పాడవు తుందని ఓ గ్లాసు పాలు త్రాగింది.

చీకటి పడుతుండగా చవకబారు "తలకువాడే" నూనె వాసన గుప్పు మంది.

లైటు వెలిగించిన రూప ముఖం చిట్లించి చూచింది.

"అయ్య లేడా?" ఒక స్త్రీ నిలబడి వుంది.

"నువ్వెవరు?"

"నేను ఈ ఊళ్ళోనే ఉంటాను. అప్పుడప్పుడు అయ్యగారి దగ్గర కొస్తాను." అని అరుగుమీద నిలబడి నోటిలోని కిళ్ళీ ఊసింది.

"చూడమ్మా! అయ్యగారొచ్చేవరకు వరండాలో కూర్చోకాని అల ఎక్కడబడితే అక్కడ ఊసి పాడు చెయ్యొద్దు." అన్నది. ఆమె హృదయంలో సన్నని మంట బయలుదేరింది. వెళ్ళి నీరసంగా మంచంపై వాలి పోయింది.

"నీ ఇష్టపూర్వకంగా ఆహ్వానించిన జీవితం కదా. అతని ప్రేమ పొందాలని చేయలేదు కదా!" ఆమె అంతరాత్మ నిలదీసింది.

ఆ విషయము నిజమేకాని తన వ్యక్తి అతన్ని మార్చటం యెలా.

ఆలోచిస్తూ అలానే పడుకుంది.

"ఓహో! జమీందార్ల బిడ్డకదూ! ఏడుగంటలకే నిదురా." అన్న అరుపుకు ఉలిక్కిపడి కళ్ళు విప్పింది.

"అయ్య పెద్దింటి పిల్లనన్న సిగ్గుడే లేదయ్య. పొద్దటి నుండి ఒకటే పనయ్య..." అంటున్నాడు వీరయ్య.

రూప త్వరగా లేచింది. ఆమె హాల్లోకి తొంగి చూచింది. వీరయ్య రాయలుకు మసాజ్ చేస్తూ ఏటో కబుర్లు చెబుతున్నాడు. ఆమె ఒక్క క్షణం ఆలోచించి, ట్రేలో నాటుసారా సీసా, ప్లేటులో కారప్పూస పెట్టు కుని వెళ్ళింది.

అంతవరకు ప్రసన్నంగా ఉన్న రాయలు ముఖం చిటపట లాడినది.



"అసలు నీ ఉద్దేశం ఏమిటి! నేను తాగుబోతుననా! నిన్నటినుండి చూస్తున్నాను- సీసాలు తీసుకువచ్చి పతివ్రతా వేషాలేస్తున్నావ్! ఖబర్దార్ మళ్ళీ నా ఎదుటికి సీసా తెస్తే అది తీసి తల బ్రద్దలు కొడతాను..." చ్రరున లేచి సీసా ఎత్తాడు రాయలు.

వీరయ్య చేయి పట్టుకున్నాడు.

"మీరు తానం చేద్దురు పదండి దొరా!" అన్నాడు.

సీసా దూరంగా గిరాటువేసి స్నానానికి లేచాడు.

వేడినీళ్ళు, సబ్బు తుండు పెట్టింది రూప.

అతని కోపం చూస్తే ఆమెకు జాలి కలుగుతుంది. మొండి పట్టుపట్టే పసిపిల్లాడిలా కనిపిస్తాడు.

స్నానం చేసివచ్చి బల్లముందు కూర్చున్నాడు. అప్పుడు అతనికి బల్ల పరదాలు, హాల్లోని మంచం తనవి కావని గుర్తుకువచ్చింది. చరచర లేచి గదిలోకి వెళ్ళాడు. ఓ వెయ్యి రూపాయలు తెచ్చి రూపకోసం అటు, ఇటు చూచాడు. వంటింటి గుమ్మంలో తెల్ల చీర కనిపించింది.

అటు నోట్లు గిరాటు వేశాడు.

"ఇలా టైగర్ ఇంద్రమ్మ ఇల్లుటోచి సామానులు తేనక్కరలేదు. వెయ్యి రూపాయలు పెట్టి ఏం కావాలో తెప్పించుకో!" అన్నాడు కరకుగా.

అతనికి జవాబు రాలేదు గాని ఎర్రవంకీ వున్న నాజూకయిన వేళ్ళ చేయి నోట్లకట్టను ఎత్తటం కనిపించింది.

అతను భోజనం ముగించి వచ్చి, మధ్య హాల్లో రేడియోముందు కూర్చొని, సిగరెట్టు వెలిగించుకున్నాడు.

వెనుకగా వచ్చి రూప అతడి తల తుడిచింది.

"ఇదేమిటి!" అన్నాడు కోపంగా. తిరుగపోయినా ఆ స్పర్శ ఎన్నడూ ఊహించనంత మృదువుగా, మధురంగా గిలిగింతలు పెట్టినట్లు అయింది. అతను అసహనంగా చూచాడు.

"చాల్లే ఇది సినిమాకాదు!" అన్నాడు.

"సినిమా హీరోయిన్‌ను అని అనటంలేదు. జుట్టు ఊడిపోతుంది జలుబు చేస్తుందని..." అన్నది నిదానంగా.

అతనికి ఆ మాత్రంగా హితవుకోరే వాళే కనిపించలేదు. అందుకే కొత్తగా అనిపించింది.

అతను అక్కడ ఉండలేనట్టు గదిలోకి వెళ్ళాడు. రూప ఒక్క నిమిషం ఆలోచించి బయటి వరండాలోకి వచ్చింది. అక్కడ సాయంత్రం వచ్చిన స్త్రీ ముడుచుకొని పడుకుంది.

"ఏయ్ అమ్మాయ్..." పిలిచింది రూప.

"పిలిచారా అమ్మా?" కంగారుగా లేచిందామె.

"మీ అయ్యగారు వచ్చారు." అన్నది గదివైపు దారి చూపుతూ.

ఆ స్త్రీ తెల్లబోయినట్టు చూచింది. ఇదేం కొత్తపద్ధతి. తనూహించని చర్య.

అమ్మగారొచ్చిందనగానే వెళ్ళిపోదాం అనుకుంది. ఇంట్లో తిండి గింజలు నిండుకున్నాయి. ఒక పదిరూపాయలు, పాత పరిచయాన్ని పురస్కరించుకొని అడుగుదామనుకుంది. అమ్మగారే స్వయంగా అయ్యగారి గది చూపుతుంటే ఆశ్చర్యంతో కళ్ళు వెళ్ళబెట్టి చూచింది.

"వెళ్ళమ్మా!" అని పడకగది దాటి వెళ్ళిపోయింది.

గదిలో రాయలు రూప గురించే ఆలోచిస్తున్నాడు. రూప స్వభావం అతనికి అర్థంకాలేదు. అమాయకురాలా! అందరు అన్నట్లు చెడిపోయిందా!

"అయ్యగారూ!" చనువుగా గదిలోకి వెళ్ళింది ఆ స్త్రీ. ఆమె పేరు రాజమ్మ, అందరు రాజీ అంటారు.

"ఓ రాజీ! నువ్వా! ఏమిటిలా వచ్చావ్?"

"తమరి దర్శనానికే, వాకిట్లో పడుకుంటే అమ్మగారు లేపి గదిలోకి పంపిండ్రు..." అన్నది తలుపేస్తూ.

ఉలిక్కిపడ్డాడు రాయలు. రూప ఉద్దేశ్యం ఏమిటసలు!

"రాజీ! తలుపు తియ్యి!" అరిచాడు.



వణికిపోతూ తలుపు తీసింది. అతను జేబులో నుండి ఓ యాభై రూపాయల కాగితం ఆమెపైకి విసిరివేశాడు.

"నడువ్! మళ్ళీ ఈ ఇంటి గడపలో అడుగు పెడితే చంపేస్తాను."

అతని మాట పూర్తికాకముందే జారుడు బండ మీదనుండి జారినంత వేగంగా పరుగెత్తుకు పోయిందా స్త్రీ.

రాయలు నాగు పాములా బుసలు కొడుతూ వచ్చాడు డైనింగ్ హాల్లోకి. అక్కడ రూప కూర్చుని అన్నం తింటుంది. అతను అలాగే నిలబడి పోయాడు. మనుషులు అంతబాగా, ఒద్దికగా కూర్చొని అన్నం తింటారని మొదటిసారి తెలిసింది. అన్నం కలుపుతున్న రూప వేళ్ళకేసి చూచాడు.

తల ఎత్తిన రూప చప్పున లేచి నిల్చింది. ముద్ద మింగి నీళ్ళు త్రాగింది- భర్తవైపు తిరిగింది.

"ఏమయినా కావాలా?"

"అసలు ఆ రాజీని నా గదిలోకి పంపటంలో నీ ఉద్దేశ్యం ఏమిటి!"

రూప జవాబు చెప్పలేదు.

"నీ అసలు రంగు అర్థం అయింది నా నుండి దూరం ఉండాలని, నాపై అభిమానం నటిస్తూ, తాగుడు, స్త్రీలను నాకు అంటగట్టి తప్పించుకుందాం అనుకున్నావేమో. నీ ఆటలు సాగవు..." అన్నాడు.

"అది కాదండి..." నచ్చచెప్పబోయింది రూప.

"నువ్వేం చెప్పొద్దు. నా నుండి తప్పించుకుని రక్షణ పొందుదామని కదూ!"

"మీరు అపార్థం చేసుకుంటున్నారు" అంటూనే చేయి కడిగేసుకుంది.

"నీ నటనను బాగా అర్థం చేసుకున్నాను!" అని ఆమె ఊహించని విధంగా వచ్చి, కాళ్ళ దగ్గర, మెడ దగ్గర చేతులు వేసి లేపాడు. రూప సిగ్గుగా కంగారుగా చూచింది.

వీరయ్య వెనుకవైపున్నాడులా వుంది-

ఆమెనలా ఎత్తుకునే కాలితో తలుపు నెట్టాడు. రూప పులిపంజాలో చిక్కిన లేడిపిల్లలా చూచింది.

సిగరెట్టు వాసన భరించలేనట్టు కళ్ళు మూసుకుంది. తను అందరి ముందూ వేసుకున్న బంధం కాదని, త్రెంచుకోలేదు. ఆమె నోరు విప్పే లోపలే ఆమెను మంచంపైవేసి ఆక్రమించుకున్నాడు రాయలు.

అతని నోరు ఆమె నోరు విప్పే అవకాశం ఇవ్వలేదు.

అతని చేతులు ఆమె శరీరాన్ని వీణగా చేసి మీటుతున్నాయి. రూప తన శేషయింటో తెలియని మత్తులో ఒక్కసారి చిన్నగా మూలిగింది.

ఆమె మర్నాడుదయం లేచేసరికి రాయలు వెళ్ళిపోయాడు. ఆమె తన ముఖం వీరయ్యకు చూపాల్సి వస్తుందేమోనని తప్పుకు తిరిగింది. అతను రెండురోజులయినా రాలేదు.

"వీరయ్యా..." అతని గురించి అడిగింది.

"అయ్యగారికిది అలవాటేనమ్మా." అన్నాడతను.

ఆమెకు ఆందోళనగా ఉంది. అలాగే పనులు చేసుకుంటోంది.

# 19

వారం రోజులకు వచ్చాడు రాయలు. రూప తేలికగా నిట్టూర్చింది. అతను స్నానం, భోజనం చేశాక మెల్లగా గదిలోకి వచ్చింది.

"వారంరోజులు వెళ్ళేవారు చెప్పి వెళ్ళొచ్చుగా!" అన్నది మెల్లగా.

"ఇప్పుడేం మునిగిపోయింది?" అన్నాడు నిర్లక్ష్యంగా సిగరెట్టు నోట్లో పెట్టుకొని.

రూప లైటరుతో అతని సిగరెట్టు వెలిగించింది.

"ఆందోళనగా ఉండదా?"

"ఎందుకు? ఎక్కడయినా యాక్సిడెంటు అయినా జాగ్రత్తగా నా శవాన్ని అప్పగిస్తారు." అన్నాడు మొరటుగా.



ఆమె కోపంగా చూచి వెళ్ళిపోయింది. కొన్ని సంవత్సరాలలో ఈ శారీరకబంధం అవినీతి అంటారు. కాని దాంపత్యానికి వారధిలాంటిదేమో. నిన్న మొన్నటివరకూ నిర్లిప్తంగా తిరిగిన రాయలుకు ఏదో ప్రశాంతత, బాధ్యత ఉన్నాయి అనిపిస్తుంది.

"అలక పాటోలు కర్మ! నీ అలకలు తీర్చే ఓపిక, తీరిక నాకులేవు. ఇదిగో తీసుకో..." ఓ కవరు తెచ్చి ఆమె పైకి విసిరాడు.

"ఏమిటది?" విప్పకుండానే అడిగింది.

"పెద్ద తెలిసినదానవుగా, చదువకుండా పెట్టిన సంతకాల ఫలితం. నీ ఇల్లు నీకు మిగల్చాలంటే ఆ జగదీష్‌గాడికి మొత్తం దబ్బిచ్చి పొలం తీసుకోవాల్సి వచ్చింది." అన్నాడు తల క్రింద చేతులు పెట్టుకుని పడుకుంటూ.

"మీరు పొలం తీసుకున్నారా ?" అపనమ్మకంగా అడిగింది.

"ఆఁ ! తీసుకోక తప్పుతుందా ! నీ కసలు బుర్రలేదు. అంతా పోసీ అనుకుంటావు. డబ్బు సగం కట్టాను. మిగతా సగానికి ఆరునెలల వాయిదా పెట్టాను. రేపటినుండి మన జీతగాళ్లే పని చేస్తారు." అన్నాడు.

"నిజం !" రూప కళ్ళు, మిల, మిలలాడేయి.

తను చేసిన నిర్ణయము సరి అయినదే, నన్న ఊహ ఆమెను నిలువనీయటంలేదు.

విహంగమై ఎగురాలనిపించింది.

మయూరంలా నాట్యం చేయాలనిపించింది.

"అబద్ధం చెప్పాల్సిన ఖర్మ నాకేం పట్టలేదు." అన్నాడు కోపంగా.

ఆమెకు చెరువు క్రింది పొలం అమ్మే విషయం చెబుదామని రెండు అడుగులు ముందుకు వేసింది.

వెంటనే అతని స్వభావం గుర్తుకువచ్చింది. ఆ విషయం అప్పుడు యెత్తక పోవటమే మంచిదనిపించింది.

[20]

"మీరు అబద్ధం ఆడతారని కాదు. అవతలి వారు చాలా గట్టివారు"

"ఛస్ ! నోరుముయ్యి. మళ్ళీ నా ముందు వాడు గట్టివాడు, వీడు ఒట్టివాడు అంటే పళ్ళు రాలుతాయి !" అన్నాడు కోపంగా.

"సారీ..." అన్నది, వెనక్కి తిరుగుతూ.

"ఏయ్ ముద్దూ ! నీ ఇల్లు నిలబెట్టాను. నాకు ఏమీ ఇవ్వవా ?" అన్నాడు.

ఆమె ఒక్క నిముషం ఆలోచించింది అతను ఊహించనంత తొందరగా వచ్చి, అతని పెదవులపై గాఢంగా చుంబించి, బయటికి వచ్చింది అతను త్రాగాడని తెలిసింది. ఒక్క నిముషం బాధ పడినా యెన్నాళ్ళనుండో ఉన్న అలవాటు ఒక్కసారి పోతుందా అనుకుంది.

అతను అనుకోని విధంగా జరిగినా, ఆ చర్యలో ఏదో కొత్తదనం కనిపించింది అతను చాలాసేపు ఆమె వస్తుందని చూచాడు. వీరయ్య తలుపులు వెయ్యటం, బయటి తలుపు వేసుకొమ్మని రూపని అడగటం అన్నీ వినిపించాయి.

అయిదు, పది నిమిషాలు చూచాడు. అతని సహనం సన్నగిల్లింది. ఒళ్ళంతా తీయగా బాధ పెడుతోంది.

అతని పెదవులను తాకిన రూప పెదవులు, సన్నని జ్వాల రగిలించాయి. అతను కోపంతా లేచాడు.

"ఏయ్ !" గట్టిగా పిలిచాడు.

అయిదు నిమిషాల తరువాత, సారాసీసా ఉన్న ట్రేతో. ఒదులుగా అల్లిన జడ, మల్లెల తురుము కుందేమో, సగం విచ్చిన మల్లెలు తమ ఉనికిని తెలుపాలని సుగంధాలు వెదజల్లుతున్నాయి. ఎరుపుమీద పసుపు పూలున్న ఫుల్‌వాయిల్ చీర ఆమె శరీరపు ఒంపుల్ని ప్రదర్శిస్తుంది. ఎత్తని బొట్టు, చేతులకు మట్టి గాజులలో మత్తెక్కించేలా ఉంది రూప.

అతను సారాసీసాను ఒక్క తోపు త్రోశాడు.

"నన్ను ఏమనుకుంటున్నావ్ ?" కోపంగా చూచాడు.



"బయట త్రాగినప్పుడు ఇంట్లో మడి దేనికి ?" నిదానంగా అడిగింది. అతను నిరుత్తరుడై జవాబు చెప్పలేనట్టు చూచాడు.

ఆమె వంగి సీసాను యెత్తి అవతల పెట్టింది. ఆమె ప్రతీ కదలిక అతడిని రెచ్చకొడుతుంది.

ఇతర స్త్రీలతో పరిచయం ఉన్నా, ఏ స్త్రీ అతన్ని అంతగా రెచ్చగొట్ట లేదు.

"ఏయ్, ఇటురా..." అన్నాడు.

రూప అవతలి గదిలోకి పోబోయిందల్లా, ఒక్క నిముషం ఆగి అతని గదిలోకి వచ్చింది.

"ఏమిటి ?"

"యెంత నెఱజాణవు ! మనుషుల్ని రెచ్చగొట్టి అమాయకంగా ఏమిటి అంటున్నావా !" అన్నాడు.

రూప తలెత్తి చూచింది. అతని ముఖంలో చిత్రమైన ప్రశాంతత కనిపించింది.

అతనితో ఒక్కనాటి అనుభవము తనకు. అయినా యెంతో సన్నిహితుడుగా అనిపిస్తున్నాడు.

"ఏమిటి ఆ స్థంభంలా నిలబడటం ?" అన్నాడు.

రూప మెల్లగా వచ్చి అతని ప్రక్కన కూర్చుంది. అతను ఆలస్యం భరించలేనట్టుగా ఆమెను పైకి లాక్కున్నాడు.

"త్రాగుడు వాసన పడదా ?"

పడదన్నట్టు తలాడించింది.

"మరి రోజూ నాకు త్రాగటానికిస్తావేం ?"

కొంచెం ప్రక్కకు జరిగి అతని చేతి ఒంపులో ముఖం దాచుకుంది.

"మీ ఇష్టమని..."

"నా కిష్టమయిన పని ఏదయినా...!"

చేస్తాను అన్నట్టు తలాడించింది. అతను ఆ వాగ్దానం చాలన్నట్టు

ఆమె ముఖం, గొంతు, మెడను చుంబించాడు.

"ఏయ్ మొద్దూ! నీ కొక మాటిస్తున్నాను. ఇక మీదట త్రాగను. యెక్కడయినా త్రాగినా నీకు దూరంగా ఉంటాను- సరా."

సరే అన్నట్టు తలాడించింది.

ఒక తాడు, దానికో సూత్రం కట్టి, స్త్రీ పురుషులను బంధిస్తారు. ఆ బంధానికింత బలం ఉందా! అతని అణువణువు తనదే అనిపిస్తుంది రూపకు.

మర్నాడు లేచి, అతను లేచేలోపలే ఈ విషయము కేశవరావుకు వ్రాసింది. నాల్గు ముక్కలు శర్మిష్ఠకు వ్రాసింది. అతను లేవగానే టీ ఇవ్వాలని టీకి నీళ్ళు పడేసింది.

హాల్లోనుండి రాయలు కేకలు, ఒక మనిషి ఆర్తనాదం వినిపించాయి.

ఆమెకు దినమంతా హాల్లోకి వచ్చే ఆజ్ఞలేదు. కాని ఆ విషయం ఏమిటో తెలుసుకోవాలనిపించింది.

"నీ కాల్మొక్త దొరా...మరెప్పుడూ ఇలా చేయను... నీ బాంచను. అబ్బా...నేను సచ్చిపోత దొర..."

"చావు, పీడా విరగడవుతుంది." చేతిలోని కర్ర యెత్తాడు.

"ఏమిటండీ ఆవేశం?" రూప పరదా తొలిగించుకుని, భర్త మధ్య, ఆ అర్భకుడి మధ్య నిలబడింది.

"అమ్మా..." అంటూ నేల కూలింది.

"అయ్యో!...నా కోసం యెంత దెబ్బ తిన్నవమ్మా..." ఇంత వరకు దెబ్బలు తింటున్న అర్భకుడు ఆమెను పొదివి పట్టుకున్నాడు

రూప తలనుండి కారే రక్త ధారలు చూడగానే రాయలు కోపం దిగిపోయింది.

"నిన్నెవడు రమ్మన్నడు..." విసుగ్గా అడిగాడు.

"అబ్బా..." అంటూ తల తడుముకుంది. ఆ దెబ్బ ఒక్కపక్క ఒరుసుకుంటూ పోయింది గాని లేకపోతే తల పగిలిపోయేది. నుదుటి



ముందు భాగం చిట్లి రక్తం కారింది.

వీరయ్య కంగారుగా వచ్చి ఆమె తలకు పసుపు అద్ది తలకు బట్ట కట్టాడు.

"చూస్తారేమయ్యా...డాక్టరును పిలువండి..." వీరయ్య అన్నాడు.

"వద్దులే వీరయ్యా, మీ అయ్యగారి చేతిలో దెబ్బలు తిన్న వారం దరిని డాక్టరుకు చూపిస్తున్నారా..." మెల్లగా లేచింది.

అతను ఆమెనే చూస్తూ అచేతనంగా నిలబడిపోయాడు.

"ఇన్ని దెబ్బలు తినటానికి ఏం తప్పు చేశావయ్యా బాబూ?" అన్నది నీరసంగా.

"ఆడు చెప్పుతాడా! మన పొలంలో మేకలు పడితే బంజరు దొడ్లో కొట్టూ అంటే, ఇంటికి తీస్కపొయ్యి కోస్కని తిన్నరమ్మ. మన అయ్యగారి కెంత బష్ఠ పేరు." వీరయ్య అన్నాడు.

"ఇంకెప్పుడూ తప్పుడు పనులు చెయ్యకు, వెళ్ళు!" అన్నది. అతను బ్రతుకు జీవుడా అని వెళ్ళిపోయాడు.

"ఏందమ్మా! దావఖానకు పోదాం."

"దవాఖానా యెక్కడది వీరయ్యా! మీ దొరగారు ప్రజాసేవ చేస్తారు కదా; అందుకే దవాఖానా యెత్తేయించారు. ప్రజలెంత చస్తే అంత జనాభా సమస్య తగ్గిపోతుంది." అన్నది ఓరగా భర్త వంక చూస్తూ.

"మనము పట్నమన్నా పోదాము!" అన్నాడు వీరయ్య.

"వెళ్ళి నీ పని చూచుకో వీరయ్యా. ఇంత చిన్న దెబ్బకేం కాదు?" అన్నది లోపలికి వెళుతూ.

వీరయ్య ఓ నిట్టూర్పు విడిచి వెళ్ళిపోయాడు.

రూప చీర మార్చుకొని, అతనికి వేప పుల్ల తెచ్చి ఇచ్చింది.

"నీ ఉద్దేశం ఏమిటి? ఈ ఊర్లో హాస్పత్రి నేను యెత్తేశాననా!"

"మీకే తెలియాలి."

"తిన్నగా మాట్లాడు, నేను కోపం వస్తే మనిషిని కాను..." ఆమె

తెచ్చిన పందుం పుల్ల ముక్కలు, ముక్కలు చేసి పడేశాడు.

"ఇప్పుడు కోపం లేనట్టు! మీరు వచ్చి ముఖం కడుక్కోండి!" అని లోపలికి వెళ్ళింది.

అతను ముఖం కడుక్కొని వచ్చేసరికి ఆమె టీ తీసుకువచ్చింది.

"అసలు నిన్ను బయటికి రమ్మన్నదెవరు ?"

"బాధ్యత, కర్తవ్యం..." అన్నది పాట్‌లోని టీ కప్పులోకి వంచుతూ. అతను తపీమని కప్పు అందుకున్నాడు.

"తన కోపమే తన శత్రువు."

"నాకేం నీతులు చెప్పొద్దు." అన్నాడు విసురుగా.

"యెవరయినా ఏదయినా చెబితే వింటారు గనక! నా నోటి దురద!" అన్నది.

"వాడు చేసిన పని బావుందా ?"

"బావుందని నేను అంటున్నానా ? ఇదే దెబ్బ వాడికి తగిలితే హాస్పత్రికెళ్ళి మీపై కేసు పెట్టేవాడు. మీరొక్కసారి కళ్ళు విప్పి, జరిగింది మననం చేసుకోండి. మా కుటుంబ చరిత్రే తీసుకోండి మా నాయనమ్మ ఆస్తీ, నిరంకుశత్వమే వంశ నాశనానికి దారి తీసింది. మానవులుగా సాటి మనుషుల బలహీనతను అర్థం చేసుకుని శాంతి యుతంగా పరిష్కరించాలి." అన్నది కాస్త హెచ్చు స్థాయిలో.

"ఏమిటి నువ్వు అనేది! వాళ్ళు నన్ను చంపుతారనా ?" అంతకంటే కోపంగా అరిచాడు.

"పిల్లిని గదిలో బంధించి కొడుతుంటే పులి అవుతుందండీ. కాలం మారింది. మనుషులు మంచి-చెడు ఆలోచిస్తున్నారు" అన్నది నచ్చచెప్పే ధోరణిలో.

"నీ ఉద్దేశం ఏమిటి ? నే నూరికే ఊరివారిపై పడతానంటావా ? ఇందాకా హాస్పత్రి యెత్తేయించానన్నావు..."

"యెత్తేస్తుంటే చూస్తూ ఊరుకోవటం నేరం కాదా ! అధికారం



చేతిలో ఉంది, నల్గురికి ఉపయోగమయిన పనులు చెయ్యండి అంతేగాని స్వంత లాభంకోసం అందరిని కష్టపెడతారా! అయినా మనకెవరు బ్రతుకలేక ఈ రాజకీయాలు !" అన్నది అదే స్థాయిలో.

"నోరుముయ్యి" అతను అవతలికి వెళ్ళాడు. అప్పుడే వెంకన్న వచ్చాడు.

"రూపమ్మా!...ఆ తలకు కట్టేమిటమ్మా?"

అతని మనసు ఏదో శంకిస్తుంది.

"ఈ ఇల్లు అలవాటు లేదు వెంకన్నా. పెరటి మెట్లుమీద జారి పడ్డాను. ఇల్లు మనకే ఉంటుంది. పిల్లలు వస్తున్నారా ?"

"యెందుకు తల్లీ నాతో దాస్తావు. ఈ స్థితి చూడాలనే బ్రతికి ఉన్నానా ?" అతను నోట్లో గుడ్డ కుక్కుకున్నాడు.

"వెంకన్నా, ఏమిటిది ? మా విషయాలలో మీ యెవరి జోక్యం వద్దు. చెప్పిన పని చెయ్యి. పొలం కొనటానికి రాజుగారు వస్తామన్నారు, రాలేదా !" అన్నది అతని దృష్టి మరల్చాలని.

"నౌకరి గాడివి అని అంటున్నావు కదమ్మా. అను, పుట్టి పురుట్లో కన్ను మూసిన కన్న తల్లిని మరిపించావు..." అతను కళ్ళు ఒత్తుకున్నాడు.

"వెంకన్నా! నా కిప్పుడేమయిందని! ఆయన యెంత కోపదారి మనిషి అయినా నా పై చేయెత్తే కుసంస్కారి కారు. వారు యెవర్నో కొడుతుంటే అడ్డం పోయాను, ఆ దెబ్బ నాపై పడింది. పొలం గురించి ఏమన్నారు ?"

"కొంటామని వచ్చారమ్మా. ఆ యాదగిరి అడ్డుపడి, ఆ పొలం తనది- అసలు దాయాదినని చెప్పాడట."

"అయితే అమ్మే ఆశ లేదన్నమాట. సరే, అవసరం అయితే శర్మిష్ఠ జువేలరీ అమ్ముదాం." అన్నది వంటింట్లోకి వెళుతూ.

వెంకన్న కూరలు తరిగిస్తూ కూర్చున్నాడు. వీరయ్య స్నానానికి

తయారు చేసి, అయ్యగారిని పిలిచాడు. అతని ముఖం చూచి పలుకరించ టానికి జడిశాడు వెంకన్న. చేతులు జోడించి నమస్కరించాడు.

తల పంకిస్తూ వెళ్ళిపోయాడు.

రూప టిఫిన్ చేసింది.

"అమ్మా ! దొర పట్నం పోతున్నారు. నాస్త వద్దంట!" అన్నాడు వీరయ్య.

రొట్టెలు, ఆమ్లెట్టు తీసుకుని గదిలోకి వచ్చేవరకే అతని మోటార్ బైక్ దూసుకుపోయింది.

రూప నిట్టూర్చింది వెంకన్నకు, వీరయ్యకు రొట్టెలిచ్చింది. కూరలు ఏరటానికి మనుషులు దొరకలేదని జీతగాడు వస్తే, ఇల్లు తను చూచు కుంటానని వాళ్ళను పొలానికి పంపింది.

సాయంత్రంవరకు జ్వరం వచ్చినట్లు అనిపించటమే కాక తలనొప్పి ప్రారంభం అయింది. అలాగే ముడుచుకు పడుకుంది.

రాత్రి తొమ్మిది గంటలకు వచ్చాడు రాయలు. వీరయ్య తలుపు తీశాడు. అతను గదిలోకి వెళ్ళాడు.

"వన్నం తిందురుగాని రండి దొరా!" అన్నాడు.

"స్నేహితులు కలిసి హోటల్‌కు పట్టుకువెళ్ళారు. ఆకలి లేదు. నువ్వు తిని పడుకో!" అన్నాడు నిర్లక్షంగా షర్టు విప్పేస్తూ.

"గట్ల అనకండి దొరా. పొద్దుటి నుండి మీరు తినలేదని అమ్మ గారు పచ్చి మంచినీళ్ళుకూడా ముట్టలేదు!" అన్నాడు.

ఒక్క నిముషం రాయలు షాక్ తిన్నట్టు నిలబడిపోయాడు. తన కోసం తిండి మానేవారున్నారా!

అతని అణువణువు పులకరించినట్టు అయింది. అతనిలో పేరుకు పోయిన ఒంటరి తనం, నిరాశా కరుగుతున్నట్టు అనిపించింది.

"నువ్వెళ్ళి కంచం పెట్టు, పద." అన్నాడు.

వీరయ్య వెళ్ళి బల్లమీద అన్నీ పెట్టి తలుపు దగ్గరవేసి వెళ్ళి



పోయాడు.

రాయలు మెల్లగా మంచం దగ్గరకు వచ్చాడు.

"అబ్బా..." కదిలి తల పట్టుకుంది.

"వీరయ్యా! అయ్య వచ్చారా... అన్నీ బల్లమీద పెట్టి నన్ను లేపు..." అంటోంది.

అతను చటుక్కున ఆమెను లేపాడు.

"యెలా ఉంది ?"

"మీరు...మీరా! కాస్త తలనొప్పి. రండి భోజనం చేద్దురు!" అతని చేతుల్లో నుండి దూకింది.

అతను వెళ్ళి బల్లముందు కూర్చున్నాడు. ఆమె వడ్డించింది.

"ఇవన్నీ వద్దు, నేను పట్నంలో తినేసి వచ్చాను." అన్నాడు.

"హైద్రాబాద్ నుండి ఇక్కడికి రావటానికి ఓ గంటయినా పడు తుంది. అరిగిపోయి ఉంటుంది, తినండి." అన్నది.

"అవునూ! నువ్వెందుకు తినలేదు."

"మీరు నన్నేం అనుకుంటున్నారు! ఈ ఇంటికి తిండికి ముఖం వాచి వచ్చాననుకుంటున్నారా ? తోడు కోసమండీ అలా అయితే మా నాయనమ్మ టైగర్ ఇంద్రమ్మ భవనంలోనే పడి ఉండేదాన్ని" అన్నది కినుకగా.

అతనికి చిత్రంగా అనిపించింది. ఆమె మాటలు మత్తుగొల్పు తున్నాయే తప్ప, కోపం కల్గించటంలేదు.

"ఇక అర్థం అయింది. ఈ పూట నువ్వు తినెయ్యి!" అన్నాడు.

ఆమె వచ్చి అన్నం కలిపి మొదటి ముద్ద అతనికి అందించ బోయింది.

"ఏం, నేను పసి పిల్లాడినా !" అన్నాడు కాస్త విసుగ్గా.

"చూస్తుంటే మేకపోతు గంభీరం తెలియటంలా. నాకు పసివాడి

లాగే కనిపిస్తారు. మీరు లేకుండా తినాలంటే యెలాగో ఉండండి!" అన్నది నవ్వుతూ. ఒక క్షణం ఆమె వంక చూచాడు. ఆ కళ్ళల్లోని అనురాగానికి కరిగిపోయాడు. ఆ ముద్ద అందుకున్నాడు.

కలిపిన అన్నం ఆమె తిన్నది. వెళ్ళి రెండు గ్లాసుల్లో వేడిపాలు తెచ్చింది.

"ఇదిగో! ఇలా ఇవ్వు. నా కోసం చూస్తూ అన్నం మానేస్తే వారంలో నాల్గు రోజులు మానెయ్యాల్సిందే!" అన్నాడు.

"పోనివ్వండి, ఏమయింది ? ఇంకా సన్నగా అందంగా తయారవు తాను!" అన్నది పాల గ్లాసు అతని కందిస్తూ.

అతను ఇలాంటి సన్నివేశాలు పుస్తకాలలో చదివితే, సినిమాల్లో చూపిస్తే విసుక్కునేవాడు. చిత్రం! తనే ప్రత్యక్షంగా చూస్తున్నాడు.

"జ్వరంగా ఉందన్నాడు వీరయ్య."

"మీ చేయి పడగానే పోయింది లెండి!" అన్నది నవ్వుతూ.

"ఇంకా ఆస్పత్రి యెందుకు! జ్వరం వచ్చిన వాళ్ళందరినీ కూర్చోబెట్టు. నేను తాకుతాను, తగ్గిపోతుంది." అన్నాడు.

"అందరూ మిమ్మల్ని ప్రేమించి, మీ స్పర్శకై తపించే భార్యలు కారు!" అన్నది అతని జుట్టు నిమురుతూ.

అతనికదంతా క్రొత్తగా, గమ్మత్తుగా ఉంది. నిజమా అన్నట్లు చూచాడు.

"ఉదయం వెంకన్న పొలం అమ్మదాం అంటున్నాడు, ఏ పొలం!" రూప నిరాసక్తిగా చెప్పింది. చెరువు క్రింది పొలం విడుదల కావటం, యాదగిరి దాయాదినని రావటం– అంతా చెప్పింది.

"ఓహో! ఇప్పుడా పొలం అమ్మవలసిన అవసరం ఏమొచ్చింది!"

"హరికృష్ణకు డబ్బు పంపాలి. శర్మిష్ఠకు ఫీజులు కట్టకూడదూ ?"

అతను ఒక్క నిముషం ఆమె వంక చూచాడు.

"ఆ డాక్టరుగారికి మీ చెల్లెలినిచ్చి వివాహము చెయ్యాలనుకుంటు



న్నారా ?"

"అవును" అన్నది అతని భుజాలపై చేతులువేసి.

అతను ఆలోచిస్తూ ఉండిపోయాడు.

ఆమె వెళ్ళి తలుపులన్నీ వేసి వచ్చింది. అతను లుంగీ చుట్టుకుని, తన మంచంపై వాలిపోయాడు

రూపకూడా వచ్చి అతని ప్రక్కన పడుకుంది.

"నన్నింత మూర్ఖుడు, పనికిమాలిన రాక్షసుడనుకుంటున్నావా?" తీక్షణంగా అడిగాడు.

ఎప్పుడు కోపం వస్తుందో, యెప్పుడు శాంతి పడతాడో ఆమెకు అనూహ్యంగా ఉంది.

"ఇప్పుడేం చేశాను !" కలవరపాటుగా అడిగింది

"నీ కింత పెద్ద గాయం అయి నీరసంగా ఉంది కదా..." అతని అమాయకతకు నవ్వుకుంది.

"ఏమండీ, భార్యాభర్తలు కోరికలతోనే ఒకే మంచంపై పడుకుంటారని యెందుకు అనుకుంటారు? అనురాగం, ఆత్మీయత, అంతకు మించిన మానసిక బంధం ఉండదా ?" అన్నది.

అతను ఏదో క్రొత్త విషయం విన్నట్లు చూచాడు. తన బాల్యం గుర్తుకు వచ్చింది. తల్లి దొంగలా గదిలోకి వెళ్ళి వచ్చేసేది. అవి చెప్పి రూప ముందు చులకన కాదలుచుకోలేదు.

అతను కళ్ళు మూసుకున్నాడు.

"ఏమండీ, ఒక్క సారి కేశవరావు అంకుల్ దగ్గర కెళ్ళిరానా ?"

"అలాగే వెళ్ళు." అన్నాడు నిర్లక్ష్యంగా.

తాను తీసుకు వెళతానంటాడేమోనని ఆశించిన రూపకు, నిరాశే యెదురయింది ఇటు తిరిగి దిండులో తలదూర్చి రెండు కన్నీటి బొట్లు రాల్చింది.

# 20

"ఏమోనమ్మా! నువ్వెంత చెప్పినా నాకు నమ్మకం కలుగటం లేదు. మీ బాబాయివాళ్ళ హత్యలో అతని తండ్రి చేయి ఉందంటారు." అన్నది అలువేలు, కేశవరావు భార్య.

"ఉండొచ్చు పిన్నీ! కాని ఆయన మాత్రం, అలాంటివారు కాదు!" అన్నది, ఆమె దురుద్దేశం యెలా దూరం చెయ్యాలో తెలియక.

"సరేలే. నీకా నమ్మకం ఉంటే కాదన్నదెవరుకాని ముందు ముందు ఈ వివాహం చేసుకున్నందుకు విచారిస్తావేమోనని. యెంత చిక్కిపోయావో చూడు. వారం రోజులుండి వెళ్ళు."

"అలాగే పిన్నీ!" అన్నప్పుడు ఆమె హృదయము చిన్న సూది గ్రుచ్చుకున్నట్లు అయింది. తను ఉన్నా, లేకపోయినా ఆయన సరదాలకేం తక్కువ! నిట్టూర్చింది.

"వంటింట్లో యెందుకమ్మా, ఏదయినా చదువుకో పో. మీ అంకుల్ రాగానే వడ్డిస్తాను." అన్నది.

రూప లేచి బయటి గదిలోకి వచ్చింది. డ్రాయరు సొరుగు లాగి హరికృష్ణ ఉత్తరం తీసింది.

"రూపా!

నీ దగ్గరుంటే పాదాలు కడిగి తలపై పోసుకోవాలనిపించింది. నిజంగా నాకు పునర్జన్మ నీ వల్లే దొరికింది. దాదాపు కోలుకున్నట్టే లెక్క. ఈ సంఘటనవల్ల మరో సంవత్సరం ఆలస్యం అవుతుందేమో. మా స్నేహితుడు ఆశ్చర్యపోయాడు, తన కుటుంబానికి ఇంత ప్రాంప్ట్‌గా డబ్బు అందుతున్నందుకు, 'నా బెటర్ హాఫ్ అంటే ఏమనుకున్నావ్' అనుకున్నాను సగర్వంగా. చెయ్యి ఇంకా ఫ్రీగా వ్రాయనీయటంలేదు. ఉండనా మరి స్వీట్.........నీ హరి."

ఆమె ఉత్తరం మడిచిపెట్టి నిట్టూర్చింది.



"హరీ! నన్ను క్షమించు...నన్ను క్షమించు. మీ ఇద్దరికీ ద్రోహం చేస్తున్నానేమో. అది మీ మంచికేనని మీరు గ్రహిస్తే చాలు." అనుకుంది.

"ఏమ్మా! భోజనం చేద్దామా?" కేశవరావు వచ్చాడు.

"పదండి అంకుల్!" ఆమె ఉత్తరం అక్కడ పెట్టి లేచింది.

"నీ గొంతు అలా ఉందేం రూపా?"

"అబ్బే, ఏం లేదు. ఏటో జలుబు!" తప్పించుకోబోయింది.

"చూడమ్మా! నా నుండి జవాబు దాచలేవు. హరి ఉత్తరం చదివి అప్‌సెట్ అయ్యావు కదూ."

"అంకుల్! నేను మనిషినే, మరను కాను!" అన్నది తల వంచుకుని. అతనేం మాట్లాడలేదు.

ముగ్గురూ భోజనము ముగించారు. ఆ రోజు ఏటో హిందీ సినిమాకు వెళ్ళి వచ్చారు. ఆమె ఉత్తరం తెచ్చుకుని హరికి వ్రాసింది.

అలాగే శర్మిష్ఠకూ వ్రాసి పడుకుంది.

"అది కాదు రూపా! నగలు అమ్మవలసి వచ్చేలా ఉంది."

"అమ్మేయండి అంకుల్. ఆయనతో పొలం విషయం చెప్పాను. అమ్మే ఏర్పాటు చేస్తారేమో అని నేను అనుకుంటున్నాను!" అన్నది పెన్నుకు క్యాప్ పెడుతూ.

"మనకే ఉండనీ అంటే!" అన్నాడు.

"అలా యెందుకంటారు అంకుల్?"

"నాకు మీ వాళ్ళేం ఇచ్చారంటే!"

నిజమే. అప్పుడు తన ప్రణాళికంతా తల క్రిందులవుతుంది.

"ఆ యాంగిల్లో నేను ఆలోచించలేదు, అంకుల్!" ఆమెకు యెక్కడలేని దిగులు పుట్టింది.

"అలా జరిగితే ఏం చేయాలో ఆలోచిస్తాను." అన్నది ఆమెకు రాత్రంతా నిదురరాలేదు.

తన హొయలు, మంచితనం చూపించి, రాయలును వలలోకి లాగ

బోయి తనే సాలెగూటిలో చిక్కుకోలేదు కదా!

తను నిజంగా ఆలోచించిందా!

అతనికి తను, ఇతర స్త్రీలు అంతా ఒక్కటే! తను వస్తానంటే వద్దంటే యెంత సంతోషించేడు! ఈ రాత్రంతా ఆ షడ్డీ ఓడే స్త్రీలతో కే విలాసాలలో మునిగి ఉండొచ్చు.

రాత్రంతా దొర్లి, దొర్లి నాల్గు గంటలకు నిదురబోయింది.

"రూపా! అమ్మాయ్..." అలువేలు లేపింది.

"అబ్బా! ఉండు పిన్నీ మరో గంట పడుకోవాలి."

"అది కాదమ్మా! నీ కోసం యెవరో వచ్చారు!" అన్నది.

"నా కోసమా!" లేచి కూర్చుంది తన కోసం వచ్చే వారెవరు!

"యెవరు పిన్నీ?"

"నాకు తెలియదమ్మా, ప్యాంటు, షర్టు వేసుకున్నాడు."

"జగదీష్ కాదు కదా!" ఆమె లేచి, పమిట సర్దుకుని బయటికి వచ్చింది. హాల్లో వార్తా పత్రిక చూస్తున్న వ్యక్తిని చూచి, ఆమె కాళ్ళకు బ్రేకులు వేసినట్లు ఆగిపోయింది.

"ఎవరమ్మా?" వెనుకే వచ్చిన అలువేలు మెల్లగా అడిగింది.

"పిన్నీ! మీ అల్లుడుగారు...ఏమండి, బాబాయ్ భార్య!" అన్నది అంచులు మించిన ఆనందంతో.

"ఓ...నమస్కారం..." అన్నాడు.

"నమస్తే బాబూ! నేను చూడలేదుకదా, గుర్తుపట్టలేదు!" అన్నదామె భుజాల మీదుగా పమిట లాక్కుని.

"అంకుల్ వాకింగ్‌కు వెళ్ళినట్టున్నారు కూర్చోండి ఇప్పుడే వస్తాను" అని కంగారుగా పెరట్లోకి వచ్చింది. ఆమె ముఖం కడుక్కుని వచ్చింది.

"అదేమిటమ్మా రూపా! శర్మకి, మీ బాబాయికి కళ్ళు లేవా? అతను అచ్చు విలన్‌లా ఉంటాడని చెప్పారు!" అన్నదామె టీ కలుపుతూ.



"ఏమో పిన్నీ..." నవ్వింది, టీ కప్పులు తీసుకుని. పిల్లలు చదువటం లేదని మెట్లు గదిలో పైన ఏర్పాటు చేశారు. అందరూ అక్కడే ఉన్నట్టున్నారు. పెద్దబ్బాయి మాత్రం బెంగుళూరు ట్రిపింగ్ వెళ్ళాడు. అందుకే ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది.

టీ తెచ్చి అతని ముందు పెట్టింది.

"ఏడు గంటల వరకు నిదుర పోవటానికింత దూరం రావాలా?" అన్నాడు టీ కప్పు తీసుకుని.

"అది కాదండీ, రాత్రంతా నిదురపోలేదు!" అన్నది తను టీ సిప్ చేస్తూ.

"నేను యెన్ని సీసాలు ఖాళీ చేశాను, యెందరిని ఇంట్లోకి పిలిచాను- అనే ఆలోచించావు కదూ?"

"అలా యెందుకనుకుంటున్నారు?" అన్నది ఉలిక్కిపడి.

అతను నవ్వాడు.

ఆ నవ్వులో యెన్నో అర్థాలు స్ఫురించాయి. ఇద్దరూ టీ త్రాగారు

"వెళదాం పద." అన్నాడు అతి మామూలుగా.

ఆమె అతని కళ్ళల్లోకి చూచి, విచలిత అయింది. భాష కందని భావం చదువ కల్గింది.

నువ్వు లేని ఇల్లు శూన్యం అన్నట్టున్నాయి ఆ చూపులు.

"పిన్ని, అంకుల్ ఓ వారం రోజులుండ మంటున్నారు."

"అయితే ఉండు." అతను చివ్వున లేచాడు.

"నాకుండాలని లేదు." అతని కాళ్ళకు బంధం పడింది వెనక్కువచ్చి కూర్చున్నాడు.

"త్వరగా తయారవ్వు మరి!" అన్నాడు. ఈ సారి రూప పరీక్షగా చూచింది. మీసాలు ట్రిమ్‌గా ఉన్నాయి. అతనికి ఉన్న ఒక్క ఖరీదయిన ప్యాంటు వేసుకున్నాడు. తల శ్రద్ధగా దువ్వుకున్నాడు.

"అంకుల్ రానీ!" అన్నది, కప్పులు తీసుకుని లేస్తూ.

"ఏయ్ మొద్దూ! నాకు పరాయి వాళ్ళింట్లో ఉండే అలవాటు లేదు అందుకని ఆయన భోజనానికి ఉండు, అని మర్యాదలు చేస్తే ఉంటాననేవు!" అన్నాడు.

"సరేలెండి!" అన్నది. కప్పులు లోపల పెట్టి, పిల్లలకు చెప్పింది బావగారొచ్చారని. వాళ్ళు ఓ ఆట ఆడిద్దామని వచ్చి, రాయలు గంభీర వదనం చూచి నమస్కరించి వెళ్ళిపోయారు.

కేశవరావు రాగానే నమస్కరించాడు రాయలు. ఇబ్బందిగా కదిలాడు, కేశవరావు ఆనందం ఇంతా, అంతా కాదు.

"బావున్నావా నాయనా!"

"ఊఁ!" అన్నాడు. రూపను, తన వివాహం రోజున కొంప మునిగినట్టు మందలించటం గుర్తుకు వచ్చి మరీ ముడుచుకుపోయాడు.

"అమ్మాయ్ రూపా! అల్లుడుగారు వచ్చారు. ఇద్దరూ రెండు రోజులుండాలమ్మా. టీ త్రాగారా?" ఆయన హడావుడి పడ్డాడు.

"ఆ...ఆఁ...త్రాగాం అంకుల్. వారికేదో అర్జంటు పనిట. మేము వెళ్ళిపోతాం!" అని బ్యాగు సర్దుకుని వచ్చింది రూప.

"రూపా!" ఆశ్చర్యంగా చూచాడు.

"ఇంక బలవంతం పెట్టకు బాబాయి, మరోసారి వస్తాం!" అన్నది.

"నీ ఇష్టం!" అన్నాడు ఆయన నిరుత్సాహంగా.

"రూపక్కా! సినిమాకు తీసుకువెళతానని చీట్ చేస్తున్నావ్!" చిన్న పిల్లలు గోల చేశారు. వారికో పదిరూపాయలు ఇచ్చింది.

"ఫలహారం అయినా చేయండి బాబూ!" ఆమె బ్రతిమాలింది.

"మరోసారి వస్తాం." లేచాడు రాయలు.

ఇద్దరూ బయటికి వచ్చాక ఆటోరిక్షాను పిలిచాడు అతను. రూప ఆశ్చర్యంగా చూచింది. మోటార్ బైక్ వెనుక కూర్చోవచ్చు. ఈ మనిషికి అదికూడా తెలుసో లేదో!

"ఆటో యెందుకండీ..."



"యెక్కు..." అతను విసుగ్గా చూచాడు. ఆమెకు అవమానంగా ఉంది. ఆటో యెక్కింది. ఆటో వెళ్ళి అతను చెప్పినట్టు కాచిగూడాలో ఓ ఇరుకు సందులో ఆగింది. అతను డబ్బులిచ్చాడు.

"ఇదెవరిల్లు?" ఆశ్చర్యంగా చూచింది.

"నా స్నేహితుడిది. నాకు కొంచెం పని వుంది. ఎలక్ట్రిసిటీ ఆఫీసుకు వెళ్ళాలి!" అన్నాడు, హారన్ కొడుతూ.

ఓ పదేళ్ళ కుర్రాడు వచ్చాడు.

"ఒరేయ్ సన్యాసీ! ఈవిడను లోపలికి తీసుకువెళ్ళు, నేను మధ్యాహ్నం వస్తాను!" అని ఓ పది రూపాయలు అతనికిచ్చాడు.

"ఇంతకాడికి నన్నక్కడే ఉండనియ్యకూడదూ!" ఆమె ప్రశ్నకంటే ముందే జావా దూసుకుపోయింది.

రూపకు కళ్ళ నీళ్ళ పర్యంతం అయింది. అదే ఆటో యెక్కి వెనక్కు వెళ్ళిపోదామన్నంత కోపం వచ్చింది.

"తన కోపమే తనకు శత్రువు, తన శాంతమె తనకు రక్ష..."

ఉలిక్కిపడి చూచింది. ప్రక్కింటి బాల్కనీలో నిలబడిన కుర్రాడు గడ, గడ చదివేస్తున్నాడు.

మెల్లగా గదిలోకి అడుగు పెట్టి ఆగిపోయింది. గది నిండా పేక ముక్కలు, సిగరెట్టు పీకలు పడి ఉన్నాయి.

"నేను ఊడుస్తానమ్మా" సన్యాసి పరుగెత్తుకొచ్చారు. గదంతా వెగటు వాసన వ్యాపించింది.

ఊడిపించి, తుడిపించి, అక్కడున్న స్టూల్ లాక్కుని కూర్చున్నది.

"సన్యాసీ! రెండు అగరొత్తులుంటే వెలిగించు" అన్నది.

"అట్లనే..." వాడు అగరొత్తులు వెలిగించాడు. ఏదయినా పుస్తకం దొరుకుతుందేమోనని అటు, ఇటు చూచింది. దూరంగా దొర్లించి

పెట్టిన ఓ పుస్తకం కనిపించింది. ఆమె అది తీసుకుని చూచింది. కళ్ళు తిరగినంత పనయింది.

దాన్నిండా స్త్రీని వివిధ కోణాలలో నగ్నంగా చిత్రించిన బొమ్మలే.

మరో పేజీ తిరగవేసింది. కళ్ళు మూసుకుని దూరంగా గిరాటు వేసింది

"ఛ...ఛ...ఏమిటీయన ఉద్దేశం! అన్ని కళలతోపాటు పేకా తారా ఖర్మ!" అనుకుంది.

అసహనంగా ఎదురు చూస్తూ కూర్చుంది. ఆ కుర్రాడు వెళ్ళి కూరలు తెచ్చి వంట చేశాడు.

"అబ్బాయ్! నీ పేరు సన్యాసని ఎందుకు పెట్టారు? మీ వాళ్ళకు ఇంతకంటే మంచి పేరు దొరకలేదా?" నవ్వుతూ అడిగింది.

ఆ గది కానుకుని ఉన్న వసారాలో స్టౌ మీద వంట చేస్తున్నాడు అతను.

"మరండీ, మాయమ్మకు పిల్లలు బతకలేదండి, ఎవడో సన్యాసి విభూదిచ్చాడండీ, అప్పుడ్నేను బతికేనండి..." వాడి మాటలు వింటున్న రూప భుజంమీద బరువైన చేయి పడటంతో ఉలిక్కిపడింది. కునేగా వాసన గుప్పుమంది.

"ఎవరు?" వెనక్కి తిరిగి చేయి తీసి వేసింది.

ఒకతను నున్నగా దువ్విన తలతో గెడకర్రలా నిల్చున్నాడు.

"కావల్సిన వాడినే. అలా కంగారుపడకు!" సిగరెట్టు పీల్చి, గుప్పు గుప్పుమని పొగ రూప ముఖంపైకి వదిలాడు.

"ఛీ...ఛీ...ఏమిటది..." దూరంగా జరిగింది.

"మావాడి టేస్ట్‌కు మెచ్చుకోవాలి, అంతా కన్య పిల్లలనే పట్టుకువస్తాడు, రాయలు కదూ!" నవ్వాడు అతను.

రూపకు కాళ్ళలో ఒణుకు ప్రారంభం అయింది. అటు, ఇటు చూచింది. బయటి తలుపు ఆగంతకుడు వేసినట్టున్నాడు, వసారా తలుపు



సన్యాసి వేశాడు.

ఆమెకు వాళ్ళు ఏం చేసేవారో అర్థం అయిపోయింది. స్త్రీలను తెచ్చి ఉమ్మడిగా వాడుకునే వారన్నమాట.

ఎంత సిగ్గుచేటు! ఆమె ఆలోచిస్తుండగానే అతను దగ్గరగా వచ్చాడు. ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

"మీ రాయలు ఇక్కడికి తీసుకువచ్చాడంటే మాకు నిన్ను అప్పగించటానికేనే భామా..." ఇంకా నోటితో ఉచ్చరించలేనంత పచ్చిగా మాట్లాడటం మొదలుపెట్టాడు.

రూప రక్తం సల, సల కాగిపోయింది. ఆమెకు భర్త లీలలు అర్థం అయినందుకే ఉక్రోషంగా ఉంది. ఈడ్చి అతని చెంపపై ఒక్కటిచ్చింది. తలుపు తీసుకుని బయటికి వచ్చి, కనిపించిన రిక్షాను కేకవేసి ఎక్కేసింది.

ఆమెను ఉన్నత శిఖరాలనుండి లోయల్లోకి తోసినట్టు అయింది. ఉదయం భర్తను చూచినప్పుడు ఉప్పొంగిన హృదయం ఇప్పుడు లావాలా కుత కుతలాడిపోతుంది.

శుష్కించిన నాగరికతలో భార్యనుకూడా పరాయివాడికి భాగం పెడతారు కాబోలు.

రిక్షా బస్‌స్టాండులో ఆగింది. రుమాలులో మడిచి, జాకిట్లో దాచుకున్న డబ్బులు తీసి ఇచ్చింది కదులుతున్న బస్సు ఆపి ఎక్కింది. ఆమె ఎలా బస్సు దిగిందో, ఎలా ఇల్లు చేరిందో ఆమెకే తెలియదు. తలారా స్నానం చేసింది.

"అయ్యగారు.. తవరు వస్తరో, రారో అని పట్టం పొయ్యండమ్మా!" వీరయ్య అన్నాడు.

"అట్లాగా!" అన్నది జరిగిందేం చెప్పకుండా.

నాల్గు గంటలు అవుతుండగా వాడి పోయిన ముఖంతో రాయలు వచ్చాడు అతను జావా చెట్టుకు ఆన్చి, అహ్లాదమైన పరిసరాలను చూచాడు. అదంతా అడవిలా ఉండేది

లోపలికి వచ్చేసరికి రూప తలార బెట్టుకుంటూ పెరటివైపున్న మెట్లమీద కూర్చుంది.

"ఇడిగో..." అన్నాడు ఆమె వెనుకకు తిరిగింది. ఆ కళ్ళల్లో విస్ఫులింగాలు కురుస్తున్నాయి.

"అతనికి నువ్వు నా భార్యవని తెలియదట..." అన్నాడు సంజాయిషీ యిస్తున్నట్టు.

"మీకు భార్యనని మీకు తెలుసుగా! తెలిసి ఆ ఇంటికి ఎందుకు పిలుచుకు వెళ్ళారు? ఆప్యాయంగా అల్లుడికి చేసిన మర్యాదలు చేస్తే కాదని అక్కడికి ఎందుకు తీసుకువెళ్ళినట్టు ?"

జవాబు ఇవ్వలేనట్టు నిలబడిపోయాడు.

"నాకు తెలుసు. త్రాగి, పేకాడి, పరాయి స్త్రీలను బొమ్మల్లా చేసి ఆడుకునే మీలాంటి వారికి భార్యను పరాయివాడికి భాగం పెట్టినా తప్పు అనిపించదు..." అంతే ఆమె చెంప పగిలిపోయింది

"రాస్కెల్! మర్యాదగా పొరపాటు జరిగిందని చెబుతుంటే పొగరుబోతుగా మాట్లాడుతుందీ." అని బయటికిపోయాడు.

చెంప తడుముకుంటూ నిలబడిపోయింది రూప. తాను కాపాడుకుంటూ వస్తున్న మధురమైన బంధం ముడి సడలినట్టు అనిపించింది.

ఆమె అన్యమనస్కంగానే సాయంత్రం వంట చేసింది. బుగ్గ నొప్పిపుడితే తడుముకుంది. కుంకుడు గింజంత మేరకు రక్తం గడ్డ కట్టింది. అదేమిటో చాలా సేపటికి అర్థం అయింది. రాయలు చేతికి ఉన్న ఉంగరం అప్పుడప్పుడు చుట్టూ తిరుగుతుంది.

అతను చెంప దెబ్బ వేసినప్పుడు ఇటు తిరిగిందేమో! అతను మౌనంగా వీరయ్య వడ్డిస్తే భోజనంచేసి వెళ్ళిపోయాడు.

"తవరండమ్మా," అన్నాడు వీరయ్య.

"నాకు ఆకలి లేదు వీరయ్యా!" అన్నది. తల గోళ్ళతో కొట్టుకుని ముడివేసింది.



"ఎవరి మీదమ్మా కోపం ?"

"నాపై నాకే కోపం వీరయ్యా. అందరు హెచ్చరిస్తున్నా, వినక కోరిన జీవితం ఇది!" అన్నది నిశ్చలంగా.

అతను మాట్లాడలేకపోయాడు.

రూప వెళ్ళి మధ్య హాల్లో మంచంపై పడుకుంది. అతను పిలిస్తే వెళ్ళి అతని హృదయంలో తల దాచుకుని సేద దీరాలని ఉంది.

అతను గదిలో రూపకోసం చూస్తున్నాడు. నిజంగా తనది పొరపాటే. వాడు అంత దరిద్రుడని తెలియదు. ఆమె రోష పడితే కోపంతో కొట్టాడు.

ఛీ...ఛీ... తను మనిషేనా! అని బాధ పడసాగాడు. ఏ చిన్న శబ్దం అయినా ఆమె అని, లేచి ఓదార్చాలని చూచాడు. గంట గడిచినా ఆమె రాలేదు.

అతను లేచి హాల్లోకి వచ్చాడు అటు తిరిగి పడుకున్న రూప కనిపించింది.

'ఊహూ! పొగరు, నేను తన కాళ్ళు పట్టుకుంటానని భావన కాబోలు' కోపంగా వెనక్కు వెళ్ళాడు.

అతను సిగరెట్టు నోట్లో పెట్టుకుని అలాగే కూర్చుండిపోయాడు.

ఈ మధ్య అతనలా పెట్టుకోగానే రూప వెలిగించేది.

"ఏడ్చి, మొత్తుకుంటావనుకున్నానే!" అన్నాడో రోజు సిగరెట్టు పొగ ఆమె పైకి వదులుతూ.

"మీరు చిన్నప్పటి నుండి చేసుకున్న అలవాట్లు ఒక్కసారి పొమ్మంటే ఎలా పోతాయి. మెల్లగా మీరే మారుతారు." అన్నది.

"ఊఁ! అంత ధైర్యమా ?"

"ఊహూ!" గర్వంగా అనేది ఈ రోజు ఉదయం లేస్తూనే రూప లేని లోటు కొట్ట వచ్చినట్టు కనిపిస్తూ ఇక ఆగలేకపోయాడు. ఆమెరాగానే, తమ సమావేశం ఎంత మధురంగా ఊహించాడు అంతా తల్లక్రిందులయింది.

"సరే చూస్తాను ఆ పంతం ఏమిటో..." అనుకున్నాడు. అటు, ఇటు పొర్లుతూ చాలాసేపు గడిపాడు.

# 21

పక్షరోజులు గడిచినా ఇద్దరికి రాజీ కుదరలేదు. మౌనంగా అన్ని చేసి పెడుతుంటే మౌనంగా తీసుకుంటున్నాడు రాయలు.

ఆ రోజు ఉపహారం తీసుకుంటుండగా. వీరయ్య వచ్చాడు.

"అయ్యా! అందరు వచ్చిండ్రు."

అతను లేచి మరోసారి తల దువ్వుకుని బయటికి వెళ్ళాడు.

'ఊహూ చేసిన తప్పు చాలక పైగా కోపం' అనుకుంది.

బయటినుండి మాటలు వినిపించాయి. నాయనమ్మ పేరు రావటంతో ఆసక్తిగా విన్నది.

"అయితే మన యాదన్న డైరెక్ట్ ఇంద్రమ్మ వారసుడన్నమాట!" వెటకారంగా అన్నాడు రాయలు.

ఓ నల్గురయిదుగురు పక్కన నవ్వారు.

"ఛ ఏమిటయ్యా నవ్వుతారు? చంద్రయ్య మామా. వారసులంటే ఆస్తి పంచుకోవటానికే ఉంటారా కష్టాల్లో పాలు పంచుకోరా?" అని అడిగాడు.

రూప కుతూహలంగా పరదా కొంచెం తొలగించి చూచింది. ఓ పెద్దాయన కూర్చున్నాడు ఎదురుగా.

"అదేం మాట రాయలూ! కష్టసుఖాలు అన్నీ పంచుకోవాలి!" అన్నాడాయన.

"విన్నావా యాదన్నా?"

"వింటున్న వాళ్ళ కష్టాలు ఏమిటో నాకు చెప్పారా?" అన్నాడు అతను ముఖం గంటు పెట్టుకుని.

"సుఖాలు చెప్పారా? ఈ పొలం కౌలుకు చేస్తున్న అతను



పోయాడు రమ్మని పిలిచారా?" ఎంతో సహనంగా అడిగాడు, రాయలు.

యాదగిరి జగదీష్ వంక చూచాడు.

"రాయన్నా! నువ్వు ఇప్పుడు భార్య తరపున మాట్లాడక, వెంకటప్పయ్య మామ కొడుకులు తల్లి తండ్రిని చూడలేదు. అయినా ఆయన ఆస్తి కొడుకులకు రాలేదా?"

"అవును జగ్గయ్యా! ఇంద్రమ్మకు మనవరాళ్ళున్నారు ఆమె ఆస్తి వాళ్ళకు చెందాలి లేదా పేరు వారసులు కదా. ఆ పిల్లల పెళ్ళి భారం వహించి. ఆ పొలం తీసుకోండి" చంద్రయ్య అన్నాడు.

"అట్లానే కానియ్యి ఒక్క పిల్ల పెండ్లి చెయ్యలేనా?" రోషంగా అన్నాడు యాదగిరి.

"చిన్నమ్మాయి డాక్టరు కోర్సు చదువుతుంది ఆ చదువు చెప్పించాలి. అమ్మాయికి కాబోయే భర్త ఖర్చులు భరించాలి. ఆ తరువాతే పెండ్లి!" వెంకన్న చెప్పాడు.

పచ్చి వెలక్కాయ గొంతులో పడ్డట్టు అయింది, యాదగిరికి.

"చూడు యాదన్నా! ఇంద్రమ్మ కుటుంబానికి, జగానికి ఏవో పాత పగలున్నాయి. తను ఏదో చేయబోయి, చేయలేకపోయాడు. నిన్ను ఉసి కొల్పుతున్నాడు. దాయాదివి అయినంతమాత్రాన ఆస్తిమీద హక్కు వస్తుందనుకోవటం మూర్ఖత్వం!" అన్నాడు రాయలు.

"అవునయ్యా! పసిపిల్లలను తీసుకుని, ఏ పూట ఎవరు తల నరుకుతారో అని అనుక్షణం భయపడుతున్న ఆ వృద్ధురాలికి మేమున్నామని ధైర్యం చెప్పారా ఎవరయినా?" కర్ణీకం చేసే కనకయ్య అడిగాడు.

"మీరంతా సర్పంచని ఆయన పక్షం మాట్లాడగానే అయిపోదు." జగదీష్ లేచాడు.

"జగం! నోరు పారేసుకుని మాట్లాడకు నీ వాళ్ళు దున్నే పొలం ఇంద్రమ్మదే కౌలుకడతావా, కొంటావా అది చెప్పేయ్ తమ్ముడూ!" ఎగతాళిగా అడిగాడు రాయలు.

"ఇంద్రమ్మ పొలాలు నా ఒక్కడి ఆధీనంలోనే లేవు. అందరూ ఎలా చేస్తే నేను అలాగే చేస్తాను." జగదీష్ ముఖం గంటు పెట్టుకుని.

"నా అధీనంలో ఉన్న పొలం కట్నం క్రింద ఉంచేసుకుంటాను." అన్నాడు రాయలు

రూప ఉలిక్కిపడింది పరదాను సలిపింది. కేశవరావు ఊహించినట్టే అంటున్నాడీయన.

"నా కొడుకు అధీనంలో ఉన్న పొలం ధర ఇస్తాం మాకు ఇంద్రమ్మా ఇచ్చినప్పుడు ఉత్త రాయి రప్పే ఉండేది. ఇప్పుడు దాన్ని ఓ రూపుకు తెచ్చాం!" అన్నాడు ఓ రైతు.

"భేష్! అలా ఉండాలి మామ. ఒక్కసారే డబ్బు కావాలనటం లేదు. రెండు, మూడు కిస్తులు ఇస్తే చాలు!" అన్నాడు.

"అందరి దగ్గరకెళ్ళి నేను రమ్మన్నానని చెప్పు వెంకన్నా!"

"ఎవర్ని బాబూ ?"

"అదేనయ్యా, మీ ఇంద్రమ్మగారి పొలాలు చేసేవాళ్ళను. చెఱువు క్రింది పొలం కొనేవారిని కూడా రమ్మను. యాదగిరయ్యకు ఆస్తికావాలి కాని బాధ్యతలు వద్దు పాపం." అన్నాడు.

"ఎవర్నో పిలువటం ఎందుకు రాయలూ! మా పొలానికి ఆనుకుని ఉంది. ఉన్న మగ్గుకు వ్యవసాయమే చేస్తామంటున్నారు. నేను కొంటాను." అన్నాడు చంద్రయ్య.

"బావుండి మామా! నువ్వు కొంటే కావల్సిందేం ఉంది."

"ఓ చిన్న సాయం చెయ్యాలిరా బాబూ రెండుసార్లు డబ్బిస్తాను." అన్నాడాయన.

"దాందేముండి మామా! మీరేకాదు, ఈ ఏరియాలో ఎవరు కొన్నా ఒక్కసారి ఇవ్వలేరు." అన్నాడు.

"నాకు ఓ ఎకరమున్నా ఇప్పించు రాయలూ" అన్నాడు యాదగిరి.

"యిడిగో చూడు యాదన్నా! అందితే జుట్టు, అందకపోతే కాళ్ళు అనే పద్ధతి నాకు నచ్చదు. ఓ పని చేద్దాము. నువ్వు మన పంచాయితీ ఆఫీసు ముందు నిలబడి నాకేంలేదు అని అడిగి చూడు. మొత్తం నీ జోలెలో వేయిస్తాను." అన్నాడు.



"అలా బిక్షం అడుక్కునే ఖర్మ నాకేం పట్టలేదు!" అన్నాడు ఉక్రోషంగా. రూప లోపలికి వెళ్ళి అందరికి టీ పంపింది.

"నాకు చాలా సంతోషంగా ఉందయ్యా. రాయలు శ్రీవల్లి యింటికి కళాకాంతులు అబ్బుతాయి." అన్నాడు చంద్రయ్య.

"అబ్బా! ఈ ఇంటి కాంపౌండు రంగే మారిపోయింది." అన్నాడు కనకయ్య టీ ఊది త్రాగుతూ.

రాయలు గంభీరంగా నవ్వాడు. రూప ప్రక్క కిటికీ దగ్గరకొచ్చింది.

"రాయలు దంతా మేకపోతు గంభీర్యంరా. అది పీడితో సామరస్యంగా కాపురమే చేయదట. ఇద్దరి పడకలు వేరు, వేరట. మనకెందుకు ఆ కనకయ్య ఇటే చూస్తున్నాడు." అంటున్నారు.

రూప ఒక్క నిముషం రాయిలా నిలబడిపోయింది.

తన భర్త ప్రజల మనిషి. ఆయన బాగోగులు, ఆయన జీవితం అందరికి కావాలి. పట్టణాలలో మినిష్టర్లు, ఏమ్మెల్యేలు అయితే ఇక్కడ సర్పంచులు, పంచులు నానుతారు ప్రజల నోళ్ళల్లో.

పనివాళ్ళు ఇంటి రహస్యాలు బయట పెడతారు. ఆ తరువాత అసలు మనుష్యుల మాటలు వినిపించలేదు. అనుమానంగా తొంగి చూచింది. యెవరూ లేరు. పీరయ్య మాత్రం కప్పులు తీస్తున్నాడు. వెంకన్న లేచాడు.

"వెంకన్నా!" రూప పిలిచింది.

"ఏమిటమ్మా ?" అతను లోపలికి వచ్చాడు.

"మన పొలం దగ్గర కూలికి వచ్చే గోపమ్మను ఒకసారి నేను రమ్మన్నానని చెప్పు. పీరయ్యా! కూరగాయలన్నీ మాయం అవుతున్నాయి. ఈ రోజునుండి నువ్వు పొలం దగ్గరుండి, అవి జాగ్రత్తగా చూడు!" అన్నది.

"అమ్మ, మరి ఇంటి పనెట్ల ! పనామె వద్దంటిరి ?"

"ఏం పని వీరయ్యా ! వాకిళ్ళు, పేడ తీయటం చుక్కమ్మ చేస్తుందాయె. పాలు తీయటానికి వచ్చినప్పుడు గోపాల్ నీళ్ళు తోడి వెళతాడు. ఇంట్లో పని, మీ అయ్యగారికి కావల్సినవి నేను అందిస్తాను." అన్నది.

వీరయ్య తలాడించి పొలం దగ్గరకు వెళ్ళిపోయాడు.

"వెంకన్నా ! గోపమ్మ కొడుకు, మన రాత్రి బడికి వచ్చేవాడు. రేపటినుండి మన దగ్గరకు పంపమను !" అన్నది. వెంకన్న వెళ్ళిపోయాడు.

రెండు గంటలకు వచ్చాడు రాయలు.

"వీరయ్యా...ఒరేయ్..." అతను కుర్చీలో కూర్చున్నాడు.

రూప అతని కాళ్ళ దగ్గర చెప్పులు పెట్టి, అతని బూట్లు విప్పటానికి వంగింది.

"ఊం...! చాల్లే పతివ్రతా వేషాలు" కాళ్ళు వెనక్కు లాక్కున్నాడు.

"నేను పతివ్రత వేషాలు వేస్తున్నానా ! అయితే నాదం నాటకం అంటారు ?" నిఠారుగా నిలబడి అడిగింది.

"మరి కాకపోతే ! నిన్ను పని మనిషిగా చూస్తున్నానా నేను ?"

"ఇంటి మనిషిగా చూస్తున్నారా ? వీరయ్య వీధి వరండాలో పడుకుందే నేను లోపలి వరండాలో పడుకుంటున్నాను!" అన్నది.

"నీకు బాగా కళ్ళు నెత్తికి వచ్చాయి." భుజంపట్టి కుదుపుతూ ముందుకు లాగాడు.

ఆమె వెళ్ళి అతని వడిలో పడింది. అంతే, ఇద్దరూ తమ మధ్య ఉన్న పోట్లాట మరచి, మరు నిముషంలో ఒకరిని ఒకరు పెనవేసుకు పోయారు.

"ఏయ్ మొద్దూ ! బయటి తలుపు తీసే ఉంది!" అన్నాడు, ఆమె పెదవులు మరోసారి తడి చేస్తూ.

ఆమె లేచింది బయటి తలుపువేసి వచ్చింది. అతను బూట్లు విప్పుకుని చెప్పులు వేసుకుని బావి దగ్గరకు వెళ్ళాడు.



"ఇదిగో మళ్ళీ మీ స్నేహితుడులాంటి వాడు కనిపిస్తే ఊరుకోను!" అన్నది నీళ్ళు అందిస్తూ.

"అదంతా మరిచిపో. పాత జీవితం తాలూకు నీడలు కొన్నాళ్ళు వెంటాడుతాయి. ఇదిగో నీకు కోపంవస్తే తిట్టు, అరువుకాని, అలా మౌనంగా మూతి ముడేసుకుని కూర్చోకు !" అన్నాడు చేతులు కడిగి, నీళ్ళు ఆమెవేపు దులుపుతూ.

"ఏమండీ ! ఇంట్లోనే ఒక బాత్‌రూమ్ కట్టించుకుందాం."

"అలాగే !" అన్నాడు లోపలికివచ్చి

ఆమె మనసు యెంతో తేలికగా ఉంది.

"వీరయ్య లేడా ?" అతను భోజనానికి కూర్చుని అడిగాడు.

"అతన్ని పొలం దగ్గరకు పంపాను !" అన్నది వడ్డిస్తూ.

అతను ఆశ్చర్యంగా చూచాడు. ఆమె అదేం పెద్ద విషయం కాదన్నట్టు ప్రవర్తించింది.

"మరి నా పనులు యెవరు చేస్తారు ?" అతనికి కోపం వచ్చింది సర్రున.

"నేను చేస్తాను లెండి. మీకు ప్రత్యేకంగా చెయ్యవలసిన పనులు రెండే కదా. ఒకటి ఒళ్ళు మసాజ్ చేయటం, రెండు, నాటుసారా తీసుకు రావటం..."

"నీకు నిజంగా పొగరు..." జడ పట్టి లాగాడు.

"మీ సారా సాయంత్రం తెస్తాడు. మనిద్దరి జీవితాలు అతను హరి కథలు, బుర్ర కథలు చేసి ప్రచారం చెయ్యనక్కర లేదు" అన్నది.

అతను ఆమె జడ వదిలేశాడు. అర్థం అయిపోయింది, వాడేటో మాట్లాడుతున్నాడని తల వంచుకుని భోజనానికి ఉపక్రమించాడు.

"అతడినిప్పుడేం అడగవద్దు ఈ పేచీలు, అహంకారాలే శత్రుత్వం కలుగజేస్తున్నాయి!" అన్నది నిదానంగా.

అతను భోజనం చేసి వెళ్ళి విశ్రాంతిగా పడుకున్నాక తనూ

భోజనం చేసి వెళ్ళింది.

"ఇదిగో..." అతను తను బయటికి తీసుకువెళ్ళే బ్యాగు ఆమె చేతిలో పెట్టాడు.

"ఏమిటి ?" విప్పి చూచింది. డబ్బుంది దాంట్లో.

"మీ పొలానికి అడ్వాన్స్ ఇచ్చారు." అన్నాడు నిదానంగా.

ఆమె మాటలు రానట్టు అతని వంక చూస్తూ ఉండిపోయింది.

"ఇంత డబ్బు ఇంట్లో పెట్టుకుని కూర్చోవటం అంత మంచిది కాదు నీ పేర అకవుంట్ తీసి వెయ్యనా ?" అని అడిగాడు.

"ఇది రేపు అంకుల్‌కు ఇచ్చివేయండి, అతనే వాళ్ళిద్దరికి పంపే ఏర్పాటు చేస్తాడు." అన్నది. జిప్ వేస్తూ.

"సరే, ఆ రోజు ఏం జరిగిందంటే..." ఆమె చేతిని చేతిలోకి తీసుకుని చెప్పబోయాడు.

"నాకు తెలుసు మీరేం చెప్పొద్దు !" అన్నది నవ్వుతూ.

"యెప్పుడూ మీరు అమ్మాయిలను వెంటేసుకుని వెళ్ళేవారు, వారు నన్ను చూచి అలాంటి అమ్మాయి అనుకున్నారు ఆ తరువాత మీకు క్షమార్పణ చెప్పారు అవునా ?"

"అవును, అంతేకాదు మళ్ళీ అలాంటి తప్పు చేయనని కూడా ప్రమాణం చేశారు. నన్ను క్షమించినట్టేనా ?" అన్నాడు.

"నా క్షమార్పణ కంత విలువ ఇస్తారా ?"

"నిజంగా నువ్వు మొద్దువే !" అతను ఆమె చెయ్యి తోసివేసి అటు తిరిగి పడుకున్నాడు.

ఆమె చిన్నగా నవ్వుకుంది. అప్పుడే కోపం. అప్పుడే శాంతం ఏం మనిషో అనుకుంది.

"తలుపు దగ్గర వేసి వెళ్ళిపో..." అన్నాడు కోపంగా.

ఆమె లేచి అలాగే చేసింది.

"ఏయ్ మొద్దు..." కోపంగా పిలిచాడు. ఏమిటన్నట్టు చూచింది.



"మీ నాయనమ్మ టైగర్ ఇంద్రమ్మ నీకేం నగలు చేయించ లేదా?"

"నేను నగలు లేక వికారంగా కనిపిస్తున్నానా ?"

"నీకు నగలు లేకపోవటం కూడా ఓ నేరం అయింది. నా స్నేహితుడు ఏమన్నాడో తెలుసా, 'నీ భార్యంటే జమీందార్ల కూతురు మరీ అంత నాసిరకంగా ఉండదనుకున్నా'నా' అన్నాడు !" అన్నాడు.

"అది కాదండీ, వాళ్ళ చదువుకు డబ్బు కావాలి కదా. అందుకని అమ్మమని అంకుల్ కిచ్చాను. ఈ డబ్బు ఇచ్చి, నా గొలుసు, గాజులు ఇవ్వమనండి !" అన్నది దగ్గరగా వచ్చి.

"ఓయ్ ! ఈ రాయలు శ్రీకృష్ణదేవరాయలు కాకపోయినా అభిమానం లేనివాడు కాదోయ్. మీ నాయనమ్మ ఇచ్చిన నగలు నీ కిస్తానా! నేనే ఇస్తాను" అతను జేబులో నుండి ఓ చిన్న కాగితం తీసి, మళ్ళీ షర్టు గొయ్యకు తగిలించాడు.

"ఏమిటిది ?"

"సూత్రం తాడు" అన్నాడు. అతను అండివ్వబోయాడు. ఆమె మెడ వంచింది. అది మెడలో వేసాడు.

రూప దాన్ని చూచుకుంది. లేటెస్టుగా వచ్చిన డిజైన్ అది. మొన్న తను పట్నం వెళ్ళినప్పుడు కేశవరావు ఇంటికి వచ్చిన వారెవరో అంటుంటే నిరాసక్తిగా చూచింది.

"టేస్టుకూడా ఉందే."

"ఆ విషయం నిన్ను వివాహం చేసుకొమ్మని అడిగిన నాడే తెలుసుకో లేదా ?" అన్నాడు అల్లరిగా.

"గొప్ప పని చేశారండి." అన్నది నవ్వును దాచుకుంటూ.

"నవ్వవోయ్...నవ్వు" అన్నాడు గిలిగింతలు పెడుతూ. ఆమె కిల, కిల నవ్వింది గొలుసుతో మెరిసిపోతున్న ఆమె మెడను ముద్దు పెట్టుకున్నాడు రాయలు.

'అలక తరువాత కలయిక ఇంత కమ్మగా ఉంటుందనుకుంటే

రోజూ అలక సాగించేదాన్ని' అనుకుంది.

ఇద్దరూ ఏదో లోకంలో తేలుతుండగా, బయట తలుపు కొట్టారు. రాయలు లేచి తలుపు తీశాడు.

"రాయన్నా! గుడి దగ్గర పోరంబోకులో వేసిన గుడిసెలు పీకిస్తున్నాడు జగదీష్, ఏమిటంటే, యెవడు వస్తాడో రానీ, మీ పంచాయితీ బోర్డు ప్రెసిడెంటును పాతి పెడతాను అంటున్నాడు!" అన్నాడు భయంగా.

"వాడు చేస్తున్న అఘాయిత్యాలు చూచి, చూడనట్టు ఊరుకుంటే మితి మీరి పోతున్నాడే!" అని షర్టు వేసుకుని అలాగే బయలుదేరాడు.

"ఏమండీ ఒంటరిగా..." దిగులుగా చూచింది.

"ఏం నువ్వు వెంట వస్తావా!" అన్నాడు ఎగతాళిగా ఆమె చిన్నబుచ్చుకుందని గ్రహించి వెనక్కు వచ్చాడు.

"నీవు లేకుంటే నీ విచ్చే ధైర్యం నా వెంట ఉంటుంది!" అని బుగ్గమీద చిటికవేసి వెళ్ళిపోయాడు.

ఆమె అలాగే దిగులుగా నిల్చుంది. ఊరి ప్రజలు అమాయకులు అంటారుగాని, వాళ్ళంత విచిత్రమైన వ్యక్తులుండరు. ఊర్లో అందరి విషయాలు వాళ్ళకే కావాలి. కక్షలు, ద్వేషాలకు ఆలవాలమయిపోయింది.

రెండు గంటల తరువాత దూరంగా వస్తూ కనిపించాడు రాయలు, అతని వెంట ఓ పాతిక మంది దాకా ఉన్నారు. ఆమె ఇంట్లోకి వచ్చి తలుపు చేరవేసి తేలికగా నిట్టూర్చింది.

## 22

రూపకు అన్నం సహించటంలేదు రాయలు స్వభావం అంచనా వెయ్యలేకపోతోంది. ఒకరోజు ఉత్సాహంగా ఉంటే ఒకరోజు గంభీరంగా ఉంటాడు.

నాల్గు రోజుల క్రితం పొలం కొన్న వారిచ్చిన మొత్తం డబ్బు



తీసుకుని హైదరాబాద్ వెళ్ళాడు. ఆ రోజు నుండి అతను ముభావంగా ఉన్నాడు.

ఏమయిందని అడిగి అలరించటానికి తనకు ఓపిక లేకుండా పోయింది.

ఉదయం ఫలహారం చెయ్యకుండా వెళ్ళిపోయాడు పోతే పోనీ, తను ప్రతి నిముషం జాగ్రత్తగానే ఉంటుంది.

కేశవరావు తొందరపడి ఏమీ అనడు. మరేమయి ఉంటుంది?

ఈయనే కాంప్లెక్స్‌తో బాధ పడుతున్నారా?

అదే అయి ఉంటుంది...మనసు యెదురు తిరిగింది. ఇంతకు క్రితం వెళ్ళి వచ్చి వాళ్ళ ఆదరణ, ఆప్యాయత గురించి, అరగంట తిరించి, ఊరించి చెప్పాడు. మరిప్పుడేం అయింటో, ఆమెకు కూర్చోవాలని పించలేదు. అలాగే పడుకుంది.

అతనే తను పోట్లాడాలని అనుమతి ఇచ్చాడు. ఏమయింటో పోట్లాలి నిజంగా అనుకుంది.

మనసంతా చిరాకుగా, చీదరగా ఉంది. అదే సమయాన రాయలు వచ్చాడు. రూపను అడగకుండానే వెళ్ళి నీళ్ళు తెచ్చుకున్నాడు. పెరడు మెట్లు దగ్గరున్న అరుగుపైనే గోడలు పెట్టి బాత్‌రూమ్ కట్టించారు.

"నీళ్ళు పెట్టమని అడగొచ్చుగా!" అన్నది కోపంగా.

అతను ఒక్కసారి తలెత్తి చూచి, నీళ్ళు పోసుకున్నాడు. తుండు తలుపుమీద వేసింది.

సాయంత్రం భోజనానికి ముందు స్నానం చేసి ఓ కప్పు వేడి టీ త్రాగటం రాయలుకు అలవాటు, ఇదివరకయితే ఆ టైములో బ్రాందీయో విస్కీయో త్రాగేవాడు అది దొరక్కపోతే నాటుసారా త్రాగేవాడు.

"ఘాటు పదార్థాలు మానిపించేవు. కాస్త హాయిగా టీ అయినా ఇవ్వు" అనేవాడు. అందుకే నీరసంగా ఉన్నా టీ తయారు చేసింది. అతను ఆ టీని చూడనట్టే తల తుడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

"అసలు యెందుకో ఈ కోపం చెబుతారా ?"

"నా అసమర్థతకు" అన్నాడు బనియన్ వేసుకుంటూ.

"నేను మొద్దునండీ, నాకు అలా చెబితే అర్థంకాదు!" అన్నది.

"నువ్వు కాదు మొద్దు. నేను, కాకపోతే ప్రపంచంలో స్త్రీలకు కరువు వచ్చినట్లు నిన్నె యెందుకు చేసుకుంటాను ? ఇన్ని అవమానాలు యెందుకు భరిస్తాను ?" అన్నాడు చురుకుగా.

"నేను మిమ్మల్ని అవమానం చేసానా ?" నిలబడలేనట్టు తలుపు పట్టుకుని నిల్చుంది.

"ఆ డాక్టర్ హరికృష్ణ ఉత్తరాలు కేశవరావు అడ్రసుకు రాయించుకోవటం నన్ను అవమానించటం కాదా ? నా గురించి వాళ్ళేమనుకుంటారన్నది ఒక్కనాతయినా ఆలోచించావా ! నీ కన్నె చెర వదిలించుకోవటానికి నన్ను వివాహం చేసుకున్నావు కదూ..." అతను ఒక్కొక్క మాట అడుగుతుంటే అతని ముఖంలో రంగులు మారుతున్నాయి.

"ఏమండీ..." రెండు అడుగులు గడిలోకి వేసింది.

"మీ అంత గొప్ప చదువులు చదువకపోయినా. మంచి, చెడు అర్థం చేసుకునే జ్ఞానం ఉంది. మనుషుల్ని అంచనా వేసే శక్తి ఉంది. ఒక మగాడు ఉత్తరం రాస్తే వాడికి, నీకు సంబంధం అంటగట్టే సంకుచితుడిని కాను." అని ఆమెను దూసుకుంటూ బయటికి వెళ్ళిపోయాడు.

అతని మనసంతా చేదు మింగినట్టుంది. బాల్యమంతా నిస్సారంగా గడిచిపోయింది. యవ్వనంలో అడుగుపెట్టి పెట్టకముందే పెడత్రోవలో, చెడు అలవాట్లు అయ్యాయి

రూప సహచర్యంలో తను ఒక మనిషిగా మారానని అనుకున్నాడు. ఆమె అభిమానంలో అమ్మనుచూచాడు. ఆత్మీయులను దర్శించాడు! కాని ఆమెకు తనపై నమ్మకంలేదు భార్యాభర్తలంటే, వారి మధ్య ఉండేది. శారీరక సంబంధం కాదండీ ! మధురమైన అనురాగ బంధం అన్న రూపేనా ! తనను ఏమనుకుంటుంది ?



అనుమానించాలంటే డాక్టరు హరికృష్ణ ఉత్తరమే అక్కరలేదు. ఆమెను గురించి ఊళ్ళో యెన్ని పుకార్లు !

అతను మెల్లగా పంచాయితీ ఆఫీసుకు వెళ్ళాడు. అక్కడ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేసేటతను రేడియో పెట్టుకుని కూర్చున్నాడు.

"రండి సార్ ! మీరీ మధ్య రాక చాలా రోజులయింది." అన్నాడు.

"ఏమిటి విశేషాలు ?" అన్నాడు యధాలాపంగా.

"ఒక మాట మాత్రం నిజం చెప్పాలి సర్! మీ శ్రీమతిగారి ఆధ్యర్యములో పిల్లలు నేర్చుకున్న అక్షరాలుకూడా మన బడికొచ్చి మరిచిపోయారు !" అన్నాడు నిజాయితీగా.

"ఆ మాట అనటానికి సిగ్గెలా లేదయ్యా నీకు? మీరంతా ఏం చేస్తున్నట్టు ?" అన్నాడు.

సర్పంచి వచ్చాడంటే నల్గురు చేరారు అక్కడికి.

"నేనేం చేయనండి ? నాల్గు తరగతులు, ఇద్దరమే ఉపాధ్యాయులం. ఇది పల్లెటూరని, ఆ రెండో ఆయన యెప్పుడూ సెలవు మీదే ఉంటాడు! ఒక్కడిని యెన్ని పనులు చేయను ?" అన్నాడు వినయంగా.

"ఏంటో పంతులూ! ఆ రూపమ్మ బడిలోకి వెళ్ళినప్పుడు పద్యాలు పాటలు చెప్పేవారు. ఇప్పుడు గోళీకాయలు, చిడత గిల్లీలు ఆడుమన్నారు." ఒక రైతు అన్నాడు.

"మరి ఆ బడిలో యెందుకు చేర్పించరు?" మరొకతను ఆశ్చర్యంగా అడిగాడు.

"అదేండి రాయలూ ! నువ్వు కాదు వద్దన్నది." మరొకతను ఆశ్చర్యంగా అడిగాడు.

"నేనా ! వద్దన్నానా ?" ఆశ్చర్యంగా చూచాడు రాయలు.

"అవును సార్. జగదీష్ అయ్య, వారి మిత్రులు గత సంవత్సరం

వచ్చి పిల్లల్ని బలవంతంగా అక్కడినుండి తెచ్చి మన పాఠశాలలో చేర్పించారు !" ఉపాధ్యాయుడు చెప్పాడు.

రాయలు ఆశ్చర్యానికంతు లేదు.

రూప తన గురించి ఏమనుకుంటుంది ఓ గాడ్ ! అనుకున్నాడు.

అతని కోపం మెల్లగా కరిగిపోయింది. హరికృష్ణ ఉత్తరాలు ఇంటికి వస్తే తను అందరూ అనుకునే పుకార్లు నిజమే అనుకునే వాడు. రూప ముందు చూపుగలది అనుకుని, అక్కడ పిచ్చా, పాటి మాట్లాడి ఇంటి ముఖం పట్టాడు.

"బాబా..." టార్చిలైటు పట్టుకుని, వీరయ్య యెదురు వచ్చాడు.

"ఏరా, నేను చిన్న కుర్రాడినా, తప్పిపోయానా ?" అన్నాడు కాస్త విసుగ్గా.

"అది కాదయ్యా ! ఏదో ముసలి సన్నాసిని, నోరు ఆపుకోలేక, ఏవన్నానో ఏంటో, అమ్మ ఇంట్లో మాటలు బయట అంటున్ననని పొలం పంపుతుంది ఇంట్లో ఈ టయాన పెద్ద దిక్కుండాలి!" అన్నాడు, రాయలు వెనుక నడుస్తూ.

"ఈ టయాన ఏమిట్రా నీ ముఖం !" అర్థంకానట్టు అడిగాడు.

"అదే అయ్యా నెల తప్పినప్పుడు. రోజుకి రోజుకి పీక్కుపోతుంది. అమ్మ !"

ఒక నిముషం తరువాత అతని భావం అర్థం అయింది.

రాయలు ఒళ్ళు ఒక్కసారి గగ్గురు పొడిచింది.

తను...తండ్రి అవుతాడా ! తాడూ బొంగరం లేని తన జీవితానికో అర్థం ఏర్పడుతుందా ?

అతనికి ఆనందంతో వెర్రిగా అరవాలని ఉంది. కాని అది రోడ్డని తను బాధ్యత గల వ్యక్తి అనీ నిగ్రహించుకున్నాడు.

అతను గదిలోకి వచ్చేసరికి మంచంపై ఓ ప్రక్కన ఒరిగి పడుకునుంది రూప.



"రూపా !"

రూప కళ్ళు విప్పలేదు. తనను రూపా అని చనువుగా పిలచే పురుషుడు హరి మాత్రమే. హరి యెందుకు వస్తాడు! తన ఊహ అనుకుని కళ్ళు దిండుకు రుద్దింది

"రూపా!..." ఈ సారి ఆమెపై బలమైన చేయి పడింది.

ఇటు తిరిగిన రూప కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవి అయ్యాయి తనను కర్త రూపా అని పిలువటమూ!

ఇది కల కాదు కదా! 'ఏయ్' 'మొద్దూ' అంటూ పిలిచేవాడు.

"రూపా..." వంగి ఆమె నుదురు ముద్దు పెట్టుకున్నాడు

"పిలిచింది మీరేనా ?" కళ్ళు ఒత్తుకుని మరోసారి అడిగింది.

"ఊఁ!" అతను యెప్పుడూ నవ్వనంత మధురంగా, ప్రశాంతంగా నవ్వాడు.

"రూపాదేవి నా బిడ్డలకు తల్లి. గౌరవనీయురాలు. 'ఏయ్ మొద్దూ, ఏమోయ్! రాయలుకు ప్రియాతి ప్రియమైన వ్యక్తి, ప్రియురాలు." అన్నాడు చాలా మృదువుగా.

అతనంత మృదువుగా మాట్లాడ గలడని యెరగదు రూప.

"రూపా! నేను విన్నది నిజమేనా ?"

ఆమె లేచి కూర్చుని, ముఖం చూపలేనట్టు అతని భుజంమీద తల దాచుకుంది.

"ఏమిటి ?" తనకు తెలియనట్టు అడిగింది.

"నాతో యెందుకు చెప్పలేదు ?" అన్నాడు ఆమె మెడ చుట్టూ చేయి వేసి.

"మీకు తండ్రి కావాలని ఇంత కోర్కెగా ఉందని తెలియదు" అన్నది మెల్లగా.

ఆమె ముఖం చేతుల్లోకి తీసుకున్నాడు.

అతని కళ్ళు కాంతివంతంగా నిర్మలంగా ఉన్నాయి.

"కోరికా! ఉత్త కోరిక కాదు రూపా! మా నాన్న చీదరించుకున్న తీరు, అతని అలక్ష్యం చూస్తే, నేను ఊహలలో తండ్రినయినా బిడ్డను యెంత అపురూపంగా చూచుకోవాలో ఊహించుకునే వాడిని. ఆ ఊహ నిజం కానంతగా నేను చెడిపోయాననుకున్నాను..."

"అబ్బ ఊరుకుందురూ..." అతని నోటికి చెయ్యి అడ్డంపెట్టింది.

ఆమె చెయ్యి తీసి గుప్పెట్లో బంధించాడు.

"నన్ను చెప్పనియ్యి రూపా! హాలాహలంలోకి అమృతంలా, సెగలు కక్కే ప్రదేశంలో మలయ మారుతంలా నువ్వు వచ్చావ్..."

అతన్ని చెప్పనియ్యలేదు.

"వద్దండీ, మనకు మంచిరోజులు వచ్చాయి. మీరు నా మాట వినాలి. హరికృష్ణ ఉత్తరాలు ఇక్కడికి వస్తే మీరేమనుకుంటారో, యెన్ని అపోహలు వస్తాయో అని భయపడిన మాట నిజమే..." అన్నది అతని షర్ట్ గుండీలతో ఆడుతూ.

"అబ్బ! భర్తపై భార్యకున్న నమ్మకం!" అన్నాడు వెక్కిరింతగా.

"మిమ్మల్ని అర్థం చేసుకునే అవకాశమే రాలేదు కదా!" అన్నది.

"నిజమే రూపా! నిదానంగా ఆలోచిస్తే నీవే రైట్!" అన్నాడు ఆమె తలపై గడ్డం ఆన్చి.

"నాపై అందరూ నిందలు లేపారు. హరి నన్ను అభిమానించేవాడు. ఆ అభిమానంతో ఏదయినా అతిగా వ్రాస్తే మీరు ఏమనుకుంటారోనని భయం, అంతకంటే మరేంలేదు!" అన్నది.

"పోనీలే, నా చిరకాల వాంఛ నెరవేరబోతుంది."

"మాటల్తో కడుపు నిండదు బాబా..." వీరయ్య పిలిచాడు. ఇద్దరూ లేచారు భోజనానికని.

"మనింట్లో పెద్దయ్యగారో, టైగర్ ఇంద్రమ్మో పుడుతుంది" అన్నాడు సంతోషంగా.

రాయలు ముఖం ఆముదం త్రాగినట్టు పెట్టాడు.



"వాళ్ళ పెద్దరికాలు ఒక్క జన్మకు చాలు, మరో జన్మక్కూడా ఎందుకు!" అన్నాడు అయిష్టంగా.

రూప పకాల్న నవ్వింది అతని ముఖ కవళికలు చూచి.

వీరయ్య బుర్ర గోక్కుని వెళ్ళిపోయాడు. ఏటో రెండు మంచి మాటలని, ఏదయినా ఇనామ్ కొట్టేద్దామంటే కథ అడ్డం తిరిగింది అనుకున్నాడు.

రూప భర్తకు వడ్డించబోయింది.

"ఉహూ! నువ్వుండు, ఈ రోజు నీకు నేను వడ్డిస్తాను."

రాయలు గరిట లాక్కున్నాడు

"అతివృష్టి, అనావృష్టి తప్ప మధ్యస్తం ఏం లేదు!" అన్నది ముసి, ముసిగా నవ్వుతూ. అతను మరేం మాట్లాడక ఆమె కంచంలో అన్నం పెట్టాడు.

"రూపాదేవి చాలా ?"

"నాకు చాలుగాని, మీరు కూర్చోండి" అతన్ని ప్రక్క కుర్చీలోకి త్రోసి తను గరిటె లాక్కుంది.

"నిజం రూపా! నేనేదో మొరటుగా ఇంటి కాపలా ఉండాలని అన్నాను అని అదే నిజం అనుకునేవే. మొదటిసారి నిన్ను పొలాల దగ్గర చూచినప్పుడే నా మనసు పారేసుకున్నాను..."

"ఏ పడుచు దగ్గరో..." అన్నది వెక్కిరింతగా.

"అను అను. ఇప్పుడు, నేను నిజాయితీ పరుడుని అని చెప్పి ఆత్మ వంచన చేసుకోలేను. నేను తిరిగిన మాట నిజమే. కాని అది కోరికల వేడి చల్లార్చుకోవటానికి, స్త్రీలపై కసి తీర్చుకోవటానికి! మనసు పారేసుకుంది ఈ టైగర్ ఇంద్రమ్మ మనవరాలి దగ్గరే అర్థం అయిందా ?"

అతని మాటల్లో అతిశయోక్తులు. అబద్ధాలు లేవనిపించింది. అతనికి నెయ్యి వడ్డించి, తను మాత్రం ఏటో పచ్చడి వేసుకుంది.

"రూపా! అదేమిటి ?" ఆశ్చర్యంగా చూచాడు.

"శరీరంతో పాటు, మానసిక ప్రవృత్తిలోను మార్పు వస్తుంది. కొన్ని వస్తువులు పడవు!" అన్నది.

"బావుంది. ఇప్పుడు మనమే పెద్దలము, మనమే చిన్న వాళ్ళమన్న మాట!" అతను నవ్వాడు.

ఆ మర్నాటి నుండి అతని ప్రవర్తనలో చాలా మార్పులు వచ్చాయి. ఇది వరకయితే ప్రతి పనీ మరొకరు చేసి పెట్టవలసి వచ్చేది. ఇప్పుడు తనే చేసుకుంటాడు.

స్నానం చేస్తుండగా, నూనే, సబ్బు ఏది తీసుకువెళ్ళినా, వారిస్తాడు. పట్నం వెళితే పాలు, పండ్లు, రకరకాల బిస్కెట్లు పట్టుకువస్తాడు.

రూప తినేవరకు ప్రాణం తీస్తాడు.

సెలవులకు శర్మిష్ఠ వస్తానని వ్రాసింది.

"ఏమండీ, వారంరోజులు మా ఇంట్లో ఉండి వస్తాను. శర్మిష్ఠ వస్తానని వ్రాసింది" అన్నది.

"ఏం, శర్మిష్ఠ మనింట్లో ఉండకూడదా! నాపై నమ్మకం లేదా?"

"అది కాదండీ, నాకు మార్పు కావాలనిపిస్తుంది."

"అయితే వెళ్ళు. ఆ అమ్మాయి వచ్చిన రోజే వెళ్ళాలి, మళ్ళీ వెంటనే వచ్చేయాలి. తెలిసిందా!"

"అది ఉన్నన్ని రోజులుంటాను. భోజనానికి మీరే అక్కడకు వస్తారు. సరా!" అన్నది. అతను అంగీకరించాడు.

వెంకన్న వచ్చి శర్మిష్ఠ వచ్చిందని చెప్పగానే పరుగున వెళ్ళింది బంగళాకు. శర్మిష్ఠ లేచి వచ్చింది.

డాక్టర్‌గా, హుందాగా కనిపించిందే తప్ప, తన పాత శర్మిష్ఠలా పరుగెత్తుకు రాలేదు.

"రా అక్కయ్యా!" అన్నది కొత్తవారికి మర్యాద చేస్తున్నట్లు చేస్తూ.

"ఏమిటే చాలా పెద్దదానివయ్యావ్!" అన్నది నవ్వుతూ.



"రామ్మా, రూపమ్మా, నీవు రాగానే ఇంటికే కళ వచ్చింది!" వెంకన్న సంబరపడిపోతూ ఏవో పళ్ళు తేవటానికి వెళ్ళాడు.

"ఏమిటి శర్మీ! అలా ఉన్నావేమిటే?"

"అక్కా..." శర్మిష్ఠ రూప హృదయంలో తలదాచుకుని బావురుమన్నది. రూపకు ఇదేం అర్థం కాలేదు.

"ఏమిటి శర్మీ! నాతో చెప్పవూ?" ఆమెను తీసుకుని ఉయ్యాల బల్ల దగ్గరకు వచ్చింది. ఇద్దరు కూర్చున్నారు

"అక్కా! నేను మొద్దునే తెలియక ఏదో నా మనసు నీ ముందు విప్పానే తప్ప, నీ ప్రేమను కోరలేదు. నేను హరికృష్ణను అభిమానిస్తున్నానని నీతో చెబితే, ఒక్కమాట, మీరిద్దరూ ఒకరిని, ఒకరు అభిమానిస్తున్నట్లు, త్వరలో వివాహం చేసుకోవటానికి నిర్ణయించుకున్నట్లు చెప్పలేదు నువ్వు. నువ్వు నన్ను మోసం చేశావ్. నిజమక్కా, నన్ను చాలా చాలా మోసం చేశావ్!" అన్నది వెక్కి, వెక్కిపడుతూ.

"ఓసి ఇంతేనా! భలేదానివే!" చెల్లెలి కళ్ళు ఒత్తింది.

"నీకు ఇంతేనా అనిపించవచ్చు, కాని నా కోసం ఆ తాగుబోతును, తిరుగుబోతును కట్టుకున్నావ్..."

"స్టాప్... అతనెవరయినా ఇప్పుడు నా భర్త. నువ్వలా అనటం బాగాలేదు. అయినా, నేను, హరికృష్ణ ప్రేమించుకున్నామని యెవరు చెప్పారే?" అన్నది ఆ విషయం తేలికగా తీసివేస్తూ.

"అక్కా! ఇంకా నా కళ్ళు కప్పదామనే తాపత్రయమేనా!" శర్మిష్ఠ కోపంగా వెళ్ళి ఓ ఉత్తరం తెచ్చి ఆమె పైకి విసిరింది.

"డియర్ శర్మిష్ఠా!

నీ ఉత్తరం చూచి ఆశ్చర్యపోయాను. రూప నీకీ విషయం చెప్పలేదని అర్థం అయింది. అందుకే వ్రాస్తున్నాను నేను రూపను, ఆమె గుణాన్ని ఆరాధించాను. అభిమానించాను. నా ఆరాధనను ఆమె అంగీకరించారు మన చదువులు అయిపోయే వరకు వివాహం వాయిదా వేశాం.

నిన్ను అభిమానించాను, నా మరదలిగా, ఆత్మీయురాలిగా. నా చనువు నిన్ను మరోలా ఆలోచింపజేస్తే క్షమించమని హృదయ పూర్వకంగా కోరుతున్నాను.

నా చదువు బాగానే సాగుతోంది. హాస్పిటల్లో ఉన్న పీరియడ్ రికవర్ చేసుకోవాలి..."

ఉత్తరం ఆపి శర్మిష్ఠవైపు చూచింది. ఆమె వెక్కి, వెక్కి ఏడుస్తోంది. రూప ఆర్తిగా చెల్లెలి తల నిమిరింది.

"శర్మీ! ఏం రాశావే?"

"ఇంక అదికూడా చెప్పాలా! నా కోసం నువ్వింత పెద్ద త్యాగం చేస్తావా! నీ వివాహం సంగతి వ్రాయవద్దంటే మరెందుకో అనుకున్నాను!" అన్నది, లేచి కూర్చుని.

"నీవు హరిని ఇష్టపడ్డావని కాదు శర్మీ. అతను అడిగినప్పుడు అంగీకరించిన మాట వాస్తవమే. కాని మన ఆస్తి మనకు దక్కాలంటే, తన మాటమీద ఊరును నడిపించే రాయలును ప్రసన్నం చేసుకోవాలి. అతను నన్ను కోరాడు..."

"అందుకని ఇంత పెద్ద ఊబిలోకి దిగుతావా?"

"పిచ్చిదానవే!" నవ్వింది రూప.

వెంకన్న టీ తెచ్చాడు, పండ్లు కోసి తెచ్చాడు.

"శమ్మమ్మా! ఇక మీ ఆటలు, గారాలు మూలకు పెట్టండి, మనింట్లో మరో చిన్న పాప వస్తుంది." అన్నాడు సంబరంగా.

"అక్కా!...నిజం! నిజమా?" అన్నది ఆనందంగా.

"నిజమే కాని, చూడు శర్మీ ఇవన్నీ ఏం మనసులో పెట్టుకోకు. హరికి నచ్చచెప్పే బాధ్యత నాది." అన్నది ఓదార్పుగా.

"ఛీ...ఛీ... అతను నిన్ను ఆరాధిస్తుంటే, అతన్ని పట్టుకుని ప్రాకులాడుతానా! భలేదానివి." అన్నది జలదరింపుగా.

"శర్మీ! మన దురదృష్టం. మనసు విప్పి మాట్లాడుకునే పెద్దలు



లేరు. నీకు నేను, నాకు నువ్వూ మిగిలాము. నేను మీ బావగారిని వివాహం చేసుకుని ఏం కోరానో తెలుసా. అతను నన్ను అసహ్యించుకోవాలని."

"అక్కా!"

"అవునే. ఆ తరువాత అతను దగ్గరగా వస్తే యెన్నెన్ని విషయాలు గుర్తుకువచ్చేవో! కాని అన్నీ మరచిపోయానిప్పుడు. అతను లేనిది బ్రతుకలేనేమో అనిపిస్తుంది!" అన్నది. మెల్లగా తామిద్దరి మధ్య జరిగిన విషయాలు చెబుతూ, పండ్లు తిని, టీ త్రాగారు.

"అక్కా! నువ్వు యెన్ని అయినా చెప్పు. హరిని భర్తగా అంగీకరించలేను."

"ఇప్పుడా విషయం వదిలేద్దాం ఇంకా చాలా టైముందిగా!" అన్నది రూప.

"ఏమిటి అక్కా, చెల్లెండ్లు నా మీద ఆడిపోసుకుంటున్నారు?" రాయలు వచ్చాడు.

"ఓ...బావగారా! మీసాలు ట్రిమ్‌గా చేసుకుని, ప్యాంటు, షర్టుతో హీరోలా వచ్చారు కాని, నేను రూపాదేవిని కానండోయ్, మీ బుట్టలో పడటానికి..." అన్నది శర్మిష్ఠ. ఇద్దరూ ఉయ్యాల బల్లమీది నుండి లేచారు.

"మరదలు మాణిక్యంగారూ! యెక్కడా మగడు దొరక్కపోతే అక్క మగడే దిక్కని-నువ్వు నన్ను చేసుకుందాం అన్నా, నేను రడీగా లేను!" అన్నాడు.

"చూడక్కా!"

"నిన్నా, నిన్నా!" నవ్వుతూ ఉయ్యాల బల్లమీద కూర్చున్నాడు.

"మిమ్మల్ని భోజనానికి రమ్మన్నాను" చిరుకోపంగా చూచింది రూప.

"అదేం మాటమ్మా! అయ్యగారు, కూర్చోండి. క్షణంలో టీతెస్తాను" వెళ్ళిపోయాడు వెంకన్న. ముగ్గురూ కబుర్లలో పడ్డారు.

[౨౬]

## 23

"డాక్టరుగారూ!" వణికిపోయాడు రాయలు.

"రాయలూ! నువ్వు అదృష్టవంతుడివి. ఆ గర్భం నిలిచి, బిడ్డ బ్రతికినా అంగ వైకల్యంతోనే పుట్టేవాడు. ఇద్దరూ ట్రీట్‌మెంటు తీసుకోండి. ఇంకా వ్యాధి ముదరలేదు." అన్నదామె. ఆమె రాయలు స్నేహితుని అక్క.

రాయలు తను సుఖవ్యాధిగ్రస్తుడని ఊహించనయినా లేదు.

గత జీవితం తాలూకు అనుభవాలు, చేదు మాత్రం అతన్ని భయపెడుతున్నాయి

నాలుగురోజులుగా కడుపులో నొప్పని బాధ పడింది రూప. ఇక జాప్యము చేసి లాభంలేదని, తన స్నేహితుని అక్క క్లినిక్‌లో చేర్పించాడు. ఆమెకు వీళ్ళ జీవితాలు క్షుణ్ణంగా తెలుసు అందుకే రూపను చూచి జాలి పడింది.

ఒక రోజంతా ప్రయత్నించింది. లాభం లేకపోయింది గర్భస్రావమయింది. రూప బాధ పడిందో, సంతోషపడిందో గాని, నిస్త్రాణగా స్పృహ లేనట్టు పడి ఉంది.

రాయలు మనసంతా చీకటి నింపినట్టుంది.

అతను ఈ నిజాన్ని భరించలేకపోతున్నాడు. సంతానంపట్ల ఎన్ని ఆశలు పెంచుకున్నాడు! యెంత అందమైన కలకన్నాడు. యెన్ని రకాలుగా ఊహించాడు.

అతనికి భార్యకు ముఖం చూపాలంటే సిగ్గుగా ఉంది.

"బి. బోల్డ్. మీరిద్దరూ కొన్నాళ్ళు ట్రీట్‌మెంటు తీసుకోవాలి." అన్నదామె. యాంత్రికంగా తలాడించాడు.

పురుషుడు తనే ఇన్ని రకాలుగా ఊహిస్తే రూప యెంత ఆనంద పడిందో-మాతృత్వం ఓ మహత్తరమైన వరం అన్నారు.



"సర్! ఆమె పిలుస్తున్నారు!" నర్స్ చెప్పింది.

అతను వెళ్ళలేకపోయాడు. తన మౌనాన్ని ఆమె మరోరకంగా అర్థం చేసుకుంటే తను బ్రతుక గలడా!

మనసు గట్టి చేసుకుని, మామూలుగా నవ్వుతూ గదిలోకి వెళ్ళాడు.

రూప నీరసంగా నవ్వింది.

ఆ నవ్వు తనను తృప్తి పరచటానికని తెలుసు అతనికి

"రూపా!" అన్నాడు దగ్గరగా వెళ్ళి.

"మీరు బాధ పడుతున్నారు కదూ! మనకు ప్రాప్తం లేదు!" అన్నది నీరసంగా

"అంతే అనుకోవాలి పాలు త్రాగుతావా?" కాస్త లేపి ఆమెచేత పాలు త్రాగించాడు

"ఒకసారి ఇంటికి వెళ్ళి వస్తారా?"

"ఏమయినా తీసుకురావాలా?"

"వీరయ్యను అడగండి- రెండు రంగు చీరలు ఇస్తాడు. మీరు బీరువాలో నుండి తెల్ల చీరలు తెచ్చారు. అలాగే, రెండు వాక్యాలు శర్మిష్ఠకు వ్రాయండి వీలుంటే అంకుల్‌కు చెప్పి పంపితే మంచిదే!" అన్నది ప్రక్కనే కూర్చున్న అతని జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి నిమురుతూ.

"సరే! నువ్వు విశ్రాంతి తీసుకో. ఇలా అయిందే అని బాధ పడకూడదు!" అన్నాడు. ఆమె తలాడించి కళ్ళు మూసుకుంది

అతను వెళ్ళిపోగానే, దిండులో ముఖం దాచుకుని వెక్కి, వెక్కి ఏడ్చింది.

"అమ్మా!" అంటూ పిలువ నోచని తను, 'అమ్మా' అని పిలిపించుకోవాలని యెంత తాపత్రయ పడింది.

ఆ అమృతమయమయిన పిలుపు కోసం యెంత తపించిపోయింది.

అంతా ఆదిలోనే అంతరించిపోయింది. యెందుకిలా జరిగింది! రాయలు ప్రవర్తనకు, ప్రతిఫలమా!

"నాకు మనఃశాంతి యెలాగు దక్కలేదు. ఆయనకు అర్థం చేసుకునే సహనమైనా కావాలి...కావాలి!" అనుకుంది పదే, పదే.

ఆమెకు తెలియదు తనలాగే రాయలు కుమిలిపోతున్నాడని, ఒకరిని ఓదార్చటానికి మరొకరు చిరునవ్వు నవ్వుతున్నారని.

"ఇదిగో నీ ఉత్తరం" రాయలు ఇచ్చిన ఉత్తరం తీసుకుంది. సాయంత్రం ఉత్తరం ఇంటి అడ్రసుకు యెలా వచ్చిందో అర్థం కాలేదు.

"వెంకన్నను కేశవరావుగారింటికి పంపాను" అన్నాడు.

అతను కోసిచ్చిన యాపిల్ పండ్లు తిని, ఉత్తరం విప్పింది రూప.

"రూపా!

నేను దిగులు పడతానని, అక్కడి విషయాలు క్లుప్తంగా అంతా బావున్నారు అనే వ్రాస్తున్నావ్. పదిరోజుల క్రితం రాయలు ఉత్తరం చూచి ఆశ్చర్యపోయాను. ఏదయినా ఆస్తి విషయాలు ప్రస్తావించేదేమో అనుకున్నాను. విచిత్రం. 'రూప నా భార్య అయినంత మాత్రాన ఉత్తరాలు వ్రాసే అధికారం, చదివే అధికారం లేదని యెలా అనుకున్నారు. మీ స్నేహాన్ని శంకించే మూర్ఖుడిని కాదు' అంటూ ఏమేమో వ్రాశాడు. ఇదేం నాటకం. నీ పైనా మనసు విరిచేయాలనా! అదేంలేదు." అంటూ తను చూచిన విశేషాలు, నయాగరా వాటర్ ఫాల్స్ గురించీ వ్రాశాడు.

"మీరు డాక్టర్ హరికృష్ణకు ఉత్తరం వ్రాశారా?"

"అవును అతను ఏమనుకుంటాడు. రూప యింత సంకుచితుని వివాహము చేసుకుందేమిటి అనుకోడు. మన ఊరికే ఉత్తరాలు వ్రాయమన్నాను!" అన్నాడు అక్కడ పడిన తొక్కలు తీసివేస్తూ.

"ఓహ్!" అన్నది పెదవి కొరుక్కుంటూ.

"ఏం రాశాడేం!" అన్నాడు– తొక్కలు పారవేసి వచ్చి కూర్చున్నాడు.

"చదవండి" ఉత్తరం ఇచ్చింది.

"నా కంత ఓపిక లేదు గాని, చెప్పు వింటాను."



"మన వివాహ విషయం అతనికి తెలియదు. మీరు వ్రాసిన ఉత్తరం చదివి ఖంగు తిన్నాడు!" అన్నది.

"అదా సంగతి. ఈ సారి వివరంగా వ్రాయి..." అతని మాట పూర్తి కాకముందే కేశవరావు దంపతులు, వెంకన్న వచ్చారు.

వెంకన్న ఆడపిల్లలా కళ్ళు ఒత్తుకున్నాడు. కేశవరావు రూప తల నిమిరాడు.

"రాయలూ! చాలా థ్యాంక్స్. ఆ పొలాల విషయం ఇంత త్వరగా తెములుతుందనుకోలేదు!" అన్నాడు.

"దానిదేముందండీ నా బాధ్యత కాదా." ఇప్పటికయినా నేను చెప్పేది ఒక్కటే, పొలాలు అమ్మటం ఉత్తమము.

"అలాగే చేద్దాం లాయర్‌గారూ" రూప ఇంటికి వచ్చాక ఆలోచిద్దాం." అన్నాడు.

"రూపకేం తెలుసు బాబూ. పొలాల విషయం చూడవలసింది నువ్వే!" అన్నాడు. జవాబుగా నవ్వాడు.

కాసేపుండి, అందరూ బయలుదేరారు.

"వెంకన్న ఉంటాడు. నువ్వు వచ్చి భోజనం చేయి బాబూ!" అన్నది అలువేలు.

"వద్దమ్మా, నాకు ఆకలిగా లేదు." తప్పించుకున్నాడు.

కేశవరావుకు చెప్పింది రూప, వెంకన్నతో క్యారియర్ పంపమని.

వాళ్ళు వెళ్ళిపోయారు. రూప భర్తవంక పరీక్షగా చూచింది. ఒక్క రోజుకే యెంతో పెరిగిపోయినట్టు అనిపించాడు అతను.

"ఏమండీ...మీరిలా నా దగ్గరగా వచ్చి కూర్చోండి" అన్నది.

అతను వెళ్ళి ఆమె మంచంపై కూర్చున్నాడు. అతని ఒడిలో చేయివేసి కబుర్లు చెబుతూ, అడుగుతూ, అతని విచారం పోగొట్టాలని పయత్నం చేసింది.

"ఏమండీ మా నాయనమ్మ బావి కొన్నారు కదా. దాని అప్పు

తీర్చవద్దూ ?"

"ఇప్పుడా విషయాలు నీ కెందుకు ?" కాస్త కోపంగా అన్నాడు.

"కూరగాయల బిల్లు యెంత వచ్చిందండీ ?"

"ఈ ఆరాలన్నీ యెందుకు ? నేను అదనం ఖర్చులేం చేయటం లేదు. అయిదువేలు వచ్చాయి!" అన్నాడు.

"బాప్‌రే అంత తక్కువా ?" అన్నది ఆశ్చర్యంగా.

"నీ ముఖం! నాకెప్పుడూ రెండు వేలకంటే యెక్కువ రాలేదు. ఈ సారి ఈ ఇద్దరి ముసలివారు బాగానే శ్రమ పడ్డారు." అన్నాడు.

"బావుందండి. అన్ని ఎకరాల పొలం వేస్తే అయిదు వేలా ? మీరు అనుమతిస్తే నేను వెళ్ళి చూచుకుంటాను!" అన్నది నొచ్చుకుంటూ.

"మంచిది మీ వెంకన్న తిండి ఎలా గడుస్తుంది రూపా ?"

"ఇంకా ఒడ్లున్నాయి. పై ఖర్చులకు నెలకు ముప్పై రూపాయలు అంకుల్ పంపుతారు. గేదెకూడా ఉంది కదా."

"మనకీసారి పని చేశాడు ఒడ్లో డబ్బో ఇచ్చెయ్యి!" అన్నాడు ఆమె ముంగురులు సవరిస్తూ.

"అది కాదండీ, కాలం యెలా వస్తుందో. తనకంటూ ఏం లేనివాడు ఈ సారి ఏ పొలం అమ్మినా అతని పేర ఓ పదివేలు వెయ్యండి" అన్నది

"అలాగే రూపా" అన్నాడు వాళ్ళు మాటల్లో ఉండగానే వెంకన్న క్యారియర్ తెచ్చాడు.

"నాకు ఆకలి లేదని చెప్పాను కదా!" అతను విసుగ్గా చూచాడు.

అన్నీ అక్కడ పెట్టి వెంకన్న వెళ్ళిపోయాడు.

"చూడండి. గర్భస్రావం మీ మూలాన అయిందని, మీరు కుమిలి పోతున్నారు హాస్పత్రిలో సుఖరోగాలు తప్ప మరేవిధంగా కావటం లేదా!" ఆమె అనునయంగా అడిగింది.

అతని కెన్నో చెప్పాలని ఉంది కాని మాటలు రావటంలేదు.



ఆమెనలాగే చూస్తూ కూర్చున్నాడు.

"నా కోసం మీరు భోజనం చేయాలి మరి. మనము ముసలి వాళ్ళం కాలేదే మీరిప్పుడు భోజనం చేయకపోతే. నేనసలు ఏం ముట్టుకోను." అన్నది ముఖం అటు త్రిప్పుకుని.

అతను కాసేపు అలాగే కూర్చుని, ఆ తరువాత క్యారియర్ విప్పాడు.

అతను భోజనం చేశాక తృప్తిగా నిట్టూర్చింది.

రూప ఇంటికి వచ్చాక. రాయలు ప్రవర్తన పూర్తిగా మారి పోయింది. తన పొలం పనులు, ఇంటి పనులు తప్ప, అత్యవసర పరిస్థితి కలిగితే తప్ప బయటికి వెళ్ళటంలేదు.

స్వయంగా రూపకు పళ్ళరసం తీసి ఇస్తున్నాడు.

అతని మాటలలో, అతని ప్రవర్తనలో ఎంతో మార్పువచ్చింది.

దూకుడుతనం కనిపించదు.

అందరూ అతని ప్రవర్తనకు ఆశ్చర్యపోయారు. పెళ్ళాం గట్టిదే అన్నవారు లేకపోలేదు.

ఈ మార్పు జగదీష్ లాంటి వారికి సుతరామూ గిట్టలేదు. వాళ్ళు రాయలును మామూలు మనిషిని చేయాలని. పార్టీలు ఏర్పాటు చేశారు. అతను మృదువుగా తిరస్కరించాడు.

"జగం! నా ఆరోగ్యం బాగాలేదు. త్రాగుడు వద్దన్నాడు డాక్టరు" అన్నాడు.

"వాళ్ళకేం పనిలేదు ఏదో ఒకటి చెబుతూనే ఉంటారు." అని తేలికగా తీసి పారేసినా రాయలు వినలేదు.

అతనిని మరో విషయం బాధిస్తుంది. రూపను మొదటి నుండి డాక్టరుకు చూపితే ఈ ప్రమాదం సంభవించేది కాదేమో. జగదీష్ బృందం డాక్టరు వద్దంటే, అదేదో తమాషా అయినట్టు, జగదీష్, రూపల మధ్య సమస్య అనుకున్నాడేగాని అందంకి అవసరం అనుకోలేదు.

అతను ఎంత ఖర్చయినా, ఎన్ని అవమానాలు ఎదురయినా ఆ ఊరికి డాక్టరును రప్పించాలని అనుకున్నాడు.

అతను ఉన్నంతసేపు కబుర్లు చెబుతూ సంతోషంగా తిరుగుతుంది రూప

ఒంటరిగా ఉంటే ఇదివరకు చేతిలో పుస్తకం ఉండేది.

ఇప్పుడు! పెరటు మెట్లపై కూర్చుని శూన్యంలోకి చూస్తుంది.

"రూపా!" అంటే ఒక్కసారి వినిపించదు. రెండు, మూడుసార్లు పిలవాలి.

ఒక్కొక్కసారి ఆమె కళ్ళు వాచి ఉంటాయి. చంపలమీద చారలు కనిపిస్తాయి, తనేం చేయగలడు.

శర్మిష్ఠ వచ్చి రెండు రోజులుండి వెళ్ళిపోయింది. కేశవరావు దగ్గర కెళతానన్నా అసలు విషయం మరిచిపోతుందని, వెళదాం అన్నాడు.

"మిమ్మల్ని విడిచి ఎక్కడికి వెళ్ళను" అన్నది రూప దృఢంగా.

అతనికి ఏం చేయాలో పాలుపోలేదు.

"రూపా! నేనేం చేస్తే నీ విచారం పోగొట్టగలను చెప్పు!" అన్నాడు ఆర్తిగా ఆమెను దగ్గరగా తీసుకుని.

"నేను దిగులుగా ఉన్నానని కలగాని వచ్చిందా!" కిల, కిల నవ్వింది.

అతనికి తెలుసు ఆ నవ్వు వెంట అగ్ని పర్వతాలు బ్రద్దలవుతున్నాయని, ఆమెను మళ్ళీ మామూలు మనిషిని చేయాలన్నదే అతని తపన.

ఆమె నిదరపోగానే దిండు పైకి చేర్చి, అంటనట్టు ఆమె నుదురు చుంబించాడు.

ఆమె కవ్వించినా, ఎందుకో సంసార సుఖానికి సుముఖుడు కాలేక పోతున్నాడు చిరునవ్వుతో తప్పించుకుంటున్నాడు. అతనికే ఆశ్చర్యంగా ఉంది. కొంగు తగిలితే పొంగే తన రక్తం, ఇప్పుడు చల్లబడిందేం అని, అతనికి రేయింబవళ్ళు రూప గురించే ఆలోచన.



# 24

ఆ రోజు హడావుడిగా వచ్చాడు రాయలు.

"ఓయ్! హెడ్‌మిస్ట్రెస్‌గారూ!" అన్నాడు ఉత్సాహంగా. రూప ఉలిక్కిపడింది. హరికృష్ణ చెప్పిన మాటలు గుర్తుకువచ్చాయి.

"నాకేదయినా బడిలో అప్పాయింట్‌మెంటు వచ్చిందా?"

"ఊహూ, నీ బడినే పునరుద్ధరించాం రూపా! ఈ ఊరి పిల్లలకు ప్రణాళిక ఏర్పరిచాం. ఫీజు ఇచ్చుకోలేని క్రింది తరగతుల వారంతా ప్రభుత్వ పాఠశాలలకు వెళతారు. మిగిలినవారంతా నీ బడికే వస్తారు. నువ్వు మునుపటిలా ఆ బడి నడిపి, పిల్లలను అదుపులో పెట్టాలి." అన్నాడు.

"నేను బయటికి వెళ్ళటానికి అనుమతిస్తున్నారా?" ఆశ్చర్యంగా చూచింది.

రాయలు వచ్చి, ఆమె భుజాలపై చేతులు ఆన్చాడు, ఆమె చూపులతో చూపులు కలిపాడు.

"రూపా! నువ్వెప్పుడయినా భట్టి-విక్రమార్కుడి కథలు విన్నావా? అందులో ఓ సత్యం చెప్పాడు!" అన్నాడు.

"నాకు తెలుసులెండి. భట్టివిక్రమార్కుల కన్ను కప్పి, మూడో మనిషితో సంభోగం జరుపుతుంటో స్త్రీ, చెడిపోవాలనుకుంటే యెవ్వరూ ఆపరు-అవునా?" అతని చేతులపై తన చేతులు వేసి అడిగింది.

"అవును రూపా! ఒకరోజు బయటికి రావద్దని ఏదో కసిగా శాసించాను. చిన్నప్పుడు మీ ఇంటికివస్తే, మీ నాయనమ్మ చేసే హడావుడి గుర్తుకువచ్చింది. అందుకే ఏవో పిచ్చి పిచ్చిగా మాట్లాడాను. పోనివ్వు. ఇంకో విషయము..." సందేహిస్తాడు.

"చెప్పండి." అన్నది ప్రసన్నవదనంతో.

"చిన్నప్పుడు మాతో చదివిన లెక్కల మాస్టారు కొడుకు సైమన్,

అమెరికా మిషన్‌వారి సహాయంతో ఓ హాస్పత్రి పెడతానంటున్నాడు. మీ నాయనమ్మ పేరు పెడితే, మీ ఇల్లు హాస్పత్రికిస్తే బావుంటుందని అనుకున్నాము. ఈ విషయము కేశవరావుకు, శర్మిష్ఠకు రాసి, వాళ్ళ అభిప్రాయము తెలుసుకో" అన్నాడు

భర్త కళ్ళల్లోకి ఒక్కనిముషం చూచింది. చిన్నగా నవ్వింది.

"ఏమండీ, ఈ ఆస్తి, పరులు తీసుకుంటున్నప్పుడు వాళ్ళు యెవరూ కాపాడలేరుకదా. రేపు శర్మిష్ఠ ఉండాలనుకుంటే ఈ హాస్పత్రిలో చేస్తుంది. హరికృష్ణ మళ్ళీ వెళ్ళే ఉద్దేశంలో ఉంటే సమస్యేకదా!" అన్నది.

"అది నిజమే రూపా! కాని వాళ్ళు ఈ ఆస్తికి వారసులు కదా."

"ఆస్తి అమ్మినా, మరేది చేసినా వాళ్ళకోసమే కదండీ. ఇద్దరూ చదువుకున్నవారు, ఆ మాత్రం గ్రహించరా!" అన్నది రూపాదేవి

"దొరా! తవరికోసం భూమయ, నారాయన వచ్చింద్రు!" వీరయ్య వచ్చి చెప్పాడు

రాయలు భార్యకు దూరంగా జరిగి అక్కడున్న దువ్వెన తీసుకుని తల దువ్వుకున్నాడు.

"వీరయ్యా! వచ్చిన వారిని కూర్చోబెట్టు, అయ్యే టీ త్రాగొద్దా!" అన్నది వంటింట్లోకి వెళుతూ.

"రూపా! అరగంటలో వచ్చేస్తాను కదా."

"అదేం కుదరదు." అన్నది అక్కడినుండే. అతను భోజనాల బల్ల దగ్గరి కుర్చీ జరుపుకుని కూర్చున్నాడు.

అయిదు నిమిషాల్లో టీ చేసుకు వచ్చింది. అతను టీ త్రాగి హాల్లోకి వెళ్ళగానే తను పుస్తకం పట్టుకుని కూర్చుంది.

"చూడండి నారాయణా! మీకు వ్యవసాయం చేయాలన్నంత ఉత్సాహం ఉన్నా, పొలాలు లేవు. పొలాలు ఇప్పుడు నేను కౌలుకిచ్చినా పెట్టుబడి లేదు" అన్నాడు నిదానంగా.

"అవునయ్యా! యెడ్లను కొనబోతే మోటార్ కొన్నట్టుంది. యవసాయం కంటే కూలేసుకున్నది నయం అనిపిస్తుంది." అన్నాడు భూమయ్య.



"అందుకే నేను చెప్పేది శ్రద్ధగా వినండి. పాత కౌలుదార్లను విడిపిస్తుంటే, స్వంతంగా మేమే చేయాలని ఓ షరతు పెట్టారు. అందుకని నేను చేయకతప్పదు..."

"అయ్యో! అంతమాటనకయ్యా, పిల్లలుగల వాడిని యెంతో ఆశతో వచ్చేను..." నారాయణ ప్రాధేయపడ్డాడు.

అతనికూడా ముగ్గురు కొడుకులు వచ్చారు. వాళ్ళంతా వయసులో ఉన్న కుర్రాళ్ళు.

"నారాయణా! అంతా తొందరేనా. నేను చెప్పింది విను మరి."

"అవునయ్య, నీకన్నింటికి అత్రనేనా!" భూమయ్య కసిరాడు

"కో ఆపరేటివ్ ఫార్మింగ్ అని, సమిష్టి వ్యవసాయ పథకమని యెన్నో పేర్లు పెట్టారు అవి మీకు అర్థంకావు. నేను సరళమైన భాషలో చెబుతాను. పొలం రూపాదేవిది, ఖర్చులు నావి, కష్టం మీది. వచ్చిన పంట ముగ్గురం సమంగా పంచుకుంటాము" అన్నాడు.

"అదేంది దొరా, గట్లంటరు! రూపమ్మ మీ భార్యేకదా?" నవ్వాడు భూమయ్య.

"నా భార్యే-కాదనటంలేదు. ఇప్పుడు టైగర్ ఇంద్రమ్మ ఆస్తికి ఆమె ఒక్కర్తే వారసురాలు కాదు. పంపకాలు కాలేదు. ఇక మీరు నమ్మకంగా పనిచేస్తే మా మరదలుకూడా వచ్చినప్పుడు మీ విషయాలు చర్చించి, మనిషికి రెండెకరాలు ఇప్పించే ప్రయత్నం చేస్తాను" అన్నాడు.

"మీరన్న దానికి మేం కాదంటామా? అట్లానే కానివ్వండి." అన్నాడు నారాయణ.

"తొందర పడకండి నారాయణా. ఇక్కడ మీరు అంగీకరించినా, మీ ఆత్మీయులు, స్నేహితులు అభ్యంతరం తెలుపవచ్చు. అందుకు మీరు ఆలోచించి నాల్గురోజుల తరువాత మీ నిర్ణయము చెప్పండి మేము

నల్గురం చేశాం, వారిద్దరు చేశారు అన్న తగాదాకూడా వద్దు. నాల్గు ఎక రాలకు ఒక మనిషి అని అనుకుందాం." అన్నాడు.

"అయ్య..." భూమయ్య ఆలోచనలో పడ్డాడు.

"సరేనండీ, ఎల్లుండి వస్తాం." అన్నారు నారాయణ కొడుకులు రాయలు చెప్పిన విషయాలు మననము చేసుకుంటూ.

"అలాగేనయ్యా, మీరు నల్గురిని అడగండి." అన్నాడు లేస్తూ.

"మేము వచ్చేవరకు తొందరపడి ఎవ్వరికీ మాటివ్వకండి." అన్నాడు నారాయణ.

"మీరు వద్దంటేనే ఇస్తానయ్యా!" అన్నాడు.

అతను ఇంద్రమ్మ బావి, పొలం, ఇల్లును తనుకొని, ఇల్లు రూపకు మిగిల్చి, పొలానికి డబ్బుకట్టాడు. అంతా అతని దగ్గరలేదు. అప్పుడు జగదీష్ బారినుండి రూప ఇల్లు తీసుకోవటానికే తొందరపడ్డాడు. ఆ అప్పు తీర్చాలి. తన పొలానికి మంచి ఆఫర్ వచ్చింది.

టైగర్ ఇంద్రమ్మ బావి ఊరు దగ్గరగా ఉంది. తన పొలం దూరం. అందుకే తన పొలం అమ్మి ఇంద్రమ్మ బావి తనకు ఉంచుకున్నా తన పొలం గుజరాతీలకు అమ్మేసి అప్పుతీర్చాడు.

మిగిలిన డబ్బు పెట్టుబడి కోసం ఉంచుకున్నాడు.

అతనికెందుకో ఇంద్రమ్మ ఇంట్లో ఉయ్యాల బల్ల చాలా నచ్చింది. అది చేయించి, మధ్యహాల్లో కట్టించేడు.

రూప బయటికివెళ్ళి స్కూలు పర్యవేక్షించి రాగానే, అలసటగా కూర్చుంటుంది దా బల్లమీద.

వెనుకగా వచ్చిన రాయలు ఉయ్యాల ఊపుతాడు.

"ఇదేం పని!" అంటుంది.

"అది నన్ను అడగాలా ?" పకాల్న నవ్వుతాడు.

పాత పనిమనిషి పనిలోకివచ్చింది. రూపకు అది రావటం బొత్తిగా నచ్చలేదు.



"మన ఇద్దరికీ వంట నే చేయతేనా! మళ్ళీ ఆ మనిషి ఎందుకు ?"

"నువ్వు చెయ్యలేవని కాదు రూపా! అలసి వచ్చిన మనిషి, మళ్ళీ లేచి మంచి నీళ్ళు ముంచుకుని త్రాగాలంటే ఇబ్బంది, విసుగు." అన్నాడు వచ్చి మరో ప్రక్కన ఉయ్యాల బల్లమీద కూర్చుంటూ.

"అంత అలసిపోయే పనేముంటుంది!" అన్నది పట్టుదలగా.

అతను ఉదాసీనంగా తల పంకించాడు.

"సరే రేపటి నుండి రావద్దంటాను." అన్నాడు మెల్లని స్వరాన.

అతనేం ఆలోచిస్తున్నాడో అర్థం అయ్యేసరికి ఆమెకు మతిపోయింది. 'ఛీ...ఛీ...' అనాలోచితంగా తనెంత అపార్థానికి తావిచ్చింది! ఆమె భర్తతో తన ఉద్దేశం అది కాదని చెబుదామనుకునే లోపలే అతను బయటికి వెళ్ళిపోయాడు.

మృగశిర కార్తె ప్రవేశించింది.

ఇటు విత్తనాలు, దున్నటాలు, ఎరువు లంటూ రాయలు హడావుడిగా తిరుగుతున్నాడు.

అటు రూపకు పని తెమలటంలేదు. ప్రక్క ఊరి నుండి కూడా పిల్లలు వచ్చి చేరుతున్నారు బడిలో. ఇంట్లో హాస్పత్రి పెడితే పిల్లలకు ఎలాంటి ఇబ్బంది కలుగరాదని, ముందు అడ్డుగోడ పెట్టించి, పెరడువైపు తలుపు ముఖద్వారంలా చేయిస్తున్నారు. హాస్పత్రికి ఖర్చు బెన్ని భరించినా పర్యవేక్షణ తప్పటంలేదు.

ఆ రోజు సాయంత్రం ఇంటికి వచ్చేసరికి కమిలి టీ తెచ్చి, చేతులు నలుపుకుంటూ నిలబడింది.

"ఏం కమిలీ ?" టీ త్రాగుతుంటే యెంతో హాయిగా ఉంది.

"అమ్మగారూ! రేపటినుండి పనిలోకి రావద్దన్నారట! అలాగే నమ్మా. బెన్నిదొర ఇంట్లో చేత్తామని పోతే, మీరు నేను మంచిదాన్నని రాసివ్వ మన్నరమ్మ! గట్లనే ఓ పాత చీరుంటే పడియ్యమ్మ."

రూప త్రాగుతున్న కప్పు క్రింద పెట్టేసింది.

"నాకు పనిమనిషి అక్కరలేదని నేను అనలేదు. వెళ్ళి గేటు ముందు ఆకురాలింది, తీసి వెయ్యి." అన్నది హుందాగా.

"బొర జేపిందమ్మా."

"బొరకు నేను చెప్పింది అర్థంకాలేదు. రాత్రిళ్ళు మీ ఇంటికి వెళ్ళిపొమ్మన్నాను-అర్థం అయిందా ?" అన్నది కాస్త కోపంగా.

"గట్లనా!" కమిలి నవ్వి పనిలోకి వెళ్ళిపోయింది.

రూప భర్త రాగానే పోట్లాడాలని తయారుగా కూర్చుంది. కాని వీరయ్య వచ్చాడు.

"లారీని ఆపి, మనూరోళ్లు దోచుకున్నరంట. అదేం కేసో, ఏమో అయ్య మూడు రోజులు పట్నంలో ఉంటరంట." అన్నాడు.

ఆమె ఉత్సాహమంతా చప్పగా చల్లారిపోయింది. ఆ రాత్రి అన్నం కూడా తిన బుద్ధికాలేదు. మళ్ళీ వీరయ్య గొడవ చేస్తాడని భోజనం చేసింది.

మర్నాడు బడికి వెళ్ళేసరికి వెంకన్న కళ్ళు ఒత్తుకుంటూ నిల్చున్నాడు.

"అమ్మా, రూపమ్మా! నీ ఇంటి ముందు కుక్కలా పడి ఉంటే ఇంత అన్నం పడేస్తే చాలమ్మా! ఈ పదివేలు నాకెందుకు తల్లి." అన్నాడు.

"యెందుకో చేతకాని రోజు తెలుస్తుంది. నీ పేర పదివేలు పెట్టారని యెవరు చెప్పారు ?"

"అయ్యగారేనమ్మా ! ఆ వడ్డీ తెచ్చుకొని గడుపు కొమ్మన్నారు." అన్నాడు.

"వెంకన్నా! నీ కెంత చేసినా తక్కువే. మాకు తల్లి, తండ్రి చేయలేని సేవలు చేశావు. మాకు జ్వరాలు వచ్చి బాధ పడుతుంటే, నాయనమ్మ కొర్టుల చుట్టు తిరుగుతుంటే నీ వడిలో కదూ సేదతీరింది..." అన్నది పాత రోజులు గుర్తుకు తెచ్చుకుని.

ఆమెకు రాయలు పట్ల విపరీతమైన గౌరవము కలిగింది. తాను



అనుకున్న ప్రణాళికలకు రూపు నివ్వ కల్గుతోంది. దానికి పరోక్షంగా అతనే కారణము.

మూడోరోజు ఆమె ఇంటికి రాగానే కమిలి చెప్పింది-

"అయ్యగారొచ్చి మళ్ళీ వెళ్ళిపోయారమ్మా."

"యెక్కడికి వెళ్ళారు ?" అన్నది కాస్త కోపంగా.

"నాకేం తెలుసు !" టీ గ్లాసు అక్కడపెట్టి వెళ్ళింది కమిలి.

"అయ్యగారికి కోపం వచ్చినట్టుంది." అనుకుని వీరయ్యను పంపింది.

అతను వెళ్ళి మామూలుగా పిలిస్తే అయ్యగారు వస్తారో, రారో అని, అమ్మగారికి బాగా లేదని చెప్పాడు. బస్ స్టాండులో యెవరితోనో మాట్లాడుతున్న రాయలు అదిరిపోయాడు. అతను వెంటనే తన వాహనం స్టార్టు చేశాడు.

అతను రాగానే రూప ముఖం మాడ్చుకుంది. అతను చిన్నగా నవ్వాడు.

"ఇప్పుడు అచ్చం ఆడపిల్లలా ఉన్నావు."

"మగ పిల్లాడిలా ఉండేదాన్నా?" అన్నది నవ్వును దాచుకుంటూ.

"నవ్వవోయ్ నవ్వు. ఇంతకీ ఒంట్లో బాగులేదట !" అన్నాడు మంచంలో ఓ ప్రక్కన కూర్చుంటూ.

"నేను మన ఇద్దరికి పని మనిషి ఎందుకు అన్నానని, ఇంకేమో ఊహించి కోపంగా మాట్లాడటం తగునా!" అన్నది కినుకగా.

"నువ్వు అనుమానించటంలో తప్పులేదు రూపా. నా గత చరిత్ర మంచిది కాదు. నన్ను నేను శిక్షించుకోవటానికే నీకు దూరంగా ఉంటాను. నీకు దగ్గరగా ఉన్నప్పుడు నా కెంత శాంతిగా ఉంటుందో చెప్పలేను." అన్నాడు గోడకు చేరబడి కళ్ళు మూసుకుని.

"ఈ సారి మీరు ఒక్కరోజు కనిపించకపోతే, మీకు జీవితంలో మళ్ళీ ముఖం చూపను...అ!..."

టక్కున ఆమె నోరు మూశాడు. ఆమెను అలాగే దగ్గరకు లాక్కు-

న్నాడు. గడ్డం పైకెత్తి కళ్ళు చుంబించాడు.

"మళ్ళీ అలాంటి మాటన్నావంటే లెంపలు వాయిస్తాను."

"మరి మీకు కోపంవచ్చి ఇలా రెండేసిరోజులు ఇంటికి రాకపోతే ఏ శిక్ష విధించాలో సెలవియ్యండి." అన్నది.

"నిజంగా నిన్ను ముద్దూ అని పిలువాలి. మనూరికి రోడ్డు వేయటానికి టెండరు అడిగారు మనకున్న పని చాలు అనుకున్నాను. కొందరు పెద్దలు, బెన్నీ బలవంతం చేశారు- నన్ను దరఖాస్తు పెట్టమని. ఇది మరో రెండు ఊళ్ళకు జగం, కనకయ్య వేయించారు. వర్షాకాలంలో వాళ్ళే వెతుక్కున్నారట రోడ్లేవి అని..." అన్నాడు.

"అంటే తమరు ఇప్పుడే కంట్రాక్టర్ అయ్యారన్న మాట."

"నీ కేమన్నా అభ్యంతరమా ?"

"నాకేం అభ్యంతరం! మీరు ఎమ్మెల్యేనో, మినిష్టరో అయితే అభ్యంతరం కాని." అన్నది, హేళనగా.

"అదేమిటోయ్! మినిష్టరయితే అభ్యంతరమా ?" విస్మయంగా చూచాడు.

"జరుగుతున్న రాజకీయ చరిత్ర చూస్తే, మన పగవాడిని మినిష్టర్ కావాలని కోరుకోవాలండీ." అన్నది.

అతను పక, పక నవ్వాడు. ఆమె ఒక క్షణం అతని వంక చూచి లేచి వెళ్ళి అతని కోసం చేసిన ఫలహారం తెచ్చింది.

"ఎలా ఉంది మీ బడి ?"

"అరే, మా బడి ఎప్పుడూ చూడలేదా ! నాల్గు గదులు, ముందు రెండు చిన్న గదులు..." అంటూ ఇంటి పరిసరాలను వర్ణించింది.

"నీకు పొగరు..." అన్నాడు కానీ అతనికి తృప్తిగా, ఆనందంగా ఉంది. ఆమె తను ఆశించినట్లు పాత రూప అయింది. తనకు అదిచాలు.

"నిజమా! మరేమిటండీ, ఎప్పుడూ మా బడి చూడనట్లు! పని అంటారా-రొటీన్ అవుతుంది." అన్నది నవ్వేస్తూ.



ఆమెకు తృప్తిగానే ఉంది తీరికనేదే ఉండదు.

"నిన్ను అభిమానించి, ప్రేమించి బలహీనుడిని అయ్యానులే, నీకు నవ్వులాటగానే ఉంటుంది."

"అబ్బా ! అంత గాఢంగా ప్రేమించారా, పాపం."

అతను లేచాడు. అతని గదిలో గోడకు ఓ చిన్న అలమరా ఉంది. అది యెప్పుడూ తీయలేదు అతను. దాని దగ్గరకు రూపను లాక్కువెళ్ళాడు.

"ఏయ్ ! ముద్దూ! అందులో ఏముంటో చెప్పు."

"చెప్పనా...మీరు ఏటో విలువయిన డ్రింకులు తెచ్చుకుని ఉంటారు. నా కోసం వాటిని దీనిలో బంధించారు త్రాగటంలేదు. అవునా ?"

"కాదు. మరో ఛాన్స్ ఇస్తున్నాను, గెస్ చెయ్యి."

"ఊహూ ! నా వల్ల కాదు బాబూ !" అన్నది కుతూహలంగా చూస్తూ.

"మట్టి బుర్ర !" అన్నాడు అలమర తీస్తూ.

"మిమ్మల్ని వరించిన నాడే నిరూపించారు అంతా !" అన్నది.

"ఏమిటి ? నీది మట్టి బుర్రనా !" అలమర బార్లా తీశాడు. దాంట్లో రక్తం మరకలతో పాతబడిన చొక్కా ఉంది.

"ఇదేమిటి ?" అది తీసి చూచింది.

"ఆ చొక్కా నాది, ఆ రక్తం అమ్మాయిగారిది. మన మొదటి పరిచయానికి గుర్తు." అన్నాడు.

హరిక్రిష్ణ అఘాయిత్యం, నాయనమ్మ విరుచుకు పడటం, ఆ రాత్రికి రాత్రే గుఱ్ఱం ఎక్కి తను వెళ్ళడం, దారి తప్పటం, గుఱ్ఱం పడవేయటం అంతా గుర్తుకు వచ్చింది.

"ఓ..." అన్నది అది జాగ్రత్తగా దాస్తూ.

ఆమె కళ్ళలో నీళ్ళు తిరగటం చూచి అతనామెను దగ్గరగా తీసుకుని, తల నిమిరాడు.

"రూపా ! గతంలోని చేదు అంతా మరిచిపోదాం. మనము పునర్జన్మ యెత్తాం. అదిగో కిటికీ నుండి బయటికి చూడు. అక్కడంతా చెత్తా చెదారం ఉండేది. ఇప్పుడు పూల మొక్కలతో, అందాలు వెదజల్లుతుంది. నువ్వు నమ్మినా, మానినా, నా హృదయం అలాగే ఉంది." అన్నాడు

ఆమె మాటలు రానట్టు రెండు చేతులు అతని మెడకు వేసింది. ఆ సుషుప్తావస్తలో చాలా సేపుండి పోయారు

## 25

వీరయ్య తెచ్చిన వార్త అందుకుని ఆనందంగా లేచాడు రాయలు, పంచాయితీ ఆఫీసు నుండి. ఆ రోజు అక్కడ ఎరువు పంపిణీ గురించి, ప్రణాళిక వేసుకుంటున్నారు.

"ఈ హరిజనుల పొలాలకిచ్చే ఎరువు దగ్గిరుండి చల్లించు కనకయ్య మామా లేకపోతే యెక్కువ ధరకు అమ్ముకుంటారు." అన్నాడు

"నువ్వు యెన్ని అరికట్ట గలవు బాబూ ! అమెరికా నుండి వచ్చే పాలపిండి, రవ్వ, నూనె పిల్లలకని ఇస్తే అవి అమ్ముకుంటారు" అన్నాడు కనకయ్య.

"వారిని ఏం అనలేం మామయ్యా. పెద్ద, పెద్దవాళ్ళే యెన్నో అవకాశాలున్నవారు చిల్లర పనులకు పాలు పడుతున్నారు. వస్తాను, నేను దగ్గర ఉందామనుకున్నాను. మా మరదలికి కాబోయే వరుడు వచ్చాడట. అతనెవరో కాదు. మీ కందరికి తెలిసిన వాడే, డాక్టరు హరికృష్ణ" అన్నాడు.

"ఓ అదా సంగతి! రూపమ్మ చాలా తెలివయిందే !" అన్నా రెవరో,

"అది మా అల్లుడిని చూస్తూ కాదంటానా !" కనకయ్య నవ్వాడు.

రాయలు చిరునవ్వుతో ముందుకుసాగాడు. శర్మిష్ఠ వివాహమయితే తమ బాధ్యత తీరిపోతుంది.

"వీరయ్యా ! బస్‌స్టాండ్‌లో నిలబడి ఏమయినా పళ్ళు దొరుకుతాయేమో చూడు. అతనొస్తున్నాడని రూప చెప్పింది గాని, హైదరాబాద్‌లో



అందరినీ చూచి వచ్చేవారం వస్తాడనుకున్నాను" అన్నాడు జేబులో నుండి పది రూపాయలు తీసి ఇస్తూ.

వీరయ్య వెళ్ళిపోయాడు. లోపలికి అడుగుపెట్టిన రాయలు మధ్య హాల్లో నుండి తీవ్రమైన మాటలు వినిపిస్తుంటే తక్కున ఆగిపోయాడు.

"చెప్పు రూపా ! చెప్పు, నన్నెందుకు మోసం చేశావు !" ఆవేదనగా ఉంది హరికృష్ణ గొంతు.

"హరీ ! నిన్ను నేను మోసం చేయలేదు. చేయాలనుకుంటే నిన్నే వివాహం చేసుకునేదాన్ని. నిన్ను చూస్తే ఓ మంచి స్నేహితుడిని చూచినట్టు అనిపించేది. ఆ తరువాత నన్ను నేను పరిశోధించుకున్నాను."

"అప్పుడయినా రాయొచ్చుగా! యెందుకు చీట్ చేశావ్ !"

"నిన్ను చీట్ చేయాలని మాత్రం కాదు. నీ మనసు చదువు మీది నుండి మళ్ళించకూడదని వ్రాయలేదు." అన్నది నచ్చచెప్పే ధోరణిలో.

"రూపా ! నువ్వింత లోతు గుండె కలదానివని కలలోకూడా ఊహించలేదు నిష్కపటివి, నిస్వార్థురాలివనుకుని ప్రేమించాను, ఆరాధించాను ఆ ప్రేమను గుండెల నిండా నింపుకుని వచ్చాను." అన్నాడు.

"నన్ను మన్నించమన్నాను కదూ ! నాతోపాటు అంకుల్‌ని, శర్మిని కూడా క్షమించు వాళ్ళు నా మాట మీదే, నీకు వ్రాయలేదు." అన్నది మృదువుగా.

"ఒక్క విషయం చెప్పు, యెవరి ఒత్తికివల్ల చేశావీ పని? అతనే... అతనే నీపై కక్ష కట్టి ఉంటాడు." అన్నాడు పళ్ళు పట, పట కొరుకుతూ.

"చూడు హరీ ! నాకు స్త్రీలు, పురుషులు, స్నేహితులంటూ ఎవరూ లేరు. ఉన్నదంతా నువ్వు ఒక్కడివే. నువ్విలా మాట్లాడటం బాగాలేదు. అతన్ని చూస్తే అలా అనవు." అన్నది అర్థం చేసుకో అన్నట్టు.

"ఎలా అంటాను. అతని అందానికి, సుగుణాలకు దాసురాలివి అయ్యావా ?" అన్నాడు వెటకారంగా.

"అందం అంటే ఏమిటి హరీ !" చిన్నగా నవ్వింది రూప.

"రూపా! ఇంతవరకు నన్ను నీ మాటలతో, రాతలతో మభ్య పెట్టింది చాలు. ఇప్పటికయినా కళ్ళు తెరిపించావు నువ్వు ఈ పల్లెలో బ్రతికిన దానవు కదూ! నా లాంటివారు తగరు. మొరటుగా, పశువులా ప్రవర్తించేవారు కావాలి."

"హరీ..." అరిచింది.

"అబద్ధం అడానా? మీ ఆయన, ఆయనంటూ గర్వంగా చెప్పే మనిషి పశువు కాక మనిషా..."

"హరీ! నా సహనానికి పరీక్ష పెట్టకు. మీకు అసలు పశువు అనటం తెలుసు. కాని పశువు ప్రవృత్తి తెలియదు దానికి ఓ సమయం ఉంది" ఆమె గొంతు వింటేనే తెలుస్తుంది కోపం బలవంతంగా అపుకుందని.

"అంటే మీ ఆయన పశువు కంటే హీనం అంటావు, అవునా!"

"హరీ! విదేశాలు వెళ్ళి చదివావు. నీ చదువు, సంస్కారం ఇదేనా! నీవు ఆలోచించే పరిధి ఇంతేనా! ఛీ...ఛీ...చదువు, సంస్కారాన్నే అవమాన పరుస్తున్నావు. విను బాగా విను. ఒక్కసారి కాదు, పదిసార్లు చెబుతున్నాను నన్ను ఎవరూ ఒత్తిడి చేయలేదు, ఆయనను హృదయ పూర్వకంగా ఇష్టపడే చేసుకున్నాను..."

"శభాష్ రూపా! అచ్చు సతీమ తల్లి లా మాట్లాడావ్! నాకంటే అతనిలో ఎక్కువ ఏం చూచావో చెప్పు." అన్నాడు వెటకారంగా.

"నీ రంగే అందం అనుకుంటే ఆ రంగులేదు. నీ డిగ్రీ చదువు అనుకుంటే ఆ డిగ్రీలేదు. నీ సైడ్ లాక్స్, బెల్‌బాటమ్ నాగరికతకు చిహ్నం అనుకుంటే అదీ లేదు ఆయన దగ్గర. కాని, కాని...మనుష్ఠుల్ని విశ్లేషించే మంచి మనసుంది నీచంగా ఊహించలేని గొప్పగుణముంది. స్త్రీ, అంటూ, ప్రగతి శీలత అంటూ ఊకదంపు ఉపన్యాసాలిచ్చే వారంతా స్త్రీ చనువుగా మాట్లాడితే నీలాపనిందలు అంటగడతారు." అన్నది, ఆవేశాన్ని అణచుకుంటూ.

"మీ ఆయన ఆ స్త్రీని అర్థం చేసుకున్నాడా?"



"అవును. నువ్వెంత వెటకారం చేసినా నిజం అబద్ధంకాదు. ఊరి వారి మాటలు విని నన్ను యెంత హీనంగా ఊహించావో నేను మరచిపోలేదు. ఆ మాటల ఆధారంగా నన్నొక కాముకిగా జమకట్టి బలవంతం చేశావు, అవమానించావు..."

"ట్రాష్! ఆ పాత కథ అప్పుడే మరచిపోయాము." అన్నాడు అసహనంగా.

"నువ్వు మరిచిపోయావు కాని, ఇప్పుడు గుర్తు చేసుకునే స్థితి వచ్చింది. వివాహమయి ఇన్నాళ్ళయినా, మన గురించి పుకార్లు విన్నా, నేను చెడిపోయిన దాన్ని అని అందరూ అన్నా ఆయన పట్టించుకోలేదు. ఒక్కనాడు అవమానకరంగా మాట్లాడలేదు."

"రూపా!" అరిచాడు.

"అవును హరీ! ఆయన ముఖం చూస్తుంటే అసలే మొరటు మనిషి, ఏం మాటలని అవమానిస్తాడో అని భయపడేదాన్ని..." అన్నది. మధ్యలోనే త్రుంచాడు హరి.

"తనలాంటి దానివే నువ్వు అనుకుని మాట్లాడలేదులే..." అన్నాడు విసురుగా.

"స్టోన్లీ అలా అనుకున్నా, ఆయన ఔన్నత్యానికి జోహార్లు అర్పించాలి. పురుషుడెప్పుడూ, తను చెడిపోయినా, తన భార్య పవిత్రంగా ఉండాలని కోరుకుంటాడు." అన్నది నచ్చచెప్పే ధోరణిలో.

"అయితే ఇంకేం, మీ ఆయనకు సన్మానం చేయిస్తాను," అన్నాడు కసిగా నవ్వుతూ.

"శుభస్య శ్రీఘ్రం! కానివ్వు హరీ. నాకు స్నేహితుడివి, ఆత్మీయుడివి, కాబోయే మరిదివి, నువ్వు చేస్తానంటే..."

"షటప్! నీకు, నాకు స్నేహం ఏమిటి? నువ్వు రాక్షసివి. అందరన్నట్టే విశృంఖలంగా తిరిగావు. నాలాంటి వాడు సున్నితంగా ఉంటాడు, నీకెలా నచ్చుతాడు! రోగాల పుట్టలు కావాలి. నీ గర్భం యెందుకు

పోయింటో యెరగవా ! ఆయన... ఆయన గర్వంగా చెప్పేవే; వాడు మనిషేనా !"

అంతే-హరికృష్ణ చెంపలపై టప్ టప్‌మని వాయించేసింది.

"యు, షటప్ ! ఆయనను ఒక్కమాట అనే అధికారం నీకు లేదు. మర్యాద ఇస్తే పుచ్చుకోవాలి, వెళ్ళు. మళ్ళీ నాకు ముఖం చూపించకు. టైగర్ ఇంద్రమ్మ చదివించిన విద్యార్థులలో నీ వొకడివి."

"రూపా !" చెంపలు తడుముకున్నాడు.

"రూపాదేవి! పరిస్థితులు అర్థం చేసుకో అని మర్యాదగా చెప్పాను నీకు వినిపించలేదు. ఇంకొక్కమాట అమర్యాదగా మాట్లాడవద్దు. ఈనాడు నువ్వు సగర్వంగా స్వదేశం వచ్చినా, శర్మిష్ఠ చదువుతున్నా అదంతా వారి చలవ. అది మరచిపోకు." అన్నది అద నాగులా బుసలుకొడుతూ.

"అంటే మా చదువులకోసం నీ జీవితం త్యాగం చేశానంటావు"

"అంత పెద్ద, పెద్ద మాటలు అనటంలేదు. మనకు తెలియని వ్యక్తి గురించి అంత నీచంగా మాట్లాడటం మంచిదికాదని చెబుతున్నాను." ఈసారి ఆమె కంఠంలోని తీవ్రత తగ్గింది.

అతను ఒక్కసారి తలెత్తి చూచాడు. తనకు పరిచయమైన రూపేనా ఈమె !

"హరీ ! నన్ను క్షమించు, నీపై చేయి చేసుకున్నాను. నువ్వు నన్ను రెచ్చగొట్టావు." అన్నది

"నీ డబ్బుతో పైకి వచ్చిన వాడిని. కొట్టే, తిట్టే అధికారం మీకుంది."

"అలా అనకు హరీ ! నాకు నిన్ను చులకన చేయాలన్న తపనతో కాదు కొట్టింది. వారిని...వారిని అలా అంటే సహించలేకపోయాను... అయామ్ రియల్లీ సారీ..." అన్నది మృదువుగా.

"మీ ఆయన అదృష్టవంతుడు రూపా !" హరి కంఠం గాద్గదికంగా ఉంది.



"థ్యాంక్స్ ఫర్ ద కాంప్లిమెంటు. నాపై ఏ మాత్రం అభిమానం ఉన్నా శర్మిష్ఠను నొప్పించకు, ప్లీజ్ హరీ..." అన్నది బ్రతిమిలాడుతూ.

"చూడు రూపాదేవీ, మీ వివాహము చేసుకోవటం మీ ఇష్టం, కాని నా వివాహము కూడా నీ ఇష్టం అనుకుంటే చాలా పొరపాటు చేస్తున్నావని చెబుతున్నాను. నాకు మీరేం చెప్పొద్దు. మీరు నాపై యెంత ఖర్చు పెట్టారో లెక్క చూపిస్తే, అంతా తీర్చి వేస్తాను. ఈ దేశంలో ఈ పరిసరాలకు దూరంగా వెళ్ళిపోతాను." అన్నాడు విసురుగా.

"హరీ..."

"నా పేరు హరికృష్ణ, డాక్టర్ హరికృష్ణ." అన్నాడు రోషంగా. రూప పిలుస్తున్నా వినిపించుకోకుండా బయటికి వెళ్ళాడు. భర్త వచ్చి హరికృష్ణ గురించి అడిగితే ఏం చెబుతుంది.

ఆమె ఉలిక్కిపడింది వరండాలో తలుపుకు అవతల వైపున్న కిటికీ దగ్గర నిలబడి వున్నాడు రాయలు. అతని చేతిలో సిగరెట్టు వెలుగుతుంది.

క్రింద పడిన నాల్గు అయిదు సిగరెట్టు పీకలు చూచి అదిరిపడింది. భర్త చాలా సేపటినుండి అక్కడ నిల్చున్నాడని అర్థం అయిపోయింది.

"ఏమండీ..." అతని దగ్గరగా వెళ్ళింది.

"ఏమిటి రూపా ?" అతను సిగరెట్టు దూరంగా పారేశాడు.

ఆమె యెందుకో వేల అయిపోయింది. తనను తాను నిలద్రొక్కుకోలేకపోయింది.

అతని హృదయంపై తల వాల్చి బావురుమన్నది.

"రూపా ! ఏమిటిది ?" ఆమె తలను హృదయానికి హత్తుకుని ఓదార్చాడు, అలాగే తల నిమురుతూ ఉండిపోయాడు.

"ఏమండీ, హరి మాటలు విన్నారా ?"

"వింటే నీకు నచ్చదనుకుంటే వినలేదు..." అన్నాడు

మెల్లగా నవ్వి.

"అది కాదండి..." ఆమెకెలా చెప్పాలో తెలియలేదు.

"అతను అన్నదానికి నీవు చెవులు మూయించావ్. ఇంకేమిటి చెప్పు!" అన్నాడు, మామూలుగా మాట్లాడే ప్రయత్నం చేస్తూ.

ఆమె దూరం జరిగి కళ్ళు ఒత్తుకుంది.

"రూపా! నాకు కాఫీ కావాలి, అలాగే ఏదయినా తినటానికి పెట్టు. అవతల చాలా పనులున్నాయి." అన్నాడు.

ఆమె త్వరగా వంటింట్లోకి వెళ్ళి ఉప్మా చేసి తెచ్చింది. అప్పటికే రాయలు వచ్చి, ఊయల బల్లమీద కూర్చున్నాడు.

"శర్మిష్ఠ కూడా వచ్చిందా?" అక్కడ పొట్లంలో ఫారిన్ నైలెక్స్ చీరలున్నాయి.

"శర్మి, అంకుల్ కుటుంబం అంతా వచ్చారు. ఈ ఉప్మా తీసుకోండి. నేను నిముషంలో కాఫీ తెస్తాను" అన్నది. ఆమె రెండు అడుగులు ముందుకు వెయ్యక ముందే పిలిచాడు రాయలు.

"నీ మనసు యెక్కడుంది?" అన్నాడు క్యాజ్యువల్‌గా.

"ఇక్కడ..." అతని గుండెపై వేలితో పొడిచింది.

"అలాగా..." ఉప్మా చమ్చాతో తీసి ఆమె నోట్లో పెట్టాడు.

"ఓ మైగాడ్...ఉప్పు వేయలేదు." త్వరగా అతని ప్లేటు తీసుకుని వెళ్ళింది. మళ్ళీ ఉప్పువేసి తెచ్చింది.

"చూడు రూపా! ఏదీ పట్టించుకోని వారెప్పుడూ సుఖంగా ఉంటారు. నల్గురి మేలుకోరి పనులు చేసేవారికి, నిజాయితీగలవారికి శత్రువులు ఎక్కువగా ఉంటారు. నువ్వు అధైర్యపడకు." అన్నాడు.

ఆమె వెళ్ళి రెండు గ్లాసులు కాఫీ తెచ్చింది.

"ఒక్కసారి వెళ్ళి అంకల్‌ని రమ్మన్నానని చెప్పండి." అన్నది,

"అలాగే, నా డ్యూటీని నేను చేస్తాను. వాళ్ళందరిని రేపు మనింటికి భోజనాలకు పిలుస్తాను." అన్నాడు రాయలు.



అతను వెళ్ళిపోయినా రూప మామూలు మనిషి కాలేకపోయింది. అతను తన గురించి ఏమనుకుంటాడు. హరి తెచ్చిన చీరలు బీరువాలో వేసింది. సాయంత్రం చీకటి ముసుగులో దూరినా యెవరూ రాలేదు. ఆమె హృదయం ఆందోళనగా ఉంది.

రాత్రి తొమ్మిది గంటలకు వచ్చిన రాయలు, భోజనంచేసి వార్తా పత్రిక తీసుకుని కూర్చున్నాడు.

"అంకుల్ రాలేదా?"

"వాళ్ళంతా మీ ఆంటీ బంధువుల ఇంటికి వెళ్ళారు. ఇప్పటివరకు డాక్టర్ హరికృష్ణతో మాట్లాడుతూ, అతనికి హాస్పత్రి, బడి చూపించాను..." అతనలా చెప్పుకుపోతున్నాడు.

ఆమె గుండెలో రైళ్ళు పరిగెత్తాయి.

అతనలా దూరంగా ఉండి మాట్లాడటం తనకు భయంగా ఉంది. హరికృష్ణకు కోపంవస్తే అసలు మనిషికాడు. తనపై ఏం కల్పించి చెప్పాడో!

అతను మళ్ళీ పత్రిక తీసుకున్నాడు.

ఆమెకు ఉక్రోషం, కోపం వస్తుంది. అతను ఏదయినా మాట్లాడి, తిట్టినా బావుండేది. తనను నిర్లక్ష్యం చేయటం సహించలేకపోయింది. అతనితో గిల్లి కజ్జం పెట్టుకోవటానికి తను సిద్ధమే. అతని చేతిలో వార్తా పత్రిక లాగి దూరం గిరాటు వేసింది.

"ఏమిటిది రూపా?"

"అసలు నా గురించి మీరేమనుకుంటున్నారు? నేనంతగా సతమతమవుతుంటే మీరు వార్తాపత్రిక యెలా చదువుతున్నారు."

అతను ఒక్కక్షణం ఆమెవంక చూచాడు. రెండు చేతులు తల క్రిందులుగా పెట్టుకుని పడుకున్నాడు.

అతని నిశ్చింత చూస్తుంటే మంటగా ఉంది.

"ప్రత్యేకంగా చెప్పాలా రూపా! కుటుంబం త్యాగం చేసిన గొప్ప స్త్రీవి" అన్నాడు.

"వెటకారం చేస్తున్నారా ?"

"నిజమే చెబుతున్నాను నీ ప్రేమను, కోరికను కుటుంబంకోసం త్యాగం చేయటం గొప్ప విషయంకాదా? దిక్కులేక నన్ను వివాహం చేసుకొమ్మని అర్థించావన్న దురభిప్రాయం ఉంటే, అదికూడా తుడిచిపెట్టుకుపోయింది" అన్నాడు మామూలుగా.

"అంటే నాకు అర్థంకాదు, నేను మొద్దును."

"మొద్దు నీవు కాదు, నేను. నాకో గర్వం ఉండేది తెలుసా రూపా! ఇంద్రమ్మ మనుమరాలు యెవరూలేక నన్ను అర్థించిందని. కాని కాని... ఈ రోజు నువ్వు నా కందనంత యెత్తుకు యెదిగిపోయావు. ఈనాడు లక్షలిచ్చికొనే డాక్టరును కాదని, ఒక చదువురానివాడిని చేసుకున్నావంటే..."

చటుక్కున అతని నోరు మూసింది.

"మీకు చదువురాదని యెవరంటారండీ... యెవరంటారు. కాపీ కొట్టో, బట్టీపట్టో డిగ్రీ తెచ్చుకోవాలనుకుంటే, అదే విద్య అనుకుంటే..."

"రూపా !" మృదువుగా ఆమె చేయి తీసివేశాడు.

"యెందుకీ ఆత్మవంచన ! ఆ రోజు నిషాలోఉండి సంతోషించాను గాని ఈ రోజు బాధగా ఉంది." అన్నాడు.

"ఎందుకు, నా పాత ప్రియుడితో కులుకుతాననా ?" తీవ్రంగా అడిగింది.

"ఏయ్ మొద్దూ..." అతను కోపంగా లాగాడు. అతని వడిలో పడింది. "నేను మనిషినే. అప్పుడు నాకా ఆలోచన రాలేదు. కాకిముక్కుకు దొండపండులా..."

"పాత సామెత..." అన్నది చురుకుగా.

"సామెతకు పాత, కొత్త లేదు. ఎప్పుడయినా వాడొచ్చు."

"చూడండి గ్రేట్ రాయలుగారూ ! నా మాటకూడా వింటారా ?



నేను హరికృష్ణవైపు ఆకర్షింపబడినమాట వాస్తవమేకాని ఆలోచిస్తే అది స్నేహశీలత్వం తప్ప మరేం లేదనిపించింది. మిమ్మల్ని చూడగానే..."

ఏదో చెప్పబోయి చెప్పలేక ఆగిపోయింది.

"నన్ను చూడగానే..." అతను ఆమె ముఖాన ఉన్న చేయి తొలగించాలని ప్రయత్నించాడు.

"ఊహూ చెప్పను..."

"నాకు తెలుసు ఏమనిపించిందో. వీడో మూర్ఖుడు, పల్లెటూరివాడు, స్త్రీలోలుడు. వీడికి నన్ను నేను ఎఱగా వేసుకుని నా ఆస్తిని దక్కించుకుంటాను-అనిపించింది కదూ ?" అన్నాడు.

ఆమె ముఖం మీదినుండి చేతులు తొలగించి అతని వంక చూసింది.

"అబద్ధమా ?"

"కాదు. సగం మాత్రమే నిజం. మీరు నమ్మినా, మానినా మీ ముందు నిజం చెబుతానండీ. మీతో వివాహమయితే మీ శత్రుత్వం ఉండదనుకున్నాను కాని...మిమ్మల్ని హృదయపూర్వకంగా ఇష్టపడ్డాను..."

ఆమ లేచి కిటికీ దగ్గరకు వెళ్ళింది.

"మీతో వివాహం అయ్యాక, నేనూహించినంత దిగజారిన వారు కారని, ఆత్మీయులు లేక, అలా అయ్యారని అర్థం అయ్యాక, నన్ను నేనే సమర్పించుకున్నాను. మీరు నమ్మినా మానినా ఇది నిజం..." అన్నది ఎటో చూస్తూ. రాయలు లేచి అమాంతం ఆమెను గాలిలోకి లేవనెత్తాడు.

"ఇదంతా నిజం...నిజమేనా రూపా ?"

"మిమ్మల్నెలా నమ్మించాలో చెప్పండి." అన్నది అతని మెడకు చేతులువేసి.

అతను ఆమెను మాట్లాడనియ్యలేదు.

ఆమె శరీరం వీణగామారి, ప్రేమరాగాలు పలికించింది. అది తొలిరేయిలా గడిచింది ప్రేమానుబంధాలున్న భార్యాభర్తలకు తొలిరేయి, మలిరేయి అంటూ ఉండదేమో. ఆ అనురాగం నిత్యనూతనంగా ఉంటుంది.

## 26

హరికృష్ణ కోపంగా బల్లను గుద్దాడు.

"అసలు నన్ను ఏమనుకుంటుంది రూప ?" పళ్ళు పట పట కొరికాడు. అందరూ నిదురబోతున్నా అతని అంతరంగం ప్రతీకారం కోరుతూ ఉంది.

"శర్మిష్ఠను చేసుకోవటం ఇష్టంలేకపోతే నీ ఇష్టం వచ్చినవారిని వివాహం చేసుకుని వెళ్ళిపో !" అన్నాడు కేశవరావు.

"వివాహమా ! ఈ జన్మకు వద్దు." అన్నాడు.

కాని, కాని రూపను సుఖంగా ఉండనివ్వడు తాను

ఏం చేయాలి ?

తను శర్మిష్ఠను కాదంటే మిగిలిన ఆస్తి కట్టబెట్టి మరో డాక్టరును తెస్తుందా రూప!

ఎలా...ఎలా ?

తను చదువుకున్నవాడు, అమెరికాలో డాక్టరీ చేస్తున్నాడంటే లక్షలు ఆర్జించటమే. తనకేం తక్కువ! ఓ పెంకిఘటం పల్లెటూరి పిల్ల కోసం ఎందుకు ఆరాటపడాలి.

"నీ కంటే నా భర్త ఎన్నో రెట్లు నయం, నిజమైన సంస్కారవంతుడు!" అంటున్న రూప గొంతు ఇంతయి, అంతయి కొండంతలయి ఘోష పెట్టింది.

అతని అభిమానాన్ని అనహేళన చేసింది.

ఇంత అహంకారమా రూపాకు? 'సారీ హరీ, నువ్వు లేవు. ముంచుకు వచ్చిన పరిస్థితులు నన్నిలా చేశాయి. నిన్ను మరిచిపోవాలని ప్రయత్నిస్తున్నాను' అంటే ఎంత బావుండేది.

అతన్ని ప్రేమించిందట! అతను చదువుకున్న వారికన్నా సంస్కారవంతుడట. తనకు తెలియకుండా కేశవరావు సహాయానికి అంగీకరించాడుగాని, తెలిస్తే చచ్చినా ఒక్క పైసా తీసుకునేవాడు కాదు.



అర్ధరాత్రి దాటాక, అయిదు సిగరెట్టు పెట్టెలు కాల్చాక రూపను సాధించే మార్గం తోచింది.

"రూపా! నీ భర్త సంస్కారం, నీ త్యాగం అన్నీ బయట పడతాయి" అనుకున్నాడు కసిగా.

అప్పుడు గాని అతను నిదుర బోలేదు.

మర్నాడుదయం లేస్తూనే నైట్‌గౌను బిగించుకుని, మెల్లగా శర్మిష్ఠ దగ్గరకు వచ్చాడు.

ఆమెకు అయోమయంగా ఉంది. కేశవరావు తన వివాహం వాయిదా వేయాలన్నాడు. హరికృష్ణకు తన చదువు పాడుకావటం ఇష్టంలేదట.

అది చెప్పటానికే వచ్చాడు కాబోలు, అనుకుని తాగుతున్న టీ కప్పు క్రింద పెట్టి లేచింది, కంగారుగా.

"టీ నాకివ్వకుండా ఒక్కదానివే తాగుతున్నావేం ?" అన్నాడు.

"మీరు లేవ లేదని..." అన్నది.

"లేపొచ్చుగా !" అన్నాడు మరో కుర్చీలాక్కుని కూర్చుని.

"యెంత సేపు-అయిదు నిమిషాల్లో చేస్తాను." వెళ్ళపోయింది.

"నీ టీ వదిలి వెళ్ళాల్సిన పని లేదులే. వెంకన్న తెస్తాడు." ఆమె చెయ్యి పట్టి ఆపాడు.

ఆమె వెంకన్నను పిలిచి టీ తెమ్మని చెప్పింది.

"మామయ్య వాళ్ళేరి ?" అన్నాడు చుట్టూ కలియ జూసి.

"అక్కయ్య ఇంటికి వెళ్ళినట్టున్నారు."

"బసి! శర్మిష్ఠా! నేనో నిర్ణయానికి వచ్చాను. నువ్వు అంగీకరిస్తే నేను సంతోషిస్తాను." అన్నాడు, విషయం చెప్పకుండానే.

"అంకుల్ చెప్పాడు మరో రెండేళ్ళు ఆగాలన్నారట! అలాగే !" అన్నది టీ సిప్ చేస్తూ.

"మొదట అలాగే అనుకున్నాను శర్మిష్ఠా! మీ అక్క వివాహం

చూచాక ఏ నిమిషంలో ఏం జరుగుతుందో తెలియదు. అందుకే నేనో నిర్ణయానికి వచ్చాను. మన వివాహం యెంత తొందరగా జరిగితే అంత మంచిది నువ్వు నీ చదువు పూర్తి చేయి-నేనీ ఊళ్ళో ఉండి ప్రాక్టీస్ పెడతాను." అన్నాడు అతను.

"ఈ ఊళ్ళోనా ?" ఆమె విస్మయంగా చూచింది.

"అవును. మొదట మన ఆస్తి, పాస్తులు చూచుకోవాలి. నీ చదువు పూర్తి అయ్యాక ఇద్దరము వెళ్దాము." అన్నాడు.

శర్మిష్ఠ మాట్లాడలేకపోయింది. అక్కను ప్రేమించిన వ్యక్తిని దూరం చేసుకోవాలా ? అంతా మరిచి అతనికి దగ్గర కావాలా అర్థం కాలేదు మనిషీ అన్నాక మనసు పడటం తప్పుకాదు. మూర్ఖంగా తను ప్రేమించిన వ్యక్తిని దూరం చేసుకోలేదు.

"మీ ఇష్టం..." అన్నది.

అప్పుడే వెంకన్న టీ తెచ్చి పెట్టాడు అతని ముందు.

ఇద్దరూ కలసి టీ త్రాగారు.

స్వతంత్రంగా అతను పిలిచి పనులు చెప్పాడు, ఇద్దరూ మెడిసన్‌కు సంబంధించిన విషయాలు చర్చించుకున్నారు.

కేశవరావు, విషయం విని ఒక్క క్షణం ఆశ్చర్యపోయాడు. ఆ తరువాత అభినందించాడు.

"నాకు తెలుసు హరీ! నువ్వు రూపను అర్థం చేసుకుంటావని." అన్నాడు ఆనందంగా.

"మామయ్యా! మా వివాహం ఇక్కడే డైగర్ ఇంద్రమ్మ స్థాయికి తగ్గట్టు చేయాలి." అన్నాడు.

"అలాగే!" అన్నాడు అతను. ఏం వాదించినా మనసు మార్చుకుంటాడేమోనని భయం.

"మామయ్యా! పాత విషయాలు నేను మరిచిపోవాలనుకున్నాను. మీరు నాతో సహకరించాలి. ప్రతి దానికి 'రూప' 'రూప' అంటూ మొదలు



పెట్టకండి." అన్నాడు, తీక్షణంగా.

"అలా అంటావేం హరీ! ఇందాక ఆమె చాలా బాధ పడింది."

"ఆమె బాధ మన బాధను తీర్చదుగాని, మీరు నేను చెప్పింది గుర్తుంచుకోండి." అన్నాడు.

కేశవరావు అంగీకరించాడు కాని రూపతో చెప్పకుండా ఉండలేకపోయాడు. ఆమె అతనిష్ట ప్రకారమే జరగనియ్యమని, పదివేల రూపాయలు బ్యాంకునుండి తెప్పించి ఇచ్చింది.

"చాలా ఘనంగా చేయండి అంకుల్. అతను నేను ఇస్తే తీసుకోడు. అడిగింది ఏదీ కాదనకండి." అన్నది చెమర్చే కళ్ళను ఒత్తుకుని.

"సరేనమ్మా !" బాధగా నిట్టూర్చాడు కేశవరావు.

శర్మిష్ఠకు హరికృష్ణ ఆంతర్యం అర్థంకాలేదు. అక్కలేని వివాహము చేసుకుంటుందా తను!

"అంకుల్, ఒక్కసారి డాక్టర్‌గారికి నచ్చ చెప్పండి." అన్నది దిగులుగా.

"కలతలు కలకాలం కాపురం ఉండవు శర్మిష్ఠా! అతను పట్టుదలగా ఉన్నప్పుడు ఎందుకమ్మా అంతగా బాధపడటావ్. మొదటిరోజు రూపను తంతానన్నంత ఆవేశంతో వచ్చాడు. రెండవరోజు వివాహ ప్రసక్తే వద్దన్నాడు. ఇప్పుడు అంగీకరించలేదా ?" అని నచ్చచెప్పాడు.

"అది కాదు అంకుల్! నా కున్నది అక్కయ్య ఒక్కర్తే కదా."

"అవును శర్మిష్ఠా! నా కున్న శత్రువు ఆమె ఒక్కర్తే. నన్ను అవమానించాలంటే ఆమెతోనే కాళ్ళు కడిగించుకుని, కన్యధార పోయించుకుంటాను." అన్నాడు కోపంగా, అప్పుడే అక్కడికి వచ్చిన హరికృష్ణ.

"అది కాదండి..." శర్మిష్ఠ ఏదో చెప్పబోయింది.

"మామయ్యా! వివాహానికి పూర్వమే భేదాభిప్రాయాలు ఎందుకు? నేను వాళ్ళ దయాభిక్షతో పైకి వచ్చిన వాడిని. నాకు అభిమానం ఉండటం అన్యాయం. అంతా రూపాదేవిగారి పెత్తనంతోనే జరుగనివ్వండి."

అని పైకి వెళ్ళాడు.

"అంకుల్! ఆయన కోరినట్టే జరుగనివ్వండి." చర చర అక్కడి నుండి వెళ్ళిపోయింది శర్మిష్ఠ.

కేశవరావు రెప్పవేయటం మరిచిపోయాడు కాసేపు.

అరగంట తరువాత తేరుకున్నాడు. వివాహపు ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. వెంకన్న పెళ్ళి ఏ రోజు వార్తలు ఆరోజూ అందిస్తున్నాడు రూపకు.

శర్మిష్ఠ పెళ్ళి కూతురవుతుండగా, కేశవరావు నగలపెట్టె తెచ్చి ఇచ్చాడు.

కళ్ళు వెడల్పు చేసి చూచింది శర్మిష్ఠ.

"అంకుల్, ఇవి అమ్మ లేదూ ?"

"లేదమ్మా! రూపవి మీ నాయనమ్మవి అవసరానికి అమ్మాము." అన్నాడు.

ఆమెకు కళ్ళమ్మట నీళ్ళు వచ్చాయి.

బూటీలున్న తెల్ల పట్టు చీర, ఒక ఉంగరం తెచ్చి ఇచ్చాడు వెంకన్న.

"అక్కయ్య ఆశీస్సులని చెప్పారమ్మా." అన్నాడు. శర్మిష్ఠకు దుఃఖం పొంగుకు వచ్చింది. కాని ఆమెకు హరికృష్ణ అన్నమాట గుర్తుకు వచ్చింది. కేశవరావు చెప్పిన ఆశాజనకమైన మాటలు గుర్తుకువచ్చాయి.

ఆమె మౌనంగా వివాహానికి అక్క పంపిన చీరే కట్టుకుంది. కేశవరావు కన్యాదానం చేశాడు.

ఊరంతా పెళ్ళికి వచ్చారు. వాళ్ళు చెవులు కొరుక్కోవటం గమనిస్తూనే ఉంది. అది రాయలుకు ఎంత దెబ్బో ఆమెకు బాగా తెలుసు. ఆమె అన్యమనస్కంగా ఉండగానే, వివాహపు తంతు ముగిసింది.

వారిద్దరూ కేశవరావు దంపతులకు నమస్కరించారు. ఊరు, ఊరంతా వివాహపు వేడుకలలో పాల్గొన్నారు. సాయంత్రం హైదరాబాద్ నుండి



ప్రసిద్ధ వైణికుడిని తెప్పించి, పాట కచ్చేరి ఏర్పాటు చేశారు. రిసెప్షన్‌లా పెట్టారు.

"మొద్దు- మొద్దే. చదువుకున్నాడు చదువుకున్నవాడే. రాయలు గతి లేనట్టు పెళ్ళి చేసుకున్నాడు. డాక్టరుగారు చూడు..." అంటూ మురిసిపోయారు కొందరు.

"మా అయ్యకు అడగ చాతకాదని కాదు, రూపమ్మకు అప్పుడు పెద్ద టెక్కెవరున్నారని..." వీరయ్య ఉడుక్కున్నాడు.

మెరిసేదంతా మేలిమి కాదని తెలిసినా, ఆ మెరుపుకే ఆకర్షితులయి వెరపు ప్రకటిస్తారీ జనం.

వెంకన్నకు బట్టలు కొన్నారు. అతని మనసు లావాలా ఉడుకుతున్నా కాలం కదలిక యెరిగిన వాడు కాబట్టి, ఓ నిట్టూర్పు వదిలాడు.

హరికృష్ణ వారం రోజులపాటు హనీమూన్‌కు వెళ్ళి వచ్చాడు. బెంగుళూరు, ఊటీ తిరిగివచ్చారు. కేశవరావు వెళ్ళిపోయాడు!

అతని లాలింపులో, ప్రేమలో సర్వం మరిచిపోయింది శర్మిష్ఠ. ఆమెకు అంతా మిథ్య, తనూ భర్త ఇద్దరే నిత్యం అన్నట్టుంది. అలసట తీరాక, ఆ రోజు ఇద్దరూ తీరికగా కూర్చున్నారు.

"నాకు పెళ్ళి చదువు పూర్తి చేయాలనిపించటంలేదండి. ఇక్కడే ఉండి పోవాలనిపిస్తుంది." అన్నది దిగులుగా భర్త వంక చూచి.

"శర్మీ ఇటురా..." అన్నాడు ఉయ్యాల బల్లమీద పడుకుని.

"ఏమండీ..." వచ్చి అతని ప్రక్కన కూర్చుంది.

"ఇదిగో చూడు, మనము పెళ్ళి చేసుకుంది గౌరవించుకుంటూ, మనసులో లేని ప్రేమలు నటించటానికికాదు. హరీ, లేదా కృష్ణా అని పిలువు." అన్నాడు ఆజ్ఞాపిస్తున్నట్టు.

"అలాగే హరీ..." అనబోయి టక్కున ఆగిపోయింది. ఆ హరీ అన్న పదం తన అక్క నోట యెంత మధురంగా, అనురాగపూరితంగా

పలికేటో తనకు బాగా తెలుసు.

"ఏదీ ఒకసారి గట్టిగా చెప్పు." అన్నాడు.

"అలాగే కృష్ణా." అన్నది అతని భుజంమీద తలవాల్చి.

"గుడ్. చూడు శర్మీ, నీవు చదివే చదువు మామూలుది కాదు. నేను అమెరికా వెళ్ళక ఇక్కడ ఉన్నది యెందుకో తెలుసా ! కేవలం నీ చదువ కోసం. నిన్ను ఒంటరిగా వదలటం ఇష్టంలేదు. ఈ రెండు మూడేళ్ళ ఇక్కడ పనిచేసి మీ నాయనమ్మ ఋణం తీర్చుకుంటాను." అన్నాడు.

"ఏం మాటలండీ, మా నాయనమ్మ దంతా మా ఇద్దరిదే కదా!" అన్నది.

"అందుకే ఈ పేపర్‌పై సంతకం పెట్టు. నీవు నాకు పవర్ అఫ్ అటార్నీ ఇచ్చినట్టన్న మాట." అన్నాడు- టైప్ చేసిన కాగితాలు అక్కడ పెట్టాడు.

"అవసరమంటారా ?" అన్నది యెటో చూస్తూ.

"అవును శర్మీ ! ఏ చిన్న విషయానికి నిన్ను పిలువటం, నీ చదువు పాడు చేయటం నా కిష్టంలేదు. ఆదివారం ఒక్క-సారి వస్తాను." అన్నాడు.

శర్మిష్ఠ, ఆ కాగితాలపై సంతకాలు పెట్టింది.

"గుడ్ గర్ల్! నీవు నిశ్చింతగా చదువుకో, నేను ఇక్కడ అన్నీ చూచుకుంటాను." అన్నాడు హరికృష్ణ.

శర్మిష్ఠ నిశ్చింతగా అతని భుజంపై తలవాల్చి కళ్ళు మూసుకుంది.

హరికృష్ణ చిన్నగా నవ్వాడు.

## 27

రాయలుకు రొట్టెలు బల్లమీద పెట్టింది రూప, అతను కూర్చుని రూపను పిలిచాడు.

"ఉదయం రొట్టెలు తింటే ఇక నాకు ఈ తలుపులు సరిపోవు." అన్నది.



"మరి నాకు సరిపోతున్నాయి కదా !" అన్నాడు.

"మీరు రొట్టెలు తింటారు, అంత శ్రమా చేస్తారండీ. నాకు అరిగే దెలా చెప్పండి." అంటుండగానే పని కుర్రవాడు మల్లేష పరుగున వచ్చాడు.

"అమ్మా ! మనింటికి యెవరో వస్తున్నారు." అన్నాడు కంగారుగా. రూప యెవరయి ఉంటారా అని బయటికి వచ్చింది.

సిగరెట్టు కాలుస్తూ, ఆ పరిసరాలను చూస్తూ నిలబడ్డాడు హరికృష్ణ.

రూప ఒక్క-క్షణం ఆలోచించింది.

వివాహం అయ్యాక అయినా శర్మిష్ఠ, అతను వస్తారని ఆశించింది. అతను రాలేదు. ఈ రోజు అయినా వచ్చాడంటే ఏదో ప్రత్యేకమైన కారణం ఉంది అనుకుంది.

తలుపులో బొమ్మలా, కాంతి దూతలా, గంభీరమైన సముద్రంలా నిలబడిన రూపను చూడగానే హరి హృదయం విహంగమయింది.

"రూపా!" అన్నాడు. ఆ గొంతులో ఆరాధనా, అనురాగం పోటీ పడ్డాయి.

"రా హరీ! వారు ఉన్నారు." అన్నది నవ్వుతూ.

ఆ 'వారు' అన్నమాట అతని హృదయాన్ని ముక్కలు ముక్కలు చేసింది.

సిగరెట్టు కాలి క్రింద వేసి కసిగా నలిపి వేశాడు.

"ఈ పరదాలన్నీ అమ్మమ్మగారు కొన్నారనుకుంటాను." అన్నాడు.

"అవును హరీ! ఆ ఇంటికి తాళం పడ్డది. ఊరికే పాడవటం యెందు కని తెచ్చాను." అన్నది కుర్చీ చూపిస్తూ

"మంచి పని చేశావు. అవి కొనాలన్నా మీలాంటి వారి వల్ల అయ్యే పనా ?" అన్నాడు.

రూప హృదయంలో గుబులు డిగబడింది.

"మీ వారు యేరి ? అంట్లు తోమిస్తున్నావా ఏం ?" పక, పక నవ్వాడు.

తనను అవమానించటానికే వచ్చాడని అర్థం అయింది.

"అమెరికాలో అదేపని చేసి, మీ లాంటి విద్యార్థులు పొట్ట పోసుకుంటారట కదా." అన్నది తనూ స్పోర్టివ్‌గా తీసుకుంటూ.

రూప అంత త్వరగా జవాబు ఇస్తుందని భావించని హరి, తెల్లబోయినట్లు చూచాడు.

"యెవరు రూపా ?" రాయలు అడిగాడు.

"రా హరీ..." ఆహ్వానించింది. అతనికి ఫలహారాలు పెట్టబోయింది. అతను అంగీకరించలేదు.

"నాకీ రొట్టెలు అలవాటు లేదు రూపా!" అన్నాడు.

"టీ, కాఫీ తీసుకుంటావా ?" అన్నది మర్యాదకు.

రాయలుకూడా నవ్వుతూ మర్యాద చేశాడు.

"ఈ బల్లకూడా బంగళాలోదే అనుకుంటాను." అన్నాడు కూర్చోకుండానే.

రాయలు ఒకసారి తలెత్తి అవునన్నట్టు తలాడించాడు.

"అవును హరీ! ఈ బల్ల, హాల్లో ఉన్న మంచం, నా పుస్తకాల బీరువా, బట్టల బీరువా అన్నీ మా ఇంట్లోవే. ఏం ?" అన్నది కాస్త రోషంగా.

"చూడు రూపా ! నిన్ను అవి ఇవ్వమని అడగటానికి రాలేదు. నీకు, శర్మిష్ఠకు చెందిన వస్తువులు ఒక్కదానివే వాడుకోవటం వింతగా ఉంది. అఫ్‌కోర్స్ నేను తలుచుకుంటే నిముషంలో కొనగలను. అసలు అవి ఎవరివో తెలియాలి కదా..." అన్నాడు నిదానంగా.

రూప చేతిలో ఉన్న చెంబు అతని ముఖాన విసిరి కొడదామన్నంత కోపం ముంచుకు వచ్చింది, కాని నిగ్రహించుకుంది.

"చూడు హరీ, ఇలా సూటిపోటి మాటలెందుకు ? నేను తెచ్చిన



సామానుకు పదిరెట్లు వదిలేశాను." మృదువుగా చెప్పింది.

"ఆ సామాను కొట్టులో నేను ప్రాక్టీసు పెట్టాలా ? ఈ బిల్డింగ్ ఇచ్చేకన్నా ముందు నా అనుమతి కోరారా ?" వెటకారంగా అడిగాడు.

"అప్పటికి నీకు, మాకు యెలాంటి సంబంధ బాంధవ్యాలు లేవు. శర్మిష్ఠను అడిగాను. అదికాక బంగళా ఖాళీగా ఉంటే గబ్బిలాలు కూర్చుంటాయి" అన్నది తీక్షణంగా.

"శర్మిష్ఠ చిన్న పిల్ల, తనకేం తెలియదు. ఇదిగో నాకు పవర్ ఆఫ్ అటర్నీ ఇచ్చింది." అన్నాడు కాగితాలు చూపుతూ.

రాయలు చెయ్యి కడుక్కొని వచ్చాడు. అతనికి పాలు ఇచ్చింది

"డాక్టర్‌గారికి కూడా ఇవ్వు." అన్నాడు.

"వారికి పల్లెటూరి పాలు నచ్చుతాయో లేదో మరి!" అన్నది నవ్వటానికి ప్రయత్నిస్తూ.

"ఇవ్వటం మన ధర్మము. తీసుకోవటం, మానేయ్యటం వారిష్టం." అన్నాడు రాయలు.

"రాయలుగారూ, ఇన్ని ధర్మపన్నాలు చెప్పే మీరు, చేసేవి అన్నీ అధర్మం పనులేనా ? ఇద్దరి అక్క, చెల్లెళ్ళకు చెందిన బంగాళాను ఒక్కరు తమ స్వార్థం కోసం వినియోగించటం ధర్మమా ?" అన్నాడు నిర్లక్ష్యంగా తల యెగురవేసి.

"ధర్మకార్యం కోసం బంగాళా ఇవ్వటం, అర్థం లేకుండా అధర్మం అంటే నేనేం చెప్పగలను ?" అన్నాడు బాధగా రాయలు.

"ధర్మకార్యమా !" పక్కున నవ్వాడు హరికృష్ణ. రూపకు కంపరంగా ఉన్నదా పరిస్థితి.

"మీరు మిషనరీ దగ్గర డబ్బు తీసుకున్న సంగతి నాకు తెలియదనుకోకండి. ఊరంతా అమాయకులు కావచ్చుకాని నేను కాను." అన్నాడు కోపంగా.

"నిన్ను అమాయకుడనుకునే మూర్ఖులం కాము హరికృష్ణగారూ!

మీరు ఫస్టుక్లాసులో పాసయిన సంగతి మా వారికి తెలియకపోయినా నాకు బాగా తెలుసు. మేము డబ్బు తీసుకున్నట్టు నిరూపించగలవా !" ఈ సారి రూప కంఠములో కరుకుదనం కర, కరలాడింది.

"లంచాలు తీసుకునేవాడు నిరూపణ కందేలా తీసుకోడని నాకు తెలుసు రూపదేవీ. ఇప్పుడు నన్నీ ఊళ్ళో ఉండి ప్రాక్టీస్ చేయమంటారా, వెళ్ళిపొమ్మంటారా? అది చెప్పండి మొదట." అన్నాడు రోషంగా, కుర్చీలో నుండి లేచి.

"నా ఇష్టప్రకారం నడుచుకుంటారా ?"

"కాదు. ఈ ఊళ్ళో ప్రాక్టీసు పెట్టి టైగర్ ఇంద్రమ్మనుండి ఋణ విముక్తుడిని కావాలని..." అన్నాడు.

"అయితే అమెరికన్ ఆస్పత్రి సూపరిండెంట్‌తో మాట్లాడుతాను. మీరక్కడ చేరిపొండి." అన్నది.

"అదేం లాభంలేదు, నేను యెవరి చేతిక్రిందా బానిసలా బ్రతుకటం ఇష్టంలేదు. నేను సర్జరీ స్పెషలైజ్ చేశాను."

"మరి..."

"ఆ బంగళా నాకు స్వాధీనం అయితే స్వంతంగా ప్రాక్టీసు పెట్టుకుంటాను." అన్నాడు.

"బంగళా మొత్తం కావాలా ?"

"అవును. బంగళాయే కాదు, ఇక్కడ బడికూడా అవసరం. ఆ గదులు కూడా కావాలి, ఇంపేషెంట్లకు ఇవ్వటానికి." అన్నాడు.

"అదెలా సాధ్యం ? అడ్డుగోడ కట్టటానికి, బంగళాను బాగు చేయటానికి వాళ్ళు బోలెడు ఖర్చు పెట్టారు." అన్నది.

"అది సాధ్యమో, అసాధ్యమో నాకు తెలియదు. నాకు వారం రోజులలో బంగళా స్వాధీనం చేయాలి నా భార్యకూడా డాక్టరే, ఇద్దరం దాన్ని నడుపుకుంటాము. లేదంటే కోర్టుద్వారా తీసుకుంటాము." అన్నాడు బయటికి వెడుతూ.



"హరీ..." ఆశ్చర్యంగా పిలిచింది.

"నా పేరు డాక్టర్ హరికృష్ణ. నేను చెప్పేది చెప్పాను. ఆ తరువాత మీ ఇష్టం." అన్నాడు బయట అడుగుపెడుతూ.

"ఆ బంగళా శర్మిష్ఠ ఒక్కదానిదే కాదు. నాకూ భాగం ఉంది."

"నువ్వు గత అయిదారేళ్ళుగా బడి పెట్టుకుని సంపాదించుకున్నావ్. ఈ అయిదారేళ్ళు మేము వాడుకుని, ఆ తరువాత ధర కట్టి డబ్బు మీ ముఖాన పారేస్తాం." అని చర చర వెళ్ళిపోయాడు.

రూప రాతిబొమ్మలా మాటలు రానట్టు నిలబడిపోయింది.

"రూపా !" రాయలు పిలిచాడు.

"ఏమండీ..." అతని చేతుల్లో ముఖం దాచుకుంది.

"ఇవ్వన్నీ మన జీవితానికి పరీక్షలు రూపా ! అధైర్య పడితే యెలా ?"

ఓదార్పుగా ఆమె వీపు నిమిరాడు.

"వెంటనే మనము కేశవరావుగార్ని కలుసుకోవాలండీ." అన్నది.

"నిజమే, కలుసుకుందాం. కాని అతని మాట హరికృష్ణ వింటాడని అనుకోను. ప్రయత్న లోపం యెందుకు ?" అన్నాడు.

అరగంటలో ప్రయాణం అయి, ఇద్దరూ కేశవరావు దగ్గరకు వెళ్ళారు.

వారు చెప్పిన విషయం విని ఆయన ఆశ్చర్యపోయాడు.

"నిజమా రూపా ! హరి ఇలా అన్నాడా !" ఆయన ఆలోచనలో పడ్డాడు అక్కడ భోజనాలు చేశాక, ఆయన వెళ్ళి హరికృష్ణతో మాట్లాడి వచ్చాడు.

"లాభంలేదు రూపా ! వాడికి మతిపోయింది. కోర్టుకు వెళ్తాడట-వెళ్ళనీ." అన్నారాయన కోపంగా.

"అతన్ని అమాయకుడుగా తీసి వేయటానికి వీల్లేదు అంకుల్. అతను అన్నమాట న్యాయరీత్యా నిజమే కదా." అన్నది రూప.

"మనము న్యాయాన్ని తల క్రిందులు చేయవచ్చునమ్మా, నువ్వేం దిగులు పెట్టుకోకు." అన్నారాయన కోపంగా.

రూప ఆలోచిస్తూ కూర్చుంది

సాయంత్రం కాఫీ త్రాగి ఆయన హైదరాబాద్ వెళ్ళిపోయాడు

రూపకు తెలుసు, తను వెళ్ళి కన్నీటితో ప్రాధేయపడితే అతను కరిగిపోతాడు.

కాని...కాని తను నటించగలదా! తననే ప్రాణంగా చూచే భర్తకు అన్యాయం చేయగలదా!

రాత్రికి అన్యమనస్కంగా వంట పూర్తి చేసిందామె.

రాయలు భోజనం చేయటానికి కూర్చున్నాడు. అతను మొదటి ముద్ద నోట్లో పెట్టుకుని ముఖం చిట్లించి, ఆ ముద్ద బయట ఊసి వచ్చాడు.

"రూపా! నువ్వూ రా." అన్నాడు ఆమె వచ్చి వడ్డించుకునేవరకు అలాగే, అన్నం కెలుకుతూ కూర్చున్నాడు.

వచ్చి తను వడ్డించుకుంది. ఆమె మరో మాట లేకుండా అన్నం ముద్దలుతిని నీళ్ళు త్రాగటం చూస్తే ఆమె మానసిక స్థితి అర్థం అయింది. ఉప్పు రెండుసార్లో, మూడు సార్లో వేసి ఉంటుంది.

అతనికి అర్థం అయింది, తను ఏదో నిర్ణయించకపోతే రూప పిచ్చిది కావటం ఖాయం.

"రూపా! అతను పంతంతో అడుగుతున్నాడు. అలాగే బంగళా స్వాధీనం చేద్దాం." అన్నాడు రాయలు.

"మీకు మతి పోయిందా?" ఉలిక్కిపడ్డట్టు చూచాడు.

"నువ్వు నాకు దూరం అయితే తప్ప నా మతి నా దగ్గరే ఉంటుం దోయ్. మీ బంగళా అంత పెద్దది కాకపోయినా, మన ఇల్లూ పెద్దదే. వాళ్ళు పెట్టిన ఖర్చులుకూడా ఇద్దాం. ఇది ధర్మం, అధర్మం అంటూ వాదించే సమయం కాదు." అన్నడాయన.

"మరి మనమెక్కడ ఉందాం?" అన్నది దిగులుగా.



"మన పొలం దగ్గర చిన్న ఇల్లుంది. అది మనకు సరిపోతుంది." అన్నాడు.

"ఏమండీ మీరు నిజంగా అంటున్నారా?"

"అవును రూపా! మనకు మాయ కప్పుకున్న కళ్ళే ఉన్నాయి. ఈ ఊళ్ళో సగంమంది బాధ పడేది, సరియైన వైద్య సదుపాయం, విద్యా సదుపాయం లేకనే. అన్ని ఊళ్ళకు చేయకపోయినా నా ఊరికి చేశానన్న తృప్తి అయినా మిగలనీ." అన్నాడు.

రూప మాటలు రానట్టుండిపోయింది ఆమె కళ్ళ ముందు స్త్రీ లోలుడయిన వేమన, నిర్దాక్షిణ్యంగా వేటాడే వాల్మీకి, రక్త మడుగులు ప్రవహింప జేసిన అశోకుడు మెదిలారు

"ఏమిటాలా చూస్తావ్! నీకే ఆ పొలాల దగ్గర తోచదేమో. ఇదివరకు ప్లేగు కేంపులు వేసేవారు రూపా. ఇప్పుడలాగే అనుకుందాం." అన్నాడు.

"మీరున్న చోటు నాకు మేడ, నందన వనం." అని చెప్పాలని ఉన్నా చెప్పలేకపోయింది.

"అలాగే రోడ్డు ప్రక్కనున్న పొలం కావాలట. అది అమ్మేస్తే కంపన్‌సేషన్ ఇద్దాం. లారీలో పెద్ద లాభాలులేవు. అదయినా అమ్ముతాను." అన్నాడు.

"వద్దండీ... వద్దు. నా మూలంగా..." ఆమె కళ్ళు నిండు కున్నాయి.

"నీది, నాది అనే భేదం వద్దు. నీ నవ్వు నాకు స్ఫూర్తి నిస్తుందని మరిచిపోకు." అన్నాడు.

ఆమె జవాబుగా అతని భుజంపై తల వాల్చింది.

"అతనికి తెచ్చిన సామాన్లన్నీ పంపించు."

"అలాగే." అన్నది, దూరం జరుగుతూ.

"ఒక గంటలో వస్తాను. నువ్వు సామాన్లు ప్యాక్ చెయ్యి." అని, అతను వెళ్ళిపోయాడు. రూప అలాగే నిలబడి పోయింది.

## 28

పొలం దగ్గర ఇంట్లో కాపురం గమత్తుగా, కొత్తగా ఉంది. ఆ ప్రశాంతత, నిర్మలమైన వాతావరణం చూస్తే హాయిగా ఉంది. రాయలు రాత్రిళ్ళు ఆలస్యంగా వచ్చినప్పుడు మాత్రం బితుకు, బితుకుమంటూ కూర్చుంటుంది. రాయలు ఇంటి వెనుక ఖాళీ స్థలంలో రేకుల షెడ్డు వేసి బడి కోసం ఇచ్చాడు. రూపకు రోజూ ఒక మైలు నడవటం అవుతుంది. లారీకూడా అమ్మి, బ్యాంకు లోన్ పోను మిగతాది బడికి ఇచ్చేశాడు. అయినా ఆమె శ్రమగా భావించటంలేదు. అన్నీ పోయాయని బాధలేదు.

నాల్గు గంటలకు ఇంటికివచ్చి అలసటగా మంచంపై వాలిపోయింది.

వీరయ్య వచ్చి చెప్పాడు-రాయలు రమ్మన్న వార్త.

"రూపమ్మా! మీ పొలం దగ్గర కుప్ప కొడుతున్నారమ్మా. అయ్యగారు నిన్ను రమ్మన్నారు." అన్నాడు.

లేచి మంచినీళ్ళు త్రాగింది. చెప్పులేసుకుని బయలుదేరింది. తమకున్న మంచి పొలాలన్నీ పోయాయి. టైగర్ ఇంద్రమ్మదే మిగిలింది. అది జాగ్రత్తగా చేసుకుంటే తప్ప తమకు గిట్టుబాటు కాదు.

సగం దూరం వచ్చాక గుర్తుకు వచ్చింది- భర్తకు టీ తీసుకురాలేదని.

వీరయ్యని వెనక్కు పంపింది.

ఆమె పొలం దగ్గర కొచ్చేసరికి, అక్కడ ఠీవిగా నిల్చున్నాడు హరికృష్ణ.

కొద్ది దూరంలో రాయలు నిల్చున్నాడు.

వారి వాలకం చూస్తే ఇద్దరూ ఏదో తీవ్రంగా వాదించుకున్నారని అర్థం అయిపోయింది.

ఒకరిని ఒకరు అంచనా వెయ్యాలన్నట్టు చూసుకుంటున్నారు.



దూరంగా నిలబడ్డ కూలీలూ, జీతగాళ్ళు, వింత చూస్తున్నారు.

"ఏమిటండీ?" రూప ఆదుర్దాగా అడిడింది.

"ఏం లేదు రూపా! మనము ఈ పొలం దక్కించుకోవాలని చూచాము కదూ! ఆ అన్యాయం తెలిసి, హరికృష్ణగారు తన హక్కు అడుగుతున్నారు-అంతే..." అన్నాడు.

"ఓహో! రూపాదేవిగారా! మీ గౌరవనీయులయిన భర్తగారు, ఈ ఊరి సర్పంచిగారు, డబ్బిచ్చి ఈ పొలం కొన్నారట. ఆ డబ్బు టైగర్ ఇంద్రమ్మగారు దయ్యం అయివచ్చి తీసుకున్నారా, అని అడిగితే జవాబు చెప్పలేకపోతున్నారు." అన్నాడు వెటకారంగా.

"ఆ డబ్బు లెక్క నేను చెబుతాను డాక్టరుగారూ! ఇక్కడకాదు. ఇంటికి రండి." అన్నది రూప.

"రూపాదేవీ! నీ వగలకు, సొగసులకు ఒకప్పుడు మోసపోయాను కాని ఇప్పుడు కాదు..." అతని మాట పూర్తి కాకముందే రాయలు చేయి గాలిలోకి లేచింది. బలంగా హరికృష్ణ చెంపను తాకేదే. కాని, మెరుపులా రూప పట్టుకుంది.

"ఏమిటండీ, అందరూ ఇటే చూస్తున్నారు."

"నువ్వుండు రూపా! మిస్టర్ హరికృష్ణా! మీకేం కావాలో సూటిగా చెప్పండి. అంతేకాని అవాకులు, చెవాకులు విసరొద్దు." అన్నాడు.

"ఈ బావి మూడు సంవత్సరాలు నువ్వు చేసుకుని ఫలితం అనుభవించావు. మరో మూడు సంవత్సరాలు నేను చేసుకుంటాను. ఇట్ ఈజ్ వెరీ సింపుల్." అన్నాడు.

"ఓకే...అలాగే. ఈ పంట అయిపోగానే మీ స్వాధీనం చేస్తాను." అన్నాడు కోపం పళ్ళ బిగువున అణచుకుంటూ.

"బాబూ..." వెంకన్న ఏదో అనబోయాడు.

"వెంకన్నా! మొగుడి సొమ్ము తిని ప్రియుడి పాట పాడతారని

నీలాంటి వారిని చూచే అన్నారు నీ హద్దుల్లో నువ్వుండు." హరికృష్ణ కసిరాడు.

"అలాగే బాబూ..." కళ్ళ నీరు ఒత్తుకుంటూ వెంకన్న వెళ్ళిపోయాడు.

రూపకు హరికృష్ణను యెన్నో అడగాలని ఉంది. కాని, అతను సవ్యంగా జవాబు ఇవ్వకపోతే పరిస్థితి ముదురుతుంది. రాయలు చెయ్యి ఎత్తాడంటే దానికి తిరుగుండదు.

"ఏమిట్రా తమాషాలు చూస్తారు. కానివ్వండి, చీకటి పడింది." అన్నాడు రాయలు ఏం జరగనట్టే.

"మంచిది దొరా..." అందరూ కాళ్ళకు చక్రాలు అమర్చినట్టు పని చేయటం ప్రారంభించారు.

ఒక్క క్షణం వారిని చూచి ముందుకు నడిచాడు హరికృష్ణ.

"రూపా! నీవు కాళ్ళు పట్టుకుని ప్రాధేయ పడేరోజు తప్పక వస్తుంది నన్ను పోగొట్టుకుని నష్ట పోయిందేమిటో తెలిసేలా చేస్తాను." అనుకున్నాడు అతను.

వీరయ్య టీ ఫ్లాస్క్ తెచ్చాడు.

గడ్డివామి దగ్గర కూర్చున్న భర్తకు టీ ఇచ్చింది.

"నువ్వు త్రాగినట్టు లేవు..." అన్నాడు ఫ్లాస్క్ మూతలోకి టీ వంచిఇస్తూ.

వీరయ్య కుప్ప కొట్టే దగ్గరకు వెళ్ళాడు.

ప్రక్కనే కూర్చుని టీ త్రాగింది.

"మీరు తొందరపడి పొలం స్వాధీనం చేస్తానన్నారు. అసలు అప్పులు ఎందుకు చేశామో అడగేదాన్ని." అన్నది రోషంగా.

"రూపా! అతను వినిపించుకునే స్థితిలో ఉన్నాడా. నోరు జారిన మాటలు మళ్ళీరావు కదా." అన్నాడు.

"అతను కావాలనే మాట్లాడుతున్నాడు."



"అందుకే సరే అన్నాను. ఆ పొలానికి నా డబ్బు కట్టానన్నా అతను వినిపించుకోడు. శర్మిష్ఠ పవర్ ఆఫ్ అటర్నీ ఇచ్చి చాలా ఇబ్బంది పెట్టింది." అన్నాడు ఒక్కొక్క గుక్క టీ త్రాగుతూ.

"దానికి విషయాలు తెలియవు. ఉత్తరం రాయనా?" అన్నది.

"ఆ పని మాత్రం చేయకు. అమ్మాయికి అప్పుడే చదువా, సంసారమా అన్న ధ్యాస ఉండి ఉంటుంది. మళ్ళీ నువ్వు కొత్త సమస్యను ఆమెకు తెలియచేయటం భావ్యం కాదు." అన్నాడు.

రూప ఆలోచిస్తూ కూర్చుంది

మనిషికి తనకు కావలసినంతే ఉండాలేమో.

ఏ మాత్రం యెక్కువ ఉన్నా ఇతరుల దృష్టిలో పడతాడు తన తాత యెవర్నీ అన్యాయం చేయలేదు. అహోరాత్రులు శ్రమపడి సంపాదించిన డబ్బు యెందుకు ఉపయోగపడింది? ఇద్దరి కొడుకుల ప్రాణాల్ని బలిగొన్నది.

మనిషికి ఉంటే బలం- పశువుకు తింటే బలం అంటారు. తమకున్న డబ్బు, ఆస్తి ఏ మాత్రం బలం చేకూర్చింది.

ఏం ఉందని అంత ఉత్సాహంగా ఆ కూలీలు పని చేస్తున్నారు?

వారి ఆనందం చూస్తే మతిపోతుంది. వాళ్ళకు రేపు అన్న ఆధారం లేనే లేదు.

మనకు వేదాంతం చెప్పారుగాని సరియైన పద్ధతిలో అవగాహన చేయలేదు.

"రూపా, దాని గురించి ఆలోచించకు. యెప్పుడూ మనకన్నా తక్కువ వారివైపు చూడు, స్వాంతన పొందుతావు." అన్నాడు.

ఆమె విప్పారిన నేత్రాలతో చూచింది. చుట్టూ మనుషులున్నారని ఊరుకుంది కాని అతనికి అతి తీయగా, అపురూపమైన అనుభూతి అందించేది.

ఆ నాడు ఏయ్ నా ఇంట్లో నీలాంటి నమ్మకమైన మనిషి కావాలన్న

రాయలుకు; ఈనాడు 'రూపా' అని తీయగా పిలుస్తున్న రాయలుకు పోలికే లేదు. అతను లేస్తూ ఆమె బుగ్గమీద చిటికెవేశాడు.

"ఏమిటి మాటా మంతీ లేకుండా చూస్తూ ఉండిపోయావు."

తన ఆలోచనలు చెప్పింది.

"రూపా! నేను... అనాడు, ఈనాడు ఒట్టి మట్టి బొమ్మనే. అనాడు జీవం పోసింది నీవే; ఈనాడు స్ఫూర్తివి నీవే. ఆడదాని హృదయం అమృతానికి, హాలాహలానికి ఆలవాలం. అమృత భాండం బయటపడిన ఇల్లు స్వర్గతుల్యం అవుతుంది." అన్నాడు ముందుకు నాలుగు అడుగులు వేసి.

"కవిత్వం వచ్చేస్తుందే" నవ్వి తనూ లేచింది.

"కావ్య నాయికలా ముందు నవ్వింటే రాకేం చేస్తుంది? నువ్వు వెళ్ళిపోతావా?" అన్నాడు.

"వెళ్ళి వంట చేస్తాను, మీరు త్వరగా వచ్చేయ్యండి." అన్నది. ఆమె ఫ్లాస్కు తీసుకుని ఇంటి ముఖం పట్టింది.

పొలం పోతుందన్న విచారం కంటే భర్తలోని మార్పు ఆలోచన ఆమెను ఊపేస్తున్నాయి.

ఆనందంతో ఇంటికివచ్చి, వంట ప్రారంభించింది. ఆ చిన్న పర్ణశాలలా ఉన్న ఇంటికి బావి నుండి వైర్ లాగి లైటు పెట్టాడు రాయలు.

ఆ ఇంట్లో ఒక మూలకు మంచాలు, ఒక మూలకు రాయలు కూర్చోవటానికి కుర్చీలు వేసుకున్నాడు.

మరో మూలకు చిన్న జాజి చెక్కల డైనింగ్ టేబుల్ ఉంది.

నాల్గో మూలకు కట్టెల పొయ్యి. అందంగా అలికి ముగ్గు పెట్టుకుంది. ఆనందం బ్యాంక్ బ్యాలెన్స్‌ల్లో, ఆస్తి, పాస్తుల్లో వెతుక్కునేవారు మనుషులు కారేమో! ఒక్కసారి తనింటిని నాల్గు మూలలా చూచుకుని, పని ప్రారంభించింది.

వడ్ల బండ్లు ముందురాగా, రాత్రి పది గంటలకు వచ్చాడు రాయలు. ఒక మూలకు సంచులు వేసి, భోజనాలు చేసి పడుకునే సరికి రాత్రి



పన్నెండు గంటలు దాటింది.

మర్నాడు ఉదయం లేవగానే ఇంటి ముందు వెంకన్న కూర్చున్నాడు.

"ఏమిటి వెంకన్నా?" ఆదుర్దాగా అడిగింది రూప.

"నేనక్కడ ఈ అన్యాయాలు చూస్తూ ఉండలేనమ్మా." అన్నాడు దిగులుగా. ఏమయిందన్నట్టు చూపులతోనే ప్రశ్నించింది.

"ఏమయిందని తిన్నగా అడుగుతున్నావా రూపమ్మా! అతను నిన్ను వీధుల్లో తిరుగుతుంటే చూచి సంతోషిస్తాడట మీ బడి కమిటీ మెంబర్లను పిలిచి, 'ఆ బడి అక్కడే ఉండ నియ్యండి. అది మామల పేరున పెట్టింది. దాన్ని అభివృద్ధి చేయాలంటే నాకు ఆత్మీయులయిన వారుండ వద్దు. వారిని నేనేం అనలేను.' అంటూ మీ ప్రమేయం ఉండరాదని సూచించాడమ్మా." అన్నాడు వెంకన్న.

"వాళ్ళేమన్నారు?"

"వాళ్ళకు మంచి, చెడ్డలు అవసరం లేదమ్మా. డబ్బు, హోదా, కావాలి. ఒప్పుకున్నారు. అన్యాయంగా అయ్యగారు కట్టించిన గదులుండి పోయాయి." అన్నాడు కోపంగా.

"ఊఁ..." అన్నది యెటో చూస్తూ.

"ఆ ఇంట్లో యెలా ఉంటానమ్మా! అసలాయనకు బడిలో కలుగచేసుకునే అధికారం ఏముంది?" కోపంగా పై పంచ దులిపేశాడు.

రూప అతన్నే చూస్తుంది.

"పైగా ఏం మాట్లాడినా 'మగడి సొమ్ము, మగడి సొమ్ము తింటూ.' అంటుంటాడు. తల కొట్టేసినట్టుంది. ఆ రోజు మీరు 'ఊఁ' అనకపోతే అయ్యగారు ఎక్కడ వుండేవాడు? అసలా జ్ఞానం వుందా?" రోషంగా అడిగాడు.

"వెంకన్నా! శర్మిష్ఠ చదువు అయ్యేవరకు హరి కొట్టినా, తిట్టినా నువ్వు అక్కడే ఉండాలి. అతను ఒంటరిగా ఉంటే దురలవాట్లు అబ్బు

తాయి అతనికి లేకపోయినా చుట్టూ చేరినవారు ఆ అలవాట్లు చేస్తారు." అన్నది నచ్చచెప్పే ధోరణిలో.

"ఆయనకు నేనో లెక్క అద్దమా! ఆ త్రాష్టుడు జగదీష్ వచ్చి ఉన్నవి లేనివి మాట్లాడుతుంటాడు." తుపుక్కున ఊశాడు.

ఆ ఊపును బట్టి వెంకన్న అంతర్యం వూహించ కల్గింది.

"మన కిష్టమైనా, కష్టమయినా తప్పదు వెంకన్నా! మమ్మల్ని పెంచావు- మా మంచి చెడ్డలు చూడాలి. నువ్వొక్కడుంటే కాస్తయినా భయం. శర్మిష్ఠ వచ్చేవరకు తప్పదు."

"ఉహూ! నేనుండనమ్మా. ఏ పొలం కాడ కాపలా ఉన్నా, పొట్టకింత కూడు కట్టుకోవటానికి బట్ట ఇస్తారు." అన్నాడు తల విదిలించి.

"అవున్లే కన్నవారు అయితే తప్పదు అనుకుంటారు. నువ్వు పెంచినవాడివి కదా, మేం యెలా పోతే నీకేమిటి!" అన్నది నిష్ఠూరంగా.

"రూపమ్మా ?" దెబ్బ తిన్నట్టు చూశాడు.

"వెళ్ళు వెంకన్నా! పొలం కాపలా ఉండు. నా చేతిలో డబ్బున్నప్పుడు నాకు చేతయిన దేదో ఇస్తాను." అన్నది ఆవేదనగా.

"అంటే మీ ఉద్దేశంలో నేను కూలి కుక్కననేగా!" వెంకన్న రోషంగా అడిగాడు.

"వెంకన్నా! మీ అమ్మాయిగారు తొందర పడ్డారు. నీవు అలా మాట్లాడితే ఎలా? రూప చెప్పినట్టు మరి కొన్నాళ్ళు ఓపిక పట్టు." అప్పుడే వచ్చిన రాయలు నచ్చ చెప్పాడు.

"మీరూ అదే మాట అంటారా బాబూ!" దీనంగా అడిగాడు వెంకన్న.

"మనకందరికి, శర్మిష్ఠ ఒక్కర్తేగదా. మాకు పిల్లలు పుడతారన్న నమ్మకంలేదు. ఆమే మాకు కూతురయినా, మరదలయినా, మా బ్రతుకులకు గమ్యం." అన్నాడు నిట్టూరుస్తూ.

"బాబూ!" వెంకన్న విచలిత కంఠంతో పిలిచాడు.

"అవును వెంకన్నా! నాకు ఇరవై ఏళ్ళకే పెళ్ళయితే శర్మిష్ఠంత



కూతురుండేది మన పాలబ్బాయి నా కంటే నెల చిన్నవాడు. అప్పుడే తాతయ్యాడు." అన్నాడు నవ్వుతూ.

"మంచిది బాబూ! ఆ ఉప్పు తిని పెరిగిన శరీరం ఆ ఇంటికే అంకితం కానీ" అన్నాడు.

రూప ఇద్దరికి టీ ఇచ్చింది. త్రాగి వెంకన్న వెళ్ళిపోయాడు.

రాయలుకు ఇంద్రమ్మ పొలం వదిలేస్తే మిగిలింది తన ఇల్లు, రెండెకరాల తరి (వరి) పొలం, ఆ క్రిందే ఉన్న పోరంబోకు నాలుగు ఎకరాలు. నిజానికి అతని తండ్రి సంపాదించిన దానికంటే వాళ్ళ పొలం, వీళ్ళ పొలం అన్యాయంగా తన చేతిలో ఉంచుకుందే యెక్కువ.

అందుకే రాయలుకు ఏం మిగలలేదు. రూప సాహచర్యంలో 'తృప్తి'కి అర్థం తెలుసుకున్న రాయలు యెవరి పొలాలు వారికి వదిలాడు. రాయలు టీ గ్లాసు క్రింద పెట్టి, బొమ్మలా నిలబడ్డ రూప భుజం తట్టాడు.

"ఏమిటి ? నాకు తిండి పెట్టేది ఉందా లేదా ?"

"నేను మరిచిపోయాను రండి. మీకు పిల్లలంటే ఇంత అభిమానం అని తెలియదు లేండి"

"నీకు మాత్రం లేదా!" ఆమె ముక్కుపట్టి ఊపాడు.

ఇద్దరు ఉదాసీనంగా మారిపోయారు.

తన జీవితం ఇలా మోడుబారి పోవల్సిందేనా! సుక్షేత్రం అయ్యే అవకాశం లేదా!

"మరొక్కసారి డాక్టరు చేత పరీక్ష చేయించుకుంటే బావుంటుంది." అన్నది, అతనికి ఇష్టం ఉండదని తెలిసి కూడా.

"పోదూ! ఇప్పుడేం మునిగిపోయిందని! రేపు శర్మిష్ఠకు పిల్లలు పుడితే పెంచేది మనమేగా. తీరిక ఉంటుందా!" అన్నాడు నవ్వుతూ.

యెంత అందమైన ఊహ!

కాని...కాని హరికృష్ణ తమ నీడ కూడా పడనియ్యడని బాగా

తెలుసు. గాఢంగా నిట్టూర్చి లోపలికి వెళ్ళిపోయింది. రాయలు యెవరో రావటంతో బయటికి వెళ్ళాడు.

## 29

కేశవరావు ఇంటికి వచ్చాడు హరికృష్ణ. శర్మిష్ఠ సెలవులకు వస్తుందని తెలుసు. ఆమె ఊరు రావటం అతనికి నచ్చలేదు. పైగా వెంకన్న ఒకటికి రెండుసార్లు ఏవయినా చెబితే ప్రమాదం.

తను రూపను కాళ్ళ బేరానికి తేవాలి.

మృగం లాంటి ఆ మనిషిని తనకన్నా గొప్పవాడంటుందా!

అక్కడ జరిగే విషయాలు ఉత్తరంద్వారా వ్రాసే అవకాశము ఉన్నా, శర్మిష్ఠ మనసు విరిచే ప్రయత్నం చేయదు రూప. అలాంటి వ్రాతకు అవకాశం లేకుండా తనే చేస్తే గొడవే ఉండదు.

అతను ఆలోచిస్తూ పేపర్ చూచినట్టు నటిస్తున్నాడు.

"ఎప్పుడు వచ్చావు హరీ?" కేశవరావు అడిగాడు.

"అరగంట అయిందేమో! పెద్దవాడు బొంబాయిలోనే వివాహం చేసుకున్నాడట." అన్నాడు వార్తా పత్రిక చూస్తూ.

"అవున్రా! ఆ అమ్మాయి వాడి ఆఫీసులో స్టెనో అట. నేను, మీ అత్త వెళ్ళి ఆశీర్వదించి వచ్చాము. ఇక్కడికి వచ్చినప్పుడు బంధువులకు, స్నేహితులకు టీ పార్టీ ఇస్తాను." అన్నాడు ఆయన.

"అత్తయ్య అసంతృప్తిగా ఉన్నారు." అన్నాడు హరి.

"మోసేవాడికి తెలుసు బరువు, మీ అత్తయ్యకేం తెలుస్తుంది. ఆడం బరాలకు పోతే యెప్పుడో అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకునే వాడిని." అన్నారాయన తేలికగా నవ్వేస్తూ.

అతను రూప దగ్గర ఇల్లు స్వాధీనం చేసుకున్నందుకు, ఏమయినా అంటాడేమోనని చూచాడు.

కేశవరావు ఆ విషయమే యెత్తలేదు.



తనే ఏటో మాట్లాడాలి. తను తప్పు చేయలేదని తపన బయలు దేరింది

"మామయ్యా! ఇంద్రమ్మగారి బంగళా అడిగినందుకు మరేం అనుకోరు కదూ? అతను మేక వన్నె పులి వాళ్ళ దగ్గర డబ్బు తీసుకున్నాడు. అది రూపకు తెలియదు." అన్నాడు.

కేశవరావు నవ్వాడు.

ఆ నవ్వులో యెన్నో భావాలు బయటపడ్డాయి.

"చూడు హరీ! నువ్వు అన్యాయం చేశావని యెవరూ అనలేదే. నువ్వు సగం పార్టనర్‌వి. న్యాయంగా అడిగావు, సంజాయిషీ యెందుకు! ఏమోయ్ అలువేలూ, ఒక కప్పు టీ పట్రా." అన్నాడు.

హరికృష్ణ తీక్షణంగా చూచాడు.

అతనికేదో అశాంతి అతని హృదయంలో సన్నని జ్వాల బయలు దేరింది

అసహనంగా లేచి బయటికి పోబోయాడు.

"అంకుల్..." అంటూ శర్మిష్ఠ వచ్చింది.

"ఏమ్మా బావున్నావా! మీవారు ఇక్కడ క్షణమొక యుగంగా నిరీక్షిస్తున్నారు" అని నవ్వేరాయన.

"పోండి అంకుల్." అన్నది, ఓరగా హరి వంక చూస్తూ.

"నేను పోనలేగాని, ఈ ఇంట్లో మీకు ఏకాంతం ఉండదు. ఏదయినా హోటల్ రూమ్ బుక్ చేసుకుని, వెళ్ళండి." అన్నారాయన.

ఆయన అన్నట్టే అరగంట కూర్చుని, తమ బ్యాగులు తీసుకుని హోటల్‌కు వెళ్ళారు.

గదిలోకి వెళ్ళగానే తలుపువేసి, అతని కౌగిట్లో వాలిపోయింది శర్మిష్ఠ. అతనివంక అర్ధనిమీలిత నేత్రాలతో చూసింది.

"నాకు చదువు వద్దు, ఏం వద్దు. వచ్చేస్తానండీ." అన్నది.

"ఆ మాట మాత్రం అనొద్దు. మీ ఇంద్రమ్మ మనశ్శాంతికోసం

నేను అమెరికన్ హాస్పత్రి వాళ్ళతో హోరా, హోరీగా పోట్లాడి మన బంగళా ఖాళీ చేయించేను. నువ్వు లేడీ డాక్టరుగా వస్తావని అందరూ ఆశగా యెదురు చూస్తున్నారు" అన్నాడు చిన్నగా ఆమె పెదవులపై వేలితో వ్రాస్తూ.

"మన బంగళాలోని హాస్పత్రి తీయించారా ?" లేచి కూర్చుంది.

"అవును శర్మీ ! వాళ్ళు మత ప్రచారంకూడా మొదలు పెడతారు." అన్నాడు. లోపల బితుకు, బితుకుమంటుంది.

"అక్కయ్య అంగీకరించిందా ?"

"మీ అక్కయ్యే కదా, మనిద్దరిని అక్కడ ఉంచాలని చూచింది." అన్నాడు- ఇక మాట్లాడనీయ్యక ఆమె నోరు, తన పెదవులతో మూస్తూ.

శర్మిష్ఠ పూర్తిగా సుషుప్తావస్తలోకి జారిపోయింది.

ఓ గంట గడిచింది, ఆమెకు సమయమే తెలియలేదు. తీయని హాయి మైకంలో అతని ఒడిలో అలాగే విశ్రాంతిగా ఒరిగిపోయింది.

"శర్మీ ! నేను మనిషిని. యెవరికీ అన్యాయం చేయనని నమ్ముతావా ?"

"అవేం మాటలండీ ! తల్లీ తండ్రి, నా అన్న వాళ్ళెవరున్నారు. నాకున్న ఆత్మీయులల్లా అక్కా, మీరే..." అన్నది.

అతను ఆమె తల, దిండు పైకి చేర్చి, దూరం జరిగాడు.

"అవునులే. నీకు నేను మీ అక్క తరువాత వాడినే కదా." అన్నాడు కినుకగా. ఆమె పక్కున నవ్వింది.

"ఇంతటి డాక్టరుగార్కి కూడా అసూయ ఉంటుందన్నమాట."

"యెంతటి డాక్టరయినా మనసున్నవాడే కదా ! శర్మీ, ఒక్క విషయం గుర్తుంచుకో. నీకు నా కంటే కావల్సిన వారున్నారేమోగాని, వివాహం అయిన మరుక్షణంనుండి నీవే నా సర్వస్వానివి, నా జీవిత లక్ష్యానివి." అన్నాడు.

ఆమె గర్వంగా తల యెగురవేసింది.



వచ్చి అతని భుజంపై తల వాల్చింది.

"అది కాదండి. నాకు మీరేం ముఖ్యం. కాని తల్లి తండ్రులు లేక, నేను అక్కయ్య ఒకరి కొకరంగా బ్రతికాం." అన్నది.

"నీకు ఆ విశ్వాసం ప్రేమ ఉన్నాయి కానీ మీ అక్కయ్యకు లేవని చెబితే నువ్వు ఊరుకోవు." అన్నాడు ఆమె చేతులు తన హృదయంపై గుప్పెట బిగించి.

"ఏమిటండీ ఆ మాటలు." అన్నది.

"మీ అక్కను నువ్వేం అర్థం చేసుకున్నావు. అన్నీ మెల్లగా రెండో కంటివాడికి తెలియకుండా చేస్తుంది. మీ నాన్నను, అమ్మను దారుణంగా చంపిందెవరో ఊళ్ళో యెవరిని అడిగినా చెబుతారు మీ బావ తండ్రి చెయ్యి ఉంది. వీరయ్య ఆ ముఠాలో ఉన్నాడు..." అన్నాడు యెంతో జాలిగా, బాధగా.

"విన్నానండీ." అన్నది. ఆ విషయం గుర్తుకు వస్తుంటేనే ఆమెకు బాధగా ఉంటుంది

"పాత విషయాలు యెత్తి నిన్ను బాధ పెట్టాలని కాదు శర్మీ. అలాంటి వారితో సంబంధం చేసుకుంది. మీ బావకు ప్రమేయం లేదు కాబట్టి వదిలివేద్దాం. ఆ వీరయ్యను యెందు కంతలా అభిమానిస్తుంది. ఆ నాడు పోయిన వాళ్ళంతా నీ వాళ్ళే కదా..."

"వద్దండీ...వద్దు. ఆ విషయాలు గుర్తుకు తేవద్దు." అన్నది విహ్వల అయి.

"నీకు గుర్తుచేసి బాధ పెట్టాలని కాదు. మీ రూప మనస్తత్వం చెబుతున్నాను. ఊరందరిని గడ, గడ లాడించే ఆ రాయలు చేత గుంజీళ్ళు తీయిస్తుంది కదా..."

శర్మిష్ఠ మరోసారి నవ్వింది, తన విచారం మరిచిపోయి.

"నీకు తమాషాగా అనిపిస్తుందేమో, నా గుండెలు మండి పోతున్నాయి. ఆ వీరయ్యను తీసి వేస్తే ఏముంది ? ఆమె తల్లి తండ్రులు

పోయాక మీ అమ్మా, నాన్న కాదనుకుంటే తను యెక్కడుండేది" అన్నాడు.

నిప్పుపై కర్రలు పడ్డాయి మెల్లగా రాజుకుంటుంది.

"నేను దానికి బాధ పడటంలేదు. నన్ను ప్రేమించానన్నప్పుడు, కృతజ్ఞతకు కట్టుబడి అంగీకరించాను. నాకు విద్యావంతులయిన అమ్మాయిలు దొరకరా ?" అన్నాడు అమాయకంగా.

"యెందుకు దొరకరు ! తప్పకుండా దొరుకుతారు." అన్నది అందమైన అతని ముఖం వంక చూస్తూ.

అందానికి నిర్వచనం అన్నట్టున్నారు హరికృష్ణ ! మగసిరికి నిదర్శనం అన్నట్టున్నాడు. అందుకే ఆ మైమరుపు.

"నేనేదో వెంటబడినట్టు. నన్ను కాదని, అతడిని చేసుకుంది. మనము యెలాగు బయటి దేశాలకు వెళతాము, ఆస్తి అంతా దక్కించుకోవాలని యెత్తు వేసింది..." హరికృష్ణ చెప్పాడు.

మిగిలిన విషయాలు చెవులకు యెక్కాయో లేదోగాని, వీరయ్య తన కుటుంబాన్ని కబళించాడన్నది మాత్రం బాగా అర్థం అయింది.

"అక్కా! ఆ వీరయ్య నీకాపుడా !" అనుకున్నది.

అనుమానం పెనుభూతం. అనుమానం రానేకూడదు- వస్తే చెదలు పుట్టలా తొలిచి వేస్తుంది.

"పోనీ శర్మి ! నేను అవన్నీ ఆలోచించాలని రాలేదు. నీ సమక్షంలో ఊర్లోని సమస్యలు మరిచిపోదామని వచ్చాను." అన్నాడు, ఆమెకు దగ్గరగా జరుగుతూ.

"ఏ సమస్యలున్నాయండీ ?"

"ఒక్కటా! పొలాలు అమ్మటం, మీ బావగారు స్వంతం చేసుకోవాలని ప్రయత్నించటం. పొలాలు ఆమె ఒక్కదానివి కాదు కదా. ఆ విషయం ఆలోచించదేం మీ అక్క."

ఆమె నోటితో ఏం చెప్పకపోయినా అతని వడిలో పడుకున్న



తీరు చూస్తే' అంతా నీకు సమర్పించాను, నువ్వేమయినా చేయి' అన్నట్టున్నాయి.

ఆమె చెంపలు ఆప్యాయంగా తడిమాడు.

"ఇప్పుడా పొలాలు రావాలని, మనకు డబ్బు కావాలని కాదు శర్మీ. ఓ పద్ధతి అంటూ ఉంటుంది కాదా." అన్నాడు.

"అవునండి, మన కిష్టమయితే యెంతయినా పంచి పెడతాం. అన్యాయంగా ఇంత పోయినా ఊర్కోలేము కదా." అన్నది అతనికి వత్తాసు ఇస్తూ.

"అందుకే ఈసారి సెలవులకు వచ్చినప్పుడు నువ్వు గట్టిగా చెప్పు." అన్నాడు.

"అలాగేనండీ, లేకపోతే ఈ అలవాటు అంటు వ్యాధిలా వ్యాపిస్తుంది." అన్నది.

"అబ్బపోదూ, ఆ విషయాలు వదిలేయి. నీ చదువెలా సాగుతుంది."

"మీ ధ్యాసలో సగం సమయం పోతుంది." అన్నది అతని హృదయంపై తలవాల్చి.

రెండు రోజులు హోటల్ గదిలో ఇద్దరూ ఒకరికి ఒకరన్నట్టు గడిపారు. శర్మిష్ఠ హరి ప్రేమ మైకంలో పడిపోయింది. ఆమెకు ఈ ప్రపంచమంతా ప్రేమ మయంగా కనిపించింది.

ఆ మైకంలో రూప అనే వ్యక్తి తనకు భవిష్యత్తుకు పునాదులు వేసిందన్న సంగతి మరిచిపోయింది.

భర్త కొన్న వస్తువులను చూచి మురిసిపోయింది.

అతని ఔదార్యానికి అంజలి ఘటించింది.

అతని అనురాగంలో కరిగిపోవాలనుకుంది!

ఆమె వెళ్ళే రోజున కేశవరావు ఒకసారి అడిగాడు-

"ఏమ్మా! అక్కను చూచిరావా ?"

"నాకిప్పుడు ఒక్క క్షణం తీరికలేదు అంకుల్." అన్నది బట్టలు

సర్దుకుంటూ.

అతను లాయర్. కొన్ని విషయాలు మౌనంగా ఉన్నా గ్రహిస్తాడు.

"అవునమ్మా, నీకు చాలా పని ఉంది కదా. రూపే ఓ సారి వచ్చి చూస్తుందిలే!" అన్నాడు

"అక్కయ్య నిజంగానే వస్తుందేమో, వద్దని చెప్పండి అంకుల్." అన్నది. తన భర్త కిష్టంలేని వారి సంగతి తను మాట్లాడలేదు. వారితో స్నేహంగా ఉండలేదు.

కేశవరావు తల పంకించాడు.

ఆ సాయంత్రమే శర్మిష్ఠ వెళ్ళిపోయింది. హరికృష్ణ ఊరికి ప్రయాణం అయ్యాడు. అలివేలమ్మ రూప చేసి పంపిన అరిసెలు కూడా తను చేసినట్టే చెప్పి ఇచ్చింది. వద్దన్నా అనగలరని భయం పట్టుకుంది.

## 30

పంచాయత్ ఎలెక్షన్స్ అవుతున్నాయి. ఈ సారి తనకేం పట్టనట్టు ఊరుకున్నాడు రాయలు.

జగదీష్ వచ్చాడు నల్గురిని వెంటేసుకుని.

"ఏం పెద్దన్నా! నువ్వు నిలబడవా ఏం ?" అన్నాడు యెంతో అభిమానంగా.

అతను నవ్వాడు.

"ఈ సారి ఛాన్స్ తమ్ముళ్ళకివ్వాలనుకున్నాను." అన్నాడు మామూలుగా.

ఆ చుట్టూ నాల్గు ఊర్లు మెంబర్లు కలసి ఎన్నుకున్నారు ఒకప్పుడు. ఇప్పటి పరిస్థితి తానెరగనిది కాదు.

"అలా అంటే యెలా అన్నా!"

"నాకు రాజ్యాలు ఏలాలని లేదు జగం. అయినా ప్రతి సంవత్సరం మారుతూ ఉండాలి కదా." అన్నాడు అదే నవ్వుతో



"అందరు ఏమనుకుంటున్నారో తెలుసా? మీరు భార్యా విధేయులని." అన్నాడు కవ్వింపుగా.

"అందరి సంగతి వదిలేయి, నువ్వేమనుకుంటున్నావో చెప్పు."

"ఈ ఊళ్ళో నీ నోటికి పదును యెక్కువ!" అన్నాడు అదే చిరునవ్వుతో.

"ఇది బావుంది. నేనేమయినా అనుకుంటే, నీ దగ్గరకు వస్తానా ? నీవు మారిపోయావ్!" అనుకుంటూ లేచాడు.

"ఆ మారటం మంచికయితే ఫరవాలేదు." అన్నాడు నిబ్బరంగా.

"మీరనుకుంటున్నారు, రాయలుడి మీసాల బలమేరా! భార్య ముందు పిల్లి అని అందరు అనుకుంటున్నారు." అన్నాడు ఎత్తిపొడుపుగా.

"పదే పదే అందరూ, అందరూ అంటావేం? నీ విషయం ఏమిటో చెప్పు." మరోసారి రెట్టించేవరకు జగదీష్ వెళ్ళిపోయాడు.

"బాగా బుద్ధి చెప్పారండి. నంగనాచి తుంగ బుర్ర అన్నట్టు వస్తున్నాడు. వీళ్ళంతా హరికృష్ణతో కలిసి మంతనాలు జరిపి మీకు ఒక్క ఓటు పడకుండా చేయాలని ప్రయత్నమట. ఇందాక వెంకన్న వచ్చి ఒకటే గోల." అన్నది రూప భర్తకు టీ తెచ్చి.

"నాకు తెలుసు రూపా!" అన్నాడు టీ అందుకుని.

"కాని...కాని మీరు యెన్నాళ్ళని వీళ్ళకు భయపడుతూ ఇలా ఉంటారండీ ?" అన్నది దీనంగా చూస్తూ.

"నే నే పుస్తకాలను, మనుష్యుల్ని చదువని మూర్ఖుడిని రూపా! నువ్వు ఇన్ని గ్రంథాలు చదివావు కదా, అసలు జరిగిందో లేదో కాని రామాయణంలో అరణ్యవాసం, మహాభారతంలో అజ్ఞాతవాసం చూస్తే ఏమనిపించింది ? జీవితంలో కొన్నాళ్ళు వెలుగూ కొన్నాళ్ళు చీకటి తప్పదు కదా..." అన్నాడు.

"అంటే తమరు అరణ్యవాసంలో ఉన్నారన్నమాట..."

"ఊహూ! అజ్ఞాతవాసం అనుకుందాం. అరణ్యవాసం మధ్యలోనే భార్యా వియోగం కల్గింది శ్రీరామచంద్రుడికి." అన్నాడు నవ్వేస్తూ.

"హృదయ పూర్వకంగా నవ్వకలుగుతున్నారా?" ప్రశ్నించిందిరూప.

"నీకెలా అనిపిస్తుంది ?" తిరిగి ప్రశ్నించాడు.

అతని చూపుల్లో మాలిన్యం లేదు.

అతని ముఖంలో దైన్యంలేదు స్వచ్ఛంగా ఉన్నాయి, అతని కళ్ళు. అతని దినచర్య పూర్తిగా మారిపోయింది. అతను పొలం, తప్పితే పొలం దగ్గర ఉన్న ఇల్లుకే పరిమితం అయిపోయాడు.

జీతగాళ్ళను పెట్టే శక్తిలేదు. వీరయ్య పశువులను కాస్తున్నాడు. ఓ కుర్రాడితో పొలం దున్నటం, కూరకాయలు వేయటం రాయలే చేస్తున్నాడు. ఎన్నికలయినా, ఊళ్ళో గల్లంతు జరిగినా పట్టించుకోలేదు.

రూప అతనితోపాటు కూరలు కోసి గంపల కెత్తుతుంది.

"టైగర్ ఇంద్రమ్మ బ్రతికి ఉంటే నన్ను ఉప్పు పాతర వేయించేది." అన్నాడు రాయలు నవ్వుతూ.

"మీరు ఇంత శ్రమ పడుతూ, యెలా నవ్వుతున్నారు ?" రూపకు కళ్ళలో నీరూరింది.

అతని దర్జా తను యెరగనిది కాదు.

అతనికి తన మంచినీళ్ళు తాను ముంచుకు త్రాగటంకూడా తెలియదు. అలాంటి వ్యక్తి కాయ కష్టం చేయటమా !

"పిచ్చిదానివి రూపా ! మన పనులు మనము చేసుకుంటే తప్పేం ఉంది. ఊరు మీద బలాదూర తిరిగి, అనవసర విషయాలు తలకెత్తుకుని, ఆ బాధతో నిదుర పట్టదని చిత్తుగా త్రాగేవాడిని. ఇప్పుడు చూడు, పడక దొరికేదే ఆలస్యం నిదుర ముంచుకు వస్తుంది." అన్నాడు తేలికగా.

వాళ్ళు పొలంనుండి ఇంటికి వచ్చేసరికి, ఒకప్పుడు కాంపౌండర్ గిరి చేస్తూ ఇరవై నాలుగంటలు రాయలు పాదపూజ చేసే రాజలింగం వచ్చాడు.



"ఏమిటి రాజలింగం ?" అన్నాడు స్నేహపూర్వకంగా.

"మీకు తెలుసా సారూ! కొత్త పంచాయితీ బోర్డ్ ప్రసిడెంటు వచ్చారు. వారు మిమ్మల్ని రమ్మన్నారు." అన్నాడు.

"యెవరు, జగమేనా ?" కాళ్ళు కడుక్కుంటూ అడిగాడు.

"జగదీష్‌గారు ! మీరు అంజివన్ రూపాయలు కట్టాలట." అన్నాడు దర్పంగా.

"నేను రావటం దేనికి? అదేదో నోటీస్ పంపొచ్చు కదా." అన్నాడు తుండుతో ముఖం అద్దుకుంటూ.

"అదొక్కటే కాదు, మరో కేసు ముడిపడి ఉంది. కమిలికి కొడుకు పుట్టాడు తెలుసా ! ఆ కొడుకు మీ కొడుకంటూ ఫిర్యాదు చేస్తుంది." అన్నాడు. రాయలుకు మతిపోయింది.

"రూపా...రూపా...ఇది అబద్ధం. ఏ నాటి కమిలి ! ఆ కమిలితో గడిపినమాట వాస్తవమే కాని..." అతని గొంతు జీరబోయింది.

రూపకు పూర్తిగా అర్థం అయింది- తమను అడుగుకు నెట్టితేగాని అందరికీ తృప్తి కలిగేలా లేదని.

భర్త ముఖంలో మారే రంగులు చూచింది.

"చూడండి రాజలింగంగారూ! ఆ కమిలి యెవరోగాని మొదట ఆయన దగ్గరకు రావాలి. ఆయన కాదన్నప్పుడు కదా పంచాయితీ" అన్నది రూప.

రాజలింగం ఏమనలేనట్టు వెళ్ళిపోయాడు. యెంతయినా టైగర్ ఇంద్రమ్మ మనుమరాలు అనుకున్నాడు.

"నువ్వు వాళ్ళ మాటలు నమ్ముతున్నావా రూపా ?"

అతని గాంభీర్యమంతా పోయింది. లజ్జితుడయినట్టు అడిగాడు.

"మీరు అంతగా బాధ పడాల్సిందేం లేదండీ. వాళ్ళు ఈ విధంగా మనల్ని సాధించాలనుకుంటున్నారు. మీరే కదా అజ్ఞాతవాసం గురించి చెప్పారు" అన్నది అతని జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి.

"రూపా!" ఆమె రెండు చేతులు పట్టుకుని, ఆమె కభిముఖంగా తిరిగి ఆమె గుండెలపై తల వాల్చి సేదదీరాడు.

పసిపిల్లడిని తల్లి లాలించినట్టు, లాలిస్తూ అతని విచారం పోగొట్టాలని ప్రయత్నించింది.

"ఒక్కసారి తప్పుచేసిన మనిషికి క్షమ దొరకదు మన సమాజంలో" అన్నాడు మెల్లగా.

"అందుకే కదా హిందూ దేశంలో, హిందూ మతమంటే చులకన భావం ఏర్పడింది. సోసియల్ స్ప్రెషన్, ఎకనామిక్ డిప్రెషన్, రొమాంటిక్ అట్రాక్షన్, ఈ మూడు కలిసి క్రిస్టియానిటిని పెంచాయి." అన్నది.

ఆమెను అలా చూస్తూ నిలబడిపోయాడు.

ఒకనాడు ఆమెని చూచి నిర్దాక్షిణ్యంగా నలిపి వేయాలనుకున్నాడు.

ఈ రోజు ఆమె పాదాలను కన్నీటితో అభిషేకించి పునీతుడు కావాలనుకుంటున్నాడు. సాగర మథనంలో అమృతం, హాలాహలం వెలువడినట్టే, స్త్రీ హృదయంలో రెండు రూపాలు దాగి ఉంటాయేమో!

"రండి..." మంచం వాల్చింది. అతను కాస్త రిలాక్స్‌గా వరిగాడు. అప్పుడే జగదీష్ కమిలిని, ఆమె బంధువుల్ని తీసుకుని వచ్చాడు.

అతను ఏటో మాట్లాడబోయాడు.

"దయచేసి మీరంతా వెళ్ళండి, కమిలి మళ్ళీ వచ్చి మీ దగ్గర ఫిర్యాదు చేస్తే వద్దురుగాని ఆమెకు అన్యాయం జరుగదని మాటిస్తున్నాను." అన్నది రూప.

రాయలు లేచి కూర్చున్నాడు చూస్తూ.

"అమ్మో! నా బిడ్డను చంపేస్తే..." ఓ ముసలమ్మ అడిగింది.

"తిండి పెట్టలేనని మనుమరాలిని కొట్టి బావిలో తోస్తానన్న నాడు టైగర్ ఇంద్రమ్మ అడ్డుపడిన సంగతి అప్పుడే మరిచిపోయావా ముసలమ్మా! ఈ చేతులకు పెట్టటమేగాని కొట్టటం తెలియను." అన్నది రూప కోపంగా.



ముసలమ్మను, కమిలిని వదిలివేసి జగదీష్ బృందం పళ్ళు కొరుకుతూ వెళ్ళిపోయారు.

తను సర్పంచి అన్న మర్యాదకూడా లేదా! కుత, కుతలాడుతూ వెళ్ళిపోయాడు.

"ఇప్పుడు చెప్పు ముసలమ్మా, ఈ బాబు రాయలుగారి కొడుకా?"

"అవును. నీ బాంఛను! ఊరులో యెవలనడిగిన అల్లద్దరు ఒక్కట ఉండేటోల్లని చెప్తరు."

"ఉండేటోల్లని చెప్తారుగాని ఉంటున్నారు అని చెప్పటంలేదు. మా వివాహమయిన ఈ మూడు నాలుగేళ్ళ నుండి నేనిక్కడే ఉన్నాను. ఏ నాడూ కమిలీ ఆయన చనువుగా ఉండటం చూడలేదు." అన్నది.

ముసలమ్మ తిక మక పడింది.

కమిలి తేరుకుంది. ఓ శోకం తీసింది.

"నేనేం జేతు దేవుడో! ఇంత జరిగినంక నేనుంటానా తండ్రో! ఏ బావిలోనో పడతాను తండ్రో..." అంటూ, దీనాతి దీనంగా ఏడ్వటం మొదలు పెట్టింది.

"నోరు ముయ్యి..." రాయలు అరిచాడు.

"మీరుండండి. ఏడిస్తే పనులు కావు కమిలి! నేను అడిగిందానికి జవాబు కావాలి." అన్నది.

"అమ్మ...మరి...మరి...దొర మా ఇంటికి వచ్చాడు." అన్నది వెక్కుతూ.

రూపకు బాగా తెలుసు, రంకు నేర్చినమ్మ బొంకు నేరుస్తుందని. అందుకే ధైర్యంగా నిలబడింది.

"చూడు కమిలీ! దొరగారు నా వివాహము అయ్యాక నీ ముఖమే చూడ లేదంటున్నారు, నువ్వేమో, అతని కొడుకంటున్నావు..." రూప మాట పూర్తి కానియ్యలేదు.

"నీమీ ఒట్టమ్మ ! అబద్ధం ఆడితే నేను నాశనం అయిపోనీ..." అంటూ శాపనార్థాలు పెడుతూ తిట్టిపోయటం ప్రారంభించింది.

"నీవు నిజం చెప్పినా నా భర్తగా ఆయన మాట నమ్మాలి కదా! అందుకే మనమంతా హైద్రాబాద్ వెళ్ళి రక్త పరీక్ష చేయించుకుందాం." అన్నది నిబ్బరంగా.

"రక్త పరీక్ష ! అదేమిటమ్మో..." అన్నది అయోమయంగా చూస్తూ.

"గందేటో మాకు తెల్వదు." అన్నది మునలమ్మ దురుసుగా.

"పెద్ద హాస్పటిలో పరీక్ష చేసి, యెవరి కొడుకో చెప్పలేక పోయినా, దొర కొడుకా కాదా అని చెబుతారు. వెళదామా ?"

"గవన్నీ మాకేం తెలుస్తాయి ? పొయ్యి, జగమయ్యా నడిగి వస్తము."

"జగమయ్యను అడగుతారో, వకీలు నడుగుతారో మీ ఇష్టం. నిజంగా అ బాబు దొరగారి కొడుకే అయితే, ఈ సంసారం, దొరగారిని నీకే వదిలి వెళ్ళిపోతాను." అన్నది దృఢంగా.

"మేము మీ సంసారం కావాల్నంట వచ్చినమా ! ఏటో ఇంతిస్తే."

"ఇంతిచ్చి మా బిడ్డను మేము వదిలేస్తామా! నేను చదువుకున్నాను, యెక్కడయినా ఉద్యోగం తెచ్చుకుంటాను." అన్నది.

కమిలి దొరగారివైపు చూచింది. ఆయన నిశ్చలంగా ఆమెనే చూస్తున్నాడు.

అతను చలించకపోవటం, కమిలిని చలింపజేసింది.

"ఏంటో సదువుకున్నోల్లు తిక, మక పెడ్తరు." అనుకుంటూ, అవ్వ, మనుమరాలు వెళ్ళిపోయారు.

రాయలు ఒక్క మాట మాట్లాడలేదు. ఆమె వడ్డిస్తే భోజనం చేశాడు. రోజుకంటే ఉత్సాహంగా ఆమెతో కబుర్లు చెప్పాడు. హాయిగా నిదురపోయాడు.



రూప మాత్రం చాలాసేపు అతన్ని చూస్తూ కూర్చుంది.

మర్నాడు ఉదయం కాళ్ళ బేరానికి వచ్చింది కమిలి. రూప చిన్నగా
...వ్వింది.

"ఏటో అమ్మ ! ఆడ్ని పెండ్లి జేసుకుంటే, దొరకు, నాకు ఏటో
...ందని ఎల్ల గొట్టిండు. అందుకే దొరను అన్న, నీ కాల్మొక్త ఇక్కడే
...లి నాలి చేసుకుని పడి ఉంట...అని" అన్నది ఏడుస్తూ,

ఈ రోజు ముసలమ్మ రాలేదు.

"సరే, వీరయ్య పాకలో ఉండు వీరయ్య ఇంటి ముందుంటాడు."

ఆమె మాట పూర్తి కాకముందే లోపలి నుండి రాయలు గర్జన విని
...ంచింది.

"రూపా !"

"ఒక్క నిముషం..." లోపలికి వెళ్ళింది.

అతను మునుపటి రాయలులా కనిపించాడు. కళ్ళలో ఎర్ర జీరలు,
ముఖం క్రోధంతో ఉబ్బినట్టుంది.

"నీకేమయినా మతిపోయిందా ! అది ఇక్కడ ఉంటే నీకు మనః
...ంతి ఉంటుందా అసలు !" అన్నాడు కోపంగా.

"నా సంగతి వదిలి వేయండి. మీకు భయంగా ఉందా ?" అన్నది
...బ్బరంగా.

అతని కోపం, ఆవేశం తను ఎరగంది కాదు.

"అవునండీ ! ఆమె ఉండటం మనిద్దరి వ్యక్తిత్వాలకో సవాలు.
...ళ్ళు కోరేది- మీరు పతనమైతే, నేను ఏడుస్తుంటే ఓదార్చి తృప్తి పడ
...మని వాళ్ళనుకుంటున్నారు. ఆ అవకాశం లేదని మనము నిరూపిస్తే,
...ళ్ళు మన జోలికి మళ్ళీ రారు." అన్నది దృఢంగా.

"చూడు రూపా ! చలించే చంచల స్వభావులను యెవరూ పట్ట
...రు. కాని అది పిచ్చివేషాలు వేస్తుంటే, అనవసరంగా నీ మనసు పాడవు
...ందని... అబ్బా అలాగే కానియ్యి." అన్నాడు బయటికి వెళ్ళటానికి

బట్టలు వేసుకుంటూ.

"మీరు ఆ మాత్రం సహకరిస్తే ఈ పపంచాన్నే జయిస్తానండి." సగర్వంగా అన్నది.

కొందరు పురుషులు స్వార్థులు. స్త్రీ మూగ బొమ్మలా ఉండి మురిపించాలని కోరుతారు.

పది మందిలో తల వంచుకుని, బయట యెలా తిరిగినా సంబంధం లేనట్టు ప్రవర్తిస్తారు. వాళ్ళెంత అంధకారంలో బ్రతుకుతున్నారో ఇప్పుడిప్పుడే రాయలుకు అర్థం అవుతుంది.

అతను బయటికి వచ్చి రెండు అడుగులు వేయగానే చటుక్కున వంగి అతని చెప్పుపై దుమ్ము తుడిచింది కమిలి. తల యెత్తకుండా వెళ్ళిపోయాడు రాయలు !

బయటికి వచ్చిన రూప చూచింది. ఆమె చూడాలనే తుడిచిన కమిలి భయం నటించింది.

"నాకు గుర్తులేని విషయాలు నీకు బాగా గుర్తున్నాయి కమిలీ! ఇన్నాళ్ళు బూట్ పాలిష్ చేశావేమిటి. పద, అన్నం పెడతాను. తిన్న తరువాత పనికి వెళ్ళదువుగాని." అన్నది ఏం జరగనట్టు.

'ఇదేం మనిషి ! మొగనితో కొట్లాడదేం ?" అనుకుంటూ పిల్లడిని తీసుకుని గుడిసె వెనక్కు వెళ్ళింది.

అన్నం తిని పని చేయాలంటే దానికి మహా బద్ధకంగా ఉంది. అసలు వ్యక్తి లేనిదే నాటకాలు యెలా ఆడుతుంది !

మధ్యాహ్నము రాయలు వచ్చాడు. అతనికంటే ముందే గబ గబ వచ్చి నీళ్ళు తెచ్చి ఇచ్చింది.

ఇప్పుడు అమ్మగారెలా పరుగెత్తుకు రాదో చూస్తాను అనుకుంది కసిగా. కాని రూప రాలేదు.

"ఛా, తేనా బోరా ?" అన్నది, భుజంమీది పైట జార్చివేస్తూ.

తన్ని తగిలి వేద్దామన్నంత కోపం వచ్చినా, తనెందుకు గుమ్మడి



కాయల దొంగలా కావాలి !

"ఇప్పుడేం వద్దు కమిలీ. భోజనం చేశాను." అని వాలు కుర్చీలో కూర్చుని కళ్ళు మూసుకున్నాడు.

'అయ్యగారు పొద్దున యెగిరావ్, ఇప్పుడు తెలుస్తుంది" అనుకుని కాసేపు అక్కడే నిలబడింది.

"అయ్యగారికి మంచినీళ్ళు ఇచ్చావా ? మంచి పని చేశావ్. నేను వద్దామని నిన్ను చూచి ఆగిపోయాను. నేను లేకపోతే ఆటమోటాలు మురిగినవి నింపేస్తారు. కాస్త చితికినవి తీసివేయాలన్న జ్ఞానముండదు" విసుక్కుంది రూప.

వాళ్ళిద్దరు భోజనంచేసి రాగానే, రూప జీతగాళ్ళకేదో పురమాయిస్తుంది. కమిలి వెళ్ళి రాయలు కాళ్ళు పడుతుంది.

కాసేపు చూచింది, రూప పట్టించుకున్నట్టు లేదు. స్త్రీ గాలి సోకగానే బుసలు కొట్టే, రాయలు హాయిగా నిదుర పోతున్నాడు.

విసుక్కుంది కమిలి.

బయట నుండి పిల్లాడి ఏడ్పు వినిపించింది. తప్పదన్నట్టు లేచింది.

తనే చొరవ చేయాలని నిశ్చయించుకుంది.

ఆ రాత్రి రాయలు త్వరగా మంచమెక్కాడు, అతను మోటారు సైకిల్ పాడయింది చాలా డబ్బులు కావాలని మెకానిక్ షాపులో వదిలానని చెప్పాడు. కాని ఎరువులు కొనటానికి డబ్బులు లేక అమ్మేశాడు. పంట బాగా వస్తే మళ్ళీ కొనుక్కోవచ్చు.

అందుకే ఏ చిన్న పని కయినా నడిచి వెళ్ళవలసి వస్తుంది.

అలసి పోతున్నాడు.

అతను కళ్ళు మూసుకుంటూండగా ప్రక్కన రూప వచ్చి పడుకున్నది. ఆమె పడుకుంటూనే అతన్ని గట్టిగా కౌగిలించుకుంది.

రాయలు ఆశ్చర్య పోయాడు ఆమె చర్యకు.

"రూపా !" ఇటు తిరిగాడు.

"దొరా... నేను కమిలిని..." అన్నది.

లైటువేసి కళ్ళు మూసుకున్నాడు, పల్చని చీర జార్చింది. ఆచ్ఛాదనం లేని యెద. తాంబూలం సేవించిన ఆమె నోరు చూచి అతను చలించలేదు. అసహ్యంతో కళ్ళు మూసుకున్నాడు.

అతని కళ్ళముందు స్తన్యం కోసం ఆటగా ప్రాకులాడే పసిపిల్లవాడు కనిపించాడు.

అతనికి కమిలిని ఈడ్చి ఒక్కటి కొట్టాలనిపించింది. కాని అది గొడవ చేయటానికే వచ్చిందని, కోపం నిగ్రహించుకున్నాడు.

అతను లేచి ఇవతలికి వచ్చాడు.

"రూపా !... రూపా !... పాపం కమిలికి జాకెట్లు లేనట్టున్నాయి, ఓ జాకెట్టిచ్చి పంపు" అన్నాడు.

రూప వంటిల్లు సర్దుతూ బయటికి వచ్చింది.

ఆడనాగులా బుసలు కొడుతూ వెళ్ళిపోయింది కమిలి.

"ఏమిటండీ !" రూపకు అర్థం కాలేదు.

"ఏముంది! నన్ను పతనంచేసి, నిన్ను పాదాల చెంత పడవేసుకోవాలని చూచే ప్రయత్నంలో కమిలిని నా పైకి ఉపయోగించారు" అన్నాడు.

రూప తల పంకించింది. ఆమెకు ఒక్కసారి వెళ్ళి హరికృష్ణను నాల్గు దులిపి రావాలని ఉంది. కాని ఒక్క విషయం ఆమెకు బాగా అనుభవంలోకి వచ్చింది.

పేదవాడి కోపం పెదవికి చేటు.

ధనికుడి కోపం డబ్బుకు చేటు. ఎంత డబ్బయినా ఇచ్చి ఆప్యాయతను కొంటారు

తను ఏమన్నా చెల్లదు. హరికృష్ణకు డబ్బున్నది. అన్నింటికన్నా అతని అవసరం డాక్టరుగా అందరికీ ఉన్నది. అతని మాటలకున్న విలువ



తనకుందదని తెలిసింది.

"బాధపడుతున్నావా రూపా !" ఆప్యాయంగా రాయలు భుజం తట్టాడు. ఆమె తల అడ్డంగా తిప్పింది.

"మనము అనుకున్నదే కదా" అన్నది. ఇద్దరూ గదిలోకి వెళ్ళారు. రూప ఆ సంఘటనకేం ప్రాధాన్యం ఇవ్వనట్టు ముఖం పెట్టింది.

అతనితో మామూలు కంటే చలాకీగా, సంతోషంగా ప్రవర్తించింది.

మర్నాడు ఓ నాల్గు పాత జాకెట్లు తీసి కమిలిని పిలిచి ఇచ్చింది.

"జాకెట్లు నాకెందుకమ్మా. నాకు జాకీట్లు లేక కాదు. నిన్న పగటాల్ల సీల్లు ఇస్తే, దొర అట్ల రమ్మన్నడు" అన్నది, యెంతో భయపడుతున్నట్టు చూచింది.

"అలాగా కమిలీ! నాకేమో జాకెట్ల కోసం వచ్చావని చెప్పారు. దొరగారితో నేను చెబుతానుండు, పిలిచిన స్త్రీని అలా అవమాన పరుస్తారా అని..." అన్నది నవ్వుతూ.

డిమ్మర పోయింది కమిలి. అమ్మగారు ఏడుస్తూ నాల్గుతిట్టి, భర్తతో పోట్లాడుతుందని భావించింది.

ఆ రోజు సాయంత్రము రాయలు చాలా సంతోషంగా వచ్చాడు.

"ఏమిటండీ అంత ఆనందం !"

"ఏం లేదు రూపా ! మనము ఓడిపోలేదని వీళ్ళందరికి చెప్పాలి."

రూప నవ్వింది.

"అది మనకు తెలుసు, వాళ్ళకు తెలుసు గాని అసలు సంగతి చెప్పండి" అన్నది అతనిచ్చిన షర్టు తీసుకుని వంకెకు తగిలిస్తూ.

"ఏం లేదు రూపా. నేను సర్పంచిగా ఉన్నప్పుడు నీ మీది కక్షతో నీ ఇంట్లోని బడి మూయించాలో, బడికో బిల్డింగ్ కావాలని వ్రాశాను, ఇప్పుడు శాంక్షన్ అయింది" అన్నాడు కూర్చుని, రెండు చేతులు తల క్రింద పెట్టుకుని వెనక్కు వాలుతూ.

"చాలా సంతోషమండీ. యెలా చేసినా నల్గురికి మంచి జరగాలి"

అన్నది మంచినీళ్ళిచ్చి.

"అంతే కాదు రూపా! అక్కడ అధికారులంతా పరిచయం కదా. కంట్రాక్ట్‌కు టెండర్ పిలిచినప్పుడు నన్ను వెయ్యమన్నారు. నా కొచ్చేదేం లేదని వేశాను. ఇప్పుడేమో అది నాకిచ్చారు" అన్నాడు సంబరంగా.

ఒక్కసారి మాట రానట్టుండిపోయింది రూప.

"కంట్రాక్ట్ వచ్చింది నిజమేనండీ. కాని మన దగ్గర అంత డబ్బేది!" అన్నది దిగులుగా

"అదంతా నాకొదిలెయ్యి. సిటీలో నా ఫ్రెండ్ ఉన్నాడు, కొంత సాయం చేస్తానన్నాడు" అన్నాడు.

ఆమె వెళ్ళి టీ తెచ్చి ఇచ్చింది

"రూపా! ఏదో చెయ్యాలి మరి. మునగటమో, తేలటమో తేల్చుకుందాం" అన్నాడాయన రూప మౌనంగా విన్నది.

# 31

వీరయ్యకు పక్షవాతం వచ్చింది రూపకు పని పెరిగింది.

రూప కూరగాయలు గంపలో కెత్తింది. నడుము చుట్టున్న పమిట తీసి చేతులకున్న తడి తుడుచుకుంటూ ఇవతలికి వచ్చింది.

"హల్లో రూపాదేవీ... కాదు సతీసుమతి... లేదా సీత అననా... ఊహూ సావిత్రి అంటాను" అన్నాడు నవ్వుతూ.

"మీరు మాత్రం హరికృష్ణగానే ఉండండి. యమధర్మరాజు వయితే నా భర్త ప్రాణాల కోసం నీ వెంట రావాలి" అన్నది

అతను ఆ జవాబు ఆశించలేదు. తన డ్రస్సు, తనను చూస్తూనే మాటలు కరువయినట్టుండి పోతుందనుకున్నాడు.

అతను క్రీమ్ కలర్ ప్యాంటు, అదే రంగు టీ షర్టు వేసుకున్నాడు లెబాన్ కళ్ళద్దాలతో యెంతో అందంగా, హుందాగా ఉన్నాడు.

"రండి హరికృష్ణగారూ! శర్మిష్ఠ ఉత్తరాలు వస్తున్నాయా?" అని



సహజంగా అడిగింది.

"ఉత్తరాలేం ఖర్మ! పోయిన ఆదివారంనాడు తనే వచ్చివెళ్ళింది" అన్నాడు.

"అలాగా! నాకు తెలియదే, వచ్చి చూసేదాన్ని" అన్నది అక్కడ ఉన్న స్టూలు లాగి కూర్చోమని చెప్పింది.

అతను దస్తీ తీసివేసి కూర్చున్నాడు.

"ఏం కూలీలు దొరకరా, కూలీ పని చేస్తున్నావ్?" అన్నాడు.

"నాకు కాలక్షేపం ఉండాలి కదా; విదేశాలు వెళ్ళివచ్చిన నువ్వే డిగ్నిటీ ఆఫ్ లేబర్ గుర్తించకపోతే యెలా? అందరూ చేసేది కూలిపనే. కాకపోతే పెద్ద, చిన్నా తేడా" అన్నది.

ఇప్పుడు కూడా తనను చూచి అయినా తను పోగొట్టుకుందేమిటో గ్రహించలేని అమాయకులారా!

"ఏవీ మీ శ్రీవారు?"

"బడి కట్టిస్తున్నట్టున్నారు. అక్కడే ఉంటారు" అన్నది అతి మెల్లగా.

"ఓ... ఐసీ... అవునవును విన్నాను. నీ విశాల హృదయానికి జోహార్లు. మీ ఆయనను, కలిమిని స్వేచ్ఛగా వదిలావట" అన్నాడు హేళన ధ్వనించే కంఠముతో.

"మనసు మహా చెడ్డది డాక్టరుగారూ! మనము పట్టుకుంటే ఆగదు. ప్రతి మనిషికి స్వేచ్ఛ ఉండాలి. దాన్ని సద్వినియోగం చేస్తారా, దుర్వినియోగం చేస్తారా అన్నది ఆ మనిషి వ్యక్తిత్వాన్నిబట్టి ఉంటుంది" అన్నది.

"దాటేస్తున్నావ్" అన్నాడు. అతనికి రూప ముఖంచూస్తే మాటలు పెగిలి రావటం లేదు. అతను చేసుకున్న రిహార్సల్ అంతా మరిచిపోయాడు.

"ఇంటికి వచ్చిన వాళ్ళకు టీ కూడా ఇవ్వవన్న మాట" అన్నాడు నిష్ఠూరంగా.

"టీ కేం భాగ్యం" తన కుటీరంవైపు దారితీసింది. ఆమెను అనుసరించిన అతనికి ఒక్క అడుగు పడలేదు. ఇంటి ముందు పేడతో కళ్ళాపి చల్లారేమో దానిపై రూప తీర్చిన ముగ్గులు అందంగా ఆమె హృదయానికి నిదర్శనం అన్నట్టున్నాయి.

"రండి హరికృష్ణగారూ."

పీటపై పరుపు, దిండ్లు వేసి దివాన్‌లా చేశారు. అది చూపింది. అతను కూర్చున్నాడు.

రూప వెళ్ళి టీ తీసుకు వచ్చింది. కప్పులు బల్లమీద పెట్టి, ప్లాస్క్ పట్టుకుని వెళ్ళింది

"మల్లేషా! ఇది బడి దగ్గరున్న అయ్యగారికిచ్చిరా" అన్నది.

అతని హృదయం భగ్గుమన్నది.

"ఏమిటో డాక్టరుగారూ! ప్రతి పనీ మనమే ఉండి పర్యవేక్షణ చేయాలి. ఏ మాత్రం అశ్రద్ధ చేసినా, ఆ పని అక్కడే ఉంటుంది. టీ తీసుకోండి" అన్నది తన కప్పు తీసుకుంటూ.

"వస్తాను రూపగారూ నాకు అర్జంటు పని గుర్తుకు వచ్చింది" అని టీ కప్పుకేసి అయినా చూడకుండా వెళ్ళిపోయాడు.

రూప అతను కనుమరుగు అయ్యేవరకు చూచి, మెల్లగా తన టీ త్రాగేసింది.

అతనికి ఉంచిన టీ తీసుకు వెళ్ళి ఇంటిముందున్న రోజా మొక్కకు పోసింది.

రాత్రికి అలసటగా వచ్చిన రాయలు స్నానంచేసి, పడుకున్నాడు.

"భోజనంచేసి పడుకుందురుగాని..." అన్నది రూప.

"కాదు రూపా! పది నిమిషాలు ఇలా కదలకుండా పడుకుంటే గాని అలసట తీరదు" అన్నాడు.

ఆమె వచ్చి అతని ప్రక్కన కూర్చుంది.

"డాక్టర్ హరికృష్ణ వచ్చారు" అన్నది, అతని అరచేతులు చూస్తూ.



కాయలు కాచి మొరటుగా ఉన్నాయి.

"తెలుసు! నువ్వూ అతను ఇంట్లోకి రావటం, అరగంట తలుపులు బిడాయించుకోవటం అన్నీ తెలుసు" అన్నాడు.

అదిరిపడింది రూప ఇదేం అభూత కల్పన!

"ఇది నా కందిన సమాచారం అందించిన వారు చెంపలకు కావు పెట్టుకుంటూ వీరయ్యా ఇంట్లో ఉన్నాడా" అన్నాడు.

రూపకు అర్థం అయిపోయింది, కమిలి అయ్యగారి ఆదరణ కోసం ఆ అభూత కల్పన చేసిందని.

"వీళ్ళు పూర్తిగా విలన్‌ల్లా తయారయ్యారు, నా స్నేహితుడు సిటీలో కంట్రాక్ట్ ఇప్పిస్తానంటున్నాడు. వెళ్ళిపోదాం రూపా" అన్నాడు.

రూప ఒక్కక్షణం అతని వంక చూచింది.

"ఏమండీ, పిరికి వాళ్ళు రోజూ చస్తారు. మనము అవసరం అయితే ఒకేసారి చద్దాం" అన్నది, దృఢంగా.

అతను మాట్లాడలేదు.

"ఛీ... యెంతో మంచి వార్త చెబుదాం అనుకుని వస్తే నా మూడ్ పాడు చేశారు" చటుక్కున లేచి వెళ్ళిపోయింది.

"అరే...రే... మా రూపకు కూడా కోపం వస్తుందే" అతను లేచాడు. ఆమె పిలుస్తున్నా వినకుండా ముందుకు వెళ్ళింది.

అతను అమాంతం ఆమెను వెనుక నుండి చేతులపైకి లేపాడు.

"రూపా! సారీ చెప్పినా, పొరపాటేదయినా ఉంటే తుడుచుకోవటానికి నేను చదువున్న వాడిని కాను..." అన్నాడు, ఉడికించాలని.

"నేను చదువుకున్నదాన్ని రాయా! వదిలి పెట్టు నన్ను" అన్నది కోపంగా.

"ఏదేది... మళ్ళీ పిలువు" అన్నాడు.

"మొదట దింపెయ్యండి" అన్నది కోపంగా.

"అచ్చు పారిజాతాపహరణంలోని సత్యభామలా ఉన్నావు సుమా

యెన్నాళ్ళకు నీలో కోపం చూచాను" అన్నాడు.

"అబ్బో! చదువురాని వారికి పాజాతాపహరణం తెలుసునే! కోపం కోసం యెదురుచూసే భర్తను మిమ్మల్నే చూచాను" అన్నది, అతను పట్టు వదులు చేయగానే క్రిందకు దుముకుతూ.

"ఏమిటా శుభవార్త..." ఆమె ముఖం తన కభిముఖంగా తిప్పుకుని అడిగాడు. "మరి నాకేం బహుమతిస్తారు?"

"నిజంగా అది నాకు శుభవార్తే అయితే నువ్వు ఏది కోరినా ఇస్తాను" అన్నాడు.

హరికృష్ణ మీ పొలం మీరు చేసుకొమ్మన్నాడా! హాస్పత్రి బంగళాలోనే పెట్టండి. మీ ఇల్లు మీరే స్వాధీనం చేసుకొమ్మన్నాడా?

"మీరు... డ్రిగేట్ రాయలుగారు తండ్రి కాబోతున్నారు" అన్నది నవ్వేస్తూ.

"రూపా!" రాయలు ముఖం వెల, వెల బోయింది.

"ఏమిటి, మీ కిష్టం లేదా?" ఈ సారి ఆమె షాక్ తిన్నది. ఈ వార్త విని తనను గిర, గిర తిప్పేస్తాడనుకున్నది.

"కాదు రూపా! డాక్టరుగారి మాటలు మరిచిపోయావా?" అన్నాడు ఆవేదనగా.

"మీకు అబార్షన్ కావటమే మంచిదయింది. రోగగ్రస్తులయితే పిల్లలు అవిటివారుగా పుడతారు" అన్నాడు.

రూప గుర్తుకు తెచ్చుకుంది అతని మాటలు. ఆమె ఆర్తిగా భర్త భుజం తట్టింది.

"మీరు అనవసరంగా అనుమాన పడుతున్నారు. ఆతను చెప్పి చాలా రోజులయింది కదా, మరోసారి పరీక్ష చేయించుకుందాం" అన్నది అనునయింపుగా.

"ఆ పరీక్షలో నాకు వ్యతిరేకంగా ఏం చెప్పినా భరించే శక్తిలేదు రూపా..." అన్నాడు తల అడ్డంగా తిప్పుతూ.



"ఏం చెప్పరనే నా నమ్మకం ప్లీజ్... నా కోసం సంతోషంగా ఉండండి" అన్నది

"నీ కోసం ఏమయినా చేస్తాను రూపా..." అని ఆమెను దగ్గరగా తీసుకున్నాడు.

భార్యాభర్తలకు ఆ రాత్రి తొలిరాత్రికంటే ఆనందంగా గడిచింది.

జీవితంలో ఆనందం అలాగే వుంటే మనిషి భరించలేడేమో.

అందుకే ఆనందంగా గడిచే క్షణాలు అల్పాయుష్కల్లా క్షణాలమీద మారిపోతాయి

రెండవ రోజు సిమెంటు కొనడానికి డబ్బుతో వెడుతున్న రాయలును యెవరో దారికాచి, స్పృహ తప్పేలా కొట్టి డబ్బు లాక్కున్నారు. స్పృహవచ్చినాక రాయలు పోలీస్ స్టేషన్‌కు పరుగెత్తాడు.

మన దేశంలో యెవరు తన విధులను సక్రమంగా చేస్తున్నారని పోలీసులు చేస్తారు! కేసు ఫైల్ చేశారు.

రాయలుకు పోయిన డబ్బు దొరుకుతున్నదన్నది కాదు ముఖ్యం. అందరినీకాదని తనకు కంట్రాక్ట్ ఇచ్చిన అధికారి పరువెలా కాపాడాలన్నది సమస్య అయింది.

అతను వెనుకా ముందు ఆలోచించకుండా పొలం తాకట్టు పెట్టి డబ్బు తెచ్చాడు. సిమెంటు విడిపించాడు. అతనికి భార్యకు ముఖం చూపాలంటే సిగ్గుగా వుంది.

ఆమె ఆదుర్దాగా యెదురు వచ్చింది.

"మీకేం దెబ్బలు తగల్లేదుకదా..." అతని తలకట్టు చూచి కంగారు పడింది.

"స్పృహ తప్పాలనే కాబోలు తలపై ఒక్కటిచ్చారు దొంగ సన్యాసులు..." అన్నాడు అలసటగా కూర్చుని.

[34]

"వాళ్ళనేం తిట్టకండి, వాళ్ళు నాకు తీరని మేలు చేశారు" అన్నది అతనికి మంచినీళ్ళు ఇచ్చి.

"వాళ్ళు నీకు తెలుసా ?" ఆశ్చర్యంగా చూచాడు.

"ఊహూ! మీ దగ్గరున్న డబ్బు కాజేద్దామనే తప్ప మీకు హాని చేయ లేదు. అంతకంటే మేలు ఏంచేయాలి మా చుట్టూవున్న దుర్మార్గులు మొత్తం కుటుంబాన్ని మట్టు పెడితే ఏంచేశాం ?" అన్నది కళ్ళు నీరు ఒత్తుకుని జీతగాడిని పిలిచి, అతనికి దిష్టి తీయించింది.

"ఏమిటి రూపా ఈ పిచ్చి నమ్మకాలు..."

"నిజమేనండి పిచ్చే, మనసు బలహీనమైనప్పుడు ఎన్నో నమ్మకాలు మనల్ని జయిస్తాయండి" అన్నది ఆమె. ఆమె మనసులో ఒకే భావన మెదులుతుంది. పడిన దెబ్బ కాస్త బలంగా తగిలితే?

అందరి పరామర్శ లయిపోయాక మెల్లగా చెప్పాడు రాయలు-

"రూపా! ఇప్పుడు మనకంటూ ఏంలేదు. నీకు నేను, నాకు నువ్వూ మిగిలాము" అన్నాడు.

ఏ పరిస్థితులలో పొలం తాకట్టు పెట్టవలసి వచ్చిందో చెబుతూ.

"పోనివ్వండి. మీరు ఈ రెండున్నర ఎకరాలు పోతే బాధ పడుతు న్నారు. రెండు వందల ఎకరాలు పోలేదా ?" అన్నది ఓదార్పుగా. అతను వేడినీళ్ళ స్నానంచేసి పడుకున్నాడు.

రూప బయటికి వచ్చి ఆగంతుకురాలిని చూచి ఆనందపడింది.

"రా శర్మీ! బావను కొట్టారని నీకు తెలిసిందా! డబ్బులు పోయాయి గాని, పెద్ద దెబ్బలు తగల్లేదు" అన్నది ఉత్సాహంగా.

"అక్కయ్యా! అయితేఏమిటి ఆ రాయిలుగారి కోసం! నీవు కోరింది జరుగ లేదుకదూ!" అన్నది వెటకారంగా.

రూప అడుగు ముందుకు పడలేదు.

"శర్మీ... ఏమంటున్నావ్ ?" అర్థం కానట్టు అడిగింది.



"ఓహో! ఏ నటీ నీ అంత బాగా నటించ లేదక్కా. డాక్టర్ హరి కృష్ణగారిక్కడికి యెందుకు వస్తున్నారు ?" తీక్షణంగా అడిగింది.

రూప ఒక్క నిమిషం ఆమె వంక చూచింది.

"నాకు తెలుసక్కా! నువ్వు జవాబు చెప్పలేవు. ప్రేమను త్యాగం చేసినట్టు పోజు పెట్టి, నన్ను చదువుకు పంపించావ్, మీ దారికి అడ్డు తొలగించుకోవాలని..."

"శర్మీ !" ఆ అరుపు ఆకాశం, భూదేవి దద్దరిల్లేడిగా వుంది.

"నిజం కాదా? నీవు ప్రమాణం చేసి చెప్పగలవా? ఆయన ఇక్కడి కెందుకు వస్తున్నారు ? నీవు పిలిపిస్తున్నావు. నీ భర్త సుఖరోగాలకు గురి అయి, ఆరోగ్యం పాడు చేసుకున్నాడు—"

"అవును శర్మీ ! యెంతటి నిజం చెప్పావు. నిజంగా నువ్వే సత్యం గ్రహించ లేదనుకున్నాను. నా భర్త మగాడు కాదు. అందుకని నేను పావులా వాడుకున్నాను. నీ భర్తను నీ ప్రేమతో కట్టివేసుకో" గిరుక్కున ఇంట్లోకి వెళ్ళింది.

"ఏందమ్మా... అక్కనే అంత మాట అంటున్నావా ?" వీరయ్య బాధగా అడిగాడు. అతను దేకుతూ రూపదగ్గరకు వస్తాడు. దేవుడు శిక్షించ డని వాపోతాడు.

"ఓహో! వీరయ్యా నువ్వు అక్కను వెనకకు వేసుకొస్తున్నావా! నిజమే కదూ! నువ్వు మొత్తం కుటుంబాన్ని హత్య చేసినా, హత్య చేసింది నా కుటుంబాన్ని కాదు-నా బాబాయి కుటుంబాన్ని అని నిన్ను చేరదీసింది కదూ !" అన్నది కోపం. హేళన మిళితమైన గొంతుతో.

"శమ్మమ్మా ?" వీరయ్య ముఖం యెత్తలేనట్టుండి పోయాడు.

"అవును. నిన్నిలా పెంచితే, అడం అనుకున్నప్పుడు మా భార్యా భర్తలను అడ్డు తొలగించుకోవచ్చు..."

ఛఖ్ఖున తలుపు తీసుకుని వచ్చింది రూప.

"శర్మీ! నన్ను రాక్షసిని చేయకు వెళ్ళు... వెళ్ళిపో..." గర్జనతో దారి చూపింది.

"నాకేం గతిలేక రాలేదు..." వెనుతిరిగింది శర్మిష్ఠ.

రూప కూలబడిపోయింది. విధి తనను ఎందుకు వెంటాడుతుంది! తనేం చేసిందని! అన్నీ పోయినా తమ జీవితాలకు వెలుగు శర్మిష్ఠ అని బ్రతుకుతుంది.

తనకు మూడోనెల అని చెప్పి, చెల్లెలి దగ్గర మందు తీసుకోవాలనుకుంది. నేనే నీ మొదటి పేషెంటునని చెప్పాలనుకుంది.

ఆ దృశ్యము అపురూపంగా ఊహించుకుంది.

"అక్కా! నాకు మాత్రం పాప కావాలి" అని శర్మిష్ఠ మారాం ఊహించుకుంది.

అంతా నీటిమీది వ్రాతలు చేసింది.

పదుగురాడు మాట పాడి అయి ధరజెల్లు అంటారు. నిజంగా ఆ మాటలు పదే పదే భర్త వింటే ఎంత అవమానము! అందరూ అన్నది నిజమే అని అనుకుంటే!

ఆమె నీరసంగా కూర్చుండి పోయింది.

ఆమె తలపై చల్లని చేయి పడింది. ఉలిక్కిపడి లేచింది.

"మీరు... మీరు నిదుర పోలేదా."

"నేను నిదుర పోవాలని అనుకుంటే అలాగే కానియ్యి. అన్నం తిననిదే నిదుర ఎలా పడుతుంది!" అన్నాడు.

"అది కాదండి" శర్మిష్ఠ విషయం చెప్పబోయింది.

"రూపా! అంతా విన్నాను. కాలం కలిసి రానప్పుడు కట్టే పామయి కరుస్తుంది అన్న సామెత వినలేదా?" అన్నాడు ఓదార్పుగా.

"ఎవరు ఎన్ని చెప్పినా, ఏమన్నా, మీరు మాత్రం బాధ పడకూడదు నమ్మకూడదండీ" అన్నది మెల్లిగా లజ్జితురాలయినట్టు ముఖం పెట్టి.

"నేను బాధ అంటూ పడితే ఒకే విషయానికి బాధ పడతాను రూపా!



తండ్రిగా, బాధ్యత గల వ్యక్తిగా నా ధర్మం నేను నిర్వర్తించ లేక పోతున్నాను అని నమ్మితే ఒక విషయాన్ని నమ్ముతాను. నీ మంచితనం, మనకు మంచి చేస్తుందని" లేపాడు.

అతని ఆసరాతో లేచి వచ్చింది.

అతనే ఇద్దరికీ వడ్డించాడు.

"అన్ని ప్రయత్నాలు అన్ని అవమానాలు అయిపోయాయి. మీ బిల్ రాగానే కొన్నాళ్ళపాటు ఈ ఊరికే దూరంగా వెళ్ళిపోదామండీ." అన్నది.

"సర్లే అన్ని ప్రయత్నాలు, అయిపోయాయి అంటున్నావు కదా. ఇంక భయం దేనికి ?" నవ్వాడు అతను.

"కాదు ఇక్కడ జరిగే విషయాలు వినకూడదని. హరికృష్ణ హాస్పిటల్ చూడటం వదిలి పేకాట, తాగటం మొదలు పెట్టాడట- అటు బడి నడువటం లేదు. నేను ఏ ఉద్దేశంతో ప్రారంభించానో మీకు బాగా తెలుసు." అన్నది బాధగా.

"అధికార దుర్వినియోగం, అన్యాయం యెక్కువ కాలం ఉండవు రూపా !" అన్నాడు అతను.

రూపకు ఆ నమ్మకంలేదు- మంచికి నిర్వచనం మరిచిపోయింది.

వంచనే తల యెత్తి బ్రతకమంటుంది. స్త్రీ అంటే కొత్త నిర్వచనం యిస్తున్నారు. ఏ కారణం చేతనయినా శీలం కోల్పోయిన స్త్రీని వెలి వేయవద్దన్న సత్యాన్ని గ్రహించక, శీలం బలిపెడితేగాని స్త్రీ కాదన్నట్టు మాట్లాడుతున్నారు.

ఈ పరిస్థితిని తను బాగు చేయగలదా! లేదని అర్థం అయిపోయింది.

"రూపా! అనవసరంగా బుర్ర చెడుగొట్టుకోకు. మనము యెవరికీ హాని చెయ్యటంలేదు." నచ్చచెప్పాడు

మనిషికి ఆశ పట్టుగొమ్మ దాని ఆధారంగానే బ్రతుకుతాడు. దురాశ

దుఃఖానికి చేటు అన్నారు ఆశాజీవులు కొందరు. దురాశతో తాము బాధ పడటమే కాక ఇతరులను బాధ పెట్టేవారు చాలామంది.

రాయలు నిదురబోయినా ఆమె నిదుర పోలేకపోయింది.

ఆమెకి శర్మిష్ఠ చేసిన అవమానం వేసిన అభియోగం గొడ్డలి పెట్టు. తానేం చేసిందో మరిచిపోయింది. ఆ సత్యం ఆమెను ఉక్కిరి బిక్కిరి చేసి ఊపిరి ఆడనివ్వటంలేదు. తను యెవరి వల్ల తిరిగి కలుకుంటామనుకుందో, ఆ శర్మిష్ఠ తనను యెన్ని మాటలన్నది! యెంత అల్లరి చేసినా ఒక్కనాడు తను దెబ్బ వేయలేదు. వీరయ్యను తను పనిలో ఉంచిందా! పిల్లలను హత్య చేసిన చేతులు పీలబడి పోయాయి.

ఏ పరిస్థితులలో రాయల్ని చేసుకుంది!

ఆనాడు వీరయ్యని పని మాన్పించాలంటే నువ్వు వెళ్ళిపో అనే స్థితిలో ఉన్నాడు.

అయినా వీరయ్య త్రాగుబోతు, హంతకుడు, వెనుక ఉండి చేయించినవారు తన శత్రువులు. తనేమయినా అంటే వాళ్ళను అనాలి గాని, వీరయ్యను అన్నా లాభంలేదు.

ఆమెకు గట్టు తెగిన వాగులా, దుఃఖం తన్నుకు వస్తుంది. అలాగే ఆరాటంగా గడిపింది.

## 32

బిల్ చేతికి రాగానే ఊరు విడిచి వెళ్ళాలని రాయలు అన్ని ఏర్పాట్లు చేశాడు. షామీర్ పేట దగ్గర చవకగా అమ్ముతున్నారంటే రెండెకరాల స్థలానికి అడ్వాన్స్ ఇచ్చాడు. అక్కడ ఫౌల్ట్రీ, డయిరీ పెట్టాలని ఆలోచించాడు.

అతన్ని దొంగలు కొట్టిన నాడే బడి పని ఆగిపోయిందని అందరూ భావించారు. కాని బడి పూర్తి అవటమే కాక, అడి స్వంత ఇల్లంత శ్రద్ధగా కట్టించాడని అందరూ పొగిడారు.



స్త్రీ హృదయం అమృతం. హాలాహలం రెండూ ఉంటాయోమో ఆ అమృత భాండమే రూప అనుకున్నారు అంతా.

పలకరిస్తే కరిచినట్టు మాట్లాడే రాయలును చూచి అందరూ ముచ్చట పడతారు.

అతని చిరునవ్వు ఆత్మ విశ్వాసం చూస్తే అందరికీ ఆశ్చర్యం వేస్తుంది. అతన్ని నిరసించిన వారే గౌరవంగా తప్పుకుని వెళ్ళి పోతున్నారు ఆ రోజు అతను ఇంటికి వచ్చేసరికి రూప చదువుతూ కూర్చుంది.

పొలం తాకట్టు పెట్టుకున్నవాళ్ళే చేసుకుంటున్నారు.

ఆమె కసలు పనిలేదు.

"రూపా! శనివారం మనము షామీర్ పేట వెళ్ళిపోవాలి" అన్నాడు. ఆమె ప్రక్కనే కూర్చుని.

"శనివారం వరకు యెందుకు! మీరిప్పుడు రమ్మన్నా వస్తాను." అన్నది ఉత్సాహంగా.

ఆమెకు కొత్త రక్తం వచ్చినట్టుంది.

ముఖఃస్తుతికి అన్నమాటలు కావు. ఆమె ఇంద్రమ్మ సమాధిపై పూలు పెట్టి వస్తుంటే, ఆమె ముందున్న వారు రాయలు నిజాయితీని మెచ్చుకున్నారు.

అదామెకు చైతన్యం, కొత్త ఊపిరి పోసినట్టు అయింది.

"రూపా! నీ, నా ప్రేమ ఫలితం మన బిడ్డ వచ్చేనాటికి మనకు ఉండటానికి ఇల్లుకూడా ఉండదనుకుంటే చాలా బాధగా ఉంది." అన్నాడు అలాగే ఆమె వడిలోకి వాలిపోతూ.

"మరేం పరవాలేదు. మీ గుండెల నిండుగా ప్రేమ ఉంటే చాలు." అన్నది.

"ప్రేమతో కడుపు నిండదు."

"కడుపు నిండినా, మానినా, మనసు నిండా మమతానురాగాలుంటే

చాలునండి. వాటిని రంగరించి పోసి మన బిడ్డను పెంచుకుందాము." అని అతని వంక చూచింది.

అతని ముఖం బాధతో గిల, గిలలాడి పోతుంది.

"ఏమిటండీ, మరీ పసిపిల్లవాడిలా! మనకు బిడ్డ పుట్టటమే ఓ గొప్ప వరం. వాడు మనకు అదృష్టం తెస్తాడు..."

"ఏం వాడు అంటున్నావ్ కొడుకే పుడతాడని అంత నమ్మకం ఏమిటి ?...అబ్బా..." అన్నాడు అటు తిరిగి.

"ఏమిటండీ? అసలేమయింది?" కంగారుగా అతని ముఖం తిప్పుకుంది. బాధతో గిల, గిలలాడుతుంది.

"రూపా!...ఏమిటో రూపా! ఉదయంనుండి కడుపులో నొప్పిగా ఉంటేను ?" అన్నాడు.

ఆమె లేచి, త్వరగా తన డబ్బా వెతికింది. అడవిలో ఉన్నామని కొన్ని మందులు, చాక్లెట్ డబ్బాలో ఉంచుకుంటుంది. హరికృష్ణ మొదటి సారి ఊళ్ళోకి వచ్చినప్పుడు, అతనికి నర్సుగా చేసిన అనుభవం ఉందామే.

"ఇదిగో, ఈ బెరల్‌గాంప్ వేసుకోండి." మాత్ర ఇచ్చి, మంచి నీళ్ళు ఇచ్చింది.

ఓ పదినిమిషాలు బాగానే ఉన్నాడు. మళ్ళీ విపరీతమైన నొప్పి ప్రారంభం అయింది.

రూపకేం తోచలేదు. రాయబు చిన్ననొప్పికే అలా గిల, గిలలాడి పోయే వ్యక్తి కాదు.

"నడవ గలరా !" అన్నది అతన్ని పడుకోబెడుతూ.

"అబ్బా! నడువ లేను రూపా! నా ప్రాణం పొయ్యేలా ఉంది." బాధతో గిల, గిలలాడిపోయాడు.

"మరేలా ?" నిముషం ఆలోచించింది. వెంటనే దూరంగా గుడిసెలో పడుకుంటున్న వీరయ్యను పిలిచింది.



"నువ్వు అయ్యగారి దగ్గర ఉండు. నేను అయిదు నిమిషాల్లో వస్తాను." అని, ఊరివైపు బయలుదేరింది. అతను దేకుతూ వచ్చాడు.

భూతాల్లా చూస్తున్న చెట్లుకాని, కీచురాళ్ళ ధ్వనికాని, చిక్కటి చీకటిగాని ఆమెను భయపెట్టలేదు. వరాలు దాటుతుంటే చెప్పులు జారాయి.

వాటిని తీసి దూరంగా విసిరివేసింది. అయిదు నిమిషాల్లో మిషన్ హాస్పత్రి చేరింది.

అక్కడున్న వారంతా లేచారు. ఆమె ఇల్లని అందరకీ తెలుసు. ఏ పరిస్థితులలో ఆ ఇల్లు ఇచ్చింటోకూడా తెలుసు.

"నమస్తే అమ్మా ?" అక్కడుండే మేల్ నర్స్ జాన్ యెదురు వచ్చాడు. ఆమె తల పంకించింది.

"డాక్టరుగారు లేరా ?" ఆదుర్దాగా అడిగింది.

"సైమన్‌గారు లేరమ్మా, వారి భార్య ఉన్నారు." అతను వెళ్ళి పిలుచుకు వచ్చాడు.

మిసెస్ సైమన్ కేరళనుండి వచ్చిన స్త్రీ. పిండి బొమ్మలా, చిన్నగా, ముద్దుగా ఉంటుంది. ఆమె ఏ డాన్సరో, అయితే బావుండేదేమో, అనుకునేది రూప. ఈ రోజు అన్నీ మరిచి చేతులు పట్టుకుంది.

"మిసెస్ సైమన్...నా భర్తకు చాలా సీరియస్‌గా ఉంది." దాదాపు ఏడ్పు గొంతుకతో అన్నది.

"ఒకసారి చూద్దాం పదండి." ఆమె కారు తీసింది. ఆమె బ్యాగ్ అందుకుని తనూ వచ్చింది.

ఊరు చుట్టూ తిరిగి గుడిసె చేరేసరికి ఇంకా దొర్లుతూనే ఉన్నాడు. రెండు చేతులు పడిపోయిన వీరయ్య అసహాయంగా చూస్తున్నాడు.

మిసెస్ సైమన్ అతన్ని పరీక్ష చేసింది. కొన్ని ప్రశ్నలు అడిగింది

"రూపాదేవి! వెంటనే ఆపరేషన్ జరగాలి. ఆయన ఊళ్ళోలేరు. నేను వెళ్ళి థియేటర్ తయారు చేస్తాను. ఒక్కసారి డాక్టర్ హరికృష్ణను పిలుచుకు రాగలరా ?" అన్నది స్టెత్ బ్యాగులో పెట్టి.

"అలాగే..." అన్నది- భర్తను లేవదీసి కారు వరకు తీసుకు వచ్చింది.

"ఏమంటారు రూపా... ఊఁ... అబ్బా..." అంటూ సీటుకు చేరబడిపోయాడు.

"అపెండిసైటిస్ అనుకుంటానండి. హరిని తీసుకురమ్మంటుంది. బంగళా దగ్గర దిగిపోతాను." అన్నది అతన్ని జరిపి కూర్చుని.

అతను అంత బాధలోను నవ్వాడు.

"హరి వస్తాడని ఆశగా ఉందా ?"

"నేను తెస్తాను." అన్నది దృఢంగా.

అతను ఏం మాట్లాడలేదు. ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

"రూపా...నేనేం అయినా పరవాలేదు, నాకు... నాకున్న దిగులల్లా ఒక్కటే... అమృతమూర్తివయిన నీ సాహచర్యంలో ఇంకా... కొన్నాళ్ళుండి...నా పాపాలు...అబ్బా, నా పాపాలు కడిగేసుకుందామనుకున్నాను..." అతని మాటలు పూర్తి కాకముందే తన చేత్తో అతని నోరు మూసింది.

"మీకేమయింది ?" తీక్షణంగా అడిగింది.

"రూపా ! నీ శాంతం, సహనం, ప్రేమ, అభిమానం, అనురాగం, ఆప్యాయత, ఆదరణ, ఆత్మీయత చవి చూచాను... అమ్మా... నీ కోపం కూడా చవిచూడాలని..." అన్నాడు ఓ జీవంలేని, నవ్వు నవ్వుతూ.

రూపకు దుఃఖం వచ్చినా బిగ బట్టింది.

"ఆపండి డాక్టర్, ఆపండి." టైగర్ ఇంద్రమ్మ బంగళా ముందు ఆగింది కారు.

రూప దిగింది.



"మీరు వెళ్ళి ఆపరేషన్‌కు అన్నీ తయారు చేయండి" అన్నది. కారు వెళ్ళిపోయింది.

రూప తన ఇంటికే తాను కొత్త దానిలా వచ్చింది. తలుపులు తట్టింది. వెంకన్న తలుపు తీశాడు.

"వెంకన్నా ! హరి యెక్కడ ?"

"నువ్వా రూపమ్మా !" వెంకన్న ఆశ్చర్యంగా చూచాడు.

"హరికృష్ణ యెక్కడ !" ఆమె రెట్టించటంతో అతను పైకి చేయి చూపాడు. రూప రెండేసి మెట్లు ఒక్కసారి యెక్కింది- పై హాల్లోని దృశ్యము చూచి ఆగిపోయింది.

హరికృష్ణ, జగదీష్‌తోపాటు మరో ఇద్దరున్నారు. ఆ ఇద్దరిలో ఒక స్త్రీ, ఆమె ఆధునిక అలంకారాలు చేసుకున్న కమిలి అని గ్రహించటానికి అట్టే టైమ్ పట్టలేదు.

"డాక్టరు హరికృష్ణగారూ !" అన్నది గర్జించినట్టు.

"ఓహో! రూపాదేవిగారా..." అన్నాడు వెటకారంగా. అతని కుడిచేతిలో విస్కీగ్లాసుంది, యెడమ చేతిలో కార్డ్సు ఉన్నాయి.

"మీరింకా మనుష్యుల్ని గుర్తుపట్ట గల్గుతున్నందుకు చాలా సంతోషం. ఒక పేషెంటుకు చాలా ప్రమాదంగా ఉంది. అపెండిసైటిస్. ఆపరేషన్ వెంటనే చేయాలి. డాక్టర్ సైమన్ ఊళ్ళో లేరు." అన్నది.

"ఉన్నా అతను చేయలేడు. అతను జనరల్ మెడిసన్‌లో చేశాడు." అన్నాడు లేవకుండానే.

"అలాగా ! పోనీ మీ అవసరం మాకు అనివార్యం. త్వరగా లేవండి." అన్నది మృదువుగానే.

అతను కార్డ్సు అవతల వేశాడు. సిగరెట్టు వెలిగించుకున్నాడు.

"యెవరా వ్యక్తి."

"పేషెంటు పేరు చెబితేగాని రావా ?"

"అవును. రేపు నాకు ఫీజు ఇస్తాడన్న నమ్మకం ఉండాలి కదా ?" అన్నాడు సిగరెట్టు పీల్చి గుప్పున పొగ వదులుతూ.

"నేనిస్తాను ఆ ఫీజు..." అన్నది ఆదుర్దాగా, తన భర్తపేరు చెబితే వస్తాడో రాడో అని భయపడ్తూ.

ఫక్కున పరిహాసంగా నవ్వాడు.

"రూపాదేవి ! మీ హోమియా? అమ్మటానికేం మిగిలిందని" అన్నాడు అవహేళనగా.

"ముక్క వెయ్యి భాయి, కార్డ్ షో." జగదీష్ రెట్టించాడు.

"కార్డ్ కేం తొందర! అవతల పేషేంటుకు ప్రమాదం అంటుంటే." ఆ మూడో వ్యక్తి అన్నాడు.

"హరీ...ఓ...హరికృష్ణగారూ! చేతులు జోడించి ప్రార్థిస్తున్నాను. మీ ఫీజు యెక్కడికీ పోదు. పేషెంటు మరెవరో కాదు. నా భర్త. దయచేసి రండి..." అన్నది ఆమెకు ఆందోళన యెక్కువయింది.

"గోవిందా...గోవిందా...అయితే చిల్లు సంచి పట్టుకో భాయి." అన్నాడు జగదీష్.

"జగదీష్, ముందు నీ నోరు ముయ్యి. డాక్టరు హరికృష్ణగారూ ! డాక్టరుగా మీ ధర్మం మరిచిపోతే యెలా ? పేషెంటు యెవరయితే మీకెందుకు ? మీరు చేసిన ప్రమాణాలు ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోండి." అన్నది దీనంగా.

"మిసెస్ రూపాదేవీ! మీతో ధర్మ సూత్రాలు చెప్పించుకునే స్థితిలో లేను. బీదదానివని ప్రాధేయపడితే..." అన్నాడు విజయగర్వంతో నవ్వుతూ.

"హరీ...హరీ! నువ్వు ధనవంతుడవయ్యావా! నేను బీద దాన్నని మీ ముందు ప్రాధేయ పడాలా ?" కోపంగా అడిగింది.

"అఫ్‌కోర్స్! అలా చేయనిపక్షంలో ఓ వెయ్యి రూపాయలు అక్కడ పెట్టు." అన్నాడు, సిగరెట్టు పారేస్తూ.



"బిల్ పాసయింది హరికృష్ణగారూ! కేష్ చేయగానే ఇస్తాను." అన్నది.

అతను తల అడ్డంగా తిప్పాడు.

"హరీ!... ఆ రోజులు మరిచి పోయావా ?" అన్నది ఆవేశంగా.

"మరుపు అనేది లేకపోతే పిచ్చివాడినయి వీధుల వెంట 'రూపా... రూపా' అంటూ తిరిగేవాడిని" అన్నాడు తీక్షణంగా చూస్తూ.

"వాదనకిది సమయం కాదు హరికృష్ణా... ప్లీజ్... అవతల ఆయనకు ప్రమాదంగా ఉంది" అన్నది గొంతు తగ్గించి.

"నా ఫీజు సంగతి చెప్పాను కదా..." అన్నాడు కార్డ్సు కలిపేస్తూ.

"నీ మొండితనంతోనే ఆ రోజు నాయనమ్మకు ప్రాణం పైకి వచ్చింది. ఈ రోజు మొండితనం చేస్తే ఆ దేవుడు కూడా క్షమించడు..." అన్నది

"ఓహో! మానవత్వమే దైవత్వం అనే ధీరురాలు. ఈ రోజు భీరువుగా దేవుడి పేరు ఎత్తటం హాస్యాస్పదంగా ఉంది" అన్నాడు పేక ముక్కలు కలుపుతూ.

"నిజమే! మన వ్యవస్థే అస్తవ్యస్తంగా ఉంది హరికృష్ణగారూ! డాక్టరు కావాలని తహ తహలాడిన నాడు యెన్నో ఆశయాలు, ఆదర్శాలు ఉంటాయి. డాక్టరు కాగానే పల్లెలంటే వెగటు, విదేశాలంటే మోజు పెరుగుతుంది. తప్పిదారి యెవరయినా పల్లెకు వస్తే, హాస్పత్రి జూద గృహము అవుతుంది. కెబరే నర్తకులకు బదులు కపిలి లాంటి అమాయకులను వాడుకుంటారు..."

"షటప్ ! బి ఇన్ యువర్ లిమిట్స్..." పేకలు దూరంగా వేశాడు.

"నాకూ ఇంగ్లీష్ వచ్చు. ఒక్కసారి... డాక్టరుగా నీ బాధ్యత గుర్తుకు తెచ్చుకో. భగవంతున్నాడో లేడోగాని, రెండవ భగవంతుడుగా కొలిచే అమాయకులను చూడు. ఆల్ రైట్ వస్తాను."

ఆమె ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంది, వెనుదిరిగింది.

జగదీష్ మాటలు రూపకు అస్పష్టంగా వినిపించాయి.

ఆమె వాటికి అర్థం వెతుక్కోవటం లేదు.

ఆమె కళ్ళముందు బాధతో మెలికలు తిరిగే భర్తే కనిపిస్తున్నాడు.

"రూపాదేవీ! ఒక్క షరతుపై మీ ఆయనకు ఆపరేషన్ చేస్తాను" ఖంగుమన్నది హరికృష్ణ కంఠము.

రూప వెనక్కు తిరిగింది. హరికృష్ణ లేచి నిలబడ్డాడు. ఆశగా చూచింది.

"చెప్పండి డాక్టరుగారూ! ఒక్క షరతు కాదు, వంద షరతులయినా అంగీకరిస్తాను..." వెను తిరిగి అతని చేతులు పట్టుకుంది.

"ఏదయినా ఇస్తావా?"

"తప్పక... నా సంగతి నీకు బాగా తెలుసు హరీ! నా దగ్గర ఉన్నది, ఇవ్వగల్గిందీ ఏదయినా ఇస్తాను. మొదట ఆయన ఆపరేషన్ చెయ్యి" అన్నది.

ఒక్కసారి తలయెత్తి ఆమె ముఖంలోకి చూచాడు. సర్వస్వం పోగొట్టుకున్నట్టు నిలబడింది. అతని హృదయం భగ్గుమన్నది. తనను ప్రేమించింది.

'హరీ! పరిస్థితుల ప్రభావంవల్ల అతన్ని వివాహం చేసుకున్నాను. నిన్ను మరచి పోలేను' అంటే యెంత బావుంటుంది. అలా అనదని తనకు బాగా తెలుసు.

అతను చక, చక బట్టలు వేసుకున్నాడు.

అతని చేతిలోని బ్యాగు అందుకుని నడిచింది.

"మీ ఆయన ఆపరేషన్ కాగానే ముఖం తప్పిస్తావా?"

"హరీ! అంతటి మూర్ఖురాలిని, స్వార్థపరురాలిని కాను" అన్నది.

అతను కసిగా నవ్వుకున్నాడు.



"అడిగినప్పుడుగాని అసలు విషయం తెలిసిరాదు" అన్నాడు. ఇద్దరూ హాస్పత్రి ప్రాంగణంలో అడుగు పెట్టారు.

"ఓ... గుడ్ ఈవినింగ్ డాక్టర్... రండి" అన్నది.

రూపాదేవి నిశ్చలంగా అక్కడ వేసిన బల్లమీద కూర్చున్నది. ఆమెకు భర్తనుచూసే ధైర్యంలేదు.

# 33

వాతావరణం కాస్త ఉక్కగాను, కాస్త చలిగాను, మరికాస్త మత్తుగాను ఉన్నది. వసంతఋతువు ఆగమనాన్ని తెలుపుతూ కోయిలలు కూస్తున్నాయి.

తన గదిలోనే, తన మంచం ఉండే చోటే పేషెంటుగా పడుకున్నాడు రాయలు.

ఆ గదికి కిటికీలు కాస్త పెద్దవిగా చేశారు. అతనికి గమ్మత్తుగా అనిపించింది. అక్కడే ఉండిపోతే యెంత బావుండును! ఎంతో నిశ్చింతగా ఉంది,

అయినా తనొక్కడి గురించే ఆలోచిస్తున్నాడు. ఈ భవంతిలో తన లాంటి రోగులు ఎందరున్నారో!

గదిలో మెరుపు మెరిసినట్టు అయింది- తలెత్తి చూచాడు.

"రూపా?... నువ్వు... నువ్వేనా!" అన్నాడు ఆశ్చర్యంగా.

ఆమె సన్నని ఫారిన్ జార్జెట్ చీర కట్టింది. అది యెప్పుడో ఆమెకని హరికృష్ణ కొనితెచ్చాడు అమెరికానుండి.

"చీరలు చిరుగుతున్నాయి, బిల్ రాగానే కొంటాను ఆ పెట్టెలో ఉన్నవి కట్టుకో" అన్నాడు చాలాసార్లు.

"వద్దండీ, మరీ పల్చగా ఉన్నాయి. ఆ బట్టలు వేసుకుంటే సెక్సీగా కనిపిస్తా" అనేది.

ఈ రోజు- అదీ తను జబ్బుతో ఉండగా కట్టుకుందంటే... అతనూ హించ లేకపోయాడు.

ఒక చీరేకాదు, ఆమె అలంకరణ అంతా కండ్లు మిరుమిట్లు గొలుపుతుంది.

చక్కగా దువ్వి అల్లిన జడలో సువాసనలు వెదజల్లే మల్లెలు ముడుచుకుంది. కళ్ళకు కాటుక దిద్ది చక్కగా కొనలు చేపలా దిద్దుకుంది. పాలభాగంలో ఎర్రని సన్నని బొట్టూ, మెడలో నల్లపూసలు వేసుకుంది. చేతులకు ఎర్రని గాజులు, అందంగా, పవిత్రతకు చిహ్నం అన్నట్టున్నాయి. రాగ రంజితమైన ఆమె పెదవులు రసిక హృదయుల హృదయాలను లయ తప్పిస్తున్నాయి.

"ఏమిటలా చూస్తున్నారు ?"

"ఇది హాస్పత్రి కాకపోతే, నేను రోగినే కాకపోతే ఏం చేసేవాడినో తెలుసా ?" అన్నాడు.

అతని ముఖంలో నీరసం తగ్గింది.

"తలుపులువేసి..." అతని మాట పూర్తికాకముందే అతని నోటికి చెయ్యి అడ్డం పెట్టింది.

"ఎక్సయిట్‌మెంటు పనికిరాదు. రేపు మనము వెళ్ళిపోతున్నాము. నాకు మేడిచల్‌లో టీచర్ ఉద్యోగం వచ్చింది. మీ షామీర్‌పేట్‌కు దగ్గరగా వుంటుందని..." అన్నది అతని మంచంపై కాళ్ళవైపు కూర్చుని.

"ఓహో ! అలాగా. బావుంది రూపా..." అతను తృప్తిగా చూచాడు.

"ఏమండీ, మీకు తెలియకుండా నేను అనుచితమైనపని చేస్తే..." అని అడిగింది.



అతను పక పక నవ్వి, ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

"రూపా! నువ్వు చేసేది ఏదీ అనుచితం కాదు. ఏదో అవసరం, ఉచితం అనుకుంటేనే చేస్తావు. నా ప్రాణం తీసినా దాని వెనుక ఓ అర్థం ఉందనే అనుకుంటాను" అన్నాడు.

"మీ ప్రేమను భరించలేక పోతున్నాను..." గొణిగింది, అతని చేయి హృదయానికి ఆన్చుకుని.

"ఏమిటి రూపా !"

"ఏం లేదు, మిమ్మల్ని చంపుతానని యెలా అనుకుంటున్నారు !" అన్నది వ్యథ చెందినట్టు.

"ఏం ఎందుకు చంపకూడదు. రాణి సారంగ కథ వినలేదు! శత్రువులు చుట్టుముట్టినప్పుడు భర్తనెలా రక్షించుకోవాలో తెలియక అతడ్ని పొడిచివేసింది" అన్నాడు.

"నేను అంతటిదాన్ని కాను కాని, రేపుదయం కేశవరావంకల్ టాక్సీ తెస్తారు. నాకు మళ్ళీ చెప్పే అవకాశం ఉంటుందో లేదో, ఒకసారి వెళ్ళి హరికృష్ణగారి ఫీజు చెల్లించి వస్తాను" అన్నది లేస్తూ.

"ఇంతరాత్రి ఒంటరిగా వెళ్తావా !"

"మరేం ఫరవాలేదు. ఆ రాత్రి నాయనమ్మను రక్షించుకోవటానికి ఒంటరిగా వెళ్ళాను. ఈ రోజు మీ ఆశీస్సులు, మీరిచ్చిన ధైర్యం నా వెంట ఉన్నాయి" అన్నది.

"రూపా..." అతని కెందుకో ఆరాటంగా ఉంది.

"మరేం ఫరవాలేదు" వంగి అతని పెదవులపై గాఢంగా చుంబించింది. తలుపు చేరవేసి వెళ్ళిపోయింది. అతను కళ్ళు మూసుకుని తాము షామీర్‌పేటలో గడపబోయే జీవితం గురించి కలలు కంటున్నాడు.

"టొరా..."

అతను కళ్ళు విప్పాడు. ఎదురుగా వణికిపోతూ కమిలి నిలబడింది. అతను ముఖం చిట్లించాడు.

"దొరా,... ఇల్లు కాలుతుంది... అంతా అయిపోయిందయ్యా... అన్నది ఒగరుస్తూ.

లేచి నిటారుగా కూర్చున్నాడు,

"ఏమిటే... ఏం జరిగింది ?" ముఖం చిట్లించాడు.

తుఫాను తాకిడికి అల్లాడే ఆకులా ఉంది. తను యెలా చెప్పాలో తెలియలేదు.

"దొరా! మీ దగ్గర పన్జేసినప్పుడు అల్లు ఆడమంటే అవద్దాలు ఆడాను... ఇప్పుడు నిజమే చెప్తున్న, నీ కాల్మొక్త..." అన్నది ఏడుస్తూ.

"అసలు సంగతేమిటో చెప్పందే..." అన్నాడు విసుగ్గా.

"అమ్మ ఏం జెప్పలేదా అయ్య, నీకు ఆపరేసన్ చేసిన పీజాకింద ఆ డాక్టరు... అదే అరికిట్టయ్య అమ్మను ఒక్కరేతిరి తనకాడ ఉండ మన్నడు" అన్నది.

అదిరిపడ్డాడు రాయలు.

ఏమిటి? హరి చదువు, సంస్కారం ఏమయింది? తనకు ఆపరేషన్ చేయటానికి రూపను కోరాడా!

"నిజవంయ్యా! ఆ జగమయ్య ఇంకా ఏవేవో అంటున్నరు. అమ్మ అల్లమాట ఒప్పుకున్నదంట" అన్నది.

రాయలు కళ్ళముందు తెర తొలిగిపోయింది.

"ఏమండీ నా వల్ల యెలాంటి పొరపాటు జరిగినా క్షమిస్తారా !"

"నన్ను చంపినా ఏదో కారణం ఉందనుకుంటాను."

తమ సంభాషణ గుర్తుకు వచ్చింది. ఆమె అలంకారం గుర్తుకు వచ్చింది. అతను అదిరిపడ్డట్టు లేచాడు.

"రూపా... రూపా—" అతని హృదయం ఆక్రోశించింది.



"ఆ రాత్రి అక్కడ గడిపినంక అమ్మ బతకదయ్యా— అమ్మ బతకదు" అన్నది.

రాయలుకు మతిపోయింది. చెప్పులేసుకుని బయలుదేరాడు, అప్పుడే మిసెస్ సైమన్ వస్తుంది.

"వ్వాట్ ! ఎక్కడికి ?"

"మా రూపకు ప్రమాదంగా ఉందట డాక్టరుగారూ—" ఆమె జవాబుకోసం ఎదురు చూడకుండానే చర, చరా వెళ్ళిపోయాడు.

"ఓ గాడ్—" ఆమె కంగారుగా మేల్ నర్సును పిలవటం విని పించింది.

రాయలు బంగళాలో అడుగుపెట్టేసరికే, అప్పుడే టాక్సీలో నుండి శర్మిష్ఠ దిగింది.

"బావా? అక్కకెలా ఉంది?" కంగారుగా అడిగింది.

రాయలు ఒక్కసారి తలెత్తి ఆమె వంక చూచాడు.

"అక్కకు చాలా ప్రమాదంగా వుందని వెంకన్న టెలిగ్రామి చ్చాడు" అన్నది టాక్సీ కిరాయి ఇవ్వకుండానే.

అతను కిరాయి అడిగాడు.

"ఉండు అక్కను చూచివచ్చి, ప్రమాదం వుంటే ఇదే టాక్సీలో హైద్రాబాద్ వెళ్ళాలి" అన్నది.

రాయలు మారు మాటలేక నిల్చున్నాడు. శర్మిష్ఠ ఇంట్లోకి వెడితే, ఆమెను అనుసరించాడు.

తలుపు తీసిన వెంకన్న అయోమయంగా చూచినా, అతని గాజు కళ్ళల్లోకి ప్రాణం వచ్చింది.

"అక్క— అక్కకెలా వుంది ?" ఆదుర్దాగా అడిగింది.

అతను జవాబుగా మేడవైపు చూపించాడు.

ఇద్దరూ మేడ యెక్కారు, తలుపులో రాళ్ళలా చెరోవైపు నిలబడి పోయారు.

లంగా, బాడీతోనే మంచం ఒక చివర్న కూర్చుంది రూప. కాస్త దూరంలో నిలబడ్డ హరికృష్ణ ఆశ్చర్యంగా, వింతగా చూస్తున్నాడు. అతను భయపడుతున్నట్టు వణుకుతున్నాడు.

మూడుదాటి నాల్గోనెల వచ్చిందేమో, తెల్లని పొట్ట కనిపించింది. కాస్త యెత్తుగా రూప అందం కళ్ళు చెదరగొడుతుంది.

"ఏం హరీ? ఆలోచిస్తున్నావేం? నువ్వు కోరినట్టుగానే వచ్చానుగా పట్టుచీరలో పవిత్రంగా కనిపిస్తున్నానన్నావు" మధురంగా నవ్వింది.

"రూపా..." అతని కంఠం వణికింది.

"మా వారికి తెలిస్తే ఏమయినా అంటారనా? మరేం భరవాలేదు. నీపై ఈగ వాలదని హామీఇస్తున్నాను. ఒక్కసారి నీ కోర్కె తీరితే పగ తీరుతుందేమో. మా ఆయన సంగతి నీకు తెలియదేమో, మనసుకు మాలిన్యం అంటకూడదంటాడు. అరగంటనుండి ఇంతగా కవ్విస్తుంటే అలా నిలబడిపోయావే. పూర్తిగా నా నగ్న సౌందర్యం తిలకించాలనా!... చూడు హరీ తనకు కావలసిన అందాలు తను పొందితేనే అందం" అన్నది మృదువుగా కవ్వింపుగా.

"రూప... రూప... నేను..."

అతనిమాట పూర్తికాకముందే రూప లేచి నిలబడింది.

"ఓ...కె. హరీ, నువ్వు సిగ్గుపడుతున్నావు..." ఆమె చేతులు వెనక్కుపోయాయి.

"రూపా... రూపాదేవీ... నో...నో... నువ్వే గెలిచావు రూపా" ఒక్కంగలో రూప దగ్గరకువెళ్ళి అమె కాళ్ళు పట్టుకునీ మోకాళ్ళపై తల దాచుకున్నాడు.

"రూపా! నువ్వు మండే అగ్నివి... ప్లీజ్ కప్పుకో...." అన్నాడు గాద్గికంగా. ఆమె నవ్వింది. చిన్నపిల్లాడు మారాంచేసి అడగకూడనిది అడిగి,



తీసుకో అంటే సిగ్గుపడతాడు. ఆ కుర్రాడిని చూచి నవ్వినట్టు నవ్వింది, అతని తలలో వేళ్ళుదూర్చి జుట్టు నిమిరింది.

"హరీ! లే...." అన్నది ఆర్తిగా.

"నన్ను...నన్ను క్షమించమని అడగను...నాకు ముఖంలేదు. కాని... రూప ఒక్క మాట అంటే నా ఇగో తృప్తిపడేదేమో..." అన్నాడు బొంగురు కంఠముతో.

"నా భర్త దుర్మార్గుడు, నిన్ను పోగొట్టుకున్నానని అవునా..." అతన్ని దూరంగా జరిపి బ్లౌజు వేసుకుంది.

అతను తల సిగ్గు భారానికి వంగిపోతున్నట్టు తలవంచాడు.

ఆమె చీరకూడా కట్టుకుంది.

"హరీ, మనిషి యెన్నో అనుకుంటాడు. అనుకున్నవి అనుకున్నట్టు జరిగితే జీవితం ఏముంది! నిజమే నా వివాహం విషయం నీతో చెప్పాల్సింది కాని నా ధ్యేయమొక్కటే నీ చదువు పాడు కావద్దు. నీచదువువల్ల ఈ ఊరికి ఉపయోగం ఉందనే ఆలోచించాను." అన్నది పమిట సర్దుకుని.

"రూపా...రూపా...నువ్వు నిజంగా...నిజంగా టైగర్ ఇంద్రమ్మ మనుమరాలివి..." అన్నాడు. లేచి కిటికీ దగ్గర నిలబడుతూ.

"మనుమరాలినో, మరేమోకాని అతి చిన్న వయసులో నాయనమ్మ కష్టాలు చూచిన నేను ఆత్మస్థయిర్యం ఏర్పరుచుకున్నా." అన్నది.

"రూపా! నాదో చిన్న రిక్వెస్ట్. ఈ విషయము మనిద్దరి మధ్యే ఉండిపోని...ప్లీజ్ రూపా." అన్నాడు ఆందోళనగా.

"ఊరందరికీ తెలియటం నాకు ఇష్టంలేదు. కాని తెలియవలసిన ఇద్దరికి తెలియాలి." అన్నది దృఢంగా.

"యు మీన్...రాయలుగార్కి, శర్మిష్ఠకా...నో...వద్దు రూపా, నేను నటించాను, అబద్ధాలు చెప్పాను. అన్నీ వేదమని నమ్మిందా అమాయకురాలు. మీకు... ప్రేమించడమే తెలుసు..." అన్నాడు ఆందోళనగా.

"క్షమించడమూ తెలుసు హరీ! నువ్వు పనికట్టుకుని చెప్పక్కర లేదు. అటు చూడు..." అని పరిగెత్తినట్టే వెళ్ళింది రూప.

"మీకు ఆపరేషన్ అయి వారం రోజులు కాలేదు. ఇంకా బలం కూడా రాలేదు. యెందుకు వచ్చారు..." రూప రాయల్ని పట్టుకుంది.

"వాళ్ళు వచ్చారా..." అస్పష్టంగా గొణిగాడు హరికృష్ణ.

రూప భర్తను బలవంతంగా నడిపించుకువచ్చి మంచంపై పడుకో బెట్టింది.

హరికృష్ణ ముఖం చూడలేనట్టు కిటికీలో నుండి బయటికి చూస్తు న్నాడు.

అప్పుడే వెంకన్న, మిసెస్ సైమన్ వచ్చారు.

"వ్వాట్! ఏమయింది రూపాదేవి ?" మిసెస్ సైమన్ అడిగింది.

"నథింగ్, వీళ్ళు ఊర్కే నే కంగారు పడ్డారు." అన్నది, శర్మిష్ఠను పిలిచి పరిచయం చేసింది.

"షి ఈజ్ మై సిస్టర్ శర్మిష్ఠ, డాక్టర్ హరికృష్ణగారి భార్య "

"గ్లాడ్ టు మీట్ యు... మీరు మెడిసన్ చదువుతున్నారను కుంటాను." అన్నది నవ్వుతూ.

"ఫైనలియర్..." అన్నది శర్మిష్ఠ.

అక్క నిగ్రహానికి, మారని ఆమె ముఖకవళికల్ని చూచి ఆశ్చర్య పోయింది. తనెందుకు అలా ఉండలేదు

మరో అయిదు నిమిషాలుండి మిసెస్ సైమన్ వెళ్ళిపోయింది.

శర్మిష్ఠ తుఫానులా వచ్చి అక్కను వాటేసుకుంది. "అక్కా, నన్ను...నువ్వు." మాటరానట్టు వెక్కి వెక్కి ఏడ్చింది.

"శర్మీ..." చెల్లెలి తల నిమురుతూ ఉండిపోయింది.

"రూపా...కొంచెం హార్లిక్స్ కావాలి." ఆ వాతావరణం తేలిక చేయాలని అడిగాడు రాయలు.

"నేను తెస్తాను..." వెంకన్న పరుగెత్తాడు.



"శర్మీ! మీ ఆయన అలిగాడే. మాటి మాటికి ఏడుస్తూ మనల్ని మనమే చులకన చేసుకుంటున్నాము. ఛ...ఛ... నువ్వేం డాక్టరువే." రూప హాస్యంగా అన్నది.

మెల్లగా శర్మిష్ఠ వెళ్ళి భర్త వెనుక నిలబడింది.

"ఇంకా కోపమెందుకండీ! అక్కమీద కోపం తీరిందనుకుంటాను."

"శర్మిష్ఠా..." ఇటు తిరిగి చేతులు పట్టుకున్నాడు.

"క్షమించను అనటానికి వీల్లేకుండా అక్క మా తరపున క్షమిం చేస్తానని హామీ ఇచ్చిందాయె. రండి క్రిందికి వెళదాం. బావగారికి విశ్రాంతి కావాలి." అన్నది.

అతను అపనమ్మకంగా చూచాడు.

"రండి మిమ్మల్ని నేను ఏం అనను మిమ్మల్ని ప్రేమించాను గనక మీరేం చేసినా క్షమించాలి, రండి..." అన్నది.

"శర్మీ! తప్పుగా అంటున్నావే, 'ఏమండీ అలా అనకండి'. అంటూ అతని పాదాలు పట్టుకోవాలి." అన్నది రూప గలగల నవ్వుతూ.

హరికృష్ణ గంభీరంగా అటు తిరిగి కిటికి దగ్గర నిలబడ్డాడు.

"శర్మీ! నావి కొన్ని షరతులున్నాయి. వాటిని అంగీకరిస్తేనే ఉంటాను." అన్నాడు.

"ఇంకా ఏమున్నాయి. అన్నీ మనకే వదిలింది మీరు కోరితే తన శీలం."

"శర్మీ..." రూప హెచ్చరించింది.

"మీ అక్కయ్య ఈ బంగళాలోనే ఉండి, బడిని అభివృద్ధి చేయాలి చీకటి పారద్రోలే ఆ విద్య...విద్యాదానం అందరికి చేయాలి."

"ఓహో!" అన్నది శర్మిష్ఠ.

"ఇంత చిన్న ఊళ్ళో రెండు హాస్పిటలు అనవసరం. మిస్టర్ సైమన్‌తో చెప్పి నాకు నీకు అక్కడే ఉద్యోగాలు వచ్చేలా చేయాలి." అన్నాడు.

"ఇంకా ?" వెటకారంగా అడిగింది శర్మిష్ఠ.

"ఇంకా ఏమయినా గుర్తుకువస్తే తరువాత చెబుతాం. ఆ మన వ్యవసాయం అంతా రాయలుగారు చూడాలి. ఆయన ఈ ఆస్తికి సగం వారసుడు అంతా నా నెత్తిన కొడితే యెలా ?" అన్నాడు.

"ఇదిగో డాక్టరుగారూ! వారేం మరబొమ్మలు కారు. మనము ఆడించినట్టు ఆడటానికి మీకిష్టమయితే రండి. లేకపోతే మానెయ్యండి." శర్మిష్ఠ చర, చర వెళ్ళిపోయింది.

"చూడు హరీ ఇప్పటికే మనము మాట నిలకడలేని వారము అయ్యాము. ఒకరోజు ఇక్కడ ఒకరోజు అక్కడ అంటూ తిప్పావ్. నీ హాస్పత్రి నీకుందని. చుట్టూ పల్లెటూరి జనం బండ్లు కట్టుకుని రావటం నేను ఎరగనిది కాదు." అన్నది రూప.

"వద్దు రూపా ? సారీ వదినా, నేను ఇన్నాళ్ళు చెయ్యాలనే పొరపాటు చేశాను. అందరిని అలక్ష్యం చేశాను. దానికి సిగ్గుగా ఉంది." అన్నాడు చురుకుగా.

రూప ఏం తోచనట్టు రాయలువంక చూచింది.

"చూడు హరీ! హాస్పత్రి విషయంలో మాకంటే మీకు బాగా తెలుసు. అది మీ ఇష్టప్రకారమే కానియ్యి. రూప ఇది నడపటం నాకు ఇష్టమే. ఇకపోతే కలసి ఉండటం విషయంలో నాకు అభ్యంతరం ఉంది."

"రాయలుగారూ !" దెబ్బతిన్నట్టు చూచాడు హరి.

"అవును హరీ ! నువ్వు అన్నా అని పిలువకపోయినా, అన్నలాంటివాడను, దూరంగా ఉండి ప్రేమగా ఉందాం !" అన్నాడు.

"ఓ. కె. ఓ. కె. మీ ఇష్టం." అతనువచ్చి మెల్లగా ఇద్దరికి నమస్కరించి వెళ్ళిపోయాడు.

రాయలు మాటలు కరువయినట్టు విప్పారిన కళ్ళతో రూపను చూస్తున్నాడు.

"నూటికి పదిమంది యువకులు పల్లెలపట్ల శ్రద్ధ చూపితే ఇదో



భూతల స్వర్గం అవుతుందండి. అంతా కృత్రిమత్వానికి అలవాటుపడ్డ మన జనం పట్నాలలో చాలీచాలని ఇళ్ళు, అంతకంటే చాలని గాలిలో బ్రతుకుదాం అనుకుంటారు." అన్నది తలుపువేసి వస్తూ.

రాయలు ఇంకా అలాగే చూస్తున్నాడు.

"అయినా ఈ పట్నాలలో మోజులకు అలవాటుపడి అని అంటారు. ఇంకా యెక్కడ ఉందండీ మోజు! బిందెడు నీళ్ళకు, ఒక్కగంట కొళాయి దగ్గర ఒంటికాలిపై తపస్సు చేయాలి. సినిమా నెలకోసారి చూస్తారేమో— అదేం ఉలుకుపలుకు లేకుండా చూస్తున్నారు..." అన్నది దగ్గరగా వచ్చి.

అతనింకా అలాగే చూస్తున్నాడు.

"ఏమిటండీ... అలా చూస్తారేం! మీ రూపని..." అన్నది తమాషాగా అతని ముందు తన ముఖం పెడుతూ.

"కాదు...నిన్నలా పిలువను" అన్నాడు స్వప్నం నుండి బయటకొచ్చి, ఏదో చూడాలని తపించిపోతున్నవాడిలా

"ఎలా పిలుస్తారు ఏయ్ ముద్దూ అంటారా అనండి, నా కది ఎంతో మధురంగా, ఆత్మీయంగా ఉంటుంది" అన్నది.

అతనామెను రెండు చేతులా దగ్గరకు తీసుకుని, విలువయిన వస్తువులా పదిలంగా గుండెల కదుముకున్నాడు.

"రూపవికాదు, అపురూపవి. అందరికి అందని అమృతమూర్తివి, నాకు అపురూపంగా దొరికిన వరానివి" అన్నాడు. ఒక్కొక్కమాట ఒత్తి పలుకుతూ స్పష్టంగా.

"అపురూప..." అస్పష్టంగా గొణిగింది.

"అవును నాకు... కాదు కాదు, అందరికి అపురూపవే నేను మాత్రం నోరారా, మనసు నిండుగా అపురూపా అని పిలుస్తాను" అన్నాడు యెందుకో అతని కళ్ళు మాటి మాటికి చెమ్మగిల్లుతున్నాయి.

ఆమెకు తెలుసు అతని ఆవేదన హరి మరో విధంగా ప్రవర్తిస్తే తనేం చేసేది అని అతను బాధపడుతున్నాడు.

తనకు తెలుసు హరి మరోవిధంగా ప్రవర్తించదని. ఆ విషయం భర్తకు చెప్పటం అనుచితం అన్నట్టు మౌనంగా అతని గుండెలపై తల వాల్చింది. అతను లైటు ఆర్పాడు.

ఆ నిశబ్ద సమయం, మందమైన కాంతిలో ప్రతి అణువు 'అపురూప' 'అపురూప' అంటున్నట్టు అనుభూతి చెందుతూ కళ్ళు మూసుకుంది, అతను మౌనంగా ఆమె వీపు నిమురుతున్నాడు, నిశ్చింతకు నిర్వచనం, శాంతి సౌఖ్యాలకు భాష్యం అన్నట్టున్నారిద్దరూ.

లారీ యాక్సిడెంటులో కాలువిరిగిన జగదీష్‌ను హాస్పత్రిలో చేర్చారని చెప్పడానికి వచ్చిన వెంకన్న వారి ఏకాంతం భంగం చెయ్యలేక వెళ్ళిపోయాడు.

* స మా ప్తం *

ముద్రణ :
అనూరాధా ప్రింటర్స్,
విజయవాడ-520001.